ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 4 సంచిక - 9 జూన్ 2023 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



బతుకు వెతల కథాశిల్పి

## ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి

సాహితీస్రవంతి


ఫొటో : SSB గేరా

సాహిత్య ప్రస్థానం
జూన్ 2023
సంపుటి : 4 సంచిక : 9

# దశాబ్ది పిలుపు

**2023** జూన్ రెండో తేదీతో తెలుగు రాష్ట్రాల విభజన పదో ఏట ప్రవేశించింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం దశమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంబించింది. విభజిత ఆంధ్ర ప్రదేశ్‌లో ఇప్పుడు నవంబర్ ఒకటో తేదీనే అవతరణ దినోత్సవంగా జరుపుతున్నారు. తెలంగాణలో ఏడాది పొడుగునా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఏపి విషయానికి వస్తే వేడుకగా జరుపుకోవడం కంటే విభజన సమస్యలపై దృష్టి ఎక్కువగా ఉంటుంది. రాష్ట్రానికి సంబంధించిన  రెవెన్యూ లోటు భర్తీ, బకాయిలు, నదీజలాల పంపిణీ వంటి వాటిపై సమస్యలున్నాయి. పలు విషయాల్లో ఉభయ రాష్ట్రాలు భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ పరిష్కరించాల్సిన కేంద్రం... కావాలనే జాగు చేస్తోంది. తెలంగాణలో వరసగా టిఆర్ఎస్/ బిఆర్ఎస్ ప్రభుత్వం కెసిఆర్ నాయకత్వంలో కొనసాగుతుంటే – ఎపిలో మొదటి పర్యాయం చంద్రబాబు టిడిపి సర్కారు, తర్వాత జగన్ మోహన్ రెడ్డి వైసీపీ సర్కారు పాలన సాగుతున్నది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరో ఏడాదిలో ఉమ్మడి రాజధాని హోదా ముగిసిపోనుండగా, ఎపి రాజధాని సమస్య ఎడతెగని ప్రతిష్టంభనగా మారింది. ఇలా రెండు రాష్ట్రాలు రెండు భిన్న దృశ్యాలను తలపిస్తున్నాయి.

కొంతమంది అంటున్నట్టు– దీన్ని కేవలం రెండు రాష్ట్రాల మధ్య వైరుధ్యంగానో, నాయకుల గొప్పతనం లేదా లోపంగానో చూడటం పాక్షికమవుతుంది. స్వాభావికంగానే విభజన ప్రభావం రెండుచోట్లా రెండు రకాలుగా ఉంది. ఒకరినొకరు పోటీ పెట్టి చూసుకోవడం, చులకన చేసుకోవడం అవసరం లేని పని. ఆ విధంగా పాలక వర్గాలు ఎక్కడి పాట అక్కడ పాడటం మానాలి. ఎక్కడైనా సరే , విధానాలు మారకుండా నాయకుల గొప్పతనమే కీలకమన్న ప్రచారాలు ఆపాలి. విభజన సమస్యలు ఇచ్చి పుచ్చుకునే రీతిలో పరిష్కరించుకోవాలని తెలుగువారు కోరుకుంటారు. కావాలని వాటిని పేరబెట్టిన కేంద్రంపై ఉమ్మడిగా ఒత్తిడి తేవడం తప్ప ఇందుకు మరో మార్గం లేదు. సహేతుకమైన సత్వర పరిష్కారాలే ఉభయులకూ మేలు చేస్తాయి. ఎందుకంటే మౌలికంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలూ లౌకిక విలువలనూ, మత సామరస్యాన్ని కోరుకుంటారు. పాలక పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలు ఎక్కడ ఎలావున్నా ప్రజలు మాత్రం మత రాజకీయాలను ఆదరించే ప్రసక్తి వుండదు. ఆ లౌకిక ప్రజాస్వామ్యాన్ని, సహోదర భావాన్ని కాపాడుకోవడమే తెలుగు రాష్ట్రాలకు నిజమైన రక్ష. రెండుచోట్ల సాంస్కృతిక విలక్షణతను కాపాడుకోవడం, వికేంద్రీకరణతో పాటు తెలుగుభాషనూ, కళా సాహిత్యాలను ముందుకు తీసుకుపోవడం ముఖ్యం.

♦ ♦ ♦

తెలుగు నాట ప్రగతిశీల సాహిత్యంలో అగ్రగణ్యుడు, అభ్యుదయవాది, సాహితీ స్రవంతి నిరంతర ప్రోత్సాహకుడు కేతు విశ్వనాథరెడ్డి కన్నుమూత తీరనిలోటు. సాహిత్య ప్రస్థానం ఆయనకు జోహారులర్పిస్తున్నది. ఈ సంచికలో ఆయన గతంలో ప్రస్థానంలో రాసిన కథను, మరికొన్ని  నివాళి రచనలను అందిస్తున్నాం. ■

ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
సత్యాజీ

సంపాదకవర్గం
కె.సత్యరంజన్ ♦ కెంగార మోహన్ ♦ వొరప్రసాద్ ♦ చీకటి దివాకర్ ♦ గనారా ♦ కుమార స్వామి
మేనేజర్ : కె.లక్ష్మయ్య

బొమ్మలు
తుంబలి శివాజి
చిదంబరం

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh.
Editor : Telakapalli Ravi

## కథలు


ఒక రెండు మాటలు : జి.ఉమామహేశ్వర్ ......... 5
పొడి నిజం : కేతు విశ్వనాథ రెడ్డి ....... 12
ఒక్క గాలివానకు ... : డా.దారల విజయ కుమారి 22
తీర్పు చెప్పే రోజు : కుమార్ కూనపరాజు ... 34
రెండరటి పళ్లు : రోహిణి వంజారి .......... 52


## కవితలు


ఇప్పుడైనా, తలెత్తి చూడు : నిఖిలేశ్వర్ .................. 9
ఆమె ఓ ఆయుధం : గిరిప్రసాద్ చెలమల్లు ....... 9
మట్టంటే ...? : చందలూరి నారాయణరావు 10
పరీక్షలు : ఎ.కిశోర్ బాబు ........... 16
అసంగతులు : పి శ్రీనివాస్ గౌడ్ ........ 17
పూర్తవ్వడం ... : మణీందర్ గరికిపాటి ..... 21
కత్తికొనల వర్తమానం : లోసారి సుధాకర్ ......... 25
నిజం తెలిస్తే చాలు : ఈతకోట సుబ్బారావు ...... 25
విప్లవాంజలి : అడిగోపుల వెంకటరత్నమ్ 29
అలా ఆగు, కాసేపు ... : ఏటూరి నాగేంద్రరావు ..... 29
రాత్రి సూర్యుడు : డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ .. 30
నాకో వృద్ధాశ్రమం కావాలి!: చిన్ని నారాయణ రావు ... 33
అప్పుడప్పుడు ... : పద్మావతి రాంభక్త .......... 33
ఆనవాలు : అనూరాధ ................ 37
హృదయభూమి : డా.విజయలక్ష్మి పండిత్ .. 37
జనమెరిగిన సత్యం : నందిరాజు విజయ్ కుమార్ 43
ఎద్దుకొమ్మున పొద్దును కట్టి ... : చింతా అప్పలనాయుడు ... 44
రైలు పట్టాలు : డా.డివిజి శంకరరావు ... 50
హాఫ్ హార్టెడ్ : దాకరపు బాబూరావు ..... 50
వెలుగు రాగాల పాట : రహీమొద్దీన్ ................ 51
గంద్ర గొద్దలి : మోకా రత్నరాజు .......... 58
రాజీ'కీయం : వీరేశ్వరరావు మూల ...... 58


## వ్యాసాలు


కథా మార్గదర్శి కేతు విశ్వనాథ రెడ్డి
– సన్నపరెడ్డి వెంకటరెడ్డి ........... 10
రైతుల బతుకు వెతలపై సాధికారిక కథలు
– గొల్లపల్లి వనజ .................. 18
మన ఎరుకలో లేని జీవితాల కథలు
– దొండపాటి కృష్ణ ............... 26
నాగేటి నెగులు వినిపించిన కొండ్రెడ్డి
– కిరణశ్రీ ......................... 31
బాల గేయాలు : వినోద విజ్ఞాన కారకాలు
– గొల్ల చక్రపాణి .. ................ 38
ముఖాముఖి : ఏది రాయకూడదో తెలియాలన్నా ... చదవాలి
– ప్రముఖ కవి, ఆచార్య శిఖాముఖి 41
సామాన్యుల బతుకు పాట 'జీవనరాగం'
– పేపకాయల ప్రసాద్ ........... 45
వర్తమానం: రాష్ట్రపతిని విస్మరించి రాజదండ ప్రతిష్ట
– తెలకపల్లి రవి ..................... 48
సాహితీ ప్రజ్ఞ ................................................ 57
ప్రతి హృదయాన్నీ తాకే అక్షర తరంగాలు
– శాంతికృష్ణ .................... 59
విశాల దృక్పథం విశాల నయనం
– సుధా మురళి .................... 61
గ్రామీణ కథా సొబగులు .. గాండ్లమిట్ట కథలు
– జంధ్యాల రఘుబాబు ......... 63
డైరీ ................................................ **65**



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# ఒక .. రెండు మాటలు

- జి.ఉమామహేశ్వర్

**రా**త్రి పదిన్నర కావస్తోంది.

దశరథ రామయ్యకి నిద్ర పట్టడం లేదు. పక్కకు తిరిగి చూశాడు. ప్రశాంతంగా నిద్రపోతోంది జానకి. తమ సంసారానికి రేపటితో యాభయ్యేళ్లు నిండుతాయి. గది బయట కోలాహల మంతా రేపటి వేడుక గురించే.

తనకి అరవయ్యేళ్ళప్పుడు షష్టి పూర్తి చేద్దామని అనుకున్నారు, కానీ కొడుకు చెప్పాడు : "షష్టి పూర్తి నాన్నకు గాని, అప్పుడు అమ్మకు యాభై ఏడేళ్లే కదా. అలా అని అమ్మకు అరవై వచ్చే పాటికి, నాన్నకు అరవై మూడేళ్లు ఉంటాయి. అందుకే ఒక పని చేద్దాం. వాళ్ళ యాభయ్యవ పెళ్లి రోజువరకూ వెయిట్ చేద్దాం. అదైతే ఇద్దరికీ వర్తిస్తుంది కదా! అప్పుడు గోల్డెన్ జూబ్లీ ఘనంగా చేద్దాం"

అందరూ సరేనని పన్నెండేళ్ళ తరువాత ఈ ముహూర్తం పెట్టారు. ఇంటి దగ్గరే ఒక చిన్న ఫంక్షన్ హాలు అద్దెకు తీసుకున్నారు. బంధువులు, స్నేహితులు, శ్రేయోభి లాషులు వస్తారని చెప్పారు.

నిద్రపట్టక అటూ ఇటూ పచార్లు చేస్తున్న దశరథ రామయ్యకు తమ తలుపుకు దగ్గరగా పెద్ద కొడుకు మాట చిన్నగా వినబడీ వినబడనట్టుంది. దగ్గరగా వెళ్ళి ఆలకించాడు. కోడలేదో చెప్పింది, తనకి వినబడలేదు. వెంటనే కొడుకు కృతజ్ఞత నిండిన గొంతుతో 'థాంక్యూ' అనడం స్పష్టంగా వినబడింది. తనలో ఒక చిన్న ఉలికిపాటు.

కొంత పశ్చాత్తాపంతో, కొంత న్యూనతతో పక్కకి చూశాడు. జానకి చిన్నగా గురక పెడుతున్నది. పెళ్ళైన కొత్తల్లో ఈ గురక భరించలేకపోయేవాడు. చాలాకాలం తను పడుకున్న తరువాతే జానకి పడుకునేది. తన పెళ్లయ్యేనాటికి ఇంట్లో ఇద్దరు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్ళు, తల్లీ ఉండేవారు. వాళ్ల చదువులు, పెళ్ళిళ్ళు ముగించి ఊపిరి పీల్చుకునే సమయానికి పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. ఎప్పుడు పెళ్లయిందో, ఎప్పుడు పిల్లలయ్యారో .. కళ్ళు తెరచి చూసేపాటికి తనకి ఉద్యోగ విరమణ వయసు వచ్చేసింది. తన బదిలీలు, ఆఫీసు పని వత్తిళ్ళు, ఒంటరి సంపాదన, అనివార్యమైన ఖర్చులు అన్నింటినీ దాటి ఈ స్థితికి చేరడానికి జానకే కారణం కదా! కానీ, ఈ విషయాన్ని తను ఎప్పుడూ ఆమెకు చెప్పలేకపోయాడు, ఎందుకనీ? కొడుకుల, అల్లుళ్ళ ప్రవర్తన, అలవాట్లు తనను చాలా న్యూనతకు గురిచేస్తాయి. ఎప్పటికప్పుడు జానకి తనను గూర్చి ఏమనుకుని ఉంటుందో అని తలచుకోవాలంటే భయమేస్తుంది.

దశరథ రామయ్య తన యాభయ్యేళ్ళ జీవితాన్ని నెమరేసుకుంటున్నాడు.

పెళ్ళయిన కొత్తల్లో, ఒకరోజు వర్షం పడుతోంది. తీగె మీద బట్టలు ఆరేసి ఉన్నాయి. తను చూశాడు. వాటిని తీసి లోపల వేద్దామనుకున్నాడు. బయటవరకూ వచ్చిన వాడు ఉన్నట్టుండి షాక్ కొట్టినవాడిలా ఆగి పోయాడు. పక్క మేడ మీద బాచిలర్స్, తన ఆఫీస్‌లో వాళ్ళే, ఆ వానలో పిట్టగోడ మీద కూర్చుని విలాసంగా సిగరెట్ తాగుతున్నారు. ఇప్పుడు తను పోయి ఆ బట్టలు తీశాడో, అయిపోయాడే! అందులో జానకి బట్టలు కూడా ఉన్నాయి. ఇంకేముంది? రేపటినుండి 'ఏంటి, వాడా? పెళ్ళాం గుడ్డలు మడిచి పెట్టేవాడు, వాడి గురించి, వాడి మగతనం గురించి మా దగ్గర చెప్పకు' అంటూ అడిగిన వాళ్ళకి, అడగని వాళ్ళకి పని గట్టుకుని మరీ చెబుతారు. అంతే, తను గుట్టుచప్పుడు

కాకుండా లోపలికెళ్లి పోయాడు. కొద్దిసేపటికి జానకి వచ్చి చూసేపాటికి బట్టలన్నీ నానిపోయాయి. నాని పోయింది బట్టలే కదా, కాసేపుంటే ఆరిపోతాయి. వాటి మీద దయ తలిస్తే రేపొద్దున పదిమందిలో తన పేరు నాని పోతుంది. అది ఆరడం కష్టం కదా! అనుకున్నాడు.

ఈ రోజు తలచుకుంటే సిగ్గేస్తుంది. తన కొడుకు, వాషింగ్ మెషీన్‌లో బట్టలుతికి, తానే అన్నిటినీ భుజం మీద వేసుకుని, ఒక్కొక్కటీ ఆరేస్తుంటే తనకు చాలా గిల్టీగా వుంటుంది.

మరోసారి, తన ఫాల్స్ ప్రిస్టేజీతో జానకిని ఇబ్బందిపెట్టిన సంఘటన గుర్తొచ్చింది. తను జానకి కలిసి హోటల్ కెళ్ళి ఏదో ఆర్డర్ చేశారు. తీరా చెప్పాక చూస్తే దాని రేటు చాలా ఎక్కువగా వుంది. వెయిటర్‌ని పిలిచి కాన్సెల్ చేద్దామని జానకి చెబితే, తనకి ఎక్కడ లేని రోషం పొడుచుకొచ్చింది. అంటే, ఇప్పుడు వాడి ముందు, 'మేము బీదవాళ్ళం నాయనా, అంత పెట్టి తినలేము' అని చెప్పడమే కదా, అని వారించి తనకు, ఆమెకు ఇష్టం లేకున్నా, కేవలం పంతం కోసం తిని ఎక్కువ డబ్బులు చెల్లించారు. అలాంటి సంఘటనే మరోసారి చిన్న కొడుకుతో ఒక కాంటినెంటల్ హోటల్‌కి వెళ్ళినప్పుడు జరిగింది. మెనూ చూస్తే, తాము తినదగినవేవీ అందులో కనబడలేదు. అప్పటికే టేబిల్ ఆక్రమించుకుని, కుర్చీలలో కూర్చున్నారు. అయినా కోడలు మొహమాటపడకుండా, బేషజాలకు పోకుండా 'ఇక్కడ ఏమీ తినేలాగాలేవు. పైపెచ్చు ధరలు చూస్తే చాలా ఎక్కువున్నాయి. లెట్స్ మూవ్.. వేరే హోటల్‌కి వెళదాం' అనగానే, కొడుకు, సరే అని లేవడం, అందరినీ పురమాయించి, వేరే హోటల్‌కి సన్నద్ధమవుతూ వెయిటర్‌ని పిలిచి ఏదో మాట్లాడి బయటకు దారితీయడం జరిగిపోయాయి. భార్య మాట వినడం అతనేమీ నామోషీగా భావించలేదు. అది తనకి ఆశ్చర్యమే!

భార్య మాట విని ఇల్లు కొనే ఆలోచనలో వున్న పెద్ద కొడుకు విషయంలో తన స్నేహితుడు ఒక ఉచిత సలహా ఇస్తే, నిర్మొహమాటంగా, తండ్రి స్నేహితుడని కూడా చూడకుండా

"పెళ్ళాం అంటే మన శత్రువు కాదు కదంకుల్! ఏది మంచో, ఏది చెడో ఇద్దరం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి కానీ, భార్య చెప్పింది కదా అని, కొట్టి పారేస్తే ఎలా?" అన్నాడు. అంతే, తన మిత్రుడికి నోట మాట రాలేదు.

ఆ మాటలు తలచుకుని తనెన్నిసార్లు కుచించుకు పోయాడో!

ఎన్నోసార్లు జానకి మాట తను వినకపోవడం, దాని వల్ల నష్టం జరగడం, జరిగిన నష్టాన్ని కప్పిపుచ్చుకోవడం, అందుకోసం అదనంగా మరికొన్ని అబద్ధాలాడడం...

పెళ్ళయిన పదేళ్ళకి చెల్లెలికి, తమ్ముళ్ళకి పెళ్లిళ్లయి, తనకి పెద్దకూతురు, పెద్ద కొడుకు పుట్టిన తరువాత ఒక రోజు, జానకికి జ్వరంగా వుంది. అంట్లు తోమడమో, ఇల్లు ఊడవడమో చేస్తే ఆమెకి చాలా సహాయం చేసినట్టు. అప్పుడు అమ్మ ఇంట్లో ఉంది. అమ్మ ఉన్నప్పుడు తనతో ఏ పనీ చేయించదు. జానకికి జ్వరం, పిల్లలు చిన్నవాళ్ళు. అమ్మకు అప్పటికే డెబ్భై ఏళ్లు. తాను ధైర్యం చేసి జానకికి సహాయం చేయవలసిన సందర్భం. కానీ అమ్మ ఎక్కడ తనని తప్పు పడుతుందోనని తటపటాయించాడు. లేవలేని పరిస్థితిలో కూడా తనని కూర్చోమని చెప్పి అమ్మైనా ఊడుస్తుంది గానీ తనతో ఊడవనివ్వదు. అప్పుడు అమ్మను వారించలేక, తను సహాయం చేయలేక, ఆ జ్వరంలో జానకిని ఎంత ఇబ్బంది పెట్టాడో తలచుకుంటే సిగ్గేస్తుంది.

ఒక్కో సంఘటన గుర్తొచ్చి హృదయాన్ని బరువెక్కిస్తోంది.

ఒకసారి బంధువుల పెళ్లికెళ్లారు. అక్కడ తమ బంధువులామె బట్టల్లో జానకి పట్టుబట్టలు కలసి పోయాయి. జానకి చూశానని చెబుతుంటే ఆ బంధువులామె దొంగతనం మోపుతున్నారని అపార్థం చేసుకుని జానకిని నిందిస్తోంది. తాను జానకిని సపోర్ట్ చేయాల్సింది పోయి, కనీసం రాజీమార్గం ఆలోచించాల్సింది పోయి, ఆ బంధువుని ఏమీ అనలేక జానకిని తిట్టి లోపలికి పొమ్మంటే మౌనంగా తన మాటలను గౌరవించి లోపలకి వెళ్లింది. ఆ తరువాత వాళ్ళ ఆయన వచ్చి ఆవిడ చేతి వాటం మనిషని చెప్పి ఆ గుడ్డలు వెనక్కి ఇస్తున్నపుడు తను జానకి వైపు చూడలేక పోయాడు.

❖❖❖

రామయ్య ఒక్కసారి తల విదిలించి ఈ లోకంలోకి వచ్చాడు. బయట మాటలు మెల్లగా తగ్గిపోయాయి. చప్పుళ్ళు కూడా నెమ్మదించాయి. ఒకటీ రెండు లైట్లు తప్ప చాలా పలుచగా పరచుకున్న వెలుతురు. మళ్ళీ మంచం దగ్గరకు వచ్చి, జానకి మొహంలో మొహం పెట్టి చూశాడు.

ఇంతటి అమాయకురాలిని, సున్నితమైన వ్యక్తిని కొట్టడానికి తనకి చేతులెలా వచ్చాయో? తలచుకుంటే సిగ్గేస్తుంది. ఆమె తిరిగి ప్రశ్నించకుండా ఓర్పుతో వాటిని భరించడం ద్వారా తనలో మరింత లజ్జను కలుగజేసి మిన్నకుండేది. ఇప్పుడు నిండుకుండలా ఎంత నింపాదిగా వుందో అనుకుంటూ మరిన్ని జ్ఞాపకాలు తవ్వుకుంటున్నాడు.

పెళ్ళయి ఐదేళ్లయినా ఇంకా పిల్లలు కలగలేదని ఇంట్లో తల్లి ఒకటే సణుగుడు. ఊ అంటే ఇంకో పెళ్లి చేయాలని మేనమామ, తల్లీ రెడీ అయిపోయారు. ఎందుకు కావడంలేదనే విశ్లేషణ లేదు. మగవాడిలో ఏ లోపమూ ఉండదనే పురుషాధిక్య అహంకారపు విశ్వాసం. ఎవరో తరతరాలుగా పాతిన మూఢ నమ్మకపు ఛాయలు. వంశాన్ని కొనసాగించాలి కాబట్టి పెళ్లి చేసుకోవాలి అనే ఎమోషనల్ డిమాండ్. రెండో పెళ్లిచేసుకున్నా పిల్లలు కలగకపోతే అనే అనుమానపు ఊగిసలాట తనని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నవేళ బహుశా జానకి తన మనసులో ఏమాలోచించుకుని ఉంటుందో ఊహించటానికే ఇప్పుడు భయమేస్తుంది. అయినా ఎక్కడా బయటపడలేదు. తనకి సవతి పోరు ఉంటుందేమోనని భయపడలేదు. ఏ దేవుళ్ళకు రహస్యంగా మొక్కుకుందో, పెద్ద కూతురు కడుపులో పడి తనని పెద్ద గండం నుండీ

బయటపడేసింది. హఠాత్తుగా ఆయనకు చిన్న కొడుకు గుర్తు వచ్చాడు. వాళ్ళకి కూడా పెళ్ళయి పదేళ్లయినా ఇంకా పిల్లలు కలగలేదు. డాక్టర్ల దగ్గర చూపిస్తే కోడలిలో ఏదో లోపముందని చెప్పారు. ఆ అమ్మాయికి పిల్లలయ్యే అవకాశమే లేదని చెప్పారు. అప్పుడు తనే ఒక బంధువు ద్వారా వాడికి ఇంకో పెళ్లి చేద్దామనే ప్రతిపాదన పెడితే వాడిచ్చిన సమాధానానికి బంధువు చల్లగా జారుకున్నాడు. ధర్మేచ, అర్థేచకి అర్థమేంటి అని అడిగాడు. నా రెండవపెళ్ళితో నేను తండ్రి అవుతాను, మరి భార్య తల్లి కాగలదా అని మొహం మీద గుద్దినట్టు అడిగాడు. 'అందుకే మేము ఏదైనా ఆర్ఫనేజ్ నుండి పిల్లలను దత్తత తీసుకుంటాం. ఇద్దరమూ కలిసే పేరెంట్స్ అవుతాము' అని తన ముందే ధైర్యంగా కుండబద్దలు కొట్టినట్టు చెప్పి నోరు మూయించాడు.

ప్రతిరోజూ రుచిగా వంట చేసే భార్య ఏదో ఒకరోజు పొరపాటున సరిగా వండక పోతే ఎంత రభస!

ఒకరోజు చెల్లెలి భర్త ఇంటికొచ్చిన రోజున ఇలాగే ఏదో కూరలో తాను మరచిపోయి కొంచెం ఉప్పు ఎక్కువేసింది. మరీ ఎక్కువేమీ కాదని ఏదో సర్దిచెప్పబోయింది. తన బావ ముందు అలా బదులిస్తే తన అహం దెబ్బతిన్నది. తను నోటికొచ్చింది వాగాడు. చెల్లెలి భర్త సర్దిచెప్పాలని ప్రయత్నించినా ఆ ఆవేశం అంత త్వరగా అణిగిపోలేదు. జానకి అప్పుడు తనని ఎన్ని శాపనార్థాలు పెట్టి వుంటుందో! తన రుచుల పట్టింపు అక్కడితో ఆగలేదు. ఒకసారి కూతురి ఇంటికి వెళ్ళాడు. అల్లుడుకి తనకీ వడ్డించింది. రసంలో పులుపు ఎక్కువైంది. తనకి తెలుస్తోంది. అల్లుడికంటే ముందు తనే కూతురిని మందలిస్తే అల్లుడికి తన కూతురిని తిట్టే అవకాశం వుండదనుకుని అదే మాట చెప్పాడు. కూతురు ఏమీ బదులు చెప్పకముందే, అల్లుడు, 'ఏదో ఒక రోజు కొంచెం అటు ఇటూ అవుతుంటుందండి. కావాలని తను చెడగొట్టదు కదా', అనేసరికి తన నోట మాట రాలేదు.

అప్పటినుండే తనలో అంతర్మథనం మొదలైంది.

ఎందుకలా? తనెందుకు అంత అవివేకంగా ఆలోచించాడు? అలా తనొక్కడేనా? సంఘానికి భయపడి, కనబడని పరువు ప్రతిష్టలకు పెద్దపీట వేసి స్వంత మనుషులను కష్టపెట్టడం ఎందుకు ? అవన్నీ పాపాల భైరవుడిలా మోస్తూ, ఆత్మ వంచన చేసుకుంటూ బయటకు మేకపోతు గాంభీర్య ప్రదర్శన ఎవరికోసం? ఎన్ని అపరాధ భావనలను మోశామో! ఎవరో ఏదో అనుకుంటారని నిరంతరం మనతో ఉండే, నిత్యం మన గురించి ఆలోచించే మనిషిని కష్ట పెట్టాం. పెళ్ళాం చేయడానికే ఉంది, చేయించు కోవడం మగవాడి హక్కు అని పరోక్షంగా సమాజం అవకాశం కల్పిస్తుంటే ఏ మగవాడికి మాత్రం దాన్ని కోల్పోవాలని ఉంటుంది? కాదు, కాదు.. ఆలోచనతో, పరిశీలనతో, అవగాహనతో దాన్ని పోగొట్టుకుంటున్న ముందు తరాన్ని చూస్తుంటే, మనం కదా నేర్చుకోవాలి వీళ్ళ నుండీ.. మన నుండి నేర్చుకోలేదని ఫిర్యాదులు చేస్తాం దేనికి ? వృత్తంలోని వ్యాసరేఖ మీద నుంచుని, అవతల వాడు నాకన్నా 180 డిగ్రీలు వెనక వున్నాడు అనుకుంటాం. నిజానికి 180 డిగ్రీలు ముందున్నాడు అని గుర్తించేసరికి వృత్తం బిందువులోకి కుచించుకుపోతుంది. ఆలోచనలలో ఎప్పుడు నిద్ర పోయాడో గమనించలేదు దశరథ రామయ్య.

❖❖❖

ఉదయమైంది.

తను లేచేపాటికి అందరూ లేచి హడావుడిగా తిరుగుతున్నారు. తను చాలా రోజుల తరువాత ఇంత గాఢంగా నిద్రపోవడం. నిద్ర కళ్ళతోనే బయటకొచ్చాడు. చుట్టూ కోలాహలంగా, సంబరంగా ఉంది.

ఎదురుగా పెద్ద హాల్. దాని చివర స్టేజి, పూలతో అలంకరించారు. ఎడమవైపున కిచెన్, కుడివైపున భోజనాలు. పరికించి చూస్తుండగానే చిన్న కొడుకొచ్చాడు

"గుడ్ మానింగ్ నాన్నా. మీరు త్వరగా రెడీ అయితే టిఫిన్ చేసేసి పూజ మొదలు పెడదాం. ఆ తరువాత మీరు దండలు మార్చుకోవడం. చిన్న రిసెప్షన్. లంచ్. కొంచెం సేపు విశ్రాంతి. సాయంత్రం పిల్లలతో కొన్ని ఆటలు. రాత్రి లైట్‌గా భోంచేసి వెళ్ళి పోవడం. ఇదీ ప్లాన్." చెప్పి వెళ్లిపోయాడు.

రామయ్యకు కొంచం సిగ్గుగా అనిపించింది. వీళ్ళందరికీ నామకరణాలు, బారసాలలు, శ్రీమంతాలు, పెళ్లిళ్లు చేసిన తనను ఈ రోజు వీళ్ళు వింతగా చూస్తున్నారు. కొత్తగా చూపిస్తున్నారు.

మధ్యాహ్నం పన్నెండుకల్లా రామయ్య, జానకమ్మ పూజ ముగించి వేదిక మీదకు చేరుకున్నారు. మేళ తాళాల మధ్యలో ఇద్దరూ దండలు మార్చుకున్నారు. ఇద్దరికీ ఇదో కొత్త అనుభవం. బహుశా పెళ్లప్పుడు ఎలా ఫీలయ్యారో గుర్తు రావడం లేదు గానీ, ఇప్పుడు దశరథ రామయ్యకి చాలా ఉత్సాహంగా ఉంది. చదువు ముగించుకుని, ఇంటి బాధ్యతలు నెత్తినేసుకుని, ఉద్యోగపు ఒత్తిడిలో, కొత్త కుటుంబాన్ని మోయాలన్న ఆలోచనలతో చేసుకున్న అప్పటి పెళ్లి కంటే ఈ పెళ్లి చాలా హాయిగా, ఆహ్లాదంగా ఉంది. తను పెంచిన పూల తోటలో విహారానికెళ్లినట్టుగా వుంది. అపరిచితురాలైన అమ్మాయి పక్కన ఉండడం కంటే, యాభై యేళ్ళు తనతో గడిపిన భార్యతో ఈ సంబరం పంచుకోవడం అద్భుతంగా వుంది.

జానకి వైపు చూశాడు. నిండుగా నవ్వుతోంది.

అవును, ఇప్పుడు ఈ నవ్వే తను చూడాలి.

'నాన్నా, ఇలా కూర్చోండి.' అంటూ కూతురు ఇద్దరినీ కూర్చోబెట్టి కాళ్ళకు నమస్కరిస్తోంది. అలా కూర్చునుండగానే కుటుంబమంతా నమస్కరించి వెళ్ళిపోయారు.

భోజనాల వేళ చెల్లెళ్ళు, మేనల్లుళ్ళు, మేనకోడళ్లు వాళ్ళు తమ జ్ఞాపకాలని నెమరేసుకున్నారు. వేసవి సెలవులకు వచ్చినప్పుడు తమతో ఎలా గడిపిందీ వాళ్ళ పిల్లలకు వివరిస్తున్నారు. చెల్లెళ్ళు తమ చిన్నప్పటి కష్టకాలాలను, ఆ కష్టాలను అధిగమించిన అనుబంధాల గొప్పదనాన్ని వాటి అనుభవాలని విడమరచి

చెబుతున్నారు. భోంచేసి కాసేపు నడుంవాల్చారు పెద్దవాళ్ళు.

సాయంత్రమైంది. పిల్లలు ఏవేవో ఆటలు ఆడుతున్నారు. పెద్దవాళ్ళు విడివిడిగా ఎవరిపాటికి వాళ్ళు రాజకీయాలు, సినిమాలు, ఉద్యోగ విషయాలు మాట్లాడుకుంటున్నారు.

పెద్ద మనవరాలు అందరినీ పోగు చేసి చుట్టూ కుర్చీలేసి కూర్చోబెట్టింది. చిన్న బొమ్మనొకదాన్ని తీసుకుని

"మనమిప్పుడొక చిన్న గేమాడబోతున్నాం. ఏయ్, అందరూ నామాట వినండి. అందరూ చుట్టూ కూర్చున్నారు కదా! ఈ పక్కనుంచి ఒక పాట వస్తుంటుంది. ఇదిగో, ఈ బొమ్మ మీ పక్కన వాళ్ళు మీకు పాస్ చేస్తారు. మీరు మీ ఇంకో పక్కన వాళ్ళకి పాస్ చెయ్యాలి. పాట వస్తున్నంత సేపూ అలా చేస్తూనే ఉండాలి. ఉన్నట్టుండి పాట ఆపేస్తారు. అప్పుడు బొమ్మ ఎవరి దగ్గరుంటుందో వాళ్ళు ఎలిమినేట్ అయినట్టు లెక్క. వాళ్ళు ఏదైనా ఒక ఐటెమ్ అంటే మిమిక్రీ, పాట, డాన్సు, స్పీచి ... ఇలాంటివి ఇక్కడ అందరి ముందూ ప్రదర్శించిపోవాలి. ఓకేనా, స్టార్ట్ చేద్దామా?" అంటూ పాట ప్లే చేయడం మొదలు పెట్టింది.

దాదాపు ఇరవై ఐదు మంది చేతులమీద ఆ బొమ్మ ఎగురుతూ, ఎగురుతూ పక్క వాళ్ళకు, ఆ పక్కవాళ్ళకు అలా చేరుతోంది.

పాట ఆగింది. బొమ్మ పెద్ద అల్లుడి చేతిలో ఉంది. మనవరాలు, అతణ్ని చేయి పట్టుకుని వృత్తం మధ్యలోకి తీసుకునొచ్చి, అతనితో ఒక చీటి తీయించింది. దాన్లో 'ఎవరినైనా ఇమిటేట్ చేయాలి' అని రాసుంది.

అతను పదే పదే కళ్లెగరేస్తూ మాట్లాడే తన కొలీగ్‌ని అనుకరించి నవ్వించాడు.

మళ్ళీ ఆట మొదలైంది.

ఈసారి చిన్నకొడుకు అవుటయ్యాడు. అతను కొత్త సినిమా స్టెప్పులేస్తూ డాన్స్ చేశాడు. ఆట మొదలై గంట దాటింది. అందరూ బాగా లీనమైపోయారు. ఎప్పటికప్పుడు తమ దగ్గరినుండి బొమ్మని పక్క వాళ్ళ మీదకు విసిరేసి రేస్‌లో కొనసాగాలని, ఓటమిని తప్పించుకుందామని ప్రయత్నిస్తున్నారు.

అప్పటికే నిష్క్రమించిన వాళ్ళందరూ మిగిలిన వాళ్లవైపు చేరి వాళ్ళను ఉత్సాహపరచడం మొదలుపెట్టారు. ఒక్కొక్కరిగా నిష్క్రమిస్తూ... చివరికి దశరథ రామయ్య, జానకమ్మ మిగిలారు.

పాట మొదలైంది. అందరూ ఎవరి పక్షంవాళ్లని వాళ్ళు ప్రోత్సహిస్తున్నారు. పాటతో పాటూ "తాతయ్య , తాతయ్య", "అమ్మమ్మ, అమ్మమ్మ", "నానమ్మ, నానమ్మ" అంటూ పిల్లల అరుపులు హాలంతా ప్రతిధ్వనిస్తున్నాయి.

పాట ఆగింది. 'తాతయ్య విసిరేయ్, విసిరేయ్' అంటూ సలహాలిస్తున్నారు. పాట ఆగకముందే దశరథ రామయ్య ఆ బొమ్మని తన దగ్గర అలాగే పట్టుకున్నాడు. అమ్మమ్మ విన్నర్, నానమ్మ విన్నర్ అంటూ మనవాళ్లు, మనవరాళ్ళు కేరింతలు కొడుతూ జానకమ్మను చేయి పట్టుకుని విష్ చేస్తున్నారు. ఆమె ముసిముసి నవ్వులు నవ్వుతూ విజయోత్సాహాన్ని దాచుకోవాలని ప్రయత్నిస్తూనే, ప్రదర్శిస్తోంది. తను ఓడిపోయినందుకు దశరథ రామయ్య అంతకంటే ఎక్కువ ఆనందం అనుభవిస్తున్నాడు.

"ఏయ్, తాతయ్యను రమ్మనండి. చీటి తీయమనండి" పిల్లలు డిమాండ్ చేస్తున్నారు. రామయ్య మధ్యలోకొచ్చి నిలుచున్నాడు. చీటి తీశాడు.

'భరత నాట్యం చేయాలి' అనుండే సరికి జానకమ్మకు ఒకటే నవ్వొచ్చింది. 'నాకు రాదురా' అనేసరికి, సర్లే తాతయ్యకి ఇంకో ఛాన్స్ ఇద్దాం అని ఇంకో చీటి తీయమన్నారు. అందులో కూడా పాప్ మ్యూజిక్ అభినయం చేయాలి అనుండేసరికి, రామయ్య ఇబ్బంది గమనించి, అలాగే పిల్లలని నిరుత్సాహ పర్చడం ఇష్టంలేని చిన్న కొడుకు, "నాన్నా, ఇవన్నీ మరీ క్రేజీగా ఉన్నాయి. అలా అని ఏమీ చెయ్యకపోతే వీళ్ళు బాధ పడతారు. అందుకే ఏవైనా రెండు మాటలు మాట్లాడి వెళ్ళండి." అన్నాడు.

రామయ్య సాలోచనగా అందరినీ పరికిస్తూ ... "నేనూ అదే అనుకుంటున్నానురా. ఆ రెండు మాటలు చెప్పడానికి ఇంతకంటే మంచి అవకాశం రాదు" అంటూ రెండు గుక్కలు నీళ్ళు తాగి, జానకమ్మ వైపు చూస్తూ ...

"నేను, ఈమె యాభై యేళ్ళ నుండి ఒకే ఇంట్లో కలిసున్నాం. అట్లా ఉండడం కూడా ఈ రోజుల్లో అదృష్టమనే అనుకుంటున్నా. కష్టాలు పడ్డాం, సుఖాలూ అనుభవించాం. నాతో పాటు ఇన్నేళ్లు నడచి నన్ను కాపాడుకుంటూ వచ్చింది. నా కోసం ఎన్నో త్యాగాలు చేసింది. ఎంతో కష్టపడింది. కానీ నేను ఒక్క రోజు గూడా దానిని గుర్తించినట్టు ఆమెతో ప్రవర్తించలేదు. ఎన్నో సందర్భాల్లో ఆమెని బాధలకు గురిచేశాను. కష్టపెట్టాను. అలాంటప్పుడు గూడా ఆమెతో ఎందుకలా ప్రవర్తించాల్సి వచ్చిందో చెప్పి ఆమెను సాంత్వన పరచాలని చూడలేదు. అప్పుడు మేమంతా ఒక ట్రాన్స్‌లో బతికాము. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే ఇప్పటికీ ఎవరైనా అలా ప్రవర్తిస్తుంటే, దహించే పశ్చాత్తాపాన్ని నాలాగా చివరివరకూ మోయగూడదని. ముసుగులు తీసేసి స్వచ్ఛందంగా, స్వచ్ఛమైన మనసుతో స్వేచ్ఛగా తప్పు ఒప్పుకోవచ్చని. మంచిని బయటకు చెప్పడంలో మనమేమీ కోల్పోమనీ... పైపెచ్చు అది మనకు గొప్ప రిలీఫ్ ఇస్తుందని నా జీవితానుభవంతో నేర్చుకున్న విషయం మీతో పంచుకుంటున్నాను. ఇన్నాళ్లనుండీ నేననుభవించిన సంఘర్షణ నుండి ఈరోజు బయటపడదామనుకుంటున్నాను. మిమ్మల్నందరినీ చూస్తే నాకొక ఆశ్చర్యం! మీరు చెప్పుకునే సారీలు, థాంక్సులు గమనిస్తుంటే నాకు ఎంతో కాలం నుండీ నా గుండెలో కొట్టుకులాడుతున్న ఈ రెండు మాటలు మీ అందరి ముందు చెబితేనే నాకు ప్రశాంతత అనిపించింది. ఇన్నాళ్ళు చేసిన పొరపాట్లకి తప్పులకి జానకిని నేను క్షమాపణ అడుగుతున్నాను. అలాగే ఇంతకాలం నన్ను భరించినందుకు, నాకు చేసిన సహాయాలకు జానకికి నా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను"

ఉద్వేగం తన్నుకొస్తోంది. మనిషి సన్నగా కంపిస్తున్నాడు.

## ఇప్పుడైనా

## తలెత్తి చూడు మిత్రమా!

**కు**డి ఎడమల దగా అంటూ
తలదించుకు నడుస్తున్న మిత్రమా!
నీ దారి కడ్డంగా
బుల్‌డోజర్ నిలుచుంది చూడు
మూకుమ్మడి అధికార బలంతో
ధన దౌర్జన్యపు ఎత్తుగడలతో
రాజ్యాంగ యంత్రాన్ని పెకిలిస్తున్నది
భవిష్యత్తు ఇక చిందర వందరే!

మానవధర్మంపై పడగ విప్పుతున్న
మనుధర్మం జీవం పోసుకుంటున్నది మరోవైపు
సనాతన సమాధుల వేదికలపై
అధునాతన శాలువల ముసుగులతో
మురిపించి మరిపిస్తున్న -
పురాణ ప్రసంగాల హోరు ...
ఏది సత్యం ఏది అసత్యమనే మీమాంసలో
ఇంకెంతకాలం అంతర్ పలాయనం?
ఇప్పుడైనా తలెత్తి చూడు మిత్రమా,
కుడి ఎడమలను కాదని
రోడ్డు మధ్య నడవగలవా?
నాకెందుకులే ఈ రాజకీయమంతానని
తటస్థంగా ముక్కు మూసుకోగలవా?
తిరిగి చూడు
ప్రమాదాన్ని తప్పించే
ఎడమ వైపే కదా, జీవితం!

**- నిఖిలేశ్వర్**
**91778 81201**

ఉన్నట్టుండి వాతావరణం గంభీరంగా మారిపోయింది. అందరికీ ఏదో కొత్త విషయాలు తెలుసుకుంటున్న ఉత్సుకత, ఎన్నడూ వినని మాటలు రామయ్య నోటినుండి.

అందరి కళ్ళల్లో ఆశ్చర్యం, ఆనందం, సంభ్రమం. కొడుకులకూ, కూతుర్లకూ కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. తండ్రి తనలో ఈ విషయం మీద ఇంత మధనపడుతున్నాడని తెలియదు. అందరిలో ఉద్విగ్నత. పెద్ద మనవరాలు ముందుగా తేరుకుని చప్పట్లు కొట్టింది. మిగతా పిల్లలు, పెద్దలు చేతులు కలిపారు. కొద్ది నిముషాల్లో ఆ హాలు చప్పట్లతో దద్దరిల్లిపోయింది. ■

## ఆమె ఓ ఆయుధం

**ఆ**మె ఆడాల్సిందే
కానీ, ఏ ఆటో వాడే నిర్ణయించాలి
ఆమె కుస్తీ పతకం తెచ్చినా వాడి చూపులో
అదే లోదృష్టి
రాజధాని నగరం నడి వీధిలో
ఆమె కంట కన్నీరు
వాడు తొణకడు
వాడు మను వారసుడు!

అంగాంగ ప్రదర్శనకై వాడు ఆరాటం
తీరొక్క పట్టులతో పతకంకై ఆమె పోరు
ఆమెకి అండగా కదలదు సంఘం
సంఘం వాడి కనుసన్నల్లో కునారిల్లు
అనాదిగా ఆమెపై అదే దాడి
న్యాయం సుమోటోగా స్వీకరించలేని
వాడి ధృతరాష్ట్ర పాలన
పట్టు పట్టాల్సిన చేతులు న్యాయం కోసం అర్థిస్తుంటే
మౌని మనువు స్వపక్ష రక్షణలో నిర్లజ్జగా ...

తల్లీ!
నువ్విలా దీనంగా పలవరించకు!
రాజ్యాన్ని అంతర్లీనంగా నడిపిస్తున్న మనువును చంపే
పదును చేతులకు కల్పించు
ఆలోచనలకు పదును పెట్టే మెదడుకు చురకంటించు
ఆయుధం ఏంటో నీ ఇష్టం!
ఏదైతే నిన్ను రక్షించగలదో అదే!!

**- గిరి ప్రసాద్ చెలమల్లు**
**9493388201**

## 14వ జాతీయస్థాయి చిన్న కథల పోటీ 'సోమేపల్లి పురస్కార' విజేతలు

**ఇ**టీవల 'రమ్యభారతి' ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్న కథలకు సోమేపల్లి సాహితీ పురస్కారాల పోటీలో 'అకుపచ్చని పొద్దు' కథకుగాను బి.కళాగోపాల్ (నిజామాబాద్) ప్రథమస్థాయి పురస్కారం లభించింది. 'విత్తు' కథా రచయిత బి.వి.రమణమూర్తి (మధురవాడ)కు ద్వితీయ, 'వైకుంఠపాళి' కథా రచయిత మల్లారెడ్డి మురళీమోహన్ (విశాఖపట్నం)లకు తృతీయ సోమేపల్లి పురస్కారాలు లభించాయి. 'ఎగిరే ముద్దు' శింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు), 'వెన్నెల దీపం' బి.వి.శివప్రసాద్ (విజయవాడ), 'బాధనుండి బాధ్యత వైపు' కె.వి.లక్ష్మణరావు (మానేపల్లి), 'ఏది దానం-ఎవరు దాత' కె.వి.సుమలత (గుడివాడ)లకు ప్రోత్సాహక పురస్కారాలు లభించాయి. విజేతలకు త్వరలో జరిగే ప్రత్యేక సభలో పురస్కారాలు అందజేస్తాం. ఈ కథల పోటీకి ప్రముఖ రచయిత శ్రీ కంఠస్ఫూర్తి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. **- చలపాక ప్రకాశ్**



# కథా మార్గదర్శి కేతు విశ్వనాథ రెడ్డి

**- సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి**

ప్రసిద్ధ రచయిత, సాహిత్య విమర్శకులు కేతు విశ్వనాథ రెడ్డి భౌతికంగా మన నుంచి దూరమయ్యారు. ఒక ఆకు రాలినట్టు తన స్థానానికి సంబంధించిన స్పష్టమైన గుర్తును వదిలిపెడుతూ చప్పుడు చేయకుండా ప్రశాంతంగా వెళ్ళిపోయాడు. ఎన్నో చిగురు టాకులకు మార్గదర్శకంగా నిలిచినవాడు. ఒక సంక్లిష్టమైన ప్రాంతీయతను సాహిత్యం చేసినవాడు. కరువులు, తాండవించే నేలల మీదుగా, కక్షల సుడిగాలులు చెలరేగే గ్రామాల వీధుల మీదుగా పయనించి కథా వస్తువుల్ని ఏరుకొన్నవాడు.. చెప్పా పెట్టకుండా దాటుకొన్నాడు. అపోహలకు, అపార్థాలకు గురై, దగా పడిన ఈ సీమనేల మట్టి గుండెల చప్పుళ్ళను నిజాయితీగా వినిపించినవాడు, ఎవరూ పట్టించుకోని దృశ్యాల్ని కూడేసుకొని, ఎవరూ వినేందుకు ఇష్టపడని మూలుగుల్ని గొంతుకలో మోసుకొని కథలుగా చెప్పినవాడు వెనుదిరిగి చూడకుండా కనుమరుగయ్యాడు.

ఏమి మనిషని ఆయన – ఎండిన కొమ్మల్ని తాళ్ళుగా పేనినవాడు, పొడి మట్టితో పూలను చేసినవాడు. ఏమి మనిషని ఆయన – నెత్తురూ కన్నీళ్లను కలిపి వాక్యాల్ని చేసినవాడు, ఆకలీ ఆవేశాల్ని కలిపి సంఘటనలు కూర్చిన వాడు. ఏమి మనిషని ఆయన – కాసిని నవ్వులు మరికొన్ని ఏడుపులు ఇంకొన్ని ఆవేశాలు చాలేన్ని చెమట చుక్కలు కలిపి కథలను వండినవాడు. ఏమి మనిషని ఆయన – మన చుట్టూ ఉండే మనుషుల్నే పాత్రలుగా మార్చి మన గుండెల్లో ప్రతిష్టించి వెళ్లినవాడు.

కథలంటే అవేవో బ్రహ్మ పదార్థాలనుకునేవాళ్లం. చిన్నచిన్న వ్యవసాయ కష్టాలు, కొట్లాటలు, రోజూ చూసే పార్టీల గొడవలు కథలుగా రాసి చూపించాడు. ఆయన కథలు చదివిన తర్వాత ఎవరికైనా సరే తమ చుట్టూ ఉన్న పరిసరాలని కథలుగా మలచుకొనే రహస్యం ఏదో తెలిసిపోతుంది. సింగమనేని, కె.సభా, పి.రామకృష్ణ, మధురాంతకం రాజారాం, పులికంటి, వైసివి లాంటి వాళ్లతో కలిసి సీమ ప్రాంతాన్నంతా కథాసాహిత్యంగా మార్చివేశాడు.

మా తరం వాళ్లకు కేతు విశ్వనాథ రెడ్డి గారు సాహిత్య గురువు. దారి దీపం. ఆత్మీయనేస్తం. తప్పుదారుల నడవకుండా హెచ్చరించే చూపుడు వేలు. అక్షరాలను ఆలంబనగా చేసుకుని పయనించిన కథక ఋషి. సాహిత్య విమర్శకుడు. వివిధ కథాసంకలనాల, పత్రికల సంపాదకుడు. పాఠ్యపుస్తకాల ప్రణాళికా కర్త. ఉపన్యాసకుడు. ఆయన మరణం సాహిత్య లోకానికి తీరని లోటు. రాయలసీమ ఆధునిక సాహిత్య వటవృక్షాలు ఇద్దరు – సింగమనేని నారాయణ గారు రెండేళ్ల క్రితం, కేతు విశ్వనాథరెడ్డి గారు ఇప్పుడు రాలిపోవడం సాహిత్య లోకం చేసుకున్న దురదృష్టం.

నాకు చెరో వైపు నిల్చుని వీపు తట్టి ప్రోత్సాహించిన వారు ఇద్దరూ. నా కథల సంపుటాలకు ఒకరు ముందుమాట రాస్తే, మరొకరు వెనక అట్ట మీద రాసి నా పట్ల తమ ఆప్యాయతను చాటుకొన్నారు. ఇద్దరితో కలిసి లెక్కలేనన్ని సభలూ సమావేశాల్లో పాల్గన్నాను. ఎన్నో రాత్రిళ్ళు సాహిత్య చర్చల్లో కూచున్నాను. ఆహ్వానమున్నా లేకున్నా వాళ్లు పాల్గనే సాహిత్య సభలకు విధిగా హాజరయ్యేవాన్ని. కేవలం వాళ్ల ఉపన్యాసాలు వినడానికి, వాళ్లతో కలిసి సాహిత్య సమయాల్లో గడపడానికి వెళ్ళేవాన్ని.

కేతు గారు ఇక లేరనే విషయం జీర్ణం కాకుండా ఉంది. నిన్నటిదాకా ఎదురుగా ఉన్నవాడు – ఈరోజు జ్ఞాపకం అయ్యాడు. మాటలుగా వినిపించేవాడు కాస్త – అక్షరాలుగా మారిపోయాడు.

రాయలసీమ పల్లెమట్టి పొత్తిళ్లలో కళ్ళు తెరిచిన వాడు. ఆ మట్టి వేదనల్ని అక్షరాలకెత్తి భవిష్యత్తరానికి కథల పాతర్లు నింపినవాడు. అచ్చమైన కడప మాండలికాల్ని సాహిత్యపు గాదెలకు పోసినవాడు. కర్కశమైన పల్లె జీవితాల్లోని ఎగుడు దిగుడుల్ని పుస్తకాల గరిసెలకు ఎత్తినవాడు. అంతటి నిపుణుడైన సాహిత్య కృషీవలుడు ఇకపై కడపలో కనిపించడనే విషయం

భరించరానిదిగా ఉంది.

ఆయన ఆచార్యుడైనా, డాక్టరేట్ సంపాదించిన విద్యాధికుడైనా నాకెప్పుడూ పల్లెటూరి రైతులాగే కనిపించేవాడు. అదే కష్టజీవనం, అదే దాతృగుణం. ఆయన గొప్ప సాహిత్యకారుడైనా, ఉపన్యాసకుడైనా నాకెప్పుడూ పల్లె జీవితాల్ని గొంతెత్తి పాడే జానపద కళాకారుడిలాగే కనిపించేవాడు. అదే పట్టుదల, అదే అంకిత భావం. గ్రామ నామాల గుట్టు బైటబెట్టిన అరుదైన పరిశోధకుడైనా, విద్యార్థుల తల వెలిగేలా పాఠ్యపుస్తకాల్ని నిర్మాణం చేసిన భాషా శాస్త్రవేత్త అయినా నాకెప్పుడూ ఒక మాండలిక పదాల కుప్పలా కనిపించేవాడు. సంకోచపడని అదే యాస, అదే పలుకుబడి.

రాయలసీమ జీవితాల్ని అనేక కోణాల్లో ఒడిసిపట్టి కథలుగా మలిచిన సాహిత్యకారుడు మరొకడు లేడనటం అతిశయోక్తి కాదు. సీమ జీవితం చాలా సంక్లిష్టమైంది. మూడు నాలుగేళ్లు వరసగా కరువులు వాలి, తినడానికి తిండి తాగడానికి నీళ్లు దొరక్క వరిటించి వరిటించి మొద్దు చింతమానుల్లాగా మొదళ్ళలో పానాలు నిలుపుకొని, ఒక్క వాన కురిస్తే చాలు ఒళ్లంతా చివురులు తొడిగి బతికి పోవడం వాళ్లకే తెలుసు. అంతటి కరువుల్లో కూడా ఆధిపత్యం కోసం మీసాలు మెలేసి గుంపును వెంటేసుకొని ఒకరినొకరు నరుక్కోవడం కూడా వాళ్లకే తెలుసు. బాటసారులు రాత్రిళ్ళు అరుగుల మీద కనిపిస్తే, గంప చేతబట్టుకుని ఇల్లిల్లూ తిరిగి అన్నం ముద్దలు సేకరించి వాళ్ల ఆకలి తీర్చటం, మాట పట్టింపు వస్తే కసి పెంచుకొని జీవితాంతం పగలు ప్రతీకారాలతో రగిలిపోవటం వాళ్ళకే తెలుసు. ఇంతటి సంక్లిష్టమైన జీవితాల్ని ప్రాంతీయ అవగాహనతో అర్థం చేసుకొని కథల్లోకి తీసుకురావడం అంత సులభమైన విషయమేమీ కాదు. వాళ్ళ ప్రవర్తనే కథయితే అదొక గొప్ప వైఫల్యం. దాని వెనక ఆర్థిక, సామాజిక, రాజకీయ కోణాలను విశ్లేషించినప్పుడే గొప్ప కథవుతుంది. కేతు గారు అందులో సఫలమయ్యారు కాబట్టే గొప్ప కథకులు కాగలిగారు. ముడి విప్పలేని సంక్లిష్ట విషయాల్ని సైతం అలవోకగా కథలుగా మార్చిన నైపుణ్యం ఆయనది. మేమంతా సులభంగా నడిచేందుకు దారులు ఏర్పరిచిన మార్గదర్శకుల్లో అగ్రగణ్యులు ఆయన.

ఈ పెద్దాయన కోపగించుకుని మాట్లాడటం నేనెప్పుడూ చూడలేదు. ఎప్పుడైనా ఎవరికైనా ఆయన నవ్వు మొహంతోనే కనిపించేవాడు. హాస్య చతురత ఆయన స్వంతం. ఎంతటి గంభీరమైన వాతావరణాన్నైనా ఒక చతురు మాటతోనో, ఒక నవ్వు సంఘటనతోనో తేలికపరిచేవాడు. ప్రతి మనిషిని గుండెలోతులు స్పృశించేలా పలకరించేవాడు. నన్నందరూ 'సన్నపురెడ్డి' అని పిలిచినా, ఆయన మాత్రం 'వెంకట్రామ్' అంటూ ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని వీపు తట్టేవాడు. రచయితగా నా గమనాన్ని సునిశితంగా పరిశీలించి సలహాలిచ్చేవాడు. పొగడ్తలకు పొంగకుండా, తెగడ్తలకు కుంగకుండా నా పని నేను చేసుకుపోయే స్థితప్రజ్ఞత సింగమనేని గారు, కేతుగారి వల్లనే నాకబ్బింది.

## జనరల్ బోగి

కనురెప్పల నిద్రాభారం
తలపై బతుకు భారం
దుర్గంధపు తలుపు చెంత పడక
వెతల కలతతో రెప్పల దోబూచులాట
రేపటి ఆశతో ఊగుతున్న దేహం
అకస్మాత్తుగా పిడుగుపాటు
తృటిలో అంతా చీకటి
ముడతలు పడిన అవ్వ చిరుహాసం మాయం
బువ్వను మోసిన మూట ఎక్కడో ..!
తాతా, ఎప్పుడు మనం రైలు దిగుతాం అన్న
మనవడు అగుపడలేదు.
పేనం ఉంది... నావోళ్ళు ఎవులూ లేరు
విడిపోయిన వలస పిట్టల్లా కాళ్లూ చేతులూ
రత్తం ధారలతో రాచ్చసిలాగుంది రెక్కలూడిన
రైలు పెట్టె
రిజర్వేషన్ బోగీకి పరిహారం పరిష్కారం
మా జనరల్ బోగీకి దిక్కూ దివానా లేదు
బాబూ, నా మనవడేడీ అని అడుగుతునే ఉన్నా.
ఆ శవాల గుట్టల్లో ఎతకమన్నారు.
పెతీ ముసుగు తీసి చూస్తున్నా..
మా బుడ్డోడి ఎర్ర చొక్కా కనిపిస్తాదని ...
గుండె నిండా గుబులు గునపాలు దింపుకొని.
ఫొటోలు తీసినోళ్ళు అనుకుంటున్నారు
'ఇది సిగ్నల్ సిబ్బంది వైఫల్యం' అని
మా బతుకులకి గ్రీన్ సిగ్నల్ ఎప్పుడో!
మనవడి బతుకు తీసేసిన సిగ్నల్....
నీకు సిగ్గు లేదా?
సాధారణ బోగీ శవాల లిస్ట్...
ఎప్పుడూపట్టాలకంటుకునే ఉంటాది
ఎన్ని పెమాదాలు జరిగినా చెక్కు చెదరకుండా!

**- కుప్పిలి వెంకట రాజారావు**
**99083 71688**

రాయలసీమకు సంబంధించిన అన్ని సమస్యల మూలాల్ని వెదకి పరిష్కారాల్ని సూచించిన నిఖార్సైన ప్రాంతీయ కథకులు కేతు విశ్వనాథరెడ్డి . ప్రాంతీయ జీవితాన్ని చిత్రిస్తూనే, ప్రాంతాలకు అతీతమైన సంస్కారాన్ని చైతన్య స్ఫూర్తిని భావోద్వేగాలని రగిలిస్తూ మానవ స్వభావాల్ని సమర్థవంతంగా ఆవిష్కరించిన అరుదైన కథకులు. ■



# పొడి నిజం

- కేతు విశ్వనాథరెడ్డి

**నా** వంతు వచ్చింది. లేచి నిలబడినా. మా రంగయ్యసారు నిన్న చెప్పిన కతను సొంత మాటల్లో రాసినా, రాసిన కతను చదవాల. కాగితం తీసుకొని నిలబడినా.. నిలబడినానో లేదో, మా సారు అరిచినాడు.

"గంగాధరా! నోటు బుక్కులో రాసుకొని రమ్మని చెప్పినా, చిత్తు కాగితం మీద రాసుకొని వచ్చినావేం?"

"నోటు బుక్కు అయిపోయింది సార్. కొనుక్కున్నాక మల్లా రాసుకుంటానుసార్," అన్నా.

"అన్నిటికి కరువే, నీటికీ కరువే, నోటు బుక్కులకూ కరువే," అని మా సారు గొణిగినాడు. "సరే చదువు" అన్నాడు. అమ్మయ్య అనుకున్నాను. చదవడం మొదలు పెట్టినా..

"బగీరదుడు" అని

"బగీరదుడు కాదు కాదు గంగాధరా! భగీరథుడు అనాల. పొల్లుల్ని మింగద్దు. రాయడమన్నా సరిగ్గా రాసినావా? ఏది చూడనీ" అన్నాడు.

సారుకు కాగితాన్ని అందించినా.. చూసినాడు. "సరిగ్గా రాసినావే. పలికేది చక్కగా పలకాల"

నేను మల్లా మొదటికొచ్చినా. సారు చెప్పినట్లు

"భగీరథుడు" అన్నా.

తర్వాత చదువు అన్నాడు మాస్టారు.

"భగీరథుడు ఒక రాజు. ఆయన ముత్తాతకు అరవై వేలమంది కొడుకులుండేవారు. ఆ ముత్తాత పేరు సగరుడు. సగరుని కొడుకులు సాగరులు. వాల్లు...'

"ల్ల' కాదు.. 'ళ్ల' అనాల. ఆ... కానీ"

"వాళ్ళు ఇంద్రుడు దొంగిలించిన గుర్రం కోసం బూ... బూ.. భూమి అంతా వెతికినారు. కనపడలేదు. భూమిని తవ్వి పాతాళానికి పోయినారు. కపిలునికి కోపం వచ్చింది. వాళ్ళను బూడిద చేసినాడు. భగీరథుడు వారికి సొర్గం...."

"సొర్గం కాదు, స్వర్గం" అని మాస్టారు నా మాటను దిద్దినాడు.

"భగీరథుడు వారికి స్వర్గం వచ్చేటట్లు చేయాలనుకున్నాడు. దాని కోసం గంగను గుడ్కి పెద్ద తపస్సు చేసినాడు. గంగ మనలోకానికి దిగివచ్చింది. పాతాలానికి... "

"ల' కాదు నాయనా గంగాధరా! ళ..ళ..."

"పాతాళానికి భగీరథుని వెంబడి పోయింది. భగీరథుని ముత్తాతల బూడిద మీద పారింది. సముద్రమైంది. సాగరులకు స్వర్గం దొరికింది..."

"ఏదీ నీ కథను చూపించు," అని సారు తిరిగి తీసుకున్నాడు. చదివినాడు. ఏమని చెప్పినాడంటే...

"గంగాధరా! తప్పులు లేకుండా రాసినావు. తప్పులతో చదువుతే ఎట్లా? రాసేది శుద్ధంగా ఉండాలి. పలుకు శుద్ధంగా ఉండాలి. భాష ఎవరి సొత్తూ కాదు. చక్కగా నేర్చుకుంటే అదే వస్తుంది. చదువుకున్న వాళ్ళ మాటలను శ్రద్ధగా వినండి. మాట్లాడండి. చదువుని రాని వాళ్ళ భాష, యాస తప్పుకాదు. మర్యాద కోసం చదువొచ్చిన వాళ్ళ భాషను మాట్లాడతాం. మంచి మంచి కథలు వింటే, చదివితే మంచిది. ఇది నీకే కాదు చెప్పింది. ఈ నాలుగో తరగతిలోని అందరికీ."

అందరం ఒక్కసారిగా "సరే సార్" అనినాము.

మా సారు పిల్లలందరికీ చెప్పినాడు : "గంగాధర్ కథ బాగుంది", అని. నాకు చక్కలిగిలి పెట్టినట్లయింది. సారు కత మీద పాటం చెప్పినాడు:

'భగీరథుడు తన ముత్తాతల కోసమే తపస్సు చేసినాడు. గంగను భూలోకంలో ప్రవహింపజేసినాడు. తన కుటుంబం కోసం చేసుకున్న పని. స్వార్థం అంటే ఎవరికి వాళ్ళు చేసుకునే మేలు.

ఈ మేలు తనకు మాత్రమే ఉపయోగపడిందా? నలుగురికీ మేలు చేసిందా? ఇదీ అసలు గొడవ."

రంగయ్య సారు మాట్లాడేది నాకు చాలా బాగుంటుంది. ఒక్కొక్కసారి అంత పెద్దపెద్ద మాటలు నా తలకాయకు అందవు.

బెల్లు మోగింది.

"పోండ్రా. రేపు మన అసలు పాఠం కొత్తది మొదలు పెడదాం" అన్నాడు. మా పుస్తకాలు సంచుల్లో సర్దుకున్నాం. బిలబిలా, గోలగోలగా ఇండ్లకు బయలుదేరినాం.

నా సంచిని ఇంట్లో తలవాకిలి పక్క కింద గూట్లో పెట్టినా.

మా అమ్మకు చెప్పినా : "అమ్మా! రంగయ్య సారు నేను రాసిన కత బాగుంది అన్నాడు. నోటు బుక్కులో రాసుకోవాల. రెండునోటు బుక్కులు కొనాలి."

"మీ నాయన రానీలే. మీ మామా వాళ్ల ఊరికి పోయినాడు – బియ్యం కోసం, అప్పుకోసం" అనింది మా యమ్మ.

మా మామ వాళ్ళకు చిన్న అంగడి ఉంది. అందుకోసం పోయి ఉంటాడులే అనుకున్నా. మా అమ్మ చెప్పింది.

"గంగాధరూ! మీ అబ్బ పొద్దననంగా పోయినాడు. ఇంకా ఇంటికి రాలేదు. అంబళ్ల పొద్దున సంగటి తిని పోయినాడు. పైటేల ఏమీ తినలేదు. కయాలు ఎక్కువైంది. నీలి తొట్ల దగ్గరన్నా కూర్చొని ఉంటాడు. మన పొలం కాడ, ఆ కాలవ దగ్గరన్నా కూర్చొని ఉంటాడు. ఆ నీలి తొట్లు, ఆ పూడిపోయిన బాయీ, చుట్టూ ఉండే ఎకరాల పొలం మీ ముదెబ్బల కాలం నాటిది. తకరార్లలో అమ్ముడు పోలేదు. ఒక దాయాది మరొక దాయాది బాగుపడతాడంటూ ఓర్చలేదు. పది మంది దాయాదులు కలిసి అమ్ముకోవడం కుదిరే పనా? ఇప్పుడు కొనే నాథుడు లేడు. కానీ మీ అబ్బకేమో ఆశ. సరేలే సరేలే. రోజూ ఉండేవే ఇవి. మీ అబ్బను పిల్చకరా – చీకటి పడకుండానే. చీకటి పడితే మీ అబ్బకు కండ్లు సరిగ్గా కనపడవు. చుక్కలా లొచ్చినాయి. దార్లో ఏ రాయికో, గోడకో, కంపచెట్టుకో కొట్టుకొని కింద పడితే, యాడ చస్తాం రా గంగాధరూ? పాడు రోజులు దాపురించినాయి..."

పాడు రోజులంటే ఏమిటో అవి ఎందుకొస్తాయో? పాడు మనుషులు అనే మాటను విన్నా. అంటే చెడ్డ మనుషులు. పాడు రోజులు అంటే చెడ్డ రోజులు. రోజులు చెడ్డగా ఉండడం అంటే ఏందో? రంగయ్య సారును అడగాల. మిగతా సార్లు చెప్పలేరు. రంగయ్య సారుకు తెలిసినంత మిగిలిన సార్లకు తెలియదు. నాకు ఆడుకోవాలని ఉంది. అమ్మేమో 'అబ్బను తొడుకొనిరా' అంది. అబ్బంటే నాకు చానా ఇది. మా అబ్బకు కతలు బాగా వచ్చు. నాకంటే బాగా చదువుకున్నాడు. భారతమూ అదీ. నేను కతలు చెప్తానంటే రాస్తానంటే మా అబ్బే నన్ను బలపరిచేది. మా నాయనకు ఎప్పుడూ సంసారం పనులే అబ్బ ఎన్ని కతలు చెప్తాడో! ఈ మద్దెన చెప్పడం లేదు. అమ్మ చెప్పినట్లు కయాలుగా ఉంటాడు. కయాలు అంటే దిగులు. దిగులు ఎందుకొస్తాది? ఏమో రాత్రి పూట పడుకునేముందు "ఏదన్నా కత చెప్పాబ్బా" అంటాను. "మనసు బాగా లేదురా" అంటూ అన్నాడు. దిగులు అంటే మనసు బాగా లేకపోవడం అన్నమాట. అబ్బ రోజూ పొద్దున సంగటి ఇంత తినిపోయి మాపటేల వస్తా ఉండాడని అమ్మ నాతో ఆ మొన్న చెప్పింది. ఆకలయితే మనసు బాగుండదేమో. నాకు ఆకలయితే దిగులు కలుగుతుంది. కోపం వస్తుంది. అప్పుడు ఎవరన్నా ఏదన్నా అంటే తన్నుదామనిపిస్తుంది. నేను పైటేల ఇంటికి వచ్చినా. అమ్మపెట్టిన సంగటి, కారం తినినా. నాకు ఆకలి లేదు. కోపం రాలేదు. అసలు ఆకలి అనేది ఎందుకుండాలి? ఆకలి లేకుండా చెయ్యొచ్చు గదా, ఎవరన్నా?

"గంగాధరూ! ఏందిరా కూర్చొని ఆలోచన చేస్తుండావు. పోయిరా నాయనా! ఆ పెద్దాయనను ఇంటికి తీసుకరా" అనింది మాయమ్మ. "పోతాండాలే అమ్మా!" అన్నా.

మా అమ్మకు మా అబ్బ అంటే చానా ప్రేమ. ముసలోడు గదా! మా జేజి ఆ నడుమ చచ్చిపోయింది గదా. మా నాయన ఊర్లో ఉన్నా, లేకపోయినా పనులు ఏమన్నా ఉంటే చూసు కుంటాడు. పనులుంటే ఊరికే కూర్చోడు. మా పెదనాయనలు, వాళ్ళ పిల్లలున్నారు. నాకంటే పెద్దోల్లు. వాల్ల మీదకంటే మా అబ్బకు మా మీదనే ఇష్టం. వాళ్ళకు అబ్బంటే పడదు. కోడి గోసుకున్నా పిలవరు. వేరుబోయినారు గదా! వేరుబోతే ప్రేమ లుండవంట. ఎందుకుండవో?

**మా** రంగయ్యసారు ఒకసారి చెప్పినాడు. ఎవరో గురజాడ అనే ఆయన ఉండాడంట! ఆయన చెప్పినాడంట: 'ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును' అని. మరి మా అబ్బ ఇవ్వాలనుకుంటే వాళ్ళు తీసుకోవాల గదా? ఇదేందో?

మా అమ్మ కసిరింది : "గంగాధరూ! చెప్పింది. వినరా! అబ్బను పిల్చుకొని రారా. నా బయం నాది" అంది.

అబ్బ కోసం బయలుదేరినా, దారిలో బాలమ్మ కనపడింది. బాలమ్మంటే మూడో తరగతిలో నా తరగతే. ఇప్పుడు స్కూలు వచ్చేసింది. మేకనూ, రెండు మేకల పిల్లలనూ తోలుకొని వస్తా కనపడింది.

"నూకలిస్తా, మేకలు కాస్తావా?" అని అడిగి ఏడిపించాలని పించింది. అడిగినా. "యాడిస్తావు? పండితే గదా!" అంది, బాలమ్మ "పండకపోతే అంగట్లో దొరుకుతాయి గదా" అన్నా. "అంగట్లో అన్నీ దొరుకుతాయి. అల్లుని నోట్లో శని!" అనింది బాలమ్మ. బాలమ్మ మాటకు మాట అంటిస్తుంది. అందుకే నాకు ఇష్టం. "అల్లుదెవరు?" అన్నా బాలమ్మను ఉడికించడం నాకు బలే బాగా ఉంటుంది.

"నా మొగుడూ, నీ మొగుడూ" అంది.

ఆడోళ్లకు మొగుళ్లు ఉంటారు. మొగోళ్ళకు మొగుళ్ళు ఉండరు. ఏందో? తిక్క మాటలు, అనుకున్నా, బాలమ్మకు చదువు బాగా వచ్చేది. జరుగుబాటు లేక మానేసిందంట! నాకు కూడా అది అనుకుంటే బయమేస్తాంది.

"ఏందో వచ్చా గంగాదరూ! మా నాయన దేశాంతరం

పోయినాడు పని కోసం. నాకు చానా పని ఉంది. ఇంటి దగ్గర అంటూ పోయింది.

నీలితొట్ల దగ్గరకు పోయినా. తొట్లో గొర్లు, మేకలు పడుకొని ఉన్నాయి. ఆపక్కన ఒక చిన్న మిద్దె ఉంది. దాంట్లో గొర్లపెంటికలు, మేక పెంటికలు తప్ప ఏమీ కనపడలేదు. మా అబ్బ ఆ చుట్టు పక్కల కనపడలేదు. మా పొలం దగ్గరకు పరిగెత్తినా. 'ఎంతెంత దూరం చానచాన 'దూరం' అని పాడుకుంటూ పొలాలంబడి అడ్డంగా పరిగెత్తినా. నాకేం బయం లేదు.

పొలాల్లో ఒక్కరు కూడా కనపడలేదు. ఒక్క పురుగు లేదు. ఒక పిట్ట లేదు. విత్తనం వెయ్యిలేదు. పైరు లేదు. మా అయిదెకరాల చేను వచ్చింది. అది కూడా మిగతా వాటి మాదిరే శుబ్బరంగా తుడిచిన పలక మాదిరి ఉంది, అచ్చరాలు తుడిచేసిన పలక మాదిరిగా. మా చేనులో నుంచి చూసినా, కాలవ కనపడతాంది. జమ్మిచెట్టు కనపడతాంది. జమ్మిచెట్టు కింద ఎవరో కూర్చొని ఉన్నారు, తల మీద ఒల్లె గుడ్డ వేసుకొని, అట్లా వేసుకునేది మా అబ్బే! బాగా చూసినా. మా అబ్బే. 'అబ్బా'! అని గట్టిగా అరిచినా మా అబ్బ లేచి నిలబడినాడు.

"ఒరేయి గంగాధరా! ఇక్కడకు, ఇక్కడకురా. పరుగెత్త మాకు. రాయోరప్పో కాళ్లకు కొట్టుకుంటుంది. నిదానంగా రా." అని మా అబ్బ అరిచి చెప్పినాడు. మా అబ్బ ఒత్తులను నాకంటే బాగా పలుకుతాడు. కాలవగట్టు మీద ఉండే జమ్మి చెట్టు దగ్గరకు గెసపోసుకుంటా పోయినా. మా అబ్బ దొరికినాడు. నువ్వెందుకు ఇంత దూరం వచ్చినావు రా?" అని అడిగినాడు.

"నీ కోసమే అమ్మ పిల్చుకొని రమ్మనింది. చీకటి పడితే నీకు కండ్లు సరిగా కనపడవని చెప్పింది" అన్నా.

"పగలే చీకటి పడింది గంగాధరా!" అన్నాడు. మా అబ్బ ఆకాశంపైకి చూస్తా ఉండాడు. దూరంగా ఉండే కొండ చూస్తా ఉండాడు. పొలాలు చూస్తా ఉండాడు. కాలువలోకి చూస్తా ఉండాడు. పెద్దోల్ల వేదాంతం నాకు అర్థం కాదు.

అబ్బ తన కుడిచేత్తో నా కుడి చెయ్యిని పట్టుకున్నాడు. మెల్లగా గెట్టు దిగుతూ కాలువలోకి తీసుకుపోయినాడు. కాలువ నడుమ నిలబడినాడు. నేనూ నిలబడినా.

అన్నాడు : "ఇది పులివెందల కాలవ కథ గంగాధరూ!"

ఆ కథేదో విని, తొందరగా ఇంటికి పోవచ్చు. ఇంకా పొద్దుంది. అనుకున్నా, "చెప్పబ్బా అన్నా.

"ఇది జరిగిన కథరా గంగాధరూ. నలభై ఏండ్లు పైగా అయింది మా కళ్ళ ముందు జరిగింది. ఈ కథలోని వాళ్ళంతా రైతులే. ఈ కాలవ కోసం పెద్ద పెద్ద సభలు జరిగినాయి. రైతులంతా ఒక్కతాటి మీద నిలిచినారు. రైతు యాత్ర జరిగింది. రైతులం పోలీసుల దెబ్బలు తిన్నాం. జైళ్లకు కూడా పోయినాం. ఆ పార్టీలేదు. ఈ పార్టీ లేదు. అందరూ ఒక్కటే. అందరికీ కావలసింది ఒక్కటే. కాలవ. ముఖ్యంగా శివరామిరెడ్డి అనే ఆయన ఉండేవాడు. అచ్చం గాంధీతాత మాదిరి అనుకో. జగమొండి. ముతక పంచెలో రైతే, కత్తులొద్దు, కఠారొద్దు, ఈ తపులులొద్దు, ఏమొద్దు, నలుగురం కలిస్తే మనమే పులులం అనేవాడు. కాలవ కోసం తిండీ తిప్పలు మాని పది రోజులు కూర్చున్నాడు. అప్పటి సభలు, అప్పటి నాయకులు, పాటలు మరిచిపోదామన్నా మరిచిపోలేదు.

కాలవ ఎట్లాగో వచ్చింది. చివరకు కాలవలో నీళ్లొచ్చిన రోజు గంగాధరూ! పెద్ద పండుగ అనుకో. ఊరు ఊరంతా కదిలి వచ్చింది. కాలవ గెట్ల మీద నిలబడి చూసినారు ఆడోళ్లు, మగోళ్లు, పిల్లా పిసుకూ, ముసలీ ముతకా, మా జన్మల్లో అన్ని నీళ్లు కాలవలో పారతా ఉండగా చూడలేదు. వానాకాలంలో రెండు మూడు రోజులు వంక పారితే చూసిందే. నేను కాలవ నీళ్లల్లో దిగినా దోసిళ్ళలో నీళ్లు నెత్తి మీద పోసుకున్నా.ఆ నీళ్లు తాగినా గంతులేసినా, చూసినోళ్లంతా నాకు పిచ్చి పట్టిందనుకున్నారు.

ఒక పంటకే నీళ్లు వదిలినా బతుకులు మారినాయి. కాలవ పక్క బావుల్లో ఊటలు పెరిగాయి. మనకు బావి లేదు. అది మీ ముగ్గురు పెదనాయనల భాగానికి పోయింది. చంకలు గుద్దుకొని చీని చెట్లు వేసుకునే వాళ్ళు వేసుకున్నారు.వడ్లు పండించేవాళ్లు వడ్లు పండించుకున్నారు. మనమూ పండించుకున్నాం. చెనక్కాయల్నీ, నల్లకుసుమల్నీ, మిరపనీ ఈసారి మాత్రం ఈ కాలవలోని మట్టీ రాళ్ళుగా నెత్తిమీద కొట్టుకోవాల్సిందే నిమ్మచెట్లు వేసుకున్నోళ్లకు నీళ్లు లేవు. ఎనిమిది నూరు వెయ్యి అడుగులు పాతాళంలో బోర్లు వేసుకున్నారు. చుక్క నీళ్లు పడలేదు. పైగా చీనీ చెట్లకు బంక తెగులు. మనుషులకు అప్పుల తెగులు.

ఇప్పుడు చూడు. కాలవలో గడ్డి పరక కూడా ఎండిపోయింది. గోరీ గుంత మాదిరి ఉంది. అప్పుడు గండిపేట, కొగరుపేట ఇంకా ఏదో అన్నారు. ఇప్పుడు చిత్రావతి చిత్రావతి అంటున్నారు. ఇంకేమంటారో తెలియదు. కనపడిన చోటల్లా రాళ్ళను పాతి పెట్టి పోతారు. మన కొండవార ఉండాయే.. ఆ పనికిరాని తంగేడు, జిల్లేడు చెట్ల మాదిరి, ఆ ఎండిపోయిన కంపచెట్ల మాదిరి ఉంది మన బతుకు. గడ్డి లేదు గాదం లేదు. సాగు నీరు లేదు. తాగే నీరుకూ కటకటే... అప్పిచ్చేవాడు లేడు. ఇదీ మన కథ!

ఇది కథా? ఏమో నాకు తెలియదు. కత మాదిరుంది. కత మాదిరి లేదు.

"పోదాం పద అబ్బా! అమ్మ ఇంటికాడ ఎదురు చూస్తా ఉంటాది" అన్నా.

మా అబ్బ ఏమనుకున్నాడో.. మోకాళ్లు పట్టుకొన్నాడు. మెల్లగా కాలవను ఎక్కినాం. ఇంటి దారి పట్టినాం. దారిలో మా అబ్బ ఏమీ మాట్లాడలేదు. ఏందో మా ఆలోచన చేస్తా ఉండాడు. మా అబ్బ ఆలోచన నాకు తెలియదు. నా ఆలోచన మా అబ్బకు తెలియదు. విచిత్రం! తెలిస్తే కాలవలో నీళ్లొస్తాయా?

రాత్రి అన్నం తిన్నాం. ఇంటి బయట మంచాలు

వేసుకున్నాం. నేనూ అబ్బా పక్కపక్కన మంచాలు వేసుకున్నాం. మా అమ్మ ఇంకా ఇంట్లో ఏదో పనిలోనే ఉంది. అమ్మకు ఎప్పుడూ పనే. అదేం పనో? బాలమ్మకూ పనే అంట!

మా ఎదురింట్లో నుంచి టి.వి. పాటలు విన్పిస్తా ఉండాయి. ఆ పెదనాయన రోడ్డు పనులు తీసుకున్నాడు. టి.వి. కొన్నాడు. మాకు టి.వి.లేదు. వాల్లింటికి పోయి టి.వి.చూడాలని నాకు లేదు.

దిగులుగా ఉంది.

మా అబ్బ వైపు చూసినా, వెల్లకిలా పడుకొని ఆకాశం దిక్కు చూస్తా ఉండాడు. నేను చూసినా. ఆకాశం మా ఊర్లో కుమ్మరాము మాదిరి ఉంది. చుక్కలూ లేవు, గొక్కలూ లేవు. గాలి మాత్రం అంతో ఇంతో ఆడతా ఉంది.

మా అబ్బ నా వైపు తిరిగినాడు.

"గంగాధరా! ఇక్కడికి రా" అని పిలిచినాడు. లేచి అబ్బ పక్కన కూర్చున్నా.

"కుమ్మరాయనా, రాచపుండు కథ గుర్తుందా గంగాధరూ?" అడిగినాడు.

"ఉంది అబ్బా!" అన్నా. నాకు ప్రతి కతా గుర్తుంటుంది. ఒకసారి వింటే చాలు. "ఆ కథ చెప్పు" అని అడిగినాడు.

మా అబ్బ ఈ కతను నాకు ఎప్పుడో చెప్పినాడు. నేను ఇప్పుడు మా అబ్బకు చెప్తా ఉండా.

"ఒక కుమ్మరాయనకు వీపు మీద రాచపుండు పుట్టిందంట! దాంతో ఒకటే దురద పుట్టిందంట. కుమ్మరాయనేమో కుండలు తట్టుకోవాల. దురద అడ్డం గదా? కుండలు తట్టుకునే తబకతో దురదపుట్టినప్పుడల్లా తపాతపామని వీపు మీద కొట్టుకునేవాడు. ఎక్కడంటే, పుండు దురద పుట్టిన దగ్గర. రాచపురుగు తబక దెబ్బలకు తట్టుకోలేకపోయింది. "వీడేమో ఇట్లా కొట్టి చస్తా ఉండాడు. వీడి దగ్గరుంటే నేను చస్తాను. రాజు దగ్గరకు పోతా' అనుకుందంట. పని లేని రాజు దగ్గరే ఉండిపోయింది", కత ముగించి "ఇంతే గదా అబ్బా" అన్నా. మా అబ్బ పకాపకా నవ్వినాడు. నేనూ నవ్వినా.

"గంగాధరా! దీనికి ఒక తోక కథ ఉంది. నేను ఇంతకు ముందు చెప్పడం మరిచిపోయినా. ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. వింటావా? నిద్రవస్తోందా?" అని అడిగినాడు.

"నిద్దర పట్టలేదులే అబ్బా! కత వింటా. చెప్పు" అన్నా.

"పని లేని రాజు దగ్గరకు రాచపుండు పోయిందని చెప్పినావు గదా?" అని అడిగినాడు. అవును అన్నాను.

"అయితే విను. రాజు దగ్గర ఒక రాజ వైద్యుడుండాడు. ఆ ఆకు నూరినాడు. ఈ ఆకు నూరినాడు. కల్వంలో ఆ మందు నూరినాడు. ఈ మందు నూరినాడు. ఆ పసరు పూసినాడు. ఈ పసరు పూసినాడు. ఆ గుళికలు తినమన్నాడు. ఈ గుళికలు తినమన్నాడు. పుండు మానలేదు. పుండు మాన్పించినోళ్లకు అర్ధ రాజ్యం ఇస్తానని చాటింపు వేయించినాడు, రాజు.

దేశదేశాల నుంచి వైద్యులు దిగినారు. మంత్రగాళ్ళు దిగినారు. ఆ రాచపుండు వైద్యులకు లొంగలేదు. మంత్రాలకు చింతకాయలు రాలేదు. రాచపుండుకు భయమేసింది. వీళ్లంతా తనను మందుల్తో మాకుల్తో చంపుతారని దిగులు పడింది. ఎక్కడికి పోతామబ్బా? అని ఆలోచన చేసింది. 'రాజ్యమంతా కరువు. పనిలేని రైతు కనబడినాడు. వేలాది మంది రైతులు కనబడినారు. వీళ్లయితే మంచిది. తిండి తిప్పలకు చస్తా ఉండరు. వైద్యమెక్కడ చేయించుకుంటారు? రేపోమాపో బాధపడి బాధపడి చచ్చిపోతారు. నా దెబ్బకు' అని అనుకున్నిందట! అనుకొనీ అనుకొనీ రైతుల మీద ఒక్కసారిగా వచ్చి వాలింది. రైతులకు పెద్ద రాచపుండ్లు వచ్చినాయి."

అబ్బ కతను ముగించి నాడు. మా అబ్బ మాటలు వణికినట్లు అనిపించింది. 'ఏందో? కత విని నేను పెద్దగా దిగులు పడినా, మా అబ్బ పక్కనే నిద్దరపోయినా.

రెండు మూడు రోజులు మా అబ్బచెప్పిన కతను గురించి ఆలోచించినా. భగీరథుడు గంగను తెచ్చి, రైతుల రాచపుండ్లు మీద పోయేటట్లు చేస్తే, రాచపుండ్లకు తిక్క కుదురుతుంది. అనుకున్నా. అంతే! కత రాసిపెట్టుకున్నా కాగితం మీదే. మా నాయన ఇంకా రాలేదు. నోటు బుక్కులను నేను కొనలేదు.

కత తీసుకొని మా రంగయ్య సారు ఇంటికి పోయినా. బెరుకు బెరుకుగా కాగితం కతను ఇచ్చినా. 'ఏంది?' అనలేదు. చూసినాడు. చదివినాడు. మా రంగయ్య సారుకు కండ్లనీళ్లు వచ్చినాయి. కత చదివితే కండ్ల నీల్లు వస్తాయా? వింటే వస్తాయి అనుకున్నా.

కండ్ల నీల్లు తుడుచుకుంటూ రంగయ్య సారు అన్నాడు:

"గంగాధరా! రైతులకు పుట్టింది కరువు రాచపుండ్లు, నువ్వు బాగా రాసినావు. భగీరథుడు గంగను తెచ్చి పుండ్లను కడిగి పోగొట్టాలని. ఇప్పుడున్న భగీరథులకు మన రైతులు వాళ్ళ తాతముత్తాతలు కాదు..."

ఇప్పుడున్న భగీరథులెవ్వరో నాకు తెలియలేదు. ఓహో! ఇప్పుడు అట్లాంటి రాజులు లేరు కదా? ముఖ్యమంత్రులు, మంత్రులు మాదిరోల్లు ఉండారు. ఏందో? ఇదంతా గొడవ, గొడవ. అయోమయం అంకాలమ్మ తిర్నాల పెరిగి పెద్దవుతాను గదా? రంగయ్యసారు భగీరథుని కత చదివినప్పుడు చెప్పినాడు గదా : నలుగురికీ మేలు చేసేది ఉందా? లేదా?" అని. అదెట్లా? ఎట్లాగంటే గంగను మా ఊరికి తేవాలి. అంతే. ఆరు నూరుగానీ గంగను తేవాల. అన్ని ఊర్లకూ తేవాల. తెచ్చి తీరాల.

అంతే....

అయితే, అంత దాకా ఇంతేనా?

**ప్రస్థానం 2003 ఏప్రిల్ - జూన్ సంచిక నుంచి...**



# పరీక్షలు

**పి**ల్లలకేవో పరీక్షలట
బెదురుగా ఉదయిస్తున్నారు
ఆందోళనల ఆవిర్లవుతున్నారు
సందేహాల సూర్యాస్తమయాలవుతున్నారు
ఇల్లంతా కంగారుగా ఉంది
ఊరంతా కంగాళీగా ఉంది
పాఠశాలల నిండా ప్రైవేటు పాఠాల నిండా
పార్కుల నిండా మైదానాల నిండా
గుంపులు గుంపులుగా
ఎటు చూసినా పిల్లలే
పుస్తకాల్లో దూరిపోయి
పాఠాలను మింగేసిన
పుస్తకాల పురుగులై తేలుతున్నారు!

నిన్నటి వరకు ఊరంతా
ఉద్యానవనమై వికసించేవారు
ఆటల వనమంతా
ఆనందమై విరబూసేవారు
సందుల్లో క్రికెట్ కేరింతలై
గల్లీల్లో గోలీలాటల గంతులై
ఎటు చూసినా
ఆటలై, పాటలై, అలసటై
చెమట చుక్కల చేమంతులై
ఊరికి చైతన్యపు ఊపిరిలద్దేవారు

ఇప్పుడేమో ఏమీ ఎరుగనట్లు
తమకేమీ పట్టనట్లు
పుస్తకాల్లో కునికిపాట్లు పడుతున్నారు
వాళ్లు నిద్రపోవడం లేదు
ఇంట్లో వాళ్లను నిద్రపోనివ్వడం లేదు
ఇల్లంతా జాగారం ఊరంతా జాగారం!

తూర్పున భయం ఉదయిస్తోంది
ఇల్లు బెదురుగా నిద్రలేస్తోంది
పిల్లల చేతుల్లో కలాల కత్తులు
చేతుల్లో భవిత మార్చే అట్టలు
తలపైన ఆశీర్వచనాల కిరీటం
వెన్ను తట్టిన ధైర్యవచనాల సంచిని
వీపుల మీద వేలాడేసుకుని
ఆల్ ది బెస్ట్ ఆలాపనల మధ్య
బరిలో దిగడానికి భయంగానే బయల్దేరుతున్నారు!
వీధుల్లో ఎటు చూసినా పరీక్షల సైనికులే
ప్రతి విద్యార్థి కురుక్షేత్ర సంగ్రామ యోధుల్లాగే ఉన్నారు
రిక్షాలకు వేలాడుతూ ఆటోల్లో ఊరేగుతూ
బైకులపై ఉరకలేస్తూ సైకిళ్లపైన ఆయాసపడుతూ
పరీక్ష సంగ్రామ కేంద్రంలో వాలిపోతున్నారు

యుద్ధ గంట మోగింది
బరిలోకి బిరాబిరా దూసుకెళిపోతున్న రేపటి పౌరులు
పరీక్ష కేంద్ర బయట చెట్ల కింద
ఆందోళన నీడలో వేలాడుతున్న తల్లిదండ్రులు
మనిషి బతకడానికి, మనిషిగా ఎదగడానికి
పరీక్షొక్కటే ప్రామాణికమన్నట్లు
ఈ పరీక్షలెందుకిలా
ఈ రోజు ఇంతలా భయపెడుతున్నాయి?

పరీక్షలంటే
ప్రతిభాన్వేషణ పండగ కదా
సృజనశీలుర సంబరం కదా
మెదడుకు మేత పెట్టే మాతమ్మ జాతర కదా
ఊరంతటినీ వణికిస్తున్న ఉత్పాతంలా ఉందేమిటీ?

ఫలితాలను మోసుకొచ్చిన పత్రిక
ఉదయాన్నే ఇంటి తలుపు తట్టింది
ఉత్తీర్ణుల అంకెలను అరలు అరలుగా పేర్చుకుని
ప్రైవేటు విద్యా సంస్థల ర్యాంకుల రంకెలతో
ఉత్తేజంగా పత్రిక ఉరకలేస్తోంది
పక్కపేజీలో ఎవరో విద్యార్థులు
పరీక్షల సంగ్రామంలో నెగ్గలేక
విగత జీవులై వేలాడుతున్నారు
కడుపులో చేయిపెట్టి దేవులాడేస్తున్నారు
మా వాడు పాసైనందుకు
నేను సంతోషించాలా?
వివేకం పెంచలేక వివేచన నేర్పలేక
ధైర్యాన్ని చాటలేక భవితకు భరోసా ఇవ్వలేక
భావి పౌరుల గొంతు నులిమేస్తున్న
ఈ విషమ 'పరీక్ష'లను
విద్యా విపణిలో ఉరి తియ్యాలా!

- ఎ.కిశోర్ బాబు
87549 95544


# అసంగతులు

పార్ట్ : 1

**కు**డిచేత్తో ఇచ్చింది ఎడమచేయికి తెలవకూడదు. ఈ చేత్తో ఇచ్చి,ఆ చేత్తో లాక్కుందీ తెలవకూడదు. తెలిసినా కించిత్ మెసలకూడదు. మెసిలినా నోరు తెరిచి ఒక మాట తూలకూడదు. వచ్చే పావలా పది పైసలకు మోకాలడ్డకూడదు. మధ్యే తరగతి విలువలకు చిలువలు పలువలు చేయకూడదు. ష్..హ్విక్.. బ్రాండ్ సీసాలకు పథకాల పైసలు సరి. ఏదీ మరో దారి? తాగినోట నిజం తన్నుకొని వచ్చినా.. తాగినోడి ఓటు తన్నుకొని పోతంది. మొల మీద గుడ్డ ఊడినా.. తల మీద గుడ్డ ఊడకూడదు కదా. రేయ్ ఇక రూటు మార్చు.. బీటు మార్చు.. చీమలు దూరే కంతకి ఏనుగులు దూరే కంతకి ఏమన్నా పోలికా..? కానీండి.. అంత చించలేం.. ఆలోచించలేం. ముద్ద నోట్లోకెళ్లే సరికే ముల్లోకాలు కనపడతాయి. ఎవడు తినేది ఆడు తినాలి. రేపటికి ఆకలి చేయి చాచాలి.

పార్ట్ : 2

**త**ల గొరిగేసిన కొండ పాదాలని ఒక డబ్బు గని దిగ్గజం తవ్వుతుంటే పర్యావరణ విభాగం పట్టాయా పర్యాటకంలో థాయ్ మసాజ్ చేయించుకుంటుంది. గుడి అరుగు మీద పూజారి మెల్లకన్నుకి కమ్యూనిస్టు మేనిఫేస్టోలో ముద్రారాక్షసం దొరికింది. అడవుల్లో సెల్ టవర్లు కొట్టిన దెబ్బకి గోండు గిరిజనుడు ఫ్రీ ఫైర్‌లో చచ్చిపోయాడు. పతంజలి ఆయుర్వేదం కార్పొరేట్ నిర్వేదం కలిసి లోకం మీద మాయయోగా పాగా వేసాయి. మార్క్స్, అంబేద్కర్ భేటీ మధ్యన పర్సనాలిటీ డెవలప్మెంట్ గురువులు ఫుల్ సూట్‌లో తిరుగుతున్నారు. విభజన హామీలన్నింటినీ సిబిఐ కేసులు ఊడ్చేసినియ్. డిజె టిల్లూ కొట్టూ.. పథకాలకి ఖజానా ఖాళీ కొట్టు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండవలెను. స్కూల్ పిల్లల బ్యాగులలో నిరోధులు ఉండవలెను. వాల్ పోస్టర్‌లో అర్ధనగ్న సుందరి లోదుస్తుల నుంచి నవ్వుతోంది. పోర్న్ సైట్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. బియ్యం గింజ మీద రైతు పేరు రాలిపోయి.. బస్తా మీద దళారీ కార్పొరేట్ మీసం దువ్వాడు. 'రండి బాబు రండి భలే చౌకబేరం.. వందల కోట్లకే ఎమ్మెల్యేలు.. మించిన తరుణం మళ్లీ దొరకదు.' ఓట్ల దుకాణం ముందు వెర్రిమొకాలతో వేడుక చూద్దాం. దేవుడి విగ్రహం ముందు హుండీ బరువు చూస్తూ ఒక ఆధ్యాత్మిక కుక్క అరుస్తోంది. తడిచిన ధాన్యం ముంగిట తల పట్టుకున్న రైతు ముంగిట కనీస కూలీ గిట్టుబాటు తలపోటు పట్టుకుంది. 'అవినీతి అంతం.. మన పంతం' అనే ప్రభుత్వాఫీసు తలుపుల పోస్టర్లను చూసి ఒక మధ్య తరగతి మందుబాబు వికటాట్టహాస మందహాసం బయటపడలేక లోనలోన పెనుగులాడింది. మీటింగ్ తర్వాత ఒక బిర్యాని మీద ఒక క్వాటర్ బిగించి, పార్టీ ఫ్లెక్సీ చించి రాలిపడిన వాగ్దానాల మధ్య ఒక బాధ్యత కల పౌరుడు కరపత్రాల మీద ఆవుంతున తూలిపోయాడు!



- పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449




# రైతు బతుకు వెతలపై సాధికారిక కథలు

- గొల్లపల్లి వనజ
పరిశోధక విద్యార్థి

**రా**యలసీమ అగ్రశ్రేణి కథా రచయితల్లో ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ఒకరు. ఈయన రాయలసీమ ముఖ్యంగా కడప ప్రాంత ప్రజలు కరువు వలన పడే కష్టాలను, వారి బాధలను, ఆవేదనలను తన కథల్లో చిత్రించాడు. సీమలో ప్రజలకు ప్రకృతి నుంచి వచ్చిన కష్టాలు కొన్ని అయితే, బలమైనవాడు బలహీనత కలిగిన వాడిని పెట్టే కష్టాలు కొన్ని.. ఇలాంటి సమస్యలన్నింటినీ అభ్యుదయ దృక్పథం కలిగిన కేతు విశ్వనాథ రెడ్డి గారి కథల్లో చూడవచ్చు. రాయలసీమ రైతుల బతుకు వెతలపై ఆయన రాసినవి సాధికారికమైన కథలు. నేరుగా ఆయన వ్యవసాయంతో సంబంధం కలిగి ఉండడం, జీవితాంతం శ్రామిక ప్రజలతో కలిసి ఉండడం వల్ల ... ఆ అనుభవాలు ఆయన రాసిన కథలను సజీవవంతం చేశాయి.

'సానుభూతి' కథలో 'కష్టాలంటే యేమిటో, కష్టాలు యెంత క్రూరమైనవో నాకు తెలుసు, మా కుటుంబానికి తెలుసు. ఆస్తిపాస్తులున్న వాళ్ళకు తెలుసు. అవి పోతున్నవాళ్ళకు తెలుసు. ఒట్టి కసిగాళ్ళకేం తెలుసు?" అనుకుంటాడు కథానాయకుడు. ఒక వైపు దాయాదుల గొడవలు, పట్టాలను చూపించి భూములు మావని తిరగబడిన మాదిగలను గురించి కథానాయకుడు తన క్లాస్మేట్ రామకృష్ణతో కష్టాలను చెప్పుకుంటాడు. "మీరు కాబట్టి ఇన్ని కష్టాలకు తట్టుకున్నారు.. మరొకళ్ళయితేనా" అని సానుభూతి చూపిస్తాడని ఆశిస్తాడు కథానాయకుడు. అంతా విన్న రామకృష్ణ "మీ ఇంటి కథ తెలుగు సినిమా కథకు సరిపోతుంది. సినిమాలో కన్నీళ్ళూ, సినిమా తీసిన వాళ్ళకు డబ్బులూ. బుద్ధీ జ్ఞానం వున్నవాడెవాడూ మీ యేడ్పులకు బాధపడడు. మీవేం కష్టాలు? తెచ్చిపెట్టుకున్న కష్టాలు. నిజమైన అవస్థలంటే మీ ఊళ్ళో హరిజనులు పడే అవస్థల్లాంటివి. వాళ్ళ గోడుకు వాళ్ళు కారణం కాదు, మీరూ, కావసినంత సొంత ఆస్తులున్న మీ లాంటివాళ్ళూ. వాళ్ళకు అవసరం ప్రేమా, సానుభూతీ. మీ కెందుకూ?" అని గట్టిగా బుద్ధి చెప్తాడు. ఈ కథలో అమాయకులైన మాదిగల భూములను కబ్జా చేసిన భూస్వాములపై మాదిగల తిరుగుబాటు ధోరణి కనిపిస్తుంది.

"పైవాడు చెప్పినట్టల్లా ఆడేవాళ్ళున్నంతవరకూ... రేచుకుక్కల్లా జనం వెంటబడి జనం తరుముకోనంతవరకూ ఈ పిల్లాటలే అమ్మలదీ, అయ్యలదీ, వాళ్ళ పిల్లలది బంధువులదీ కూడా..." అని 'అనధికారం' కథలో డిప్యూటీ కమిషనర్ భార్య సుధారాణి పెట్టే ఇబ్బందులకు కానిస్టేబుల్ సుబ్బన్న మాటలు నిస్సహాయతను, తిరుగుబాటు ధోరణిని తెలియజేస్తాయి. ఈ కథ 1978 ఆగష్టులో జనసుధ మాసపత్రికలో అచ్చయ్యింది. 1985 అక్టోబర్‌లో బెంగాలీలోకి అనువాదమైంది.

చదువుకుని ఉద్యోగాలు లేక, వ్యవసాయం చేద్దామంటే వానలు పడక, మెట్టభూముల్లో పంటలు పండక డబ్బుకోసం యువత చెడు మార్గాన్ని ఎంచుకుని జీవితాన్ని నాశనం చేసుకుంటున్న విధానాన్ని కేతు విశ్వనాథరెడ్డి 'విశ్వరూపం' కథలో చెప్పారు. ఈ కథలో పార్థా మేథమెటిక్స్ చదువుకున్న నిరుద్యోగి. పార్థా బావ క్రిష్టయ్య ప్రోద్బలంతో పార్థాకి మట్కా అనే జూదం మీద మనసు మళ్ళుతుంది. చివరికి క్రిష్టయ్య మట్కా కంపినీ పెడదామని ఉన్న డబ్బు పోగొట్టుకుని పిచ్చివాడై పోతాడు. మట్కా కోసం డబ్బును అప్పు తెచ్చి అప్పుల పాలైపోయిన పార్థా

విషాదంలో కూరుకుపోయి తన క్లాస్మేట్ చెన్నకేశవులకు తన గోడును చెప్పుకుంటాడు. "చదువుకున్న వాళ్ళం.. మనమైనా కొంత ఆలోచించకపోతే యెట్లా? నిన్ను తప్పులు పడుతున్నానని అనుకోకు. యింత మంది మట్కా నిప్పులగుండంలో యెందుకు నడుస్తున్నారంటావు, పీర్లపండగలో నడిచినట్లు? యేదో వొరుగుతుందని ఆశ. యెట్లా వొరుగుతుంది, ఈ వ్యవస్థే మనుషుల్ని తగలబెట్టే నిప్పులగుండం అయితే? మనకు ఉద్యోగాలు ఎట్లాగూ యిప్పట్లో రావు. వచ్చినా బతుకు మారుతుంది అనుకోకు. ఆలోచించవలసింది అదృష్టం మీద ఆధారపడని బతుకు కోసం'' అని చెప్పిన చెన్నకేశవుల ఆవేదనను మొదటిసారిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు పార్థా.

రైతు పోలీసులపై తిరుగుబాటును ప్రకటించే కథ 'ఆ రోజులే వస్తే'. ఈ కథలో సబ్ ఇన్స్పెక్టర్ సుబ్బన్నను కమలాపురం తాలూకా గంగిరెడ్డి పల్లె స్టేషన్ నుంచి ఎస్పీ బద్వేలు తాలూకా మామాపురం పోలీస్ స్టేషన్ కు ట్రాన్స్ఫర్ చేస్తాడు. వానలు పడక, పంటలు పండక కడుపు నింపుకోవడమే కష్టంగా ఉన్న ప్రజలకు ఖూనీ, కొట్లాటలు వంటి వాటికి తావు లేకుండా పోతుంది. ఒకవైపు ఆశ్వయుజం వచ్చినా చినుకుల్ని రాలనీయకుండా పల్లెలనూ, పొలాలనూ, వాటిని నమ్ముకున్న రైతుల బతుకులనూ నిలువునా కాలుస్తున్న ఎండ అయితే, కొట్లాటలు, ఖూనీ కేసులు ఏమీ లేకపోవడంతో పై ఆదాయం ఏమీ లేకపోవడంతో యెండ కంటే తీవ్రంగా, యెదురుపడ్డ జీవినల్లా మాడ్చేటట్లు సుబ్బన్నకు మనసెండ! ఆ సమయంలో చుట్టాల ఊరి నుండి ఎద్దుల బండిలో తిండికి జొన్నలు వేసుకుని వస్తున్నా సోమయ్యపై ఎస్ఐ సుబ్బన్న కన్ను పడుతుంది. రైటరు కాశీం, సుబ్బన్న రెండు మూటలు జన్నలు దించిపొమ్మంటారు. "అమ్ముకోవడానికి అనుకుంటున్నారా? అంత రాతా? మాకు కూటికే సాలటం లేదో బగవంతుడా అనుకుంటా వస్తున్నా" అని సోమయ్య చివరికి స్టేషన్ దగ్గర మూటలు దించకనే వెళ్ళిపోతాడు. ఆ తరువాతి సంవత్సరం వానలు బాగా కురవడంతో పొలాలను నమ్ముకున్న రైతులు అరకలను పొలాల్లో దింపుతారు. సుబ్బన్న తన దందా మొదలు పెడతాడు. అందరితో పాటు సోమయ్య కూడా దున్నడం ప్రారంభిస్తాడు. సోమయ్య స్టేషన్లో జన్నలు దించలేదన్న విషయం మనసులో పెట్టుకున్న సుబ్బన్న సోమయ్య పొలంలో గంజాయి గింజలను చల్లించి కేసులో ఇరికించాలని చూస్తాడు. కేసు తప్పుకోవాలంటే ఐదువందలు జరిమానా కట్టమంటాడు. అది విన్న సోమయ్య అక్కడే కూలబడిపోతాడు. సోమయ్య గురించి తెలిసిన ఆ ఊరి ధర్మశాసనాధిపతి బ్రహ్మంరెడ్డి ఆ సొమ్మును తాను కడతానని ఒప్పుకుంటాడు. అందరూ వెళ్ళిపోతుండగా సుబ్బన్న సోమయ్య దగ్గరకు వచ్చి "ఆ రోజు వొక్కమూట జన్నలడిగితేనే అమాయకం మొగం పెట్టినావు. ఇప్పుడేమైంది? పోలీసోళ్ళతో వ్యవహారమంటే ఇప్పుడన్నా తెలిసిందా?" అంటాడు. సోమయ్య సుబ్బన్న వైపు కొన్ని క్షణాలు చూసి ముళ్ళకర్రతో ఎద్దును వెర్రిగా బాధుతూ, "ఆకాశం బతకనీదు. మనుషులూ బతకనీరు. నువ్విట్లా! నీయమ్మ... నిన్ను నాటుకట్టెల్తో కొట్టాల్నే" అని తిట్టడం ప్రారంభిస్తాడు. దాంతో సుబ్బన్న సోమయ్య కడుపుమంట గ్రహించి "ఆ ముళ్ళకర్ర తనను బాదే రోజులస్తే! యెక్కడొస్తాయి? యెప్పుడొస్తాయిలే... వస్తే!!" అనుకుంటూ తొందర తొందరగా వెళ్ళిపోతాడు.

"దప్పిక" కథలో కొందరు ధనికులు పైకి మంచివారిగా నటిస్తూ రైతులకు అవసరానికి డబ్బిచ్చి అదను చూసుకొని వారి ఆస్తిని కాజేసి, తమ ఆస్తులను పెంచుకుని దాన్ని చూసుకొని మురిసిపోతున్న దృశ్యాన్ని రచయిత చిత్రీకరించారు. ఈ కథలో కథకుడు రిటైరైన అరవయ్యేళ్ళ ప్రభుత్వ ఉద్యోగి. ప్రకృతి సౌందర్య పిపాసి. టౌనుకు దగ్గరలోని పల్లెటూరులో పొలం కొని, గంగన్న అనే రైతు సహాయంతో బావి తవ్వించి, మోటారు పెట్టించి, ఆ బావి నీరుని గంగన్నకు అప్పుగా ఇస్తాడు. ఊళ్ళో రైతులకు కూడా వడ్డీలను ఇచ్చేవాడు. గంగన్నకు, అతని కొడుకును ఆస్తి పంపకాల తీర్పులో తనకు రావలసిన బాకీకి పొలం మొత్తం వశం చేసుకుని మిగిలింది గంగన్నకు, గంగన్న కొడుక్కి చెరొక వెయ్యి రూపాయలు ఇచ్చి వారిని వీధిపాలు చేస్తాడు. గంగన్నకు ఏదో సహాయం చేసానుకుని, కొన్న పొలాన్ని మొత్తం కలిపి పచ్చని సౌందర్యాన్ని చూసి ఆనందిస్తూ ఆ ఆనందాన్ని తన యువ స్నేహితుడైన సోమశేఖరంతో పంచుకుంటాడు. అది విన్న సోమశేఖరం "మీ సౌందర్య దాహం, మంచితనం, స్నేహం సంగతేమో నాకు తెలియదు. కరెంటూ, నీళ్ళూ, డబ్బూ మీ చేతుల్లో వున్నాయి. ఉండబట్టే గంగన్న కుటుంబం వీధుల్లో పడింది. మీ దెబ్బతో యింకా కొన్నాళ్ళు పోతే చాలా కుటుంబాలు వీధిన పడతాయి" అని సోమశేఖరం కథకుడు చేస్తున్న మోసాన్ని గుర్తు చేస్తాడు. సోమశేఖరం మాటలు కథకుణ్ణి ఆలోచింపజేస్తాయి.

'పీర్లసావిడి' కథలో రాజకీయ స్వార్థం కనిపిస్తుంది. ఓట్లకోసం అమాయకులైన ప్రజలను మోసం చేసి, వారి అవసరం తీరిపోయాక వారి స్థాయిని గుర్తు చేసి, వారని మోసం చేసి ఎన్నికలప్పుడు ఖర్చు అయ్యిన డబ్బుకంటే రెండింతలు ప్రజల దగ్గర లాగడం వంటి దుస్థితిని ఈ కథలో చూడవచ్చు. కరువు రోజుల్లో ప్రభుత్వం ఎప్పుడో ఒకసారి స్పందించి పశువులకు గడ్డిని సరఫరా చేస్తే ఆ గడ్డిని పేదవారి వరకు రానివ్వకుండా అధికారులు అన్యాయంగా మాయం చేయడాన్ని 'గడ్డి' కథ వివరిస్తుంది. ఈ కథలో అచ్చమ్మ పాత్ర ద్వారా కన్నబిడ్డల్లా చూసుకుంటున్న పశువులకు గడ్డి దొరకకపోవడంతో ఆమె పడే

బాధను, ఆక్రోశాన్ని, ఆవేశాన్ని రచయిత ఆవిష్కరించారు. అచ్చమ్మ అధికారులను ప్రశ్నించి నిలదీసే ధైర్య సాహసాలు గల పాత్రగా విశ్వనాథ రెడ్డి చిత్రీకరించారు.

చిన్న రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో క్రమంగా వారు కూలీలుగా మారుతున్న పరిస్థితిని 'నమ్ముకున్న నేల' కథలో చూడవచ్చు. ఈ కథలో వీరన్న కరువుకు భయపడి వ్యవసాయం చేసే ధైర్యం లేక భోగం మేళంలో కూలీగా చేరతాడు. తర్వాత భోగం మేళం కంపెనీని స్వయంగా తానే పెడదామనుకుంటాడు. భోగం మేళంలో రాణించే చాకచక్యం, సామర్థ్యం తనకు లేదని గ్రహించి సిమెంటు ఫ్యాక్టరీలో కూలీగా పని చేస్తూ జీవనాన్ని గడుపుతాడు. ఈ కథలో కథకుడు ఊర్లో ఉన్న పొలాన్ని అమ్మితే డబ్బు వస్తుంది. ఆ డబ్బుతో కూతురి పెళ్లి చేయాలని ప్రొద్దుటూరు నుంచి సొంత ఊరికి వస్తాడు. కానీ ఆ ఊర్లో కరువు విలయతాండవం చేస్తుండడంతో అతి తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

'అన్నదాతలు' కథలో తమ సంస్థలలో పనిచేసే కార్మికుల శ్రమను దోచుకుంటూ వారి కష్టాలను పట్టించుకోకుండా ఎంతసేపూ కీర్తి, ప్రతిష్టల కోసం తాపత్రయపడే పెత్తందారుల స్వభావాన్ని రచయిత చిత్రీకరించారు. ఈ కథలో రమణయ్య తోటి శ్రామికుడు చనిపోవడంతో అతనికి న్యాయం జరగాలని యజమాని అయిన రంగయ్యను నిలదీస్తాడు. అందుకు రంగయ్య 'మీరు పెట్టే చెయ్యిని కరిచేవాండ్ల'ని రమణయ్యను దూషించి మిల్లును మూసివేస్తాడు. శ్రామికుల కష్టాలను పట్టించుకోని రంగయ్య కొత్త సంస్థను ఏర్పాటు చేసి, ఆ సంస్థ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి ముందు ఒక అనాథ బాలుర అన్నదానం మందిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి ప్రశంసలను అందుకుంటాడు. మిల్లు మూత పడడంతో వేలమంది కార్మికులు, వారి కుటుంబాలు పొట్ట చేత్తో పట్టుకుని వస్తారు. అయితే, వారు వచ్చింది అన్నదానం కోసం కాదు; న్యాయం కోసం.

పొట్ట కూటికి ప్రాంతం, కులం, మతం ఇవేవీ అడ్డు కాదనే విషయం 'శ్రుతి' కథలో తెలుస్తుంది. ఈ కథలో సిమెంటు ఫ్యాక్టరీ అధికార్లు తమ స్వార్థం కోసం ప్రాంతాలను, మతాలను, కులాలను అడ్డుపెట్టుకుని కార్మికులను విడదీస్తే ట్రేయికు వీగిపోతుందనుకుంటారు. కానీ ప్రాంతం, కులం, మతం ఇవన్నీ పక్కన పెట్టి రెండు రూపాయల కూలీ పెంచమనడం కోసం కూలీలందరూ ఏకమయ్యి 'కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి' అని నినాదం చేస్తారు. ఎంత స్నేహితులైనా అధికారం, హోదా పెరిగే కొద్ది స్వార్థంతో కులాలు, ప్రాంతాలు, మతాలూ గుర్తుకొస్తాయనే విషయాన్ని కథకుడు గుర్తిస్తాడు.

సమ సమాజాన్ని కోరుకునే విశ్వనాథ రెడ్డి గారు సమాజంలో ప్రేమరూపం ఎలా ఉందో తన కథలలో తెలియజేసారు. ప్రేమించిన వ్యక్తికి హెచ్చు కులగోత్రాలు, డబ్బు వంటివి లేకపోవడంతో వేరే పెళ్లికి సిద్ధమైన వైనాన్ని విశ్వనాథరెడ్డి 'ఎవరు వీరు?'కథలో చిత్రించారు. ఈ కథలో కథకుడికి మోహన్, సురేఖ ఇద్దరూ ఒకేసారి పరిచయం అవుతారు. సురేఖ లైబ్రరీలో పుస్తకాల పురుగు అయితే మోహన్ కథా రచయిత... ఒక పత్రికలో ప్రూఫ్ రీడర్గా పనిచేసేవాడు. సురేఖ మోహన్ రచనలన్నీ చదువుతూ అతడి ప్రేమలో పడుతుంది. మోహన్ కూడా ఆమెను ఇష్టపడతాడు. మోహన్‌కి డబ్బు లేకపోవడం, కులమతాలు వేరు కావడంతో సురేఖ, మోహన్ విడిపోతారు. మోహన్ కంపోజిటరుగా పనిచేస్తున్న అమ్మాయిని ఇష్టపడి పెళ్ళి చేసుకుంటాడు. సురేఖకు ఒక ఇంజనీరుతో, ఐదులక్షల కట్నం ఇచ్చి పెళ్ళి నిశ్చయమవుతుంది. ఇదంతా దగ్గరుండి గమనించిన కథకుడికి సురేఖ, మోహన్ "ఏ రకం ఖాతాదారులు జీవితంలో? ప్రేమలో?" అనుకుంటాడు. 'ప్రేమరూపం', 'మన ప్రేమ కథలు' కథలు కూడా ఈ కోవకి చెందుతాయి. ప్రేమ ప్రకటించడానికి కూడా స్తోమత, డబ్బు ఉండాలనే స్థితికి సమాజం ఎలా దిగజారిందో 'దూరం' కథలో చూడవచ్చు. ఎంత ప్రేమ వున్నా డబ్బు లేకపోతే మనిషికి మనిషికి దూరం పెరుగుతుందనే వాస్తవాన్ని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు. భక్తిలో కూడా పేద, ధనిక తారతమ్యాలను చూపడాన్ని "S2 బోగి" కథలో చూడవచ్చు. వున్న వాస్తవాలను దాచిపెట్టి తమ కీర్తిని పెంచుకోవడానికి చరిత్రను కల్పించి రాస్తున్న చరిత్రకారులను 'ఖడ్గాలూ కాటుక పిట్టలు' కథలో చిత్రీకరించారు.

కేతు విశ్వనాథరెడ్డి గారు చాలావరకు కడప గ్రామీణ ప్రాంత జీవితాన్ని చిత్రీకరించారు. కూలీల దీనస్థితిని, వానలు లేకపోవడం వలన ఏర్పడిన కరువుతో రైతులు పడే ఆవేదనను, దాంతో నాశనమవుతున్న వారి జీవితాలను చిత్రీకరించారు. భూస్వాములు చిన్నకారు రైతులను, కూలీలను చేసే మోసాలను ఎండగట్టారు. కేతు విశ్వనాథరెడ్డి 1939 ఆగస్టు 10వ తేదీన కడప జిల్లా కమలాపురం తాలూకా రంగసాయిపురంలో కేతు పెద్ద వెంకట రెడ్డి, నాగమ్మ దంపతులకు జన్మించారు. "జప్తు" (1974), "కేతు విశ్వనాథరెడ్డి కథలు" (1991), "ఇచ్ఛాగ్ని" (1996) కథా సంపుటాలు వెలువరించారు. "వేర్లు", "బోధి" (1994) అనే నవలికలు కూడా రాశారు. "కేతు విశ్వనాథరెడ్డి కథలు" సంపుటానికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, 1996లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించాయి. కేతు విశ్వనాథరెడ్డి కథకునిగానే కాక పరిశోధకుడిగా, విమర్శకుడిగాను ప్రసిద్ధి గాంచారు. "కడప ఊళ్ళ పేర్లు" ఈయన పరిశోధన

గ్రంథం. సాహిత్యానికి సంబంధించిన అనేక విషయాలను చర్చిస్తూ "దృష్టి" అనే పేరుతో 1998లో వ్యాస సంపుటిని వెలువరించారు. ఈయన సాహిత్యానికి చేసిన కఋషికి గాను భారతీయ భాషా పరిషత్తు పురస్కారం, రావిశాస్త్రి పురస్కారం, రితంబరీ పురస్కారం, పులుపుల వెంకట శివయ్య సత్కారం, తుమ్మల వెంకట రామయ్య బంగారు పతకం, అజో విభో పురస్కారం, గోపీచంద్ సాహిత్య సత్కారం ... ఇలా ఎన్నో పురస్కారాలు లభించాయి. ఈయన మొదట పాత్రికేయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి తరువాత కడప, తిరుపతి, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో అధ్యాపకులుగా పనిచేశారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డైరెక్టరుగా ఉద్యోగ విరమణ చేశారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు అనేక పాఠ్య పుస్తకాలకు సంపాద కత్వం వహించారు. 2023 మే 22న కన్నుమూశారు. ■

**"సాగిపోవుటె బతుకు**
**ఆగిపోవుటె చావు**
**సాగిపోదలిచిన**
**ఆగరాదిచటెపుడు "**



**– కాళోజి**

## అక్షర సేద్యం కవితల పోటీ

**అ**క్షర సేద్యం ఫౌండేషన్ సిద్దిపేట ఆధ్వర్యంలో వేల్పుల బాలయ్య గారి స్మారకార్థం కవితల పోటీ – 2023 కోసం కవితలను ఆహ్వానిస్తున్నారు. రూ.2000, రూ.1500, రూ.1000 ప్రథమ, ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతులుగా ఉంటాయి. రూ.500 చొప్పున 5 ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. పతనమవుతున్న మానవ సంబంధాలు, నైతిక విలువలు, డబ్బు కోసం నమ్మకద్రోహ చర్యలు .భూకబ్జాలు లాంటి అంశాలపై సామాజిక చైతన్య స్ఫూర్తి కలిగించేలా కవితలు ఉండాలి. .కవితల నిడివి 40 పంక్తులకు మించరాదు. కవితలను పోస్టు ద్వారా గాని, మెయిల్ ద్వారా గాని పంపవచ్చు. వేల్పుల బాలయ్య గారి వర్ధంతి సందర్భంగా 2023 జూలై 24వ తేదీన బహుమతుల ప్రదానోత్సవం, కవితా సంకలనం ఆవిష్కరణ జరుగుతాయి. కవితలు పంపాల్సిన చివరి తేది : 20-06-2023. చిరునామా : కన్వీనర్ ,కవితల పోటీ, అక్షర సేద్యం ఫౌండేషన్ రామునిపట్ల, సిద్దిపేట జిల్లా – 502267. మెయిల్ : aksharasedyam@gmail.com.

**– వేల్పుల రాజు, కన్వీనర్,**
**97019 33704**

# పూర్తవ్వడం ...

**ఊ**రకనే
అలా.. నిన్ను నీవు
నిందించుకుంటే
ఎలా...

ఇక్కడ ఇప్పుడు
ఏదీ రుచించడం లేదు
చుట్టూ ప్రపంచమే లేదు
అసలు మనుషులే లేరని
నీ అభియోగం!

బహుశా
పదార్థాలను రుచి చూడడానికి
రుచి మొగ్గలున్నట్టు
జీవితాన్ని జీవించడానికి
కొన్ని సందర్భాలు ఉండే ఉంటాయి

ఆకుల మీద వెన్నెల ఒలికినట్టు
కడలి పైన గాలి తరగలెత్తినట్టు
మనిషి మీద జీవితం
పౌర్ణమిలా సాగుతుంది.

ఒక్కోసారి
ఎండ హాయిగాను
వెన్నెల వేడిగాను
గాయాలను రేపుతుంది.

నువ్వు ఒట్టి సాకు మాత్రమే
దేహ సలపరాలకన్నా
లోపలి జీవితం
భలే కలవర పెడుతుంది కదా
ఇంకొన్ని సమయాల్లో
అసహనానికన్నా
మనలను కలవర పెట్టేది ఏది ఉండదు.

మనం
అందంగా పూచే అరక్షణమైనా చాలు
ఆ లిప్త కాలమే
మనిషి నిజంగా బతికుండేది!

**– మణీందర్ గరికపాటి**
**99483 26270**



# ఒక్క గాలి వానకు ...

- డా. దారల విజయ కుమారి
91771 92275

"మట్టిలో ఉండి మట్టిలోనే పొర్లి దొర్లే మనిషిని లేపి దగ్గరికి తీసుకుని మంచి జీవితాన్ని ఇద్దాం అనుకుంటాను. అది నా గొప్పతనం. అలా లేవనెత్తినందుకు ఎంతో కృతజ్ఞత ఉండాలి. పోనీ అది లేకపోతే పోయింది. కనీసం నా స్థాయిని గుర్తించి దానికి తగ్గట్టుగా మసలు కోవాలి. అదీ లేదు. మీ అమ్మాయికి మీరు ఏవీ నేర్పలేదు. ఇన్నేళ్ళుగా నేను నేర్పుతున్నా ఈమె నేర్చుకోలేదు. అన్నీ నేనే భరిస్తున్నానండి"

"ఏమైంది అల్లుడు సర్"

"మామూలేనండి. పార్టీకి ఎలా రెడీ అవ్వాలో తెలియదు. ఇంటికి అతిథులొస్తే ఎలా మసలుకోవాలో తెలియదు. ఎవరైనా వస్తే వండుతుంది. వడ్డిస్తుంది. స్నానాలు చేస్తారా.. ఇంకాస్త వడ్డించుకుంటారా.. మీకు ఏదిష్టమో చెబితే వండుతాను.. ఇలా ఉంటాయి ఆమె మాటలు .."

"వచ్చిన వాళ్ళను ఆదరించడం మంచిదే కదండి"

"అలాంటి పనులు చేసేందుకు పనివాళ్ళు ఉన్నారు కదండీ. గెస్టుల పక్కనే కూర్చుని అవీ ఇవీ మాట్లాడాలి. అందుకు లోకజ్ఞానం కావాలి. మీ అమ్మాయికి అది లేదు."

రామయ్యకు ఇవేవీ అర్థం కాక.. ఏం చెబితే ఏం మునుగుతుందో తెలియక.. కూతురి వైపు, అల్లుడు సర్ వైపు చూస్తూ ఉండిపోయాడు.

మొదట ఎక్కడో చూసి నచ్చి ఇంటికి కానుకలతో మనిషిని పంపి సంబంధం చేసుకున్న మనిషి. గొప్ప మనిషి, గొప్ప సంబంధం అని కూతురి అభిప్రాయం ఏమీ అడగకుండానే పెళ్ళికి ఒప్పేసుకున్నాడు. శాంత మారు మాట్లాడకుండా తాళి కట్టించుకుంది. డిగ్రీ చదివి బిఇడి చేసి టీచర్ పోస్ట్ కోసం చూసే శాంత .. చాలా చురుకైంది, తెలివైంది అనే చుట్టాల్లో పేరు. కానీ, ఈశ్వర్ దగ్గరకు చేరుకోగానే ఆమెకు ఏమీ రాదని, తెలియదని తేల్చేసాడు. శాంతకు అత్తమామలతో పాటుగా ఉండాలని ఆశ. వారిని ఒక బంగ్లాలో పెట్టేసాడు ప్రైవసీ పేరుతో. అల్లుడు అని సింపుల్‌గా పిలుస్తుంటే నామోషీగా ఫీల్ అయి రంకెలేస్తున్నాడని తెలుసుకుని... రామయ్యే 'అల్లుడు సర్' అని పిలవడం మొదలు పెట్టాడు. అది బాగా పనిచేసింది. ఈశ్వర్ సంతోషంగా ఉన్నాడు.

వరకట్నం వేధింపుల్లాగ ఇవి ఇగో వేధింపులు. ఇగో శాటిస్ఫాక్షన్‌కు లోటు కలిగినపుడల్లా.. ఇలా రామయ్యను పిలిపిస్తాడు. అతడు రామయ్య నుంచి తీసుకోవడానికి, రామయ్య ఇచ్చేందుకు ఇది తప్ప మరేమీ లేదు. ఇది ఇద్దరికీ తెలిసినట్టే ఉంది. అందుకే సయోధ్య కుదిరింది.

ఇప్పుడు ఏం జరిగిందో తెలీదు. పిలిపిస్తే వచ్చాడు. వచ్చిన దగ్గర్నుంచి ఏవేవో చెబుతున్నాడు. అవి సమస్యలని రామయ్య గ్రహించడం లేదని ఈశ్వర్ అసహనం.

"ఇన్‌స్టంట్ కాఫీ తాగండి" అనగానే ...

"నేను తాగేసే వచ్చాను అల్లుడు సర్. పర్వాలేదు" అన్నాడు రామయ్య.

"అయితే నూడుల్స్ లేదా పాస్తా చేసి వడ్డించు" అని శాంతకు చెప్పేసి, రామయ్యను చూస్తూ.. మళ్ళీ చెప్పటం మొదలు పెట్టాడు.

"నాకు ప్రతి పని నా లెవెల్‌కు తగినట్టుగా ఉండాలి. మీ అమ్మాయి అది నేర్చుకోలేక పోతోంది."

"నెమ్మదిగా నేర్చేసుకుంటుందిలెండి అల్లుడు సర్"

'అల్లుడు సర్' అన్న మాట అతడిని బాగా శాటిస్ఫై చేసిందేమో.. "సరేలెండి. 'భోంచేసి వెళ్ళండి' అనేసి ఆఫీస్‌కు వెళ్ళిపోతూ.. మళ్ళీ లోపలికొచ్చాడు.

"శాంతా" అని పిలుస్తూ రూంలోకి వెళ్ళాడు.

ఆమె లోపలికి రాగానే "మీ నాన్న పిల్లాడిని దగ్గరికి తీసుకుంటాడేమో. స్నానం చేసి వచ్చాడో లేదో కనుక్కుని దగ్గరికి పంపించు. అర్థం అయిందా" అని బయల్దేరి వెళ్ళాడు.

శాంత అతను వెళ్ళిన వైపే చూస్తూ నిలబడింది.

"అమ్మా మనుమడు ఎక్కడున్నాడమ్మా.. ఒకసారి చూసేసి పోతాను" అనగానే ఉలిక్కిపడి ..

"నిద్రపోతున్నాడు నాన్నా" అనేసింది అనాలోచితంగా.

"సరేమ్మా నేను వెళ్తాను" అని గేటు దాటుతూ చూసాడు, పైన వరండాలో బాల్‌తో ఆడుకుంటున్న మనమడిని. వెనక్కి

తిరిగి తలుపులో చూస్తూ నిలబడిన కూతుర్ని చూసాడు. ఆమె ముఖంలో ఏం కనబడిందో మరేం అడగకుండానే వెళ్ళిపోయాడు.

అతనికి ఇంకా గుర్తుంది. కాన్పుకు అడిగితే మీ ఇంట్లో కంటే వసతి ఇక్కడే ఉంది అంటే సరే అని వెనక్కి వెళ్ళిపోయాడు. పిల్లోడు పుట్టిన తర్వాత వచ్చి అడిగితే.. ఇలాగే శాంతను లోపలికి రమ్మని పిలిచి ...

"నీకు మంచి తిండి కూడా పెట్టలేరు.. దాంతో బాబుకు ఇచ్చే పాలలో బలం కూడా ఉండదు. అందుకే నువ్వు వెళ్ళడం నాకిష్టం లేదు. ఏదో కారణం చెప్పి పంపించేసేయ్ మీ నాన్నను" అని. రాలేనని కూతురితోనే చెప్పించాడు.

కరివేపాకు పొడి.. పిప్పిళ్ళు.. కిసురు పూసలు తెచ్చిస్తే.. పక్కన పడేసాడు. అవన్నీ గుర్తు చేసుకుంటూ వెళ్ళిపోయాడు రామయ్య.

శాంతను 'ఎలా ఉన్నావమ్మా' అని తల్లిదండ్రులు అడిగినా చిరునవ్వు నవ్వుతుంది. ఆ నవ్వులోని బరువు గూర్చి మాట్లాడేందుకు లేదా దించుకునేందుకు వారికి శక్తి లేదు. అది శాంతకూ తెలుసు. అందుకే ఆమె నవ్వును గూర్చి.. మౌనాన్ని గూర్చి వాళ్ళెవరూ మాట్లాడరు.

పెళ్ళయ్యాక మెట్టినింట ఎందరివో భావాల బరువును మోస్తూనే ఉంది. ఆమె ఆత్మాభిమానపు దండ ఎవరో ఒకరి మూలంగా పూసలు పూసలుగా ఎన్నో సార్లు తెగి పడుతుంటుంది. కొన్నిసార్లు విసిరేయబడుతుంటుంది. రాల్చబడినవేవో దండగా మళ్ళీ అల్లుకుంటూనే ఉంటుంది. ఎన్నో ఏళ్ళుగా అవ్యక్తంగా అల్లాడిపోతూనే.. వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించుకుందుకు అరుదైన సందర్భాల కోసం అన్వేషిస్తూనే ఉంది.

ఆ లోగిలిలో ఎన్ని అస్తవ్యస్తాలను సర్దింటుందో.. ఎన్ని సార్లు భావాల వైరుధ్యాలతో నలిగిపోయుంటుందో.. ఆ పరివేదన ఎవరికీ పట్టక పోయినా తాను ముందుకే సాగుతోంది. మమకారాలు దొరుకుతాయనేమో నిర్విరామంగా ఈశ్వర్ లాంటి మనుషుల్లో తవ్వుతూనే ఉంది.

ఈశ్వర్ మనసు.. ముడిసరుకులాంటిది. ఎన్నిసార్లు శుద్ధి చేసినా.. మకిలి వదలదు. అతని లోపాయికారీ తనానికి గాయపడ్తూనే ఉన్నా మనసును వెనక్కి తెచ్చుకోదు.

ఎందుకలా ఉద్వేగ బరువులను మోయలేక మోస్తావని పుట్టింటి వాళ్ళు ఎవరడిగినా.. ఒకటే జవాబు. నేను పుట్టింటికి మెట్టినింటికి మధ్యన ఒక వారధిగా నిలబడుండాలి అంటుంది. జ్ఞానం లేని శాంతకు ప్రశ్నించడమంటే రాదని అనుకుంటాడు ఈశ్వర్.

చిత్రమేమిటంటే ఈశ్వర్‌కు ఆ మౌనమే నచ్చింది. ఆమె మాట్లాడదు.. నేర్చుకోలేదు అంటూ ఫిర్యాదు చేస్తున్నాడు కానీ ఆమె మాట్లాడక పోవడం.. నేర్చుకోలేకపోవడమే అతనికి నచ్చింది. ఐశ్వర్యంతో పాటు ఆనందాన్ని ఆమెకు ధారాదత్తం చేసేసానని ఈశ్వర్ ప్రగాఢ విశ్వాసం. ఈశ్వర్ లాంటి వ్యక్తులు ఇతరుల మనసులు.. వారి వ్యక్తిత్వాలు.. అస్తిత్వాలు.. స్వేచ్ఛ.. సమానత్వం.. లాంటి విషయాల జోలికి వెళ్ళరు. ఇన్ఫాక్ట్ వాటి గురించి మాట్లాడాలంటే భయపడతారు. అందుకేనేమో.. ఈశ్వర్‌కు ప్రశ్నలు ఫిర్యాదులు నచ్చవు.

ఆంగ్లేయులు తమ దురాక్రమణతో భారతదేశంలో ఎన్నో సంపదలను, సంతోషాలను అనుభవించారు. వారు ఎక్కువ సంతోషాన్ని భారతీయుల అస్తిత్వాన్ని, స్వేచ్ఛను అణిచి వేయడంలోనే పొందారు. ఇదో క్రూరమైన సంతోషం. ఈశ్వర్ లాంటి వాళ్ళను చూస్తే ఆంగ్లేయులు తమ మూలాలను కావాలనే ఇక్కడే కొన్ని వదిలేసి వెళ్ళినట్టుగా అనిపిస్తుంది.

❖❖❖

ఆరోజు నరసింహస్వామి గుడికి మొక్కు తీర్చుకునేందుకు బయల్దేరారు. ఈశ్వర్ కుటుంబం ఆఫీస్‌లో పనుల వత్తిడి వల్ల ఆలస్యంగా స్టార్ట్ అయ్యారు. వంద కిలోమీటర్లు తర్వాత శాంత ఏదో వెతుకుతూ కలబెదుతుంటే ...

"ఏమైంది" అడిగాడు ఈశ్వర్.

"రెండు బ్యాగులుండాలి. ఒకటే ఉంది. ఒక బ్యాగ్‌లో పూజ సామగ్రి మరో బ్యాగ్‌లో ఫ్రూట్స్, స్నాక్స్ సర్దాను. పూజ సామగ్రి బ్యాగ్ మాత్రమే ఉంది" అంది భయపడుతూనే ...

"ఇది మామూలే కదా.. ఏదో ఒకటి సమస్య ఉండాల్సిందే.. సరే సరే.. కాల్ చేస్తే దారిలోకి తెచ్చిస్తారు" అన్నాడు.

శాంత కాస్త రిలాక్స్ అయింది. చూస్తుండగానే వర్షం మొదలైంది. ఒక దగ్గర ఒక పల్లెటూరి స్త్రీ చేతిలో సంచి పట్టుకుని తడుస్తూ నిలబడింది. కారు కదిలిపోతున్నా శాంత చూస్తూనే ఉండటం ఈశ్వర్ కళ్ళబడింది.

"ఏంటి, ఆమెను ఎక్కించుకోవాలనా" అనగానే.. వెలుగుతున్న కళ్ళతో అవునని గబగబా తల ఊపింది.

"ఈ దరిద్రాలను డ్రాప్ చేసేందుకే నా ఈ కారుంది. అసలు ఈ కారు ఖరీదెంతో నీకు తెలుసా? అయినా చూడు.. బాబు నీ ఒడిలో ఎంత హాయిగా పడుకున్నాడో. ప్లేస్ ఎక్కడుంది? ఒకవేళ ఉన్నా.. అంతా అన్ హైజీన్ పీపుల్‌ను ఎక్కించుకునే అవసరం లేదు" అన్నాడు చిరాగ్గా.

డ్రైవర్‌ను చూస్తూ "ఇంకెంత దూరం" అని అడిగాడు.

"ఇంకో యాభై కిలోమీటర్లు సర్" అన్నాడు.

వర్షం కాస్త తగ్గింది. గుడి చేరుకుని దర్శనం చేసుకుని.. బయల్దేరగానే మళ్ళీ వర్షం మొదలైంది. సగం దూరం రాగానే చీకటి పడింది. వర్షం పెద్దదైంది.

రోడ్డు పక్కన ఆమె ఇంకా తడుస్తూ అలాగే నిలబడి ఉంది. శాంత మళ్ళీ ఆమెనే చూస్తుండటం ఈశ్వర్ చూశాడు. కారు ముందుకు దూసుకుపోయింది. ఓ పది నిమిషాల జర్నీ తర్వాత టైరు పంక్చర్ అయింది. స్టెఫినీ పెట్టుకోవడం మర్చిపోయానని డ్రైవర్ చెప్పడం, ఈశ్వర్ తిట్టడం అయిపోయాయి.

సెల్ ఫోన్‌లో సిగ్నల్స్ లేవు. ఆ దారిలో ఎప్పుడో ఒక ఆటో తప్ప వెహికల్స్ తిరగడం లేదు. అరగంట తర్వాత ఒక ఆటో వెళ్తూ చూసి ఆగింది. అందులోంచి ఆ రోడ్డుపక్కన నిలబడిన

ఆమె దిగి తడుస్తూనే... కారు దగ్గరికి వచ్చింది. డ్రైవర్‌కు ఏదో చెప్పింది. డోర్ కాస్త ఓపెన్ చేసి తల లోపలికి పెట్టి "ఆటోలో ఎక్కుతారా? అని అడుగుతోంది సర్" అన్నాడు.

"నో నో.. ఆటోలో వెళ్ళడమేంటి.. వద్దని చెప్పు" అన్నాడు ఈశ్వర్.

ఆమె మళ్ళీ ఏదో చెప్పింది. ఈసారి డ్రైవర్ "అయ్యా, ఇంకడెక్కడా పంక్చర్ షాపులు ఉండవట. టైం దాటితే ఆటోలు కూడా తిరగవట" అన్నాడు.

ఈశ్వర్ ఆలోచిస్తుంటే.. ఆటో అతను హార్న్ కొట్టాడు... ఆమెను రమ్మన్నట్టుగా. శాంత వెళ్దాం అని అభ్యర్థించింది. ఇక తప్పదని డ్రైవర్‌ను ఉంచి.. బాబుతో ఆటో ఎక్కారు. షేర్ ఆటో అది. రెండు వైపులా టార్పాలిన్ కట్టినా లోపలా తడిసిపోతోంది వాలిపిరితో.

బాబు చాలా సేపటినుంచీ ఆకలితో ఏడుస్తున్నాడు. ఏడ్చి శాంత ఒడిలో వాలిపోయాడు. వీళ్ళకు సీటు మొత్తం వదిలేసి.. ఎదురుగా ఉన్న చెక్క మీద ముడుక్కోని కూర్చోంది ఆమె. కాస్సేపయ్యాక..

"పిల్లోడికి ఆకలైనట్టుంది అమ్మగారు" అంది.

శాంత అవునని అసహాయంగా తల ఊపింది.

ఇంకొంచెం సేపయ్యాక ఆమె చేతిలోని సంచిని ముందుకు చాపి "పిల్లోడికి తినిపించండమ్మా" అంది.

శాంత ఈశ్వర్ వైపు చూసింది. ఈశ్వర్ "అలాంటివి మా బాబు తినడు లేమ్మా.. వద్దు" అనేసాడు.

ఆమె సంచిని వెనక్కు తీసేసుకుంది. వర్షం మరింతగా పెరిగింది. ఆటో డ్రైవర్ ఒక షెల్టర్ దగ్గర కాసేపు ఆపేసాడు. ఆటోలోని జీరో బల్బు వెలిగించాడు. బాబు మళ్ళీ ఏడ్వడం స్టార్ట్ చేశాడు. ఈసారి ఈశ్వర్‌కు కూడా బాధ మొదలైంది. శాంతకు కన్నీళ్లు వచ్చేస్తున్నాయి.

"ఏదో ఒకటి తినిపించండి సార్. పసిబిడ్డ ఆకలికి తట్టుకోలేడు. ఇంకా ఇరవై కిలోమీటర్లు పోతే ఒక పల్లె వస్తుంది కానీ ఈ వర్షంలో పోలేను. ఈ టయానికి ఆడగూడా ఏమీ దొరకదు" అన్నాడు ఆటో డ్రైవర్. ఏదో నిశ్చయించుకున్నదానిలా ఈశ్వర్ వైపైనా చూడకుండా తినేందుకు ఇవ్వమని ఆమె ముందుకు చేయి చాపింది శాంత. ఈసారి ఈశ్వర్ కూడా అభ్యంతరం చెప్పలేదు.

ఆమె సంతోషంగా ఆ సంచిని శాంత చేతిలో పెట్టేసింది. కాస్త తడిసిన సంచిని తెరిచింది. ఒక ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి పెట్టిన నాలుగు మురుకులు. సత్తు క్యారియర్‌లో రాగిముద్ద మధ్యలో గుంత చేసి పెట్టిన చింతకాయ చెట్నీ.. ఇంకో కవర్‌లో చెనిగిత్తనాల కారం పొడి ఉన్నాయి.

బాబుకు కొంచెం తినిపించి "మీకు ఉంచుకోండి, చాలు" అంది శాంత ఆమె వైపుకు సంచిని చాస్తూ.

"నాకేమొద్దులే అమ్మగారు. వచ్చే పల్లెలోనే మా ఇల్లు. ఉదుకుడుగ్గా సంగటి గెలుక్కుంటాము. ఆకలి మీదుండారు మీరు, సారు తినండి" అంది.

"ఇవి ఎవరికోసమో తెచ్చుకున్నట్టున్నారు" అని శాంత అనగానే

"నా కొడుకు గవర్నమెంట్ ఆస్టల్‌లో చదువుతాడమ్మా. మొన్నట్నుండీ జ్వరమొచ్చిందంట.. ఊరోళ్ళతో చెప్పంపిచ్చినాడు. జొరమొచ్చిన పానం గద నోటికి ఇతువుగా ఉంటాదని వానికోసం ఇవి తీసుకోని ఆటో ఎక్కితే మధ్యకే ఆపేసినాడు. ఇంగ ఆటోలే రాల్యా. పొద్దు పొయినంక వాళ్ళు రానీరు. అందుకే ఈ ఆటో వస్తే ఎనక్కి వచ్చేస్తి. మీ కారు నా ముందరే పొయ్యింది చూసినా. మళ్ళా ఆడ ఆగిపొయ్యిన కారు మీదేనని గుర్తుపట్టి చూసి 'రాతిరైంది.. అగసాట్లు పడతారని ఆటోలో ఎక్కించుకుందామని మీ దగ్గరికి వస్తి. ఈ ఆటో అన్న కూడా 'అయ్యో.. పోమ్మా పిల్చుకోనిరా" అని ఆపినాడు. ఆయన్న తెలిసినోడే. చానా మంచోడు" అని చెప్పగానే 'హాస్టల్ ఎక్కడ' అని అడిగింది శాంత.

"మీ కారు పొయ్యిందే.. ఆ రోడ్డుకే పోతే వస్తుంది. లక్ష్మి నరసింహస్వామి గుడి.. గుడికి ఆ పక్కనే ఆస్టలు.."

శాంతకు, మౌనంగా వింటున్న ఈశ్వర్‌కు గుండెలో ముళ్ళు దిగిన ఫీలింగ్ కలిగింది. ఆమెను కారులో ఎక్కించుకొనింటే – జ్వరంలో ఉన్న తన బిడ్డను చూసుకునేది. ఆ బాబు కోసం చేసిన ముద్ద ఇలా తమని ఆదుకోవడం.. ఆమెను కన్నెత్తి చూడలేని గిల్టీనెస్. కనీసం లిఫ్ట్ ఇవ్వలేని ఇరుకు మనసుల వాళ్ళు.. మానవత మచ్చుకైనా కానరాని వాళ్ళుగా.. కొరగాని తమ స్థాయి.. స్వార్థం..

ఇవేవీ తెలియని ఆ పల్లెటూరి స్త్రీ ...

"ఈ రాత్రి మా పల్లెలోనే ఉండండి సారు. మా ఇంట్లో ఒక నవారు మంచముంది. సుట్టాలు ఎవురన్నా వస్తే కింద పండు కోలేరని మొన్న కోతలప్పుడొచ్చిన కూలి డబ్బులతోనే కొనుక్కుంటి. కొత్తదే. మీ ముగ్గురికీ సరిపోతుంది. మా పొంత పొయ్యిలో ఎబ్బుడూ ఉడుకు నీళ్ళుంటాయి. ఈ చలికి ముఖాలు ఉడుకు నీళ్ళతోనే కడుక్కోచ్చు. ఉతికి పెట్టిన దుప్పటి కూడా ఉంది" ఆమె చెబుతూ ఉంది.

చెప్పే కొద్దీ ఆమె విశాలంగా విస్తరిస్తూనే కనిపించింది.

శాంత బాబును పొదివి పట్టుకుని వింటూ ఉంది.

ఆమెతో ఇక ఏం మాట్లాడాలో కూడా అర్థత లేని పరిస్థితి. 'మీరు ఎక్కడికి వెళ్ళి వచ్చారు' అని అడగనే లేదు. ఒక వేళ అడిగింటే వీళ్ళ జవాబు ఎంత వెలవెలపోయేదో. ఆ పల్లెటూరి పేదరాలు ఇపుడు భిక్షమేసే స్థితిలో ఉంది. ఇంత సంస్కారం ఎలా అబ్బిందో.

ఆకలి తీరిందేమో బాబు నిద్రపోతున్నాడు. శాంతకు చాలా ఇష్టమైన సామెత .. వంద గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు చచ్చెను.. గుర్తొచ్చి.. సన్నగా పెదవులు సాగిపోతుంటే.. ఈశ్వర్‌ను చూసింది. ఈశ్వర్ మాత్రం చాలా మౌనంగా.. ఏదో యాతన పడుతున్నట్లుగా అయిపోయాడు. బహుశా అతనిలో మానవుడిని ప్రసవిస్తున్నాడేమో..! ■

## కత్తికొనల వర్తమానం

కింద నెత్తురు తడిసిన నేల
పైన మబ్బులు కమ్మిన ఆకాశం
నడుమ ఏకాకి పక్షిలా జీవితం
చుట్టూ శూన్యం సంధించిన చేతులు
చేతులు నిండిన కత్తులు
కత్తుల కంటిన నెత్తురు
నెత్తురు రంగు ఎరుపు కాదు
నలుపూ కాదు
బతుకు ముందుకు సాగదు
వెనక్కి మరలిపోదు
ఏది చేతికి అందదు
ఏది పక్కన కుదరదు
ఆకాశానికి ఎగరునూ లేక
నేల మీద నిలువనూ లేక
విరిగిన కాలు
తెగిన రెక్క
దేహమంతా క్షతగాత్రం
దేశమంతా చీకటివర్ణం
ఆత్మవిశ్వాసమే ఆయుధం
క్షణ క్షణమూ ఓ సంగ్రామం
కత్తికొనల మీది వర్తమానం!

**- లోసారి సుధాకర్**
99499 46991





## నిజం తెలిస్తే చాలు

పొలాలనంతా హలాల దున్ని
ఇలా తలంలో హేమం పండించిన రైతును
నేల కూలీగా చూస్తున్నాడే కానీ
అన్నదాత గా పరిగణించటం లేదు.


తన చుట్టూ స్వార్థం మేట వేసుకున్న
ఎడారి బిడారు ల్లో కొలువుదీరి
వొంటరి ఒంటెగా మారిపోయాడు.
కండలు కరిగించి బండలు పగలదీసి
తనకోసం రోడ్లు పరిచిన శ్రామికుడిని
చెమట కూలీగా నామకరణం చేస్తున్నాడు

తన ఇంటికి రాళ్ళెత్తిన కష్టజీవుల్ని
వలస కూలీలుగా ముద్రిస్తున్నాడే కానీ
వాళ్ళని మనుషులుగా గుర్తించింది లేదు
వాళ్ల కోసం ఓ నిట్టూర్పు విడిచింది లేదు.

నీళ్లు కొని తాగుతున్న రోజులు కదా
నదులన్నీ తన బానిసలంటాడు.
ప్రపంచ విపణి సమర్థిస్తూ
డబ్బును ఓడించే దేవుడు లేడంటాడు.
ధనమూల మిదం జగత్ అంటూ
తన మాటకు వేదాలే సాక్ష్యమంటాడు.

ఏమన్నా పర్వాలేదు కానీ
మనిషిలో మనసును గుర్తిస్తే చాలు
ఎన్ని అంతస్తుల బతుకు బతికినా
చివరకు నలుగురు అవసరమన్న నిజం
నిర్వంద్వంగా ఒప్పుకుంటే చాలు.
మరణం ముందు ఎంతటి అహంకారైనా
తలవంచక తప్పదన్న సత్యం తెలిస్తే చాలు
వాడిని మనిషిగా మలచటానికి ...
ఏ ఉలీ అక్కర్లేదు!

**- ఈతకోట సుబ్బారావు**
9440529785




# మన ఎరుకలో లేని జీవితాల కథలు



- దొండపాటి కృష్ణ
90523 26864

**త**నకు తెలియనిది తెలుసుకోవడానికి వివిధ మాధ్యమాలను ఆశ్రయిస్తూ ఉంటాడు. ఒకసారి ప్రేక్షకుడవుతాడు. మరోసారి శ్రోతవుతాడు. అప్పుడప్పుడు పాఠకుడవుతాడు. అతనికి ఏం చదవాలో, ఏం చదవకూడదో ఓ స్పష్టత ఉంది. పిళ్ళై లాంటి కొద్దిమంది రచయితలే అటువంటి పాఠకులు కోరుకునే సాహిత్యాన్ని అందిస్తున్నారు.

'రాతి తయారి పిళ్ళై'గా తెలుగు సాహిత్య క్షేత్రంలో అడుగుపెట్టిన కె.ఎ. మునిసురేష్ పిళ్ళై తదనంతర కాలంలో నిర్దిష్టమైన దృక్పథాన్ని కలిగి ఉన్న రచయితగా ప్రఖ్యాతి గాంచారు. తల్లిదండ్రుల ద్వారా లభించిన 'ఆదర్శిని' పత్రిక ప్రారంభంలో తోబుట్టువు అయ్యింది. తర్వాత అమ్మ అయ్యింది. పుష్కర కాలంపైన నడకలు నేర్పిన 'ఈనాడు' నాన్న అయ్యాడు. వాళ్ళిద్దరి సంరక్షణలో పాత్రికేయుడిగా తనదైన ముద్ర వేశాడు పిళ్ళై. జర్నలిజంలో ఆయన చూడని కోణం లేదు. చెప్పని సంగతులు లేవు. ప్రభావితం చేయదగ్గ సంఘటనలను మనసు వెనకాలే దాచేసుకోవాల్సి వచ్చినప్పుడు మాత్రం బాధ పడ్డాడు.

జర్నలిజం ద్వారా వ్యక్తం చేయలేని భావాలు లోపల మెలి పెట్టేసినప్పుడు అవి కథలుగా బయటకొచ్చాయి. తన గుండె మంటను చల్లార్చుకోవడానికే కాకుండా నలుగురి గుండెల్లో స్థానం సంపాదించడానికి రచయిత అవతారమెత్తాడు. మన ఎరుకలో లేని జీవితాలను కూడా మనకు పరిచయం చేసే భూమికను కథ నిర్వర్తిస్తుందని నమ్మాడు. మనకు 'దగ్గరైన' జీవితాలు, ఘటనలు ప్రభావితం చేసినట్లుగా నీతులు, ఉపదేశాలు మనమీద పనిచేయవని ఆ ఘటనల్ని తన కథల్లో ప్రతిబింబించేలా రచనలు చేస్తున్నాడు.

కొంచెం ఆలస్యంగానైనా మన ముందుకొచ్చిన ఆయన మొదటి కథాసంపుటి 'పూర్ణమూ.. నిరంతరమూ..'లో అన్నీ గొప్ప కథలే ఉన్నాయి. రచయితకు జర్నలిజం నేపథ్యం ఉండటం వలన కథల్లో వస్తు వైవిధ్యం చోటు చేసుకుంది. అదే మనల్ని చివరివరకు చదవడానికి ఉసిగొల్పుతుంది.

వరాలత్త – బిక్కవోలులో కొందరికి మామ్మగారు, కొందరికి అత్త, అమ్మ, పిన్ని, పెద్దమ్మ, అక్క, దారంమ్మట వెళ్ళే ప్రతివాడికీ '..యేండీ'! వద్దనకైనా ఆమెది దొడ్డ చెయ్యే. నిరతాన్నదానం చేస్తుంటుంది. ఆ వీధిలో ఏనాడూ ఎవ్వడూ పస్తు పడుకునే పరిస్థితి ఉండేది కాదు. ఆ బిక్కవోలులో ఒక చిత్రమైన ఆచారం ఉండేది. దాని ప్రకారం తన పరిచయస్తులు, బంధువుల్లో ఎవరింట పెళ్లి జరిగినా.. ఆ రోజు ఆ దంపతుల్ని తన ఇంటికే తీసుకొచ్చేది. తానే స్వయంగా వండి వడ్డించేది. కొత్త బట్టలు పెట్టి వారి ఇళ్ళకు సాగనంపేది. అందుకే అయినవారందరికీ, ఊరందరికీ కూడా వరాలత్త అంటే ఎంతో ప్రేమ, ఇష్టం.

రెండు చేతులకూ చెరొక డజను గాజులు వేసుకుని ఉంటుంది. మొత్తం రెండు డజన్లూ బంగారం గాజులే! వాటి మధ్యలో ఎన్నడూ మట్టిగాజులు తొడగలేదు. అంతకుమించి నగల పిచ్చి ఉండేది కాదు. అవంటే ఎందుకంత పిచ్చి? అని అడిగితే ఆ బంగారం గాజుల వెనుక ఉన్న ప్రేమలు, బంధాలు, నమ్మకాల కథ చెప్పేది.

వరాలత్తది వెన్న మనసు. ఇట్టే కరిగిపోతుంది. కరిగించేసుకుంటుంది కూడా... శబ్దానికి ఒకటే అర్థం ఉంటుంది. కానీ

నిశ్శబ్దానికి అనేకం ఉంటాయి. ఆమె నిశ్శబ్దంగా ఉందంటే ఎవరికో మూడినట్లే! అయిదోతనానికి గుర్తుగా, మెరుగు పట్టడానికి కూడా ఎన్నడూ బయటకు తీయను గాజులు ఆ క్షణాన జీవం కోల్పోయినట్లుగా ఉన్నాయి. నెత్తుటి మరకలు లేని యుద్ధం గెలవడానికి వాటిని బయటకు తీయాల్సి వచ్చింది. ఉన్నపళంగా పది లక్షలైనా విసిరి వేయగల వరాలత్త, ఆ డజను గాజులు తీయడానికి కారణమేంటి? మిల్లులో వచ్చిందంతా పేకాట క్లబ్బులకి, పెద్దాపురానికి తగలేసే ఆ సత్తిరెడ్డి లాంటి ఎదవ కోసం ఎందుకు తీసింది? బోసిగా ఉన్న చేతుల్తో నిండుగా ఎలా నవ్వగలుగుతోంది? తెలియాలంటే 'వరాలత్త గాజులు' కథ చదవాల్సిందే!

'దేవుడు... దెయ్యం భ్రమల మధ్యలో తెల్లారేదే బతుకు! మనిషి... మనిషి మధ్యలో బలైపోతుండేదే బతుకు!' ఈ వాక్యాలు చదవగానే రచయిత దృష్టికోణం అవగతమైపోతుంది. అతను చెప్పాలనుకున్నది ఈ రెండు వాక్యాల్లోనే ఇమిడ్చేశాడు. అవును, ఒక మనిషి బతుకు మరొక మనిషి కారణంగానే బలైపోతుంది నేడు. బలవంతుడున్న ప్రతిచోట బలహీనుడికి చోటు లేదు. సమాజ స్థితిగతులలా మారిపోయాయి. చాలామంది బతుకులు ఆశ, భయం మధ్యలో ఊయలలూగుతుంటాయి. వెలుతురు, చీకటి మధ్యలో రెపరెపలాడుతుంటాయి. 'పేరు తెలియని ఆమె' బతుకైతే మరింత దయనీయంగా ఉంటుంది.

తలనిండా మల్లెపూలు పెట్టుకుంది. మొహానికి పౌడరు పూసుకుంది. గడ్డం కింద, పయ్యెద కొంగుల మీద అత్తరు రాసుకుంది. ఈ మూడు రకాలైన వాసనలో ఏదో ఒకటో/ మూడూ కలగలిపి కొత్త వాసనో పని చేయకపోతుందా? అని రాత్రంతా ఆశ, నిరాశల మధ్య మనసు కొట్టుమిట్టాడుతుంది ఆమెకు.

ఒక లారీ డ్రైవర్ బండాపాడు. ఊపిరి పీల్చుకుంది. మెల్లగా మాటల్లో పెట్టింది. ఊహించిన దానికన్నా సగానికే బేరం కుదిరింది. వాడిదేమో ఆత్రుత, ఆమెదేమో జాగ్రత్త... ఎత్తుపల్లాలుగా పని జరిగిపోయింది. క్లీనర్ లో రగిలిన కోరికను పసిగట్టింది. అవసరం గుర్తుకొచ్చింది. ఆ సగం బేరాన్ని అతనితో మాట్లాడుకుంది. సూర్యుడు, చంద్రుడు రిలే గేమ్ ఆడుతున్న వింత నాటకంలో తన పాత్రకు కాసేపు విరామం ఇద్దామనుకుంది. ఇంతలో నలుగురు దూసుకొచ్చారు. లారీ ఎక్కబోతున్న దాన్ని బరబరా కిందకు లాగారు. అప్పుడు అక్కడే ఉన్న డ్రైవరు, క్లీనరు ఆమెకు సాయం చేశారా? ఈ గొడవంతా తమకెందుకులేనని వెళ్ళిపోయారా? అన్నది 'పేరు తెలియని ఆమె' కథ చదివితేనే తెలుస్తుంది.

వేదాల్లో 'పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే' అని ఉంది. అంటే మొత్తంలోంచి మొత్తం తీసేస్తే.. మొత్తం మిగులుతుంది. అసలది ప్రాక్టికల్గా ఊహించగలమా? కాదంటాడు తండ్రి, అవునంటాడు కొడుకు.

'చివరిచూపు' మీద నమ్మకం లేదంటాడు తండ్రి. చచ్చిపోయాక ప్రాణం లేని దేహాన్ని చివరిగా చూడడమేమిటి? ట్రాష్... అంటాడు. ప్రాణం మాయమైపోతే చాలు ఆ శవం అప్పుడే దేవుడై పోయినట్లుగా అంతా వచ్చి కాళ్ళు మొక్కడాలూ లాంటివి అసహ్యం అంటాడు. తాను చనిపోయాక తన దేహాన్ని వైద్య కళాశాలకు రాశాడు. చనిపోయాక మెడికల్ కాలేజీ వాళ్లకు తప్ప ఎవ్వరికీ కబురు చేయవద్దంటాడు. దాన్ని వ్యతిరేకిస్తాడు కొడుకు. వీలునామా ఎలాగైనా రాసుకో, అందులో తప్పులేదు గానీ ఎవరినీ పిలవొద్దని, ఎవరూ రావొద్దని ఆదేశించడానికి నీకేం హక్కు ఉందని తండ్రిని ప్రశ్నిస్తాడు.

ఎవరైనా చనిపోతే మనం వెళ్ళడం, పోయిన వారికోసం కాదని, మిగిలిన వారికోసమని, ఒకరిని కోల్పోయావు, కానీ నీకింకా ఇందరున్నారని వాళ్ళకు భరోసా ఇవ్వడానికి వెళ్తారని అంటాడు. పూర్ణమైన ఒక అనుబంధం తెగిపోయింది... అయితే అనేక అనుబంధాలు ఇంకా పూర్ణంగానే ఉన్నాయని తెలియజేస్తాడు. అప్పుడా తండ్రి ఏం చేశాడు? కొడుకు వాదనకు తలొగ్గాడా? తాను రాసిన విల్లును మార్చి రాయించాడా? ఇదంతా ట్రాష్ అని కొట్టి పడేశాడా? ఈ 'పూర్ణమూ.. నిరంతరమూ..' అనే కథలో రచయిత సాధించిన విజయం కనిపిస్తుంది. ఏదైనా ఒక కథ రాసేటప్పుడు ఏదో ఒక విషయాన్ని బలంగా చెప్పడానికి అనువైన పాత్రను బలంగా మలచడం రివాజు. కానీ కథలో ఉన్న రెండు పాత్రలూ ధీటుగా ఉంటాయి. నువ్వా.. నేనా.. అన్నట్లు ప్రవర్తిస్తాయి. ఇద్దరి వాదనలోనూ వాస్తమే ఉందనిపిస్తుంది. మన ఓటు ఎటువైపు వేయాలో నిర్ణయించుకోవాలంతే...

దాంపత్యం అంటే ఏమిటి? ఇంటర్ డిపెండబిలిటీనా? మన వ్యవస్థలో దంపతుల్ని ఇంటర్ డిపెండబుల్ గా మార్చేయడం ఒక సంప్రదాయం అయిపోయిందని రచయిత ఉదాహరణలతో సహా నిరూపిస్తాడు 'మా ఆయన అపరిచితుడు' కథలో. ఇంటి యజమాని కాలం చేసినప్పుడు, 'నాకేం కావాల్సి వచ్చిన తనే చూసుకునేవాడమ్మా' అనే విలాపంలో ఆమె ద్వారా బయటకు వ్యక్తం అయ్యేది ఆవేదనే కానీ కాస్త లోతుగా ఆలోచిస్తే అసలెందుకంత అశక్తంగా తయారైపోయినట్లోనని వాపోతాడు. ఐహికమైన, దైహికమైన బాధ్యతలనుంచి విముక్తే మరణం. అలాంటి విముక్తి ప్రదాయకమైన అద్భుత సందర్భాన్ని కన్నీటితో నింపుకోవడం దేనికంటాడు. రిటైరయ్యాక ఇదే మనస్తత్వంతో ప్రవర్తిస్తుంటుంది ప్రధాన పాత్ర.

భార్య తనమీద ఆధారపడకూడదని ఆమే స్వయంగా అన్ని పనులూ చేసుకోవాలంటాడు. భార్యపై ఆధారపడకుండా అతనూ అన్ని పనులూ నేర్చుకుంటాడు, వంటతో సహా. నలభయ్యేళ్ళుగా ఎరిగిన ఆయనలో... నాలుగేళ్ల కిందట ఒకడు కొత్తగా కనిపించాడు. భర్త ప్రవర్తనకు విసిగి వేసారిన భార్య అతనిపై ఆధారపడకుండా అన్ని పనులూ నేర్చుకుంటుంది. తర్వాతేం జరిగింది? ఓడలు బళ్ళవుతాయి, బళ్ళు ఓడలువుతాయి. ముగింపు మన ఊహకు అందదు. అది రచయిత గొప్పదనం.

రోడ్డు విస్తరణలో భాగంగా గుడిని కూలగొట్టాలని అధికారులు నిర్ణయిస్తారు. గుడిని కొట్టేస్తే, రోడ్డు మార్జిన్‌లో ఉండే షాపులనూ కొట్టేస్తారు. దానిని అడ్డుకోవడానికి వ్యాపారులు వేసిన ఎత్తుగడే గుడికి మరమ్మతులు చేయించడం... ఉత్సవాలు జరిపించడం... కోటకు కాపలాగా రాజులు కట్టిన వినాయకుడి గుడిని ఊళ్ళో పెద్దలే కాదు పిల్లలూ పట్టించుకునే వారు కాదు. కానిప్పుడు పరిస్థితి మారింది. జనంలో కదలిక వచ్చింది. వినాయకుడు గార్డు అవతారం ఎత్తాడు. అది ఎలాగో 'గార్డు వినాయకం భజే' కథలో చదవొచ్చు.

డెస్క్ జర్నలిస్ట్ గురించి, వారి జీవన విధానం గురించి తెలిసిన వారు బహు అరుదు. పూర్తిగా సూర్యుడినీ చూడలేరు. వెన్నెలనూ ఆస్వాదించలేరు. ఎన్ని గడ్డి పరకలు కాలిస్తే బొగ్గులవుతాయి? అనే ప్రశ్నతో మొదలవుతుంది వారి జీవితం.

'అడిక్వేట్' అనేది అబద్ధం. 'డెడ్ లైన్' ఒక్కటే నిజం అని నమ్మే వ్యక్తి ఇస్మాయిల్. యాభై తొమ్మిది వేల జీతం. కంపోజ్ చేయలేడు, పేజీ మేకప్ రాదు, బియ్యే చదివి వొచ్చాడు, అవుట్ పుట్ పెద్దగా లేదు. అలాంటి సీనియర్ జర్నలిస్ట్‌ను కాస్ట్ కటింగ్‌లో తీసేయ్యాలనుకుంటారు. ఎన్నో వేల వార్తలు రాసిన చెయ్యి... సంతకానికి ముందు నాలుగు ముక్కలు రాయడానికి ఎలా ఒణికిందో తెలిస్తే బాధ భరించరానిదవుతుంది.

ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే! ఎక్కడో ఫారిన్ యూనివర్సిటీల్లో చదువుకునొచ్చి, నాలుగు టెక్నికల్ మాటలు చెప్పి ఉద్యోగం తీసెయ్యడం సులభమే! కాని అదే వ్యక్తి ఉన్నప్పుడు పేపర్ మనుగడ ఎలా ఉంది? ఇప్పుడెలా ఉంది? తర్వాత ఇస్మాయిల్ తన జీవితాన్ని ఎలా రూపుదిద్దుకున్నాడో 'గడ్డిబొగ్గులు' కథ చదివితే మనసు పులకిస్తుంది.

ఇలా ఈ సంపుటిలోని ప్రతి కథలోనూ రచయిత గొప్పదనం కనిపిస్తుంది. పిళ్ళై కథల్ని చెప్పడు. చూపిస్తాడు. దృశ్యమానం చేస్తాడు. మనల్ని పట్టి లాక్కెళ్ళతాడు. కథలు ఎక్కడుంటాయో, వాటిని ఎలా పట్టుకోవాలో, ఎలా చెప్పాలో, ఎందుకు చెప్పాలో తెలిసిన కథకుడు పిళ్ళై. 'మన పరిశీలనలో, ఏదైనా ఒక జీవితపు విచిత్రాన్ని, కథా వస్తువును గుర్తిస్తే దాని గురించి మనలో ఆవేశం పుట్టాల. అప్పుడే కథో కవితో పుడతంది. మీ జర్నలిస్టులు ప్రతిరోజూ రాస్తుంటారబ్బా.. మీ ఆవేశం ఆ రాతల్లో ఎక్కడో ఓ చోట బయటకు వచ్చేస్తుంటుంది. ఇక కథలు రాసేది చచ్చిపోతుంది' అని జర్నలిజంలో పడి రోజూ పేజీల కొద్దీ రాసేస్తున్న రోజుల్లో పిళ్ళైతో శ్రీ మధురాంతకం రాజారాం గారు అన్నారని స్వయంగా రచయితే చెప్పుకున్నారు. కానిప్పుడు అదే మధురాంతకం రాజారాం గారు పిళ్ళై వెలువరించిన 'పూర్ణమూ.. నిరంతరమూ..', 'రాతి తయారి' కథాసంపుటాలను చదివితే తన మాటను వెనక్కి తీసేసుకుంటారు. ప్రతులకు: 99594 88088. ■

## వర్ధమాన రచయితలకు 24, 25 తేదీల్లో కథా కార్యశాల

**నూ**తన తరం రచయితలను, అనువాదకులను తయారు చేయాలన్న సంకల్పంతో **జూన్ 24, 25 తేదీల్లో** సమన్విత, సేఫ్, జి.ఆర్.కె – పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా చిన ముత్తేవిలో కథా కార్యశాల నిర్వహిస్తున్నాం. ఆసక్తి గల యువ రచయితలు, రచయిత్రులూ ఈనెల 15వ తేదీ తమ పేర్లు నమోదు చేసుకొని ఈ కార్యశాలకు హాజరు కావొచ్చు. ప్రముఖ రచయత ఖదీర్ బాబు, ఇతర సీనియర్ రచయతల సారథ్యంలో కథారచనపై శిక్షణ ఉంటుంది. ఈ కార్యశాల అనంతరం ప్రతినిధులు రాసే కథలతో ఒక సంకలనం వెలువరిస్తాం. ఈ కార్యశాలకు వచ్చేవారు రూ.100 ప్రవేశ రుసుం చెల్లించాలి. రెండు రోజులూ భోజనం, వసతి ఏర్పాట్లు ఉంటాయి. 23వ తేదీ సాయంత్రానికి విజయవాడ చేరుకుంటే– ఆ రాత్రికి కథా కార్యశాల స్థలికి చేరుస్తాము. కార్యశాల ముగిశాక 25వ తేదీ సాయంత్రం తిగిరి విజయవాడలో దించుతాము. మరిన్ని వివరాలకు శాంతిశ్రీ 8333818985, శమంతకమణి 9491962638, ఉషారాణి 9492879210 లను సంప్రదించాలి.

**– సమన్విత**

## విప్లవాంజలి

అంజలీ అంజలీ
గీతాంజలీ కళాంజలీ
ప్రేమాంజలీ విప్లవాంజలీ
కథ నీది గానం నాది!
భూదేవి సొంతమై ఆకాశం అర్ధరాజ్యం నీది
నిరక్షరాస్యత దారిద్ర్యం దోపిడి
ముప్పేట తిమిరంలో పొదుగుతూంది పట్టం
అక్షరం పదమై వాక్యమై సుమధుర ప్రబోధం
సుప్రసన్న సందేశమై
అవిరామం చిగుర్చు
అంజలీ గీతాంజలీ!
కళలు విత్తానికి అమ్ముడై
తిరిపాలై బిచ్చమెత్తుతున్నాయి
ఉద్భవించిన ఆధునిక కళ
ప్రాచీన కళకు పుటమై
ధనార్జనే ధ్యేయమైంది
మనిషిని మేల్కొల్పే మనసును పదునించే
బతుకును శిల్పించే
అరవై నాలుగు కళలలకు జీవం పోసి
ప్రదర్శించు కళాంజలీ!
ద్వేషం ద్రోహం జమిలిగా కదుల్తూ
మనసున చేతన చిచ్చు రగిల్చి
బంధం అనుబంధం
జలస్తంభన విద్య నేర్చాయి
అనురాగ క్షేత్రాన పండించిన ప్రేమను
పంచు ప్రేమాంజలీ!
పరజాతిని స్వజాతి
స్వజాతిని పరజాతి
స్వజాతిని స్వజాతి
దాహార్తులై రక్తం తాగుతూ
అన్నార్తులై కండలు తింటూ
కళ్ళెదుట కదిలే దృశ్యాలు
కులం బలం ప్రదర్శిస్తూ కులం
కలం బలం ప్రదర్శిస్తూ కలం
ఉచ్ఛ్వాస విశ్వాసని నియంత్రించి
బతుకు కాని బతుకులు
మానవ కళ్యాణానికి
పల్లవించు విప్లవాంజలీ!

- అడిగోపుల వెంకటరత్నమ్
98482 52946



## అలా ఆగు, కాసేపు ...

ఎలాగో ఆ జ్ఞాపకాలన్నింటినీ
పక్కకి నెట్టేయ్!
నీ త్యాగాల గురించి
తెలుసుకునే అవసరం
ఎవరికీ లేదిక్కడ ...
దేనికీ కోప్పడకు
అర్భకుడి ఆక్రోశం
నవ్వులాటగా ఉంటుంది.
ప్రాణం చివుక్కుమన్నా కిమ్మనకు!
ఎంతైనా రక్త సంబంధం కదా
నిన్ను నీవు మూడు భాగాలుగా
విభజించుకో!
ఏదీ నిన్ను ప్రశ్నించదు
కొన్నిసార్లు తల వాల్చిన
పూలను చూస్తూ వుండు
నీలో చప్పుడు నీకే వినిపిస్తుంది
నీ సర్వస్వాన్నీ ఆకాశానికిచ్చేయ్
ఏ ఇసుకలోనూ
నీ నీడ అడుగులు కనిపించవు
అలా ఆగు కాసేపు
ఈ రాత్రయినా మనసారా
నిన్ను కౌగలించుకోనీ...!

- ఏటూరి నాగేంద్రరావు
74166 65323

# రాత్రి సూర్యుడు

- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

**అ**తడికి
పగలు ... రాత్రి
రాత్రి ... పగలు

ప్రపంచమంతా పరుగెత్తుతున్నప్పుడల్లా
వాడు తనదైన లోకంలో విహరిస్తూనే ఉంటడు
లోకమంతా అలసిపోయి నిద్రపోయినప్పుడల్లా
అతడు రాత్రి సూర్యుడై వెలుగుతూనే ఉంటడు

అతడు నిత్యం పహారా కాస్తున్న రాత్రిలా
రహదారులను శుభ్రం చేస్తూనే ఉంటడు
మానవసేవనే మాధవసేవనంటూ
మానవాళి శ్రేయస్సుకై పరితపిస్తూనే ఉంటడు
నిత్యం మురికికూపంలో దిగబడుతూనే
మన మురికిని వదిలిస్తుంటడు

కడుపుకు తిండిలేకున్నా... కంటికి నిద్రలేకున్నా
రోజూ మహా శివరాత్రిలా...నిత్య జాగరణ చేస్తూ
ప్రతి నిత్యం లోకాన్ని శుభ్రపరుస్తూనే ఉంటడు
వాడి ఆకలిని ఈ లోకం పట్టించుకోదు
అతడి దాహాన్ని ఈ ప్రపంచం తీర్చదు

అతడి పని వాడిదే...
తను నిత్యం కొత్త ప్రపంచానికై
బాటలు వేస్తూనే ఉంటడు
రాత్రి మేల్కొంటూనే
లోకాన్ని నిద్రలోకి దించేస్తుంటడు

పొద్దు నేలను ముద్దాడేదాక
తనువును విల్లులా వంచి
ఊపిరి సలపనంతగా పనిచేస్తుంటడు

తన రెక్కలను ముక్కలుగా మార్చినా
అతడికింత జనాదరణ ఉండదు
తన కష్టాన్ని లోకానికి ఆహుతి చేసినా
అతడి కడుపుకింత ఆకలి తీరదు


అతడు...రాత్రి సూర్యుడు



పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడిలా
చీకటితో యుద్ధం చేస్తూనే ఉంటడు
రాత్రి మిత్రుడితో చెలిమి చేస్తూనే
నిత్యం వేగుచుక్కై వెలుగుతుంటడు

మనం వెన్నెలై వెలుగుతున్నమంటే
అతడు లోకాన్ని నిత్యం శుభ్రం చేస్తున్నందుకే
మనం మనుషులమై తిరుగుతున్నమంటే
అతడు రాత్రి సూర్యుడై పహారా కాస్తున్నందుకే! ■

**సాహిత్యప్రస్థానం**
విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక
**చందాదారులుగా చురండి ..**
**మీ మిత్రులను చేర్పించండి ..!**
**వివరాలకు 94900 99057 ను సంప్రదించండి.**




# నాగేటి నెగులు వినిపించిన కొండ్రెడ్డి

- కిరణశ్రీ
91105 80418

**ఆ**ధునిక కవులంతా విశాల ప్రజాజీవనానికే అంకిత మయ్యారు. ప్రజల బాధల్నీ, గాథల్నీ, ఆశల్నీ, ఆశయాల్నీ వైయక్తిక కవితా రీతిలో ప్రతిబింబిస్తున్నారు. ప్రజాజీవన గతి స్థితులను రాసావేశంతో చిత్రీకరిస్తున్నారు. ప్రజల ఊహాపోహలకు కవులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ప్రభావాన్నే జూలియన్ సైమన్ అనే ప్రఖ్యాత ఆంగ్ల విమర్శకుడు "Every poet is an unconscious mass observer" అంటాడు. ఈ మాట ఆధునికాంధ్ర కవిత్వానికి సరిగ్గా సరిపోతుంది. గత ఆరు దశాబ్దాల వయోరేఖకు దిగువన ఉన్న కవితరం, తీరుతెన్నులు గమనిస్తే, ఒక విస్పష్ట సామాజిక ప్రయోజనాన్ని తన జీవ ధాతువుగా మార్చు కొన్నది. ఈ పరిణామం ఒక క్రమానుగత వికాసంగా మార్పు చెందుతూ, ఆధునిక కవితారంగంలో స్థిర సంకల్పంతో మోసులు వారుతోంది.

కవి స్వయంగా పొందిన అనుభవ సాంద్రత అదే స్థాయిలో పాఠకుడు లేక శ్రోతలో కూడా కలిగించాలనుకున్నప్పుడు కవికి భాషపై శ్రద్ధ, అధికారం ఉండాలి. సమకాలీన సంఘర్షణాత్మక చరిత్రలో స్పష్టంగా రైతు పక్షాన నిలబడ్డ కొండ్రెడ్డి వెంకటేశ్వర్రెడ్డికి ఇవన్నీ హెచ్చుస్థాయిలో ఉంది. శ్రీశ్రీ 'మంటల చేత మాట్లాడించి/ రక్తంచేత రాగాలాపన చేయిస్తాను' అన్న తీరులో ఆగ్రహావేశాల్ని వ్యక్తం చేస్తాడు.

నాగేటి గోడు పూర్తి కృషీవలుని గోడు వినిపించడానికి కొండ్రెడ్డి తలకెత్తుకున్న వ్యవసాయ కవితా వ్యాసంగమిది. శ్రామికవర్గమైన రైతన్నలు కార్పొరేట్ తదితర శక్తుల చేజిక్కి, ఎలా గిలగిలలాడు తున్నారో వినిపిస్తాడు. జనావళి ఆకలిని తీర్చే రైతన్న ఈ ప్రపంచీ కరణ నేపథ్యంలో ఎలా బిక్కచచ్చిపోతున్నాడో వినిపిస్తాడు. కవి ఆవేదన, ఆగ్రహావేశాలను మనకు దృశ్యమానం చేస్తాడు. ఇందులో మతశక్తుల ప్రసక్తి సైతం చోటుచేసుకొన్నది. ఈ శక్తుల కుయుక్తుల కు, దుశ్చర్యలకు రైతన్నలు అజ్ఞాన, అశాస్త్రీయ భావన ల్లో మునిగిపోయి ప్రశ్నించే శక్తిని, హక్కుల్నీ కాలరాచుకునే వైనాన్ని దుయ్యబట్టాడు.

శ్రీశ్రీ చెప్పిన 'కర్షక వీరుల కాయం నిండా/ కాలువకట్టే ఘర్మజలానికి/ ఘర్మజలానికి/ ధర్మజలానికి/ ఘర్మజలానికి ఖరీదు లేదోయ్' అన్న సత్యం ఇందులో స్పష్టంగా బోధపడుతుంది. మానవ సుఖజీవనానికి కర్షకులే ప్రాణాధారమని, దేశ సౌభాగ్యం కోసం వారు ఎనలేని సేవలందిస్తున్నారని, సకల వృత్తులకు సమ ప్రాధాన్యం గలదని, శ్రమైక జీవనంలోనే మాధుర్యం నిండి ఉందని తెలపడానికే కొండ్రెడ్డి ఈ కావ్యం రాశాడు. కర్షకులు మానవ జీవితగమనానికి అతిముఖ్యులని, వారు సౌఖ్యంగా జీవించేలా చూడవల్సిన బాధ్యత సమాజంపై ఉందని చెప్పడానికే ఈ దీర్ఘకవిత రాశాడు. వాస్తవంగా చెప్పాలంటే 'వర్తమానాన్ని ఒడిసిపట్టే కవిత్వం కావాలి' అని 2018లో కవి రాసిన ఒక వ్యాసం గమనిస్తే నాగేటి గోడును వినిపించి తీరాలన్న కృత నిశ్చయం ఆనాటికే ఉందనిపిస్తుంది.

156 పుటల్లో ఆరు విభాగాలుగా వింగడించిన ఈ కావ్యాన్ని స్థాలీపులాక న్యాయంలా పరిశీలిద్దాం. ఒకటవ విభాగంలో 'ఇది పిడికిట హృదయాన్ని/ పట్టిపిండుతున్న 'నాగేటి గోదు'' అంటాడు. అలాగే 'నిదురపట్టని నిశ్శబ్ద సందర్భాల్లోంచి/ లేచి కూర్చున్న వాక్యాలు'గా అభివర్ణిస్తూ.. 'కవులు భావోద్రేకాన్ని/ బహుముఖంగా ఆవిష్కరిస్తూ/ కలాల్ని కదుపుతూ/ కర్షకుల కష్టాలు/ కృష్ణబిలాలవుతున్న వైనాన్ని/ విశదపరిచే దిశగా/ శాంతి దీపాలతో కాంతి ప్రభలతో/ విరాజిల్లే కవిత్వమైపోతున్నారు'. 'కాష్టమై రగులుతున్న కారణాల్ని/ ప్రశ్నించలేని బలహీనత ప్రహసనమైంది' అన్న ప్రాచీన కవిత్వ అవతారికల రీతిలో 'కావ్యపరిచయం' చేస్తాడు కవి.

రెండో విభాగంలో కర్షక కష్టాలకు మూలకారణాలు వెలికిదీసి పట్టుకునేందుకు యత్నిస్తాడు కవి. నీతినియమాల చట్రం ఏర్పరచుకొని నియమబద్ధ జీవితం గడిపేవారికి జీవితం

పూలతోట కాకపోయినా ఎడారిబాట మాత్రం కాదన్న విశ్వాసం ప్రకటిస్తూ 'చట్టసభల్లో అవినీతి ఖద్దరు చీకటి ముసుగుల్లో/ ప్రజాస్వామ్యాన్ని నెత్తురోడిస్తూనే' అంటూ 'సమసమాజం/ సోషలిజం/ ప్రజాస్వామ్యం/ అన్నింటిని ఊకదంపుడు ఉపన్యా సాల్లో' జనం మెచ్చుకోలుకై 'ఉపయోగించే ఆదర్శపదాలు' అటూ వారి ఎన్నికల మేనిఫెస్టోలలో గుప్పించిన హామీలను గుర్తుచేస్తూ 'హామీ పథకాలు/ నిర్వీర్య రాగాలు ఆలాపిస్తున్నాయ్/ అన్నదాతల కిచ్చిన అభయాలు/ నిర్జన పంథాలై కంటకమయమై' అంటూ 'కర్షకుణ్ణి కాటేసేందుకు కోరలు చాస్తూ/ మాటేసి కూర్చున్నాయ్' అని చెబుతూనే... రైతును దిగాలు పడవద్దని 'బతుకును బతికించు కోవడమే/ బతుక్కి మనమిచ్చే బహుమానం' అని రైతన్న భుజం తడతాడు.

మూడవ విభాగంలో  రైతుకు ధైర్యం, ధృతి ధీరత్వాలను కోల్పోవద్దని చెప్పే ఈ అధ్యాయంలో 'చెమట చిత్తడికి చైతన్య రూపమైన/ సైరికుని మించిన సేవాతత్పరుడెవరు?' అని అతని సేవలు జాతికే అంకితమ్ము, అతని తనువెల్ల అవనికే అర్పితమ్ము అని వారిని ప్రస్తుతిస్తాడు, ప్రశంసిస్తాడు. రాజకీయ నాయకులు 'ఛీటింగులో సిద్ధహస్తమైన/ ఇంపోర్టెడ్ ప్లాన్స్ ఇంప్లిమెంట్ చేస్తూ' ఇంకా 'కులమతాల సమీకరణలను/ గోత్రనామాల గోప్యతను వెలికిదీస్తూ/ ఓట్లు దండుకునే ప్లాన్స్‌తో/ కుర్చీనెక్కే యజ్ఞంలో కృతకృత్యులవుతుంటారు' అని వారి భోగట్టాను బహిర్గతం చేస్తాడు. అందుకే  'ఓసారి ఓడినంత మాత్రాన/ కాలం కలిసిరాలేదని/ నిరాశా నిస్పృహలతో/ ఆశాపాశాన్ని తెంచుకోకూడదు/ పిరికి తనంతో/ ఈ లోకం వీడి పారిపోవడానికి/ పాడెక్క కూడదు' అని రైతన్నకు ఉపదేశం చేస్తాడు.

'ఈ భూమ్మీద సేద్యగాడు అంతరిస్తే/ సూర్యుడు అస్తమించి నట్లే' అని ప్రారంభించిన నాల్గవ విభాగంలో 'సిరిదాగిన సేద్యాన్ని/ పాలకులు కరిమ్రింగిన వెలగపండును చేస్తూ/ రైతును నిర్వీర్యం చేస్తున్న సందర్భం' అని సేద్యంపై చిన్నచూపు చూస్తే జరిగే దుష్ఫలితాలను దుయ్యబడతాడు. 'ఇక ఎప్పటికీ ఈ నేల/ మానవ విధ్వంసాలతో మాయని గాయాల/ నేలగానే మిగిలిపోవాలా?/ నేటి యువత దృష్టి సారించి తెలుసుకోవాలి' అంటూ యువతను కార్యోన్ముఖులను చేస్తాడు. 'మనం మనిషిగా యాంత్రికతకు దాసోహమన్ననాడే/ ప్రకృతిని పట్టించుకోవడం మానేశాం/ పర్యావరణానికి పాడె కట్టడం మొదలెట్టాం' అంటూ... 'బతుకుల్లోకి దూకిన/ యాంత్రికత కీలకమై కూర్చొంది/ స్వీయ శ్రమీకరణ అనాథైపోతుంది' అని యాంత్రికతపై తన తీవ్ర అసంతృప్తిని వెళ్ళగక్కుతాడు. ముగింపుగా 'హాలికుణ్ణి కష్టాల్లోకి నెట్టి/ కాలం కదిలి పోతూనే ఉంది/ దానికి కారణం ఎవరో వెతకాలి/ మనం మనంగా బతకాలి' అంటూ ఈ దుస్థితికి కారణాలను అన్వేషిం చాలని ఉద్బోధిస్తాడు.

ఐదవ విభాగాన్ని ఆరంభిస్తూ 'ఈనేల/ ఈ నింగి/ రైతు కలలు పండించుకునే/ మూల ధాతువులకు నిలయాలు/ స్వేద పూజితాలయాలు' అని ప్రకృతిని ప్రస్తుతిస్తాడు. మన పాలకులు బహుళజాతి కంపెనీల కార్పొరేట్ వ్యాపారం/ లాభాల బాటల మీద చేసే నృత్యాలకు/ తాళం వేస్తున్నారు' అని పాలకులు కొమ్ము కాస్తున్న విధానాన్ని ఎరుకపరుస్తాడు. 'మానవ సమా జాన్ని/ అన్నదాత అన్నం ముద్దతో బతికించ గలడు/ ఉడుకుడుకు ఉద్రేకపుటాలోచనలు మానుకొని/ ప్రశాంతతో ఆలోచిస్తే/ శాంతి మార్గం దొరుకుతుంది' అని రైతుపక్షాన తన వాదన వినిపిస్తాడు. 'కలుషితాల వలలో చిక్కి/ పర్యావరణం పరిపరి విధాల నాశన మౌతోంది/ రుతువులు గతులు తప్పుతున్నాయి' అని ప్రకృతి కన్నెర్ర జేస్తే జరగబోయే దుష్పరిణామాల తీవ్రతను కరోనా వంటి వ్యాధుల వ్యాప్తిని తెలియజేస్తాడు.

చివరిదైన ఆరో విభాగంలో 'రైతుయాతన వింటుంటే/ ఇది తరతరాలుగా తరుముతున్న కన్నీటి గాథ/ అంతంలేని పోరై నిలుస్తున్న నాగేటి గోడు' అని ఆవేదన వెలిబుచ్చుతూ, 'ఆత్మ హత్యలతో/ అసువులుబాసే దుస్థితి నుండి/ కాపాడుకునే ఆత్మ నిగ్రహాన్ని/ ఏవిధంగా కూడగట్టుకోవాలో ఎరుకలేకుంది'  అని విలపిస్తాడు. 'ఇకనైనా పాలకులు నియంతృత్వ ధోరణులు మాని/ నాగేటి గోడు వింటే/ ఊరటలేని ఉద్వేగాలు ఊరడిల్లుతాయ్/ ఉక్కిరి బిక్కిరౌతున్న రైతుల బతుకులు ఊపిరోసుకుంటాయి' అని రైతు సంక్షేమాన్ని కోరుకుందామని, దేశాన్ని సుభిక్షంగా ఉంచుదామని ఆశావహ దృక్పథంతో ముగిస్తాడు. రైతు దిగుళ్ళను గుదిగుచ్చి 'నాగేటి నెగులు'ను వినిపించాడు  కవి కొండ్రెడ్డి.

కవులు దీర్ఘ కవితల్ని రాయడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి వస్తువిస్తృతి.. రెండవది కవిత్వ తపన. ఏకవస్తువు, సుదీర్ఘత, భాషా సారళ్యం, ప్రవాహ గుణాలు దీర్ఘ కవితల ముఖ్య లక్షణాలు. అంతే కాక కవి చేసుకున్న విభాగాలపై స్పష్టత, పునరుక్తి రహితం అవశ్యకం.  కవి కొండ్రెడ్డి ఈ కావ్యం అన్ని విభాగాల్లోని అన్ని అంశాలు పునరుక్తిని పొందడం వల్ల, పాఠకుడికి పఠనంలో క్రమోన్మీలన కొరవడిందేమో అన్న సందేహం కలుగుతుంది. కొండ్రెడ్డి 1999లో 'మట్టితడి బంధాల్లో' అనే కావ్యం, 2003లో 'దుక్కి చూపు' తీసుకొచ్చి, దువ్వూరి రామిరెడ్డి గారిలా కర్షక పక్షపాతి, తనదైన ముద్రతో గత కొన్ని దశాబ్దాలుగా కవితా సేద్యం చేస్తున్న కవి, విమర్శకుడు. వీరి కలం నుంచి మరిన్ని సృజనాత్మక రచనలు రావాలని ఆశిద్దాం. ■



# నాకో వృద్ధాశ్రమం కావాలి!

మనిషి జీవితం
యుద్ధరంగమై జ్వలిస్తున్నపుడు
రాకాసి అలలు నడినెత్తిన స్వారీ చేస్తున్నప్పుడు
బతుకే కన్నీటి సుడిగుండంలో
చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నప్పుడు
ముడతలు పడ్డ దేహగాయాల సంరక్షణ
బాధ్యత మోసే స్థితి స్ఫురించదు
వయసు సంద్రమై మీద పడే మనుషులు
సొంత మనుషులైనా లాలించే వీలుండదు
మనిషి జీవనగమనంలో వేదనల బాధలు
ఉవ్వెత్తున ఎగుస్తున్నప్పుడు
లేమితనం ఇంట్లో పాములపుట్టయి తిష్టవేసి
ప్రతిష్టంభన పారువేటగా మారినపుడు
వృద్ధత్వం మోయలేని బరువవుతుంది!

ఆ ఆపత్సమయంలో ఆసరా ఇచ్చి ఆదుకొనేవి
తీరం చేరని వ్యక్తుల జీవితాల్లో
వెలుగు పూలు పూయించేవి
నడిసంద్రంలో ఆలంబనగా నిలచేవి
అక్కున జేర్చుకొనేవి
వృద్ధాశ్రమాల ఉద్దీపనల వాకిళ్ళే కదా!
వదాన్యత సౌరభ విశిష్టతలు తీర్చిదిద్దిన
ఆశ్రయ ఆశ్రమాలే
మనిషిని ప్రేమించే మహనీయ
ఆశయ సంపదల ఆనవాళ్ళే కాదా
మనసున్న మనసులు వెలుగు దివిటీల
మార్గదర్శనమై దారిచూపుతూ
కుటుంబాలకు సంజీవనులు ఈ ఆశ్రమాలు
పిల్లల బతుకులు సంక్షుభితమయినపుడు
గుప్పెడు ప్రాణాల్ని నిల్పేవి
ఈ ఆశ్రమ దేవాలయ గోపురాలే కదా
వృద్ధాప్యాన్ని భయపెట్టి మనమే
పిల్లలమై చలాకీగా ఆశ్రమాల
నీడన బతుకు నీడుద్దాం
మన పిల్లల ఆక్రమందనల ఆక్రోశాల్ని
'త్యాగ' వికాసంతో అణచివేద్దాం!

- చిన్ని నారాయణ రావు
94402 02942



# అప్పుడప్పుడు ...

అప్పుడప్పుడు
నాకు నేను దొరకకుండా పోతాను
కట్టు తెంపుకున్న దూడలా
నా నుంచి నేను పారిపోతాను

ఏదో పాత దుఃఖం
గోరుచుట్టై పోటు పెడుతూ ఉంటుంది
గతపు జ్ఞాపకమేదో
తప్పులను ఎత్తిచూపుతూ ఉంటుంది
పక్కనున్న పెదవి
తేనెటీగై కుట్టి ఫక్కుమంటుంది
అందమైన గులాబీ సైతం
ముల్లై పొడుస్తుంటుంది
మోయలేని బరువేదో గుండెల మీదకెక్కి
మరింత కుంగదీస్తుంది!

ప్రతి క్షణం పదును కత్తై దిగబడి
దిగులు గుబులు రేపుతుంది
గాయాలన్నీ విచ్చుకుని గోల చేస్తుంటాయి

అప్పుడే
నా నుంచి నేను
కాస్త దూరం జరుగుతాను
అక్షరాలతో మనసును కడుక్కుని
తేటపడి ... నింపాదిగా
నన్ను నేను చేరుకుంటాను
హృదయానికి కొత్త బట్టలు తొడిగి
మళ్ళీ చందమామను చేస్తాను!

- పద్మావతి రాంభక్త
99663 07777



# తీర్పు చెప్పే రోజు

- కుమార్ కూనపరాజు
99899 99599

**ఉ**దయం 11 గంటలు అవుతోంది. అప్పటికే వాతావరణం ఉక్క బోస్తోంది. గాలి కదలడం లేదు. బ్రిటీష్ కాలం నాటి నల్ల రాతి పలకలతో కట్టిన పాత భవనం మౌనంగా విచారంగా నిలబడి వుంది. ఆవరణ అంతా పాత చెట్ల నీడలు పరుచుకున్నాయి. నేరేడు చెట్టు మీద కాకి ఉండి ఉండి అరుస్తోంది. జాగర్తగా వింటే పిచ్చుకల కువకువలు కూడా వినపడతాయి.

'ఇంకెంతసేపు పడుతుంది?' అని అడిగాడు సుందర్, కానిస్టేబుల్ ప్రకాశాన్ని. 'చెప్పాను కదా సార్.. ఈరోజు తీర్పు ఇచ్చేస్తారు. బెంచ్ మీదకి పిలవరు సార్. మనకు సాయంత్రం అవ్వొచ్చు' అన్నాడు తాపీగా. 'మీరు బయటకు వెళ్లి ఆ చెట్ల కింద ఎక్కడైనా కూర్చోండి సార్' అన్నాడు ప్రకాశం.

ఉస్సూరుమంది ప్రాణం. బతుకు ఇన్ని మలుపులు తిరుగుతుందని ఊహించలేదు సుందర్. కోర్టు ఆవరణలో పడిగాపులు పడాల్సి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. 'ఏమి చేస్తాం! కష్టం వచ్చి మీదపడ్డాక అనుభవించాల్సిందే.' అని నిట్టూరుస్తూ, కొంచెం దూరంగా వున్న చెట్ల కింద వున్న సిమ్మెంట్ బెంచీల దగ్గర చోటు చూసుకొని కూర్చున్నాడు.

సుందర్‌కు ఇప్పుడు మధ్య వయస్సు. ఊళ్ళో వ్యవసాయ కుటుంబం. చదువుకొన్న తరువాత హైదరాబాద్‌లో మంచి ఉద్యోగంలో చేరాడు. కొంతకాలానికి వ్యాపారం కూడా ప్రారంభించాడు. తండ్రి ఊళ్ళో పరపతి కలవాడే. కొంత కాలానికి ఆయన పోవడంతో పొలాలు చూసుకోవడానికి తప్పనిసరిగా ఊరు రావాల్సి వచ్చింది. పొలాలు అమరకానికి ఇచ్చి, అమ్మను తీసుకొని హైదరాబాద్ వెళ్లిపోదామనుకొన్నాడు. కానీ ఆరోజుల్లోనే కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు వచ్చాయి. ఊళ్ళో జనం చాలామంది వచ్చి 'మీ నాన్నగారికి మంచి పేరుంది. మిమ్మల్ని సొసైటీ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవం చేసుకొంటాం' అని బతిమాలారు. తను ఎటూ తేల్చుకోలేక తటపటాయిస్తూ ఊఁ అన్నాడు.

కానీ తరువాత ఎన్నికలు వచ్చాయి. ఇక తప్పదుగా.. ఎన్నికలు కోలాహలంగా జరిగాయి. గొప్ప మెజారిటీతో గెలిచాడు. డబ్బు కూడా తీసుకోకుండా ఓట్లేసిన జనం అభిమానానికి పొంగిపోయాడు. వారి ఆశలను కొంతైనా తీర్చాలనిపించింది. సొసైటీ సొమ్ముతో అప్పులిద్దామంటే, డబ్బు నిల్వలు తక్కువగా వున్నాయి. జిల్లా సహకార బ్యాంకుకు చాలాసార్లు తిరిగాడు. చివరికి ఎస్‌సి కార్పొరేషన్ లోన్లు కొన్ని మాత్రం తెచ్చుకోగలిగాడు. తన్ను నమ్ముకున్నవారి కొందరికీ లోన్లు ఇవ్వడం కష్టమయ్యింది. స్టాఫ్‌ను గుడ్డిగా నమ్మాడు. కొన్ని అవకతవకలు కూడా జరిగాయి. ఇంకేముంది! ప్రత్యర్థి వర్గాల వాళ్ళు పేపర్లకెక్కారు. అది తిరిగి తిరిగి ఎంక్వయిరీ, తరువాత కేసు దాకా పోయింది. తన టర్మ్ పూర్తి అయ్యిన తరువాత హైదరాబాద్ వెళ్ళిపోయాడు. కానీ మరో పది సంవత్సరాలకు కేసు సెషెన్స్ కోర్టుకు వచ్చింది. అంటే సుమారు పదిహేను సంవత్సరాలకు ట్రయిల్స్ ప్రారంభం అయ్యాయి. కేసు మరో నాలుగు సంవత్సరాలు జరిగింది. ఓపికతో వాయిదాలకు హాజరయ్యాడు సుందర్. ఇప్పుడు జెడ్జిమెంట్ డే వచ్చింది.

తాడేపల్లిగూడెం సెషెన్స్ కోర్టులు, పాత తాలూకా ఆఫీసు ప్రాంగణంలో ఉన్నాయి. ఈ నాలుగు సంవత్సరాల్లో అక్కడ అన్నీ పరిచయం అయ్యాయి. పొద్దుటే గౌతమి ఎక్స్‌ప్రెస్‌కు దిగి రూమ్ తీసుకోవడం, కోర్ట్ టైమ్‌కు అక్కడే ఎదురుగా వున్న అమ్మన్న హొటల్‌లో, కానిస్టేబుల్, పాత సెక్రటరీ, క్లర్క్‌లకు టిఫిన్లు పెట్టించడం, రాత్రికి మరల ట్రైన్‌కు పోవడం అలవాటుగా మారిపోయింది. గవర్నమెంట్ వైపు నుంచి అప్పటి ఉద్యోగస్థులు కొంతమంది చనిపోవడం, మరికొంతమందికి అనారోగ్యాలు, ఇలా సరైన సమాధానాలు చెప్పేవారులేక కేసు వీగిపోయే స్థితికి చేరింది. తనే ఖర్చులు పెట్టుకొని మిగిలిన వాళ్లకు కూడా క్రాస్ ఎగ్జామినేషన్స్ పూర్తి చేయించాడు. కానిస్టేబుల్, పబ్లిక్

ప్రాసిక్యూటర్ వీరందరి సహకారంతో కేసు ఓ కొలిక్కి వచ్చింది. ఈ రోజే తీర్పు ఇచ్చే రోజు. తనపై వున్న ఈ కేసు కొట్టేస్తారనే ధీమా ఉన్నప్పటికీ, ఏదో చిన్న ఆందోళన వెంటాడుతూనే వుంది.

లాయర్ భూషణం గారి జూనియర్ కనిపించాడు. పెద్దాయనికి బాగా లేదని ఇంటికాడే ఉండిపోయారని, కేసు మానేజ్ చేయడానికి కొంచెం ఎక్కువ ఖర్చు అయ్యిందని, రేపు మీతో మాట్లాడతారని చెప్పాడు. ఇప్పటికే చాలా అయ్యింది, ఇంకా ఎంత పిండుతాడో అని భయం వేసింది.

ఓ బెంచీ పైన కూర్చున్నాడు సుందర్. చివర ఎవరో ఇద్దరు ఆడ మనుషులు కూర్చుని ఉన్నారు. వాళ్ళ మాటల్లో తెలుస్తోంది. ఏదో విడాకుల కేస్ అని. అమ్మాయి కళ్ళు లోపలికి పోయాయి. చింపిరి జుట్టు, కమిలిపోయిన శరీరం, నలిగిపోయి మాసిపోయిన నేత చీర, ఎండిపోయిన చెట్టులాగా, దిగాలుగా వుంది. సంకలో పిల్ల. పక్కనే వాళ్ళ అమ్మ, పొట్టిగా నల్లబడిపోయింది, జుట్టంతా ముగ్గుబుట్ట. ఆవిడ ఈ పిల్ల అత్తగార్ని తిడుతోంది. "కట్నాలు దొబ్బి, ఇప్పుడు ఆడపిల్ల పుట్టిందని రాచి రంపన్నపెట్టి బయిటికి గెంటేసారు. ఇదేమి న్యాయం చెప్పండి అయ్య గారూ!" అని సుందర్‌ని అడిగింది ఆవిడ. తనకు ఏమీ చెప్పాలో తెలీక బిక్క మొహం వేసాడు. ఏదో సముదాయించాలనుకున్నాడు. ఇంతలో వాళ్లకు పిలుపొచ్చింది. వాళ్ళు ఆదరాబదరా వెళ్లిపోయారు. సాయంత్రం దాకా సమయాన్ని ఎలా గడపాలి అని సుందర్ అనుకుంటుండగా, తన ఊరువాడే సుబ్బారావు కనిపించాడు.

"అయ్యగారూ తమరు ఇలా ఇక్కడ... " అని ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ఏమీలేదు, అప్పులిచ్చిన లోన్ల గురించి గొడవ. ఈ రోజుతో అయిపోతుందిలే" అన్నాడు సుందర్.

"మరి నీ కేసు ఏమిటి?" అని అడిగాడు సుందర్.

"అన్నదమ్ముల కుటుంబాల మధ్య ఎప్పటినించో తగువులు వున్నాయండి. ఈ సంవత్సరం భోగి రోజున పెద్ద గొడవయి పోయిందండి. ఆడోళ్ళకి మొగోళ్ళకి కూడా తలలు పగిలాయండి.. ఇప్పుడు ఉస్సురుమంటూ కోర్టులు చుట్టూ తిరుగుతున్నామండి. అంతా అరసెంటు స్థలం కోసమేనండి. ఊళ్ళో సరిగా తెర్పుచెప్పే నాథుడే లేడండి." అని తల ఏలాడేసాడు సుబ్బారావు.

"దీనికి తగ్గట్టు నెల కితం నాలుగు పాడి గేదెలను పచ్చగడ్డి కోసమని రెడ్డిసీమ తోలుకెలతన్నానండి. సందటేల లోడు లారీ గుద్దేసిందండి. ఆ నాలుగు అక్కడికక్కడే సచ్చిపోనాయి. నా దశేమి బాలేదండి" అని కళ్ళమ్మట నీళ్లుపెట్టుకున్నాడు సుబ్బారావు.

"సరే ఏమిచేస్తాం.. బాధపడకు.. ఇన్సూరెన్స్ వచ్చిందా!" అని అడిగాడు సుందర్. "లేదండి కట్టలేదండి" అన్నాడు దిగాలుగా. "నువ్వు కట్టకపోయినా లారీకి థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉంటుంది. నా లాయర్‌కి చెబుతా, ఆరోజు కేసు వివరాలు పోలీస్ స్టేషన్‌లో తీసుకొని లాయర్ గారికి ఇయ్యి" అన్నాడు సుందర్.

సుబ్బారావు కళ్ళల్లో మెరుపు.. లాయర్ వివరాలు తీసుకొని దండాలు పెట్టుకుంటూ వెళ్ళిపోయాడు. పక్కూరి ప్రసాద రాజు గారు "ఎంతవరకూ వచ్చిందోయ్ సొసైటీ కేసు?" అని పలకరించారు సుందర్‌ని. "ఏదో సాగుతోందండి!" అన్నాడు ముక్తసరిగా.

"పాత కలెక్టర్, కొల్లేరు అన్సర్వే భూముల్లో చెర్వులు తవ్వామని మాపై కేసులు పెట్టాడు. ఆ గ్రామాల వడ్డీల దగ్గర లీజుకు తీసుకునే తవ్వాం. కొత్త వాడు వచ్చినప్పుడల్లా, పర్యావరణం.. తొక్క.. అని మా చెర్వుల గట్టులు కొట్టేయడం, మా మీద కేసులు పెట్టేయడం మామూలూపోయింది." అన్నాడు చిరాకుగా.

"చదూకున్నోడివి కదా, నీకు తెలుస్తుందిలే!" అని నవ్వేసాడు. ఆయనకో నమస్కారం చేసి భోజనానికి బయలుదేరాడు సుందర్.

ఇంతలో విడాకులు కేసు వాళ్ళు చెట్టు కింద బెంచీ మీద కనిపించారు. "ఈ రోజే తీర్పు ఇస్తారంటండి.. సాయంత్రం దాకా వుండమన్నారండి." అంది ఆ పెద్దావిడ.

"భోజనం చేసారా" అని అడిగాడు సుందర్.

"ఇంటి కాడ్నుంచి తెచ్చుకున్న చద్దన్నం తిన్నామండి" అంది ఆవిడ. ఇంతలో చంటిపిల్ల గుక్కపెట్టి ఏడుస్తోంది. తల్లి జోపెడుతూ దూరంగా తీసుకు వెళ్ళింది. నెమ్మదిగా నడుచుకొంటూ బయటికి వస్తుంటే కానిస్టేబుల్ వచ్చి, సుందర్ చెవిలో గుసగుసలాడాడు. కోడిపందెం గాళ్ళను పట్టుకొన్నారు. పది కోళ్లు కూడా దొరికాయి. లంచ్ సమయంలో పాట పెడతారు. మీరేమైనా పాడుకుంటారా? ఓసారి కోళ్లను చూద్దాం రండి" అన్నాడు.

దూరంగా వేపచెట్టు కింద కట్టేసారు. "ఇవి పీలగా వున్నాయి మామూలు నాటుకోళ్ళే" అన్నాడు సుందర్.

పళ్ళికిలించాడు కానిస్టేబుల్.

"అసలు వాటిని మార్చేసుంటార్లెండి" అన్నాడు.

"బజారులో నాటుకోళ్లు కూడా ఎక్కువ రేటే పలుకుతున్నాయి. మామూలుగా కోర్టు స్టాఫ్ పాడేసుకొంటారు. కానీ జడ్జి గారికి తెలియకూడదు. అందుకే మిమ్మల్ని అడుగుతున్నాను." అన్నాడు.

"నన్నొదిలేయ్ బాబూ. అసలే ఈరోజు తీర్పు ఇస్తున్నారు. ఆవిడ గుర్తుపడితే అంతే సంగతులు" అన్నాడు సుందర్.

"సర్లెండి.. ఎవర్నో చూసుకుంటాలెండి" అని వెళ్లిపోయాడు కానిస్టేబుల్.

భోజనం చేస్తున్నా మనస్సంతా గతంలో జరిగిన ట్రయిల్స్ పైకి మళ్ళింది. రెండు నెల్ల క్రితం రిటైర్డ్ జాయింట్ కలెక్టర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు జెడ్జి గారు. అప్పటికే చాదస్తం వచ్చేసినట్టుంది. పెద్దాయన అనే గౌరవంతో దగ్గర్లో కుర్చీలో కూర్చోబెట్టారు.

"ఈ లోన్లు తీసుకున్న లబ్ధిదారులను మీరు చూశారా?" అని అడిగారు జెడ్జి గారు.

"లేదు.. చూడలేదు" అన్నారాయన.

"మరి మీరు స్వయాన గుర్తించి ఆమోదించి సంతకం చేసారని వుంది ఇక్కడ." అడిగారు జెడ్జి. ఆయనకు కోపం

వచ్చేసింది. "జిల్లాలో కొన్ని వందల ఫైల్స్ సంతకాలు చేస్తాం. వేల లబ్ధిదారు లను గుర్తించడం అసాధ్యం. కింది అధికారులను నమ్మి సంతకాలు చెయ్యడం తప్ప వేరే మార్గం లేదు." అన్నాడు ఆయన కొంచెం స్వరం పెంచుతూ.

జడ్జి గారు కలగచేసుకొంటూ "మీరు స్వయంగా తనిఖీ చేసి ఆమోదించానని సంతకం చేశారు. మీరు పెద్దవారైపోయారు. సాధారణంగా జరిగే ప్రక్రియ గురించి నాకు చెప్పొద్దు. ఇలాగయితే మీరు మరో కేసులో ఇరుక్కుంటారు. ఇక మీరు వెళ్లొచ్చు" అని చికాకు పడింది ఆవిడ.

ఓ రకంగా ఆయనకు సహాయం చేసినట్టు అయ్యింది.

మరోసారి, పిటీషన్ పెట్టిన ఓబులేసు వంతొచ్చింది.

"ఆ ఎదురుగా వున్న మాజీ సొసైటీ ప్రెసిడెంట్, సెక్రెటరీ, గుమస్తా, వీళ్ళు నీకు తెలుసా!" అని జడ్జి అడిగారు. ఓసారి అతను అటు తిరిగి చూసి "తెలియదండి" అన్నాడు. "మరి పిటీషన్ నువ్వే పెట్టావు కదా, ఈ సంతకం నీదేనా?" అని అడిగారు.

"నాకు సంతకం రాదండి" అన్నాడు చేతులు కట్టుకొని, వొంగి వొంగి. జడ్జి గారు చిన్నగా నవ్వుకొని ఏదో రాసుకొన్నారు. బయటికి వచ్చిన ఓబిలేసు సుందర్ దగ్గరికి వచ్చి, "అయ్యా మీకు అన్నాయం చేసానందయ్యా, చెమించాలి. పిల్లలు చదువుకుంటున్నా రయ్యి.. తమరు ఏదైనా సాయం చెయ్యాలండయ్య.." అని పడి పడి నమస్కారాలు చేసాడు.

ఇలా జరిగినవన్నీ ఆలోచిస్తూ కోర్టుకు తిరిగొచ్చాడు. రోడ్డు మీద ఎండ ఎక్కువగా వుంది. చెట్ల నీడల్లో కొంతమంది తిరుగు తున్నారు. వాయిదాలు అయ్యిపోయాక జనం తగ్గారు. మధ్యాహ్నం చాలా భారంగా గడిచింది. సాయంత్రపు నీరెండలు చెట్ల ఆకుల్లోంచి వాలుగా పడుతున్నాయి. ఇతర కేసుల వాద ప్రతి వాదాలు కూడా అయ్యిపోయాయి. చాలామంది వెళ్లి పోయారు. చిరు చీకటి నెమ్మదిగా ఆలముకొంటోంది. లైట్లు కొన్ని వెలిగాయి. ఇంతలో కానిస్టేబుల్ ప్రకాశం వచ్చి "మన కోర్టులో కరెంటు పోయింది. జడ్జి గారు కొవ్వొత్తుల వెలుగులోనే తీర్పు రాస్తారు" అన్నాడు. "సార్ మధ్యాహ్నం రెండు నాటు కోళ్లు నేను తీసుకున్నా సార్.. ఈ తీర్పు అయ్యాకా మా ఇంటికాడ భోజనం చేద్దురు" అన్నాడు.

"నీకో దండం.. ముందు తీర్పు అవ్వనీయవయ్య బాబూ!" అని నమస్కారం చేసాడు సుందర్. రాత్రి తొమ్మిది గంటలకు పిలుపు వచ్చింది. జడ్జి గారి ఛాంబర్‌కు వెళ్లారు వీళ్ళు. ఆమె అందరి పేర్లు కనుక్కొని "మీపై ప్రభుత్వం చేసిన అభియోగాలకు సరైన సాక్ష్యాధారాలు లేకపోవటం వల్ల కేసు కొట్టివేయడమైనది." అన్నారు. వీళ్ళు ఆశ్చర్యం, ఆనందం నుంచి తెరుకునే లోపే "ఇక మీరు వెళ్లొచ్చు, తీర్పు పూర్తి పాఠం మూడు రోజుల్లో కోర్టు గుమస్తా దగ్గర తీసుకోండి." అన్నారు. హుషారుగా బయిటికి వచ్చిన సుందర్ అందరికీ డబ్బు పంచే సరికి నీరసపడ్డాడు.

రాత్రి పది గంటలయ్యింది. రోడ్డుపై రద్దీ తగ్గిపోయింది. బ్యాటరీ లైట్ వెలుగులో ఆపిల్స్, నారింజ పళ్ళు అమ్మే షాపు కనిపించింది. అతన్ని అడిగాడు సుందర్ : "మధ్యాహ్నం కోళ్లు పాడింది నువ్వేనా?" "అవునండి.. కానీ నాకోసం కదండీ.. కోర్టు స్టాఫ్ కోసమండి.. లేకపోతే నా బండి ఇక్కడ పెట్టనివ్వరు కదండీ" అన్నాడు అతను. రోడ్డుకి ఆవల విడాకులు కేసు వాళ్ళు కనిపించారు. అటువైపు వెళ్లి "అరె ఇంకా ఇక్కడే వున్నారు? మీ కేసు తీర్పు వచ్చిందా" అని పెద్దావిడను అడిగాడు. "లేదండి ఇప్పటి దాకా ఉంచి రేపు రమ్మన్నారండీ." అంది ఆవిడ.

"ఇప్పుడు మావూరు బస్సులేమి లేవండి." అంది దిగాలుగా. ఆమె కూతురు, చంకలో వున్న పిల్ల, సుందర్ వంక కళ్ళు పెద్దవి చేసి చూస్తున్నారు. "సరే ఏదైనా ఆటో కట్టించుకొని వెళ్లిపోండి" అని కొంత డబ్బు ఆమె చేతిలో పెట్టి, రూమువైపుకు నడిచి వెళ్ళిపోయాడు.

రాత్రి పదిన్నర అయ్యింది. రైల్వే స్టేషన్‌లో మూడో నెంబర్ ఫ్లాట్ ఫార్మ్‌పై దూరంగా ఓ బెంచీపై కూర్చున్నాడు సుందర్. పెద్దగా ప్రయాణికులు కనిపించడం లేదు. వాతావరణం కొంచెం చల్లబడింది. ఆకాశంలో చుక్కలు విచారం వున్నాయి. తెలియని ఆవేదన సుందర్ మనసులోకి పాకుతోంది. జేబులు కొట్టే సూరిగాడికి సంవత్సరం శిక్ష పడిందంట. మధ్యాహ్నం చీర కొంగులు అడ్డుపెట్టుకొని భయంగా చూస్తున్న ఆ నలుగురు ఆడోళ్ళకి వ్యభిచారం కేసుపై మూడు నెలలు శిక్ష, విటులు మాత్రం డబ్బులిచ్చి జారిపోయారు. అరసెంటు కోసం రక్తాలు చిందుతున్నాయి, చచ్చిపోయిన గేదెల రక్తం నల్లని తారురోడ్డు పై పారుతోంది. ఇంతలో చంటిపాప ఏడుపు.. ఆగని ఏడుపు.. మరోపక్క కొల్లేరును పిండుకొంటున్న రాజుగారి వెకిలి నవ్వు.. మనస్సంతా తుపాను హోరు.. ఇంతలో సెక్రెటరీ భూషణం ఫోను చేసాడు. ఈ సమయంలో ఫోన్ ఏమిటి అనుకుంటూ ఎత్తాడు. "సార్ ఇందాకే మన లాయర్ వెంకటేశం గారు హార్ట్ ఎటాక్ తో పోయారంట. గుమస్తా చెప్పాడు" అన్నాడు భూషణం. "ఇప్పుడేమి చేయగలం. వీలైతే పదకొండో రోజు వస్తాలే" అని ఫోన్ పెట్టేసాడు సుందర్.

మనస్సు కొంచెం ఊరట చెందినట్లు అనిపించింది. ఇంతలో గౌతమి ఎక్స్‌ప్రెస్ వస్తున్నట్లు ఎనౌన్స్మెంట్ వచ్చింది. బెర్త్ మీద పడుకొన్న సుందర్‌కి ఎప్పటికో పట్టిన నిద్ర..

పీడ కల.. ఆ పసిపాప పిచ్చిగా నవ్వుతోంది.. గేదెలు రోడ్డుమీద పరిగెడుతున్నాయి. జేబులు కొట్టేవాళ్ళు తనొంక గుర్రుగా చూస్తున్నారు. నీడల్లో తిరుగుతున్న వేశ్యలు మొఖం మీద పరదా పక్కకు తొలగించి తుపుక్కున ఎర్రని ఉమ్మి ఉ శారు. సుబ్బారావు పడి పడి నమస్కారాలు చేస్తున్నాన్నాడు అందరూ అడుగుతున్నారు, మీద పడి రక్కుతున్నారు. 'మాక్కూడా న్యాయం కొని పెట్టమని.' హఠాత్తుగా మెలుకువ వచ్చింది. మొఖమంతా చెమటలు పట్టాయి. రైలు పోతూనే ఉంది.

■



నేను నేనుగా లేకపోవడాన్ని
గతమనో గందరగోళమనో చెబుతాను
బంధాలు బంధుత్వాలు చీకటి అనీ చెప్పను
వెలుతురు అనీ చెప్పను
నా అసమర్ధతే సత్యమనీ,
నేనొక మూసుకుపోయిన దారిననీ చెబుతాను
ఎంతో ఇష్టాన్ని రాసుకోనూ లేను
ఏ దగ్గరితనాన్నీ పాడుకోనూ లేను
ఏ సమాధానమూ ఉండదు; ప్రశ్నే మిగిలి లేదు ఇక్కడ
కాపాడుకుని ఉండవలసిందని అనుకున్నా, చివరాఖరుకు
వచ్చేసాక ప్రయత్నాలు విఫలఫలాలేనేమో!

❖❖❖

పంజరమూ నవ్వింది, యజమానీ నవ్వాక
పక్షి బిక్కమొకమేసుకునే ఉన్నది
మరి నేను ఇలా అయినా అక్షరాల్లో జీవితాన్ని
బంధిద్దామనుకుంటానా ...!

**- అనూరాధ**

## ఆనవాలు

**ను**వ్వు అలా వెళ్ళిపోవడం దగ్గరే
ఒక్కోసారి ఆగి చూసుకుంటాను
ఆరోజు దగ్గరకే మళ్ళీ మళ్ళీ వస్తాను
అప్పుడు ఉదయం కాఫీవేళనుండే చెయ్యి వణుకుతోంది
సరిగ్గా కప్పు పట్టుకుందామనుకునేలోపే
ఇకముందుటి ఆలోచనల్లో చెయ్యిజారిపోయింది!
పింగాణీ కప్పు ఎన్ని ముక్కలైనదని కాదు కానీ,
లెక్కలేనితనంలోకి ఒక బంధం వెళ్ళిపోవడం
అర్థమవుతోంది!

❖❖❖

అంతా వచ్చారు
గదిగోడలకి వాళ్ళమాటలని పట్టించి పోయారు
ఆరోజు అంతా స్త్రీ ఒక బేలచూపులా
గోడపై చిత్రపటంలా అనిపించింది
ఆ స్త్రీకి హృదయమున్నది, ప్రేమా ఉన్నది
లేనిది కేవలమూ కాఠిన్యం
నేనే ఆ స్త్రీనని జాలిపడినప్పుడు
నా దు:ఖమొక్కటే అక్కడ నిజమని తేలినప్పుడు
నేనున్న పంజరాన్ని ఒకసారి చూసుకున్నాను!

❖❖❖

ఇక, నేను మాత్రమే నిజమని తెలుసుకున్న క్షణాన్ని
ప్రేమించాలనుకుంటాను

## హృదయభూమి



**హృ**దయ భూమి తేమ ఊరి
మట్టి పరిమళంతో నిండితేనే
మమతల మొలకలు మొలిచేది
ప్రేమ పూలగుత్తులు పూసేది..
జీవితం ఆనంద ఫలాలు కాసేది..

తేమెండిపోతున్న హృదయ క్షేత్రాన్ని
తడపడానికి ప్రేమ కరుణ యాగం చేయండి
వడివడిగా ప్రేమ జడివాన కురిస్తే
కరోనా కారుచిచ్చుతో ఎండి బీటలు వారిన
హృదయాలు మమతల మడుగులో మునిగి తేలి
హృదయాలు మట్టి వాసనలు వీస్తాయి
జీవచ్ఛవాలను నిద్ర లేపి ప్రేమ ఊయలలూపి
బతికించి కుంటుతున్న జీవితాలను నడిపించి
నడివీధుల్లో నగారాలు మోయించి హృదయభూమి
మొలకల పున్నమ తిరునాళ్ళను జరుపుకుంటుంది..!

**- డా. విజయలక్ష్మి పండిట్**
**86390 61472**




# బాల గేయాలు
# వినోద విజ్ఞాన కారకాలు

- గొల్ల చక్రపాణి
పరిశోధక విద్యార్థి
తెలుగు శాఖ
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
99633 50973

"**బా**లబాలికల శ్రవణ పఠనాదులకు ఉద్దేశింపబడిన రచనలు బాలసాహిత్యం. ఇది వారు నేర్చుకోదగిన లేదా చదువుకోదగిన లేదా వినదగిన సాహిత్యం." ఇదీ, ఆచార్య ఎం. దేవకి గారి 'బాల సాహిత్యం' గ్రంథంలోని నిర్వచనం. ఆధునిక బాలబాలికలు శ్రవణ పఠనాదులకే పరిమితం కాక ఔత్సాహిక బాలలు వారే కొంత సాహిత్య సృష్టి చేయగలుగుతున్నారు. తెలుగులో కాని, ఇతర భాషల్లో గానీ బాల సాహిత్యం ఎప్పుడు మొదలైందో కచ్చితంగా చెప్పలేం. బాల సాహిత్యం మొదటగా గేయరూపంలో ఉండి జానపద సాహిత్యంలో అంతర్భాగంగా కొనసాగిందని భావించొచ్చు.

ప్రాచీన బాల సాహిత్యం ఆశువుగా పుట్టింది. అందులో బాలలను ఉద్దేశించి పెద్దలు పాడేవి, చెప్పేవే అధికం. దీనికి కారణం మాతృ హృదయం కర్తృత్వం వహించడం. తెలుగు తల్లులు తమ పిల్లలకు ఉగ్గుపాలతో పాటు సంగీత సాహిత్యాలను కూడా రంగరించి పోశారనడానికి అనాదికాలం నుంచి వెలువడిన జోల పాటలు, లాలి పాటలే ముఖ్య నిదర్శనం.

కాలం మారింది. అలాగే సాహిత్యంలో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆంగ్ల భాషా ప్రభావం చేత, రచయితల మౌలిక ప్రయత్నం చేత తెలుగులో 19వ శతాబ్ది ఉత్తరార్థంలో గద్య, పద్య, గేయరూపంగా ఆధునిక బాల సాహిత్యం ఆవిర్భవించి వ్యాప్తి చెందింది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆధునిక బాల సాహిత్యం ఈ దశాబ్ద కాలంలో కొత్త పుంతలు తొక్కిందని చెప్పవచ్చు. బాలలే తమకు ఎలాంటి సాహిత్యం కావాలో వారే నిర్దేశించుకొని కొందరి ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో స్వయంగా పుస్తకాలను వెలువరించడం శుభపరిణామం. ఔత్సాహిక ఉపాధ్యాయులు కొందరు తమ తమ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ సంకలనకర్తలుగా, సంపాదకులుగా ముందుకు వస్తున్నారు. అలాంటి వారిలో పుల్లా రామాంజనేయులు, నీలిమ, తోగట సురేష్ బాబు, గద్వాల సోమన్న, దేవేంద్రప్ప, టి.అంజనయ్య మొదలగువారు ముఖ్యులు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి బాల సాహిత్యం వెలువరిస్తున్న రచయితలలో ప్రముఖంగా డా:ఎం. హరికిషన్, గద్వాల సోమన్న, పుల్లా రామాంజనేయులు, కంచనపల్లి వెంకట కృష్ణారావు, వియోగి, ఆవుల చక్రపాణి యాదవ్, పల్లోలి శేఖర్ బాబు, మురళి ఆకాశ్, కొప్పుల ప్రసాద్ ముందు వరుసలో ఉన్నారు.

బాల సాహిత్యాన్ని రెండు విధాలుగా విభజించవొచ్చు. 1.జానపద బాలసాహిత్యం. 2.ఆధునిక బాలసాహిత్యం. ఈ వైవిధ్యభరితమైన బాల సాహిత్యాన్ని గేయాలు, కథలు, నాటికలు, నీతి శతకాలు, నవలికలు, పొడుపు కథలుగా విభజించుకోవచ్చు.

బాలసాహిత్యంలో వచనం కంటే గేయం పిల్లలను త్వరగా ఆకర్షిస్తుంది. పాటలంటే ఇష్టపడని పిల్లలుండరు. గేయం లయాత్మకంగా పాడుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. పిల్లలకు నీతులు చెప్పాలన్నా, ఆటపాటల గురించి చెప్పాలన్నా, పండగల గురించి, ఆరోగ్యం గురించి మరే విషయం గురించైనా చెప్పాలన్నా గేయ రూపంలో సులభంగా చెప్పవచ్చు.

అల్లరి చేస్తున్న పిల్లలను బుజ్జగించడానికి మాత్రమే బాల సాహిత్యం లేదు. ఆధునిక బాల సాహిత్యం ప్రయోజనాలు విస్తృతమైనవి. పిల్లలను బాధ్యతాయుత పౌరులుగా పెంచడానికి, నీతిమంతులుగా తీర్చిదిద్దడానికి, మాతృభాషను పరిరక్షించుకోవడానికి బాల గేయాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

కోడి పిల్ల కోడి పిల్ల
ముద్దుగుంటది
పట్టబోతె/ కీచుమంటు పారిపోతది

పరుగు పెడుతు
అమ్మ చాటు చేరుకుంటది
ఏమైందని
తల్లికోడి పొదువుకుంటది
దగ్గరికి వెళ్ళామంటె
మనల్ని పొడవజూస్తది
అమ్మ ప్రేమ
అందరికి తెలియజేస్తది.

**– ఆవుల చక్రపాణి యాదవ్, సాక్షి ఆదివారం 18.04.2021**

కవి ఓ పిల్లవాడు చూసిన లేదా అనుభవించిన సన్నివేశాన్ని గేయంగా మలిచాడు. ఈ సంఘటనతో కోడి పై పిల్లవాడికి మొదట వ్యతిరేక భావన ఏర్పడి ఉంటుంది. కానీ చివరి వాక్యం ద్వారా అది అమ్మ ప్రేమ అని, తల్లి సంరక్షణ అలా ఉంటుందని తెలుసుకుంటాడు.

డాక్టర్ ఎం.హరికిషన్ ఉపాధ్యాయుడు కావడం వల్ల చిన్న పల్లెల్లో ఉన్న జానపద గేయాలను పిల్లలనుండి సేకరించి 'పిల్లల జానపద గేయాలు' పుస్తకాన్ని ప్రచురించారు.

'దుబ్బోడమ్మా దుబ్బోడు
దుబ్బా బిస్కెట్ తిన్నాడు
ఇంకా కావాలన్నాడు
అమ్మకు కోపం వచ్చింది
మూడు గుద్దులు గుద్దింది.' ఈ గేయం ద్వారా అతిగా ఆహారం తినరాదని చెప్పే సందర్భంలో పిల్లలు సరదాగా పాడుకునే పాట. నేటికీ పల్లె పిల్లల్లో వినపడుతోంది.

ఆటపాటల ద్వారా అంకెలను నేర్పడం ఒక అలవాటుగా వస్తోంది. ఇందుకోసం ఎన్నో గేయాలున్నాయి. మచ్చుకు ఒకటి.

దోశమ్మ దోశ
వేడివేడి దోశ
అమ్మకు అయిదు
నాన్నకు నాలుగు
అక్కకు మూడు
అన్నకు రెండు
తమ్ముడికి ఒకటి
నాకేమీ లేవు

ఇలాంటి గేయాల ద్వారా పిల్లలు తాము అంకెలు నేర్చుకుంటున్నామని తెలియకుండానే నేర్చేసుకుంటారు. ఇప్పుడు అంగన్వాడీ బడుల్లో జరుగుతుంది ఇలాంటి బోధనే.

ఆరోగ్య సంబంధమైన స్పృహను పెంపొందించడం కోసం..

మల్లయ్య మామ వచ్చాడు
బెల్లం వుండలు తెచ్చాడు
ఈగా, దోమా వాలాయి
దుమ్మూ, ధూళి పట్టాయి
తమ్ముడు నేనూ తిన్నాము
జ్వరమూ, దగ్గూ వచ్చాయి'

పరిశుభ్రంగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తినాలని ఈగలు, దోమలు వాలిన ఆహారాన్ని తింటే రోగాల బారిన పడతామని ఈ గేయం పిల్లలకు చెప్పకనే చెబుతుంది.

నేటి పిల్లల దీనస్థితిని పిల్లలు పాడుకుంటూ ఉండగా విని సేకరించినట్టున్నారు ఈ గేయాన్ని ...

'ఏబిసిడి చదువుల బాధ
పొద్దున లేస్తే ట్యూషన్ బాధ
బడిలోకెళ్తే పరీక్షల బాధ
ఇంట్లోకొస్తే హోంవర్క్ బాధ'

నేటి పిల్లలు అనుభవిస్తున్న పరిస్థితికి అద్దం పడుతుందీ గేయం. ర్యాంకుల వెంట పరుగెత్తించడం కోసం పిల్లలను ఆటపాటలకు దూరం చేస్తున్నారు తల్లిదండ్రులు. చదువు చదువు అని పిల్లల్ని మరయంత్రంలా తయారు చేస్తున్నారు. నైతిక విలువలను, కథలను, గేయాలను నేర్పించడం లేదు. ఇక పెద్దయ్యాక పెద్దవారిపై ప్రేమ ఎలా పుడుతుంది? పైగా పిల్లలకు ఆడుకోమ్మని సెల్ ఫోన్ ఇస్తున్నాము. వారు ఫ్రీ ఫైర్ అని ఎదుటివారిని తుపాకులతో నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తున్నారు. అదే మనసుతోనే పెరుగుతున్నారు. తోటి వారి పట్ల జాలి, దయ, కరుణ ఉండాలని మర్చిపోతున్నారు. అలాంటి పిల్లవాడు పెద్ద యిన తర్వాత తల్లిదండ్రులను చూసుకుంటాడా? పట్టించు కుంటాడా?

ఆరేళ్ల పైబడిన పిల్లల్లో గ్రహణశక్తి అపారంగా ఉంటుంది. లేతప్రాయంలోనే వారి మనోక్షేత్రంలో బాలసాహిత్యం ద్వారా నిజాయితీ, సత్యం, ధర్మం, శాంతి, సహనం, మానవత్వ విలువలు వంటి మౌలిక గుణాలను విత్తనాలుగా నాటాలి. పిల్లలు పెరిగేకొద్దీ ఆ మౌలిక గుణాలు సంస్కార రూపంలో వికసిస్తాయి. అలాంటి బాల సాహిత్యం పిల్లలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే.

లయతో కూడిన గేయం పిల్లలకు కోయిల పాటలా తియ్యగా ఉంటుంది. ఊయల తూగులా హాయిగా ఉంటుంది. అంత్య ప్రాసలతో గద్వాల సోమన్న అలాంటి హాయిని పంచుతూ గేయాల ద్వారా సామాజిక అంశాలను నీతులను బోధిస్తారు.

'అమ్మ జోల పాట
జీవజలపు ఊట
నాన్న మంచి మాట
బతుకుతెరువు బాట' అంటూ నాన్న మాటలు వినమని బోధిస్తారు.

'చెట్లు చిగురిస్తాయి
పూలు వికసిస్తాయి
చెప్పుకో ఏ రుతువు?' అని ప్రశ్నల రూపంలో విజ్ఞానాన్ని బోధిస్తారు. బాలల గేయాల్లో హరికిషన్, గద్వాల సోమన్న ప్రయోగాలు చేసి పుస్తకాలను వెలువరించారు. పిల్లలకు ఒత్తులు

పలకడం కష్టమని, చదువుకోవడం కష్టమని ఒత్తులు లేని గేయాల సంపుటాలు 'రేపటి వెలుగులు', 'మెరుపుల వాన', 'తేనె చినుకులు' లాంటి పుస్తకాలను హరికిషన్ వెలువరిస్తే, ఒత్తులను పిల్లలకు నేర్పించడం కోసం 'ఒత్తులు – గేయాలు' అనే పుస్తకాన్ని గద్వాల సోమన్న వెలువరించారు.

ఉదా : 2మచ్చల ఆవు వచ్చింది
పచ్చిక కొంత మేసింది
ముచ్చట వేసి వెళితే
అచ్చట నుండి కదిలింది.'

పిల్లలు కష్టపడకుండా సులభశైలిలో ఒత్తులు నేర్పిస్తారు గద్వాల సోమన్న. ఆవుల చక్రపాణి గేయాల్లో మరో వైవిధ్యం కనబడు తుంది. పిల్లలకు వినోదంతో పాటు విజ్ఞానం కూడా అవసరమని ప్రతి గేయంలో వినిపిస్తారు.

'తుంపర చినుకులు కురవంగా
సరిగ్గా సూర్యుని ఎదురుంగా
ఇంద్రధనస్సు పుట్టు సుందరంగా
అవనికి అందం ఇచ్చునుగా..' ఈ గేయంలో ఇంద్రధనస్సు ఎలా పుడుతుందో తెలియజేస్తారు. 'నది – నడక' గేయంలో నది ఎలా పుడుతుందో చిన్న చిన్న పదాలతో వివరించారు.

'దారులు ధారలు కలిసేను/ పెద్ద కాలువలయ్యేను
కాలువలన్నీ కలిసేను/ వాగు వంకగా మారేను
వాగులు వంకలు ఏకమై/ సెలయేరులా ఉరికేను
ఉరికే నీటి గలగలలే / నదిలా ప్రవాహమయ్యేను.' ఇలా నీరు కొండకోనల నుంచి ధారలుగా పడుతూ నదిలా మారే విధానాన్ని కళ్ళకు కట్టింపజేస్తారు.

'రంగుల జెండా ఎగిరింది/ గాలికి రెపరెపలాడింది
ఎన్నడు తరగని దేశభక్తిని / గుండెలనిండా నింపింది.' గేయంతో పిల్లల్లో దేశభక్తిని రగిలింపజేస్తారు.

'అవయవమ్ములు లేని అవిటి వాళ్లను గాంచి
అల్లరి చేయకు పాపా
అందముందని అందరి యెదుట
అహమును చూపకు చిట్టీ' అంటూ అవిటివారిపట్ల చులకన భావం ఉండకూడదని హెచ్.జి.పద్మావతి తన గేయంలో తెలిపారు.

'పసి పిల్లలనెందుకు పనికి
పంపుతూ హింసిస్తున్నారు? బాల్యంలోనే
బానిసలుగా మారుస్తున్నారు
బిడ్డల భవితను బూడిద చేస్తున్నారు.' అంటూ బాల కార్మిక వ్యవస్థ ఉండకూడదని పిల్లల భవిష్యత్తును నాశనం చేయవద్దని తన 'శిశు వికాస గీతాలు'లో తెలియజేసారు జె.ఎస్.ఆర్.కె శర్మ.

బాల సాహిత్య పఠనం పిల్లల్లో ఊహాశక్తిని పెంచుతుంది. అదివారి విద్యాభ్యాసానికి ఉద్దీపనగా ఉపయోగపడుతుంది. విద్యార్థి సొంత ఆలోచనలతో ముందుకు వెళ్లడానికి దారిని చూపుతుంది. మరి విద్యార్థులే రచయితలైతే, చిట్టి చిట్టి మెదడులకు పని పెడితే, చిన్నచిన్న చేతులకు సాన పెడితే చరిత్ర తిరగరాయొచ్చని 'చిట్టి చేతులు – గట్టి రాతలు', 'సంకల్పం', 'అంకురం', 'దేశమంటే' మొదలగు సంపుటుల ద్వారా పిల్లల చేత గేయాలు రాయించి నిరూపించారు కొందరు ఉపాధ్యాయులు.

పిల్లలు ఎంత తెలివైనవారో, ఎంతటి వైవిధ్యం చూపిస్తారో 'దేశమంటే' పుస్తకంలోని గేయాలను చూస్తే అర్థమవుతుంది. జెండా ఇతివృత్తంగా తీసుకొని ఏడుగురు బాలలు వివిధ రకాలుగా రచించారు

'మూడు రంగుల జెండా
ముచ్చటైన జెండా
మూడులోకాల జెండా
మూడు రంగులున్న జెండా' అని ఎనిమిదో తరగతి అమ్మాయి అనిత రాస్తే,

'జెండా పండుగ వచ్చింది
బహుమతులెన్నో తెచ్చింది
ఆహ్లాదంతో ఆడండి
ఆడుతు పాడుతు మెలగండి.' అని ఎం.రుతిక రాసింది.

'జెండా అమ్మ జెండా
అశోక చక్ర జండా
వీరుల నెత్తురు జెండా
స్వాతంత్రపు జెండా' అని అమీర్ వీరత్వాన్ని ప్రదర్శించాడు.

ఎస్.ఏ.పి క్యాంప్ మున్సిపల్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి పి.లిఖిత.. 'ఆకాశంలో ఉంది చుక్క/ వీధిలో ఉంది కుక్క
నేను చేస్తాను లెక్క / నాకెంతో ఇష్టం అక్క
నేను నాటుతాను మొక్క' అంటూ అంత్యప్రాస పదాలతో తన ఇష్టాన్ని గేయం అల్లింది.

బాల సాహిత్య వికాసానికి నేడు సామాజిక మాధ్యమాలు ఎంతో దోహదపడుతున్నాయి. వాట్సాప్, ఫేస్బుక్, యూట్యూబ్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి.

ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బాలల అకాడమి ఉండేది. బాలసాహిత్య గ్రంథ ప్రచురణ చేపట్టి బాల్యానికి, భాషకు పట్టం కట్టేది. మళ్ళీ ఆ సంస్థ ప్రాణం పోసుకోవాలి. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి. ప్రస్తుతం పాఠశాలల్లో 'ఆనంద వేదిక' అని ఒక ప్రోగ్రాం మొదలుపెట్టారు. కానీ ఆచరణలో నీరుగారిపోయింది.

జిల్లాలో బాల సాహిత్యం విరివిగా వెలువడుతూ బాల బాలికల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుంది. అయితే ఈ రచనలు పిల్లలకు చేరుతున్నాయా? పిల్లలు చదువుతున్నారా? అన్నది సందేహం. పిల్లలకు బాలసాహిత్యాన్ని అందుబాటులో ఉంచితేనే అన్ని రంగాల్లో వారు ముందుకు సాగిపోగలరు.

■



# ఏది రాయకూడదో తెలియడానికి కూడా విస్తృత అధ్యయనం అవసరం

**- ప్రముఖ కవి శిఖామణి**

**'దళిత రచయితలెవరూ దళిత సాహిత్యం కలకాలం ఉండాలని కోరుకోవడంలేదు. వారు ఆశించేది దళిత పీడన లేని సమాజం' అన్నారు ప్రముఖ కవి, ఆచార్యుడు శిఖామణి (కర్రి సంజీవరావు). కవి, రచయిత డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య 'సాహిత్య ప్రస్థానం' తరపున శిఖామణితో ముచ్చటించారు. ఆ ముఖాముఖి ఇదీ ...**

**మీ బాల్యం, విద్యాభ్యాసం గురించి క్లుప్తంగా చెప్పండి.**

మాది కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంలోని అంబేద్కర్ నగర్. మా చిన్నప్పుడు దానిపేరు ఆదియాంధ్రపేట. మాది మధ్య తరగతి పేద కుటుంబం. పురిటిలోనే మా అమ్మగారు చనిపోతే మా నాన్న స్నేహితుడైన రత్నశిఖామణి గారు మా కుటుంబాన్ని సాకారు. ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియేట్ వరకూ నా చదువు యానాంలోనే సాగింది. కాకినాడ పి.ఆర్.కళాశాలలో బి.ఏ స్పెషల్ తెలుగు, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ., పిహెచ్.డి చేశాను.

**తెలుగుపై మీ ఆసక్తికి కారణం?**

చిన్నప్పుడు నన్ను పెంచిన రత్న శిఖామణి గారు చందమామ వంటి పత్రికలు గుణించుకుంటూ చదివేవారు. రాత్రి భోజనాలకు ముందు ఊర్లో ఉన్న పెద్దలు భారత, భాగవత కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు చెప్పేవారు. నవరాత్రుల్లో ప్రదర్శించిన పౌరాణిక జానపద నాటకాలు, మా సన్ థియేటర్‌లోని బ్లాక్ అండ్ వైట్ సినిమాలు... బాల్యం నుంచీ తెలుగుపట్ల ఆసక్తిని పెంచాయి.

**కర్రి సంజీవరావు శిఖామణిగా మారిన నేపథ్యం ఏమిటి?**

పదో తరగతి, ఇంటర్లో ఉండగా ఏవో రాస్తూ కాగితాలు ఖరాబు చేస్తూ ఉండేవాడిని. లావణ్య, శ్రీకాకుళ కలం పేర్లతో కొంతకాలం రాసేవాణ్ణి. ఇంటర్ అయ్యాక నన్ను పెంచిన శిఖామణి గారు ఆకస్మికంగా చనిపోయారు. ఆయనకు కృతజ్ఞతగా వారి పేరులోని 'శిఖామణి'ని నా కలంపేరుగా చేసుకొన్నాను.

**మొదట్లో ఎవరి కవిత్వం మీ మీద ఎక్కువ ప్రభావం చూపింది?**

నిస్సందేహంగా దేవరకొండ బాలగంగాధర తిలక్ కవిత్వం నాపై ఎక్కువ ప్రభావం చూపింది.

**మీరు 'చిలక్కొయ్య'లో 'మగ్గంలో అటూ ఇటూ తిరుగుతున్న కండె నిలువునా రెండుగా చీలుతుందట' అన్నారు. చీలడం అనే మీ ప్రయోగంలోని అంతరార్థం ఏమిటి?**

ఇది 'చిలక్కొయ్య'లోని 'దిశమొల' కవితలోని పదచిత్రం. ఒక మతిస్థిమితంలేని వ్యక్తి నగరంలో నగ్నంగా తిరుగుతుంటే జరిగిన పరిణామాలను చెప్పుకుంటూ వచ్చిన కవిత. అందులో ఒకచోట దేవదేవుని శేషవస్త్రానికి నిప్పంటుకుందని రాశాను. జరగని దానిని జరిగినట్లు చెప్పడం ఈ పదచిత్రంలోని విశేషం. అజంతా ఒకచోట 'ఆరోజుకి పసిపిల్లలు పాలు తాగరు' అంటాడు చెట్లు కాలుతున్న దృశ్యం కవితలో. ఇదీ అలాంటిదే!

**మీ మువ్వలచేతి కర్ర, చిలక్కొయ్యకు తర్వాత దళిత కవిత్వం వేపు మొగ్గు చూపడానికి కారణం?**

మనకు మొదటినుండి కులానికి దళిత కవులు, లింగానికి స్త్రీ రచయితలు ఉన్నారు. అయితే వారంతా మొదటినుంచీ సామాజిక కుదుళ్ళ నుంచి రాయలేదు. అస్తిత్వ ఉద్యమాలు తెరమీదకు వచ్చాక తమ మూలాలు తడుముకోవల్సిన అవసరం వచ్చింది. ఆ అవసరాన్ని మీరు 'మొగ్గ' అనుకున్నా అభ్యంతరం లేదు.

**దళిత సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేసే దశలో కొంత మంది దళిత కవులు నిమగ్నమైనట్టున్నారు?**

పునర్మూల్యాంకనం చేయవల్సింది దళిత కవిత్వాన్ని కాదు;

మొత్తం కవిత్వాన్ని. ఇన్నేళ్ళ తెలుగు సాహిత్యంలో ఖాళీలు, అగాధాలు, లోటుపాట్లు, ఎత్తుపల్లాలు ఎందుకున్నాయో వాటిని పూరించడానికి, భర్తీ చేయడానికి, సరిచెయ్యడానికి ఏం చేయాలో సాహితీవేత్తలు ఆలోచించవలసి ఉంది.

**మీరు 'అశుద్ధ మానవుడు'లో వాడిన భాష అభ్యంతరకరమని, దిగంబర కవిత్వం లాగే ఉన్నదని విమర్శలొచ్చాయి. మీరు ఈనాడు, మీ విధానం ఇప్పటికి సరైనదనే అనుకుంటున్నారా?**

గాలినిండిన రబ్బరు బంతిని ఎంత గట్టిగా నేలకు కొడితే అంత కంటే ఎక్కువగా పైకి ఎగురుతుంది. సాధు జంతువైన పిల్లిని గదిలో పెట్టి కొడితే పులిలా తిరగబడుతుంది. ఎంతటి సౌజన్యమూర్తికైనా ఏదో ఒక సందర్భంలో కోపం రాక మానదు. దీనికి భారతంలో ధర్మరాజే ఉదాహరణ. మనవాళ్ళు వ్యావహారిక భాషను ఆమోదించడానికి మీనమేషాలు లెక్కించారు. ఆ కవిత సందర్భంలో ఆ విధానం సరైనదనే నమ్ముతున్నాను. ఇలాంటి సన్నాయి నొక్కులకే, పైడి తెరేష్‌బాబు 'వాడు తిట్టొద్దంటున్నాడు' కవితలో సమాధానం చెప్పాను.

**మీరు పఠాభి విధానాలు నచ్చి ఆయన మీద పిహెచ్.డి చేశారు. ఆయన 'చిన్నయసూరిని చాల దండిస్తాను', 'పద్యాల నడుములు విరగదంతాను' అన్నాడు. ఈనాటికీ ప్రాచీన సాహిత్యం, చిన్నయసూరి వ్యాకరణమే విశ్వవిద్యాలయాల్లో బోధన జరుగుతూనే ఉంది. దీనిపై మీ వ్యాఖ్యానం?**

సాహిత్యంలో 'పొయిటిక్ జస్టిస్' అనేది ఉంటుంది. ఇది అన్ని భాషల్లోనూ ఉంటుంది. కవి/ రచయిత సాహిత్యం, సమాజం ఎలా ఉండాలో కోరుకునేదే పొయిటిక్ జస్టిస్. అది ఒక్కోసారి నిజం కూడా అవ్వొచ్చు. శ్రీశ్రీ అయినా, పఠాభి అయినా సాహిత్యం లో శృంఖలాలు వద్దని, ఈనాటి అవసరాలకు అనుగుణంగా సాహిత్య రూపాలు ఉండాలని కోరుకున్న మాట అందరికీ తెలిసిందే! ఇక వ్యాకరణం అంటారా అది శాస్త్రం. పదస్వరూప నిరూపణకు, నిర్ధారణకు వ్యాకరణం అనవసరం. వ్యాకరణం తెలియకపోతే నీరు పదానికి ఎన్ని అర్థాలున్నాయో తెలీదు. నా విధానం ఆనాటికి గానీ, ఈనాటికి గానీ సరైనదనే భావిస్తున్నాను.

**వస్తువులో మార్పు లేకుండా కేవలం శిల్పం మార్పుతో దళిత కవిత్వాన్ని నడిపిస్తున్నందువల్ల ఆ సాహిత్యంలో ఒక దశ తర్వాత స్తబ్ధత వచ్చే అవకాశం లేదంటారా?**

ఇది ఒక్క దళిత కవిత్వానికే కాదు. అన్ని ఉద్యమాలకు వర్తిస్తుంది. అయితే దళిత కవిత్వంలో తమ వివక్షకు మతం కారణం కావడంతో అలాంటి వస్తువులో మోనాటనీ కనిపించడం సహజమే! అయితే ప్రతిభ ఉన్న కవులు దాన్ని సులభంగా అధిగమించగలరు.

**'కవిసంధ్య' పత్రిక మీ ఆలోచనేనా? ఆ ఆవిర్భావ విషయాలు కొంచెం చెప్పండి.**

పూర్తిగా నా ఆలోచనే! ఆంధ్రరాష్ట్రం రెండుగా విడిపోయాక, కవిసంధ్య కార్యక్రమాలు పూర్తిగా యానాంకు బదిలీ అయిపోయాయి. ఆ క్రమంలో 2016 దుర్ముఖి నామ ఉగాది ఉత్సవాలను యానాంలో నిర్వహిస్తూ కవిసంధ్య పేరుతో ఒక కవిత్వ బులిటెన్ తేవాలనే ఆలోచన మెరుపులా పుట్టింది. అలా కవిసంధ్య మొదటి సంచిక కందుకూరి ముఖచిత్రంతో, యానాం కవుల సంచికగా వెలువడింది. ఇప్పుడు సప్తమ సంవత్సరంలో అడుగిడి 42వ సంచిక వెలువడుతున్నది.

**మీ సాహిత్య అకాడెమీ సభ్యత్వ కాలం ముగిసింది. మీ భవిష్యత్ కార్యక్రమాలేమిటి?**

అకాడెమీ సభ్యత్వం ఫుల్‌టైం జాబ్ ఏమీ కాదు. అది ఉన్నా లేకపోయినా కవిసంధ్య కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. మొన్న మార్చి 21న 'వరల్డ్ పొయిటీ డే' హైదరాబాదులో ఘనంగా నిర్వహించాం.

**తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయన శాఖలో మీరు చేసిన ప్రత్యేక కృషి గురించి వివరిస్తారా?**

ప్రత్యేక కృషి అంటూ ఏమీ లేదు కానీ, సెమినార్ పేపర్లు సమర్పించినా, విమర్శ గ్రంథాలు ముద్రించినా వృత్తిలో భాగంగానే! అయితే ఆ కేంద్రంలో చేరాక తెలుగు మరాఠీ దళిత కవిత్వంపై సెంట్రల్ యూనివర్సిటీలో తులనాత్మక పరిశోధనలో రెండో పిహెచ్.డి పట్టా తీసుకున్నాను. ఎం.ఫిల్., పిహెచ్.డి అభ్యర్థులకు దళిత సాహిత్యాంశాలు అధిక సంఖ్యలో ఇవ్వగలిగాను.

**'మీరు ఉద్యమ అవసరం తీరాక కూడా కవిత సజీవంగా ఉండాలి' అన్నారు. ఈ కవిత్యోద్యమాల్లో పుట్టిన కవిత్వమంతా అలా సజీవంగా ఉందంటారా?**

సాహిత్యంలో పాపులర్, క్లాసికల్ అనే వర్గీకరణ ఉంది. వస్తు, స్థల కాలాలకు అతీతంగా నిలిచి ఉండేవి క్లాసికల్స్. ఉదాహరణ కన్యాశుల్కం నాటకం. నాటకం సమస్య ప్రస్తుతం సమాజంలో లేకపోయినప్పటికి సాహిత్య రూపంగా నిలిచి ఉంది. పాపులర్ రచనలు అంటే ఏమిటో మనందరికి తెలిసినవే! ఉద్యమ కవిత్వం అలా సజీవంగా లేని మాట వాస్తవమే! నిదానించి రాస్తే ఉద్యమ కవిత్వం కూడా సజీవంగా నాలుగు కాలాపాటు నిలుస్తాయి.

**దళిత కవిత్వం దళితులే రాయాలా? పాల్కురికి, వేమన, వీరబ్రహ్మం వంటి యుగ కర్తలు చేసిన కృషిని ఎక్కడా శ్లాఘించినట్టు కనబడదు.**

అలాగని ఏమీ లేదు. తెలుగు సాహిత్యంలో గొప్ప వైరుధ్యం ఏమిటంటే తొలినాళ్ళలో హరిజనాభ్యుదయం గురించి బ్రాహ్మణులు, స్త్రీజనాభ్యుదయం గురించి పురుషులు రాశారు. దానికి కారణం విద్యాగంధం. సంఘ సంస్కరణ చైతన్యం. దళిత సాహిత్య సృజనకు దళిత జీవితం, దళిత అనుభవం, దళిత సమస్య తెలుసుండాలి. స్వీయానుభవానికి, సహాయ అనుభవానికి మధ్య ఉన్న వ్యత్యాసమే వాటి వ్యక్తీకరణలోను ప్రతిఫలిస్తుంది.

వేమన, వీరబ్రహ్మం, మంగిపూడి వెంకట శర్మ వంటి వారి కృషి దళిత సాహిత్య చరిత్ర, విమర్శలలో నమోదై ఉంది.

**దళిత కవిత్వం సాధించిన విజయాలేమిటంటే మీరు చెప్పే సమాధానం?**

దళిత రచయితలెవరూ దళిత సాహిత్యం కలకాలం ఉండాలని కోరుకోవడం లేదు. వారు ఆశించేది దళిత పీడన లేని సమాజం. అలాంటి సమాజంలో దళితులు, ఆకాశం, సముద్రం, నక్షత్రాలు, పక్షుల గురించి రాస్తారు.

**దళిత కవిత్వం ముందున్న ఉధృతి ఇంకా అదే తీరులో కొనసాగుతోందంటారా?**

దళిత సాహిత్యం మరింతగా ప్రజాస్వామ్యీకరించబడింది. కుసుమ ధర్మన్న, జాషువా, భీమన్న కాలానికి పదుల సంఖ్యలో ఉన్న దళిత సృజనకారులు ఇప్పుడు వందలు, వేల సంఖ్యలో ఉన్నారు. ముందు చెప్పినట్లు గతంలో దళితేతరులు దళితుల గురించి రాస్తే, ఇప్పుడు దళితులు తమ గాయాలను తామే గానం చేసుకుంటున్నారు. దళిత సంబోధనల విషయంలో సభ్య సమాజం ఇప్పుడిప్పుడే మర్యాద నేర్చుకుంటోంది.

**'దళిత కవిత్వంలో జీవన వాస్తవికత గూర్చి చెప్తున్నప్పుడు, దళితులకి చెందిన పదాలు, పదబంధాలూ, నుడికారాలూ రావొచ్చు గాని ఒక ప్రత్యేకశైలి ఉంటుందని దళితులు చెప్పడం సమగ్రతనివ్వదు' అన్న అద్దేపల్లి రామమోహనరావు వ్యాఖ్యకు మీ సమాధానం ...**

అద్దేపల్లి గారంటే నాకు గౌరవమే కాని, దళిత సాహిత్య విషయంలో ఆయన అథారిటీ కాదనుకుంటున్నాను. శివసాగర్ ప్రతిపాదించిన దళిత సౌందర్యశాస్త్ర నేపథ్యం నుంచి దళిత కవిత్వం రాసినప్పుడు ప్రత్యేక శైలి సాధ్యమౌతుంది.

**దళిత సాహిత్యంలో ఇన్ని ప్రక్రియలు వచ్చినా సామాన్యుడి అందుబాటులో ఉన్నది పాట (గేయం) మాత్రమే. అలాంటి పాట పాతబడి కవిత్వం, కథ పరుగులెడుతున్నాయని విమర్శకులంటున్నారు. మీ అభిప్రాయం?**

పాట సామాన్యులది. ఆ మాటకొస్తే నిరక్షరాస్యులది. అది నేరుగా వాళ్ళను తాకుతుంది. మిగతా సాహిత్య ప్రక్రియలు బుద్ధిజీవులవి. పాట పాతబడిందనడం సబబు కాదు. అందుకు గోరటి వెంకన్న, జయరాజులే సజీవ సాక్షులు.

**వర్ధమాన కవులకు మీ సందేశం ఏమిటి?**

సందేశం అన్న పెద్ద మాట వద్దు కాని, సాహిత్యంలో 'ఎక్కువ చదువుకున్నవాడు తక్కువ రాస్తాడు' అని ఒక మాట ఉంది. అందుకని ఎక్కువ చదవమంటాను. సామాజిక మాధ్యమాలు ఉధృతి పెరిగాక చదవనవసరం లేదనే ఒక అభిప్రాయం ఏర్పడింది. 'రామాయణ కల్పవృక్షం చదివి కవిత్వం ఎలా రాయకూడదో నేర్చుకున్నాను' అన్నాడు ఆరుద్ర. రాయడానికే కాదు, ఏది రాయకూడదో తెలుసుకోవడానికి కూడా విస్తృత అధ్యయనం అవసరం. ■

## జనమెరిగిన సత్యం

**అ**రే! వాళ్ళని చూడు
మాటల్ని ఎంత నేర్పుగా తిరగేసి తొడిగేస్తున్నారో!?
అర్థ విపర్యయాన్ని
ఎంత అద్భుతంగా సృష్టిస్తున్నారో?!
అంతర్జాతీయ వ్యాపార దాసత్వాన్ని
దేశీయ 'దాసోహం'గా
సంస్కృత పదబంధాలతో
ఎంత గంభీరంగా ప్రవచిస్తున్నారో!
భారతీయ ధర్మం అట్టేసిన
విషవిపణి పురాణాలను
ఎంత విరివిగా చెలామణీ చేస్తున్నారో!
బతకటానికి జానెడు జాగా దొరక్క
చావు వైపు నడిచే పాదాలకు
నోళ్లు మొలుస్తాయనుకున్నప్పుడు–
మేరువులా చూపిస్తున్న మిథ్యాభివృద్ధి
మంచులా కరిగిపోతున్నప్పుడు–
వాళ్లు పాతిపెట్టిన మానవ హక్కులు
మహావృక్షాలై శాఖిస్తున్నప్పుడు–
వాళ్ళ చేతుల్లో గిరాగిరా తిరుగుతున్న
పూల పొట్లాల్లోంచి
కొత్త సమస్యలు రవ్వల్లా రాలతాయి
అత్యవసరంగా మనదేశం ప్రమాదంలో పడుతుంది
జనం మనసుల్లో
సరికొత్త గాయాల సలపరింతలు మొదలౌతాయి!

అరెరే అటు చూడు!
వాళ్లు మాటల మంత్రజలాన్నీ
మనపై సంప్రోక్షిస్తున్నారు
అయ్యో! మనంతట మనమే
యూపస్తంభంపై తలఉంచి దిలాసాగా ఉన్నాం.
వాళ్లు
ప్రబోధించిన యుద్ధ వ్యూహనిర్మాణం పనిలో
మనం తలమునకలై ఉంటాం
రాజదండం కుర్చీల ఆటలో
మరో వంచనాప్రణాళికను రచిస్తూ ఉంటుంది.
ఇది జనమెరిగిన సత్యం!
ఐనా ఎందుకీ ఖర్మం అంటే
అది ప్రజల ప్రారబ్ధం!

– నందిరాజు విజయ్ కుమార్
95027 60757

## ఎద్దుకొమ్ముున పొద్దును కట్టి...



మొలకు పంచ
భుజాన గావంచ
వొంటిమీద బాడీ
వున్నా ఒకటే
లేకున్నా ఒకటే

❖❖❖

నెత్తినెక్కి కూకున్న
ఎండ కండకావరాన్ని
తుండు గుడ్డతో
ఎండగట్టగల మొండిజీవి!

❖❖❖

తన రెక్కల మీదుగా
ఎన్ని తుపానులు
తోకముడిచాయో
ఆయనొక్కడే లెక్కచెప్పగలడు

❖❖❖

తెగులు దిగులు సోకి
ఏడుపురాగమెత్తుకున్న
మొక్కలను ఎత్తుకొని
చెమట టానిక్కుతో సేద తీర్చగలడు

❖❖❖

జీవకోటి కడుపులో
ఆకలి కాపరముండకుండ
పొలాన కాపలా కాస్తాడు
అప్పులు చేసి
ఎందుకీ పంట తిప్పలంటే
అప్పుల్లేని రైతులు
పుప్పుల్లేని వంకాయలు ఉండవని
ఉపమానాలు చెబుతుంటాడు

❖❖❖

పోయిచోటే వెతకాలంతాడు
రాలినచోటే మొలవాలంటాడు
యెద్దు కొమ్ముకు పొద్దును కట్టి
ఏకువజామున యెనుములతో
ఏలబారుతుంటడు
అరిచేతుల్లో బువ్వపువ్వులై
పూస్తూ వుంటాడు
పంటలు పండని
గుల్లూ గోపురములు
కదిలీ కదలని రాతి విగ్రహాలు
మనసును మురిపిస్తాయేమోగానీ
ఆకలి మంటలు ఆర్పలేవని
చెప్పక చెబుతుంటాడు.

❖❖❖

కళ్ళముందర కదిలే దేవుడు
రైతే కావచ్చని
కవి కంటికి అనిపిస్తుంటాడు!

**- చింతా అప్పనాయుడు**
**94417 13185**

### అత్తివిల్లి శిరీష జ్ఞాపకార్థం కథల పోటీ

**స**మాజంలో ఉత్తమ విలువలు పాదుకోవాలన్న లక్ష్యంతో అత్తివిల్లి శిరీష జ్ఞాపకార్థం శ్రీమతి అండ్ శ్రీ అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం గార్లు కథల పోటీ నిర్వహించాలని సంకల్పించారు. వారి సహకారంతో 'పాలపిట్ట' ఈ కథల పోటీ నిర్వహిస్తోంది. రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఉంటాయి. రూ. 1000 చొప్పున ఐదు కథలకు ప్రత్యేక బహుమతులు ఉంటాయి. కథల పోటీకి పేజీల పరిమితి లేదు. కవర్ మీద అత్తివిల్లి శిరీష జ్ఞాపకార్థం నిర్వహించే కథల పోటీకి అని రాయాలి. కథలు పంపడానికి చివరితేదీ : 30 జూన్ 2023. ఫలితాలు 30 జూలై 2023న వెలువడతాయి. కథలు పంపించాల్సిన చిరునామా : ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, బ్లాక్-6, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044. ఫోను : 94900 99327. email: palapittamag@gmail.com

**- గుడిపాటి, ఎడిటర్, పాలపిట్ట**






# సామాన్యుడి బతుకు పాట ఈ ప్రేమరాగం

- పేపకాయల ప్రసాద్
94907 12967

"పెజలకి ఏం కావాలో తెలియటం లేదు. అన్నిటికీ ఆ సామే ఉన్నాడు. ఆయన కోరుకుంటే ఎలాగోలాగ బతికేస్తాలే! కాని ఆలోచిస్తుంటే ఆ సామిని కూడ ఎవరో నడిపిస్తున్నారేమో అని అనుమానం కలుగుతూంది. లేకపోతే అన్యాయం ఇలా ఎందుకు పెరుగుతోంది బాబూ...?"

బతుకు తెరువు పోయినా – బతుకు మీద ఆశను చంపుకోని ఓ వృద్ధ తోలుబొమ్మలాట కళాకారుడు తన బోటి వారికి జరుగు తున్న అన్యాయం గురించి మరొకరితో మొర పెట్టుకున్నప్పటి మాటలివి. ఆ పాత్ర నోట ఈ మాటల్ని పలికించిన రచయిత కుమార్ కూనపరాజు. 15 కథల స్వీయ సంకలనంగా 2022లో ఆయన వెలువరించిన రచన 'ప్రేమరాగం వింటావా?'. అతి సామాన్యుల, బలహీనుల జీవితాల్ని దగ్గర నుంచి చూపించిన ఓ మంచి పుస్తకమిది. 'అన్వీక్షికి' ప్రచురణగా వెలువడిన ఈ పుస్తకం లో 9 కథలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పశ్చిమ గోదావరి గ్రామీణ ప్రాంతాల నేపథ్యంలో సాగుతాయి. మిగిలినవి ఎక్కడ జరిగినా – అన్నీ సామాన్యుల బతుకు పోరాటాలనే ఆవిష్కరిస్తాయి.

కొల్లేరు ప్రాంతంలో రొయ్యల చెరువులు కాపలా కాస్తూ పిట్టల్ని కొట్టి బతికే విబ్రో – ఆ చిన్నిపిట్టల స్వేచ్ఛను అడ్డుకుని, తాను వాటిని వేటాడినట్టే – తమ బతుకుల్ని కూడా యజమాని సాయిరాజు ఏదో ఒకరోజు వేటాడతాడని అర్థమయ్యాక అతడి చెర నుంచి బయటపడటం – తొలి కథ 'బుడబుచ్చ కాయలు' లోని ఇతివృత్తం. విబ్రో శ్రమతో పాటు అతడి భార్యను సైతం సాయిరాజు కబళించిన సన్నివేశాలు – సీతాకోకచిలుక సినిమాలో శరత్ బాబు పోషించిన 'డేవిడ్' పాత్రను గుర్తుచేస్తాయి. చెరువు మీదుగా ఎగిరే పరజ బాతుల్నే కాదు; బలహీనుల్ని కూడా కాల్చుకు తినగల పెట్టుబడిదారీ వర్గానికి ప్రతినిధిగా సాయిరాజు కని పిస్తాడు. బడిలో చదివే రోజుల నుంచి బతుకులో స్థిరపడిన కాలానికి పాత జ్ఞాపకాల్ని పదిలంగా పయనింపజేసిన ఓ మంచి కథ 'హిందీ టీచర్'. తరగతిలో ఎపుడూ సీరియస్‌గా కనిపించే హిందీ టీచర్ జీవితంలో భర్త రూపంలో దాపురించిన విషాదాన్ని ఈ కథలో చిత్రించారు రచయిత. ఈ సంపుటిలోని 'మేపుల్ ఆకులు', 'శాంతాదేవి' మనస్తత్వ శాస్త్ర ప్రాధాన్యం ఉన్న కథలు. ఓ రాజకీయనాయకుడి చేతుల్లో తన తల్లి అనుభవించిన లైంగిక దాడి, హింస – తన జీవితంలోనూ ఎదురవ్వడంతో, మానసిక రోగిగా మారిన 'గీత'– ట్రీట్మెంట్ కంటే విలువైన ఆత్మీయతను 'ప్రియ' నుంచి పొంది, మళ్ళీ మామూలు మనిషై భవిష్యత్తుపై ఆశ పెంచుకున్న కథ 'మేపుల్ ఆకులు'. తనను సరిగా పట్టించుకోని భర్తకు – కొడుకుకి మధ్య నలిగిపోయి, తాను కనబరిచిన ప్రేమ తనవారి నుంచి కరువవ్వడంతో డిప్రెషన్‌కు గురై చనిపోయిన స్త్రీ కథ 'శాంతాదేవి'.

పరిచయం ప్రేమగా మొగ్గ తొడిగి, పుష్పించక ముందే రాలిపోయిన వృత్తాంతం 'కడలి అంచున పిట్ట'లో కనిపిస్తుంది. పార్కులో మోదుగుపూల చెట్టు కింద పరిచయమైన ఓ మూగయువతి నిశ్శబ్దంలో ప్రేమరాగాన్ని ఆస్వాదించిన ఓ యువకుడి కథ 'ప్రేమరాగం వింటావా?'. తక్కువ మాటల్లో ఓ కథను ఎంత అందంగా చెప్పవచ్చో ఈ కథ చదివితే తెలుస్తుంది. ఈ రెండూ ఈ కాలపు ప్రేమకథలు. మొబైల్ ఫోన్ చాటింగ్‌తో 'కడలి'లాంటి అమ్మాయిల్ని ట్రాప్ చేసి, ఆ అమ్మాయి కంటే 'బెటర్ చాన్స్' వస్తే – ప్రేమిస్తున్న యువతికి సింపుల్‌గా 'సారీ' చెప్పేసి, బ్రేకప్ చేసుకునే 'సన్నీ' ('కడలి అంచున పిట్ట') లాంటి యువకులు ఇపుడు చాలాచోట్ల కనిపిస్తారు.

లక్షలు చేతులు మారే కోడి పందేల్లో – రోషానికి పోయి, ఉన్నదంతా పోగొట్టుకున్న ఓ మధ్య తరగతి కుటుంబీకుడి కథ 'కోడిపందెం' కాగా; గోదావరి పల్లెల్లో ముప్పయ్యేళ్ల కిందటి, దీపావళి వేడుకల సన్నాహాన్ని, సందడిని కళ్ళకు కట్టినట్లు చూపించిన కథ 'తారాజువ్వలు'. ఈ కథలో తారాజువ్వల పాళ్ళు ఎవరికీ చెప్పని వీరాస్వామి లాంటి వాడు – అప్పట్లో

వీథికొకడైనా ఉండేవాడు. సోవియట్ పేపర్లతో గుల్లలు తయారు చేయడం, దీపావళి తర్వాత మిగిలిన మందుల్ని నాగుల చవితికి దాచుకోవడం లాంటి విశేషాలు పాఠకుల్ని అమాంతంగా బాల్యం జ్ఞాపకాల్లోకి లాక్కొని పోతాయి.

పేదరైతులు సబ్సిడీలో గేదెల్ని కొనుక్కోవాలని ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బుతో– గేదెల్ని కొనకుండా– ఐదేసి వేలు రైతులకిచ్చి, మిగిలిన డబ్బును సొసైటీ స్టాఫ్, కార్పొరేషన్ ఎలా నొక్కేసారో ఆసక్తికరంగా చెప్పే 'గేదెలు కొల్లేరెల్లాయి' కథ ఆకట్టు కుంటుంది. ఊళ్లన్నీ మహా శ్మశానాలై సంపన్నులు సామాన్యులూ అనే తేడా లేకుండా బతుకులు చావుకంపు కొట్టేలా హడలగొట్టిన కరోనా మహావిపత్తుని చూసి చలించని హృదయం లేదు. కరోనా కాలం నాటి బీభత్సాన్ని కళ్ళకు కట్టినట్లు కుమార్ రాసిన కథ 'ఆ రాత్రి తెల్లారేనా!'. ఈ కథనో, ఇలాంటి వాటినో చదువుతున్న ప్పుడు – వందల కరోనా చావుల్ని, అంతులేని దుఃఖాన్ని చూసి చూసి హృదయం కరడుగట్టేసిన ఇప్పటి వారికి పెద్దగా ఏమీ అనిపించకపోవచ్చు కాని మరో పదేళ్లు గడిచిన తర్వాత మారే కొత్త ప్రపంచానికి– ఆ విపత్తు భయంకర స్వరూపాన్ని కళ్లకు కట్టి చూపుతాయి.

సాహిత్య సేవనాన్ని ఓ వ్యాపకంగా మార్చుకుని, నిరంతరం సభలు, వర్కుషాపులూ, మేటి రచయితల అనువాదాలూ వంటి బృహత్తర కార్యక్రమాలెన్నో భుజాన వేసుకుని ప్రపంచంలో ఎపుడూ ఏదో ఒకమూలకి తిరిగే రచయిత కుమార్ వంటి వారికి అకాడమీ అవార్డుల లోగుట్టు బాగా ఎరుకే! ఈ నేపథ్యంలోనే కవుల్లో కొందరికి 'అవార్డు పిచ్చి' ఎంతగా ముదిరిపోయి ఉందో; ఆ అవార్డుల వెనుక రాజకీయాలు ఎలా ఉంటాయో అధిక్షేప హాస్య ధోరణిలో రాసిన కథ 'అకాడమీ అవార్డు' ఆలోచింపజేస్తుంది. ఈ కథలోని శ్రీనివాస్ పాత్రలో చాలామంది రచయితలే కనబడుతు న్నారని అన్నారు రచయిత్రి కాత్యాయని. తిరునాళ్ళు జరిగినన్నాళ్లూ పల్లెల్లో నాటకాలు, జానపద కళారూపాలూ ప్రదర్శించే పాత రోజుల్ని గుర్తుకు తెచ్చే ఓ మంచికథ 'తోలుబొమ్మలాట'. ఈ పుస్తకంలో భిన్నమైన కథల్లో ఇది ఒకటి. తోలుబొమ్మలాట పైనే ఆధారపడి బతికే ముసలివాడు తన కళకు ఆదరణ లేక రికార్డింగ్ డాన్సు చేయాల్సి రావడం– ప్రజల అభిరుచుల్లో వచ్చిన మార్పును సూచిస్తుంది. ఉత్సవ కమిటీ అన్యాయం వల్ల దిక్కులేని చావు చచ్చింది తోలుబొమ్మలాట వృద్ధుడొకడే కాదు; ఆ కళకూ అదే దుర్గతి పట్టిందన్న సందేశాన్ని ఈ కథ ద్వారా చెప్పారు రచయిత.

మనం చదివిన కొన్ని కథల్లోని పాత్రలు మన జ్ఞాపకాల్లో నిలిచిపోయి, ఎప్పటికీ వెంటాడుతూ ఉంటాయి. ఈ పుస్తకంలోని 'విబ్రో' (బుడబుచ్చ కాయలు), తోలు బొమ్మలాట వృద్ధుడి పాత్ర అలాంటివే. 'శ్రీలక్ష్మి పేరు మార్చుకొంది' కథలో మేరీగా మారిన శ్రీలక్ష్మి, 'తీతువుపిట్ట పాట'లోని యెస్తేరు రాణి పాత్రలను రచయిత ఉదాత్తంగా తీర్చిదిద్దిన తీరు బాగుంది.

అత్తమామల సాధింపుల్ని, మొగుడి ప్రేమ రాహిత్యాన్ని భరించలేక – 'ఆడపిల్ల పెళ్ళి తప్పనిసరిగా చేసుకోవాలా' అని అమ్మను అమాయకంగా అడిగిన శ్రీలక్ష్మి – మేరీగా మారి, భర్త తోడు లేకపోయినా – టీచర్‌గా, హెడ్ మిస్ట్రెస్‌గా, హక్కుల ఉ ద్యమ నాయకురాలిగా ఎదిగి, తనలాంటి ఎందరికో ఆలంబన అవుతుంది. 'మనం కొంచెం లొంగితే ఈ సమాజం మనను కిందికి ఈడ్చేస్తుంది. గట్టిగా నిలబడాలి. ధైర్యంగా ఉండాలి.' అని కూతురికి ధైర్యం చెబుతుంది మేరీ. ఓ చక్కని నవలగా రాయగలిగే అవకాశం ఉన్న కథ ఇది. తాగుబోతు మొగుడు పెట్టే బాధలు భరిస్తూ తాపీ పనికి వెళ్లే యెస్తేరు రాణి కష్టాలు చూసి, కరిగిపోయిన మేస్త్రీ సతీశ్ తాను ఆమెకి తోడవుతానని ముందుకు వచ్చినా – ప్రలోభ పడకుండా తన కాళ్ళమీద తానే నిలబడి కూతురును పోషించుకోవడం 'తీతువుపిట్ట పాట'లోని ప్రధానాంశం. 'ఉన్న బంధాలు తెంచుకుని కొత్త వాటి కోసం ఎతుక్కోవడం ఎందుకో సరిగా అనిపించటం లేదు' అని రాణి – సతీశ్‌తో అన్న మాటలు ఆమె ఆలోచనల్లోని పరిపక్వతను చాటుతాయి. ఈనాటి సంఘంలో తప్పుదారి పడుతున్న ఎన్నో జంటలకు కనువిప్పు కలిగించగల అక్షర సత్యాలు ఈ మాటలు. అశుభానికి ప్రతీకగా భావించబడే తీతువు పాట రాణి జీవితంలో కొత్త అవకాశాలకు ద్వారాలు తెరిచి, శుభాలు కలిగించిందని ప్రతీకాత్మకంగా చెప్పారు రచయిత.

'కుమార్ చెప్పిన కొన్ని కథలు సంక్షిప్తీకరించిన నవలల్లా గుంటాయి' అన్నారు ఈ పుస్తకం తొలి పలుకుల్లో ప్రముఖ రచయిత మధురాంతకం నరేంద్ర. మరో కథారచయిత ఉణుదుర్తి సుధాకర్ చెప్పినట్టు– ఈ సంపుటిలో చివరి కథ 'సులేమాన్ కారు'కు ఒక ఉత్తమ నవలగా రూపొందే స్థాయి ఉంది. ఊళ్ళో చైతన్యం కోసం పనిచేసినా, తమలో ఒకడిగా కాక పరాయివాడిగానే, ఓ సాయిబు గానే ఊరివారు చూసిన చిన్నచూపు భరించలేక, స్వదేశంలోనే ప్రవాసిగా బతకలేక ఊరు విడిచి వెళ్ళిన అహ్మద్ .. పరాయి దేశంలో స్వమతస్థుల మధ్యనే ఉన్నా– తాను కోల్పోయిందేమిటో తెలిసికొని, తిరిగి మాతృదేశానికి వచ్చి 'మతాల మధ్య స్నేహం కోసం పనిచేసే సంఘాల్లో ఉంటూ తలిదండ్రుల్ని చూసుకోవాలని అనుకోవడం' ఉదాత్తంగా ఉంది. ఈ సంపుటిలోని 'ఆ రాత్రి తెల్లారేనా' ఓ ప్రత్యేక కథగా భాసిస్తుంది. ప్రధాన కథాంశమైన తేజు – వెంకట్‌ల ప్రేమ, కరోనా కల్లోలంతో పాటు సమాంతరంగా రొయ్యల చెరువుల బాబ్జీ, పాత ప్రెసిడెంటు, మందువా లోగిలి పెద సుబ్బరాజు వంటి వారి సంగతుల్నీ ఒడుపుగా కథనం చేశారు రచయిత.

ఈ కథలు చదువుతున్నప్పుడు పాఠకులకు నిడమర్రు, గూడెం, భీమవరం, ఉండి, ఎండగండి, పందికోడు వంతెన, సంగపాలెం, బాడవ – ఇలా దాదాపు 20కి పైగా పశ్చిమ గోదావరిలోని ప్రాంతాల పేర్లు ఆయా కథల్లో తారసిల్లి రచయితకు ఆ ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని చాటిచెబుతాయి. మాతృభూమిపై రచయితకున్న ఈ మమకారమే ఆయనను

అమెరికా నుంచి ఈ గడ్డకు మళ్ళీ రప్పించి ఉంటుందేమో! తన ఊరికి వెలుగులు పంచాలని అమెరికా విడిచి వచ్చేసిన వీరాస్వామి (తారాజువ్వలు) పాత్రలో రచయితే కనిపిస్తారు. ఇదే కథలో తన పిల్లల్ని న్యూయార్క్ స్టీవెన్సన్ హైస్కూల్లో చదివిస్తున్న అవినాశ్ కూడా చిన్ననాటి దీపావళి గుర్తుకు రాగానే సొంతూళ్లో వాలిపోతాడు.

ఉండి రోడ్డులో రైల్వే ట్రాక్ పక్కన సిమెంట్ దిమ్మల పైన సాహిత్య చర్చలూ, మెహిదీపట్నం రూమ్‌లో విరిసిన సాహితీ సౌరభాలు, రసవత్తరంగా సాగిన కవిత్వ ముషాయిరాలు (‘ అకాడమీ అవార్డు’లో) సైతం రచయిత స్వానుభవాలుగానే స్ఫురిస్తాయి. అర్ధ శతాబ్దానికి పైబడిన గతకాలపు సంగతుల్ని గుర్తుకు తెచ్చే ఈ కథల్లో – ఒంటెద్దు గూడు బండి, సైకిల్ డాక్టర్, తోలుబొమ్మలాటలు, నాటకాలు, రికార్డింగ్ డాన్సులు, మండువా లోగిళ్లు – ఈ తరానికి తెలియని పాత రోజుల్లోకి పాఠకుల్ని తీసుకువెళతాయి.

మధురాంతకం నరేంద్ర గారన్నట్లు– రొయ్యల మిషన్లు, ఆ మిషన్లను బాగు చేసేవారు, చెరువుల కాపలావాళ్లు, మేత వేసే వాళ్ళు, చేపల వలల్ని లాగేవాళ్ళూ, పిట్టల వేటగాళ్ళు, డ్రైవర్లు, క్లీనర్లు, ఆటోలూ ఈ కథల నిండా కిక్కిరిసి కనబడతారు. తప్పనిసరై పంటపొలాన్ని రొయ్యల చెరువులుగా మార్చేసిన రైతులు, పంటపొలం చెరువుగా మారిపోయి, కౌలుకు తీసుకుందామన్నా పొలం దొరక్క కూలిపనికి పోయే రైతులు, చెరువు గట్లపై కొబ్బరిచెట్లు, చెరువులపై అల్లిన వలదారాలు – ఇక్కడి జనజీవనాన్ని పాఠకుడి ముందు ప్రత్యక్షమయ్యేలా చేస్తాయి. డేగ, పరజ లాంటి పందెం కోళ్ళు, పై పందేలు, వీధుల్లో తారాజువ్వల పోటీలు, చిరంజీవి పాటలు, తాటాకు ఉట్టెలు, ఉమ్మెత్త కాయల దీపాలు, చింతతోపు చీకట్లో మసకలాడుకునే దెయ్యాలు... ఈ కథల్లో ప్రత్యేకంగా కనిపిస్తాయి, వినిపిస్తాయి. క్వాజ (తూర్పు గోదావరిలో ‘కోస’ అంటాం.) మాంసం వేపుడు, రావల పులుసు, తణుకులో దొరికే పందూరోరి మామిడిపళ్ళు లాంటి ఎన్నో రుచులు చాలా కథల్లో నోరూరిస్తాయి. *అకాడమీ అవార్డు, ఆ రాత్రి తెల్లారేనా?* మొదలైన కథల్లో కథాగమనంలో భాగంగా రచయిత చేసిన చక్కని వర్ణనలు రా.వి.శాస్త్రి కథల్లో వచ్చే వర్ణనల్లాగ అనిపిస్తాయి.

చిన్నతనం నుంచి కమ్యూనిస్టు భావాలున్న ఈ రచయిత సహజంగానే బడుగుల పక్షపాతి. కాబట్టి ఈ కథల నిండా సామాన్యులే తారసపడతారు. ఈ కథల్లోని స్త్రీలు కన్నీళ్లు కార్చి, క్రుంగిపోయే బేలలు మాత్రం కాదు. హిందీ టీచర్, గీత, కడలి, శ్రీలక్ష్మి (మేరీ), యెస్తేరు రాణి మొదలైన పాత్రలు – కష్టాల నుంచి ధైర్యంగా ముందడుగు వేసి భవిష్యత్తు మీద ఆశతో బతకాలనుకుంటారు.

‘సామాజిక అసమానతలు, వాటికి తోడ్పడే చెడ్డ ప్రభుత్వాలే పేదరికానికి మూలకారణం’ అంటాడు కోలిన్ పావెల్ అనే అమెరికన్ రాజనీతిజ్ఞుడు. పీడితులు అనుభవిస్తున్న దుఃఖానికి మూలాలు సామాజిక అసమానతల్లోనే ఉన్నాయన్న విషయాన్ని ఈ కథల ద్వారా విశదం చేసారు రచయిత. మరి ఈ సమస్యలకి పరిష్కారం ఎలా లభిస్తుంది? వీటికి రచయిత సూచించిన పరిష్కారం ఈ కథల్లోనే దొరుకుతుంది.

‘కర్మఫలం అనుభవించక తప్పదు’ (ప్రేమ రాగం వింటావా!) లాంటి పెసిమిస్టిక్ మెసేజలిచ్చే స్వామీజీలు, మనని పట్టి పీడించే కష్టాల సైతానుని ఏమీ చేయలేక దీనంగా చూస్తూ ఉండిపోయే దైవాల వల్ల సమస్యలు తీరవు! (తీతువుపిట్ట పాట)

‘మనిషి స్వేచ్ఛగా, శాస్త్రీయంగా ఆలోచించాలి. (శాంతాదేవి) చేదు జ్ఞాపకాలను పాత ఆకులుగా రాల్చి, కొత్త ఆకులను ఆశలుగా తొడుక్కోవాలి. అందుకు మన లోపలి శక్తి చాలకపోతే – ప్రకృతి నుండి స్వీకరించి, సాటి మనిషి తోడ్పాటుతో ముందుకు అడుగులు వేయాలి.’ (మేపుల్ ఆకులు)

రా.వి.శాస్త్రి, ప్రేమ్ చంద్, ఆంటోన్ చెకోవ్‌లను తన త్రిమూర్తులుగా భావించే రచయిత కుమార్ గారి వ్యక్తిత్వం మీద, రచనల మీద ఆ మహా రచయితల సంయుక్త ప్రభావం కనిపిస్తుంది. అదే ఈ కథల్లోనూ ద్యోతకమవుతుంది. ఉణుదుర్తి సుధాకర్ అన్నట్లు – ‘రచయిత స్వానుభవమే ఈ కథల ప్రత్యేకత, వాటి వెనుక ఉన్న చోదక శక్తి. దానికి ప్రజా పక్షపాతాన్ని జోడిస్తాడితడు.’

ఈ సంపుటిలోని ‘సులేమాన్ కారు’ కథలో ఒక పాత్ర ఇలా అంటుంది : ‘చైతన్యం కలిగించే పని ఒకరోజు ఃతో ముగిసేది కాదు. ఎప్పటికప్పుడు జనంలో పని చేస్తూ ఉండాలి.’ ఈ స్పృహ ఉన్నవారు కనుకనే ఖర్చుకు వెరవకుండా – ఓ పెద్ద సంస్థ చేయవల్సిన పనిని తామొక్కరే మీద వేసుకుని, ప్రజా చైతన్యం కోసం ప్రపంచ స్థాయి ఉత్తమ సాహిత్యాన్ని పాఠకులకు అందించే పనిలో ఉన్నారు ఈ రచయిత. ఈ కృషి జయప్రదం కావాలని, ఇలాంటి ఉత్తమ శ్రేణి రచనలు మరిన్ని వారి నుంచి రావాలని కోరుకుందాం. ■


## దీపావళి కథల పోటీ- 2023

**గు**రజాడ ఫౌండేషన్ (అమెరికా) ప్రచురిస్తున్న చారిత్రిక త్రైమాస అంతర్జాల తెలుగు పత్రిక ‘ప్రకాశిక’ దీపావళి కథల పోటీ నిర్వహిస్తోంది. ప్రథమ బహుమతి : రూ. 1,500, ద్వితీయ బహుమతి : రూ. 1,000, తఅతీయ బహుమతి : రూ. 500. ఆన్లైన్‌లో సమర్పించిన రచనలు మాత్రమే పరిశీలించబడతాయి. https://www.prakasika.org కి పంపండి. అచ్చుతప్పులు సరి చేసి పంపించండి. కథల నిడివి 900 పదాలకి మించకూడదు. కథలు పంపించడానికి చివరి రోజు : 15 ఆగస్టు 2023.



# రాష్ట్రపతిని విస్మరించి రాజదండ ప్రతిష్ట

- తెలకపల్లి రవి

**దే**శ ప్రతిష్టకు ప్రతీకగా నిలవాల్సిన పార్లమెంటు భవన సముదాయం ప్రారంభోత్సవాన్ని ఏకపక్ష వ్యవహారంగా మార్చడం ప్రధాని నరేంద్రమోడీకే చెల్లింది. ఇరవైకి పైగా ప్రతిపక్షాలు హాజరు కాబోమని ప్రకటిస్తే కనీసం సంప్రదింపులకు కూడా ప్రయత్నించని అప్రజాస్వామిక పోకడలు దేశం ఎప్పుడూ చూసివుండదు. ఈ మధ్యనే లోక్‌సభ మాజీ కార్యదర్శి పిడిటి ఆచారి ప్రసంగాన్ని అనువాదం చేసినప్పుడు ఆయనో మాట చెప్పారు. నెహ్రూ హయాంలోనూ, తర్వాత చాలా కాలం కూడా పార్లమెంటులో ఉద్రిక్తత వస్తే ప్రతిపక్ష నాయకులను పిలిచి చర్చించి ఏదో ఒక పరిష్కారం చేసేవారట. ఎందుకంటే సభ జరిగేలా చూడటం ప్రభుత్వాధినేత అయిన ప్రధాని బాధ్యత. కర్తవ్యం కూడా. మోడీ హయాంలో పార్లమెంటును ఒక తంతులాగా మార్చి పెత్తనం చేయడమే గాని ఎన్నడూ రాజ్యాంగం, సంప్రదాయం రీత్యా వ్యవహరించింది లేదు. కీలకమైన కాశ్మీర్ అంశం లాటిదాన్ని కూడా హఠాత్తుగా తెచ్చి మమ అనిపించడం తప్ప ముందుగా చర్చించే సాహసం ప్రజాస్వామ్య స్పృహ లేవు. నోట్ల రద్దు, ఎన్ఆర్‌సి వంటివాటిపై చర్చలకే అవకాశమివ్వని నిరంకుశత్వం ఈ సర్కారుది. అదే ఇప్పుడూ ప్రత్యక్షమవుతున్నది. అసలు న్యూ విస్తా పేరుతో నూతన భవన సముదాయాన్ని కట్టాలన్న నిర్ణయమే ఏకపక్షమైంది. దేశమంతా కరోనా మహమ్మారితో కలవరపడుతున్నప్పుడు తీసుకున్నది. చారిత్రకంగా కొనసాగుతున్న గొప్ప నిర్మాణాల స్థానంలో తన ముద్ర కోసమే అవసరం లేకున్నా లూట్యాన్స్ ఢిల్లీని మోడీస్ ఢిల్లీగా మార్చడమే ఏకైక లక్ష్యంగా ఈ తతంగం తలపెట్టారు. కోర్టుల్లో కేసులూ నడిచాయి. సాంకేతిక కారణాలతో అనుమతి సంపాదించి పూర్తి చేశారు. నూతన భవనంపై జాతీయ చిహ్నమైన మూడు సింహాల ప్రతిష్టాపన కూడా ఇలాగే హఠాత్తుగా ఒంటరిగా కానిచ్చేశారు. ఆ సింహాలు గతంలో వలె గంభీర ప్రసన్నంగా గాక క్రోధంగా ఉండటం మరో చర్చకు దారితీసింది. దానిపై విమర్శల తర్వాత పూర్తిస్థాయి ప్రారంభోత్సవానికైనా పునరాలోచించుకొని అందరినీ కలుపుకుపోయే బదులు దీనికీ తనే ఏకైక కర్త కర్మ క్రియగా కానిచ్చేయడం మోడీకే చెల్లింది!

### రాష్ట్రపతి రాజ్యాంగ పాత్ర

పార్లమెంటు అంటే అన్ని పార్టీల సభ్యులూ వుండే వేదిక. రాజ్యసభ అయితే రాజ్యాంగ పరంగా రాష్ట్రాల సభ. కాని మోడీ సర్కారు దీనిని కేవలం ప్రభుత్వ వ్యవహారంగా మార్చేసింది. అలాగే ప్రారంభోత్సవ కార్యక్రమంపై విమర్శ వచ్చింది ప్రతిపక్షాల గురించి కాదు, రాష్ట్రపతి గురించి. భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం పార్లమెంటు ఉభయ సభల ఏర్పాటుకు, ప్రారంభానికి, ప్రోరోగ్ (నిరవధిక వాయిదా)కు ఎన్నికలకూ కర్త రాష్ట్రపతి. రాజ్యాంగంలో 3, 111, 274 అధికరణాలు రాష్ట్రపతి అధికారాలను స్పష్టంగా పేర్కొంటున్నాయి. 79వ అధికరణం ప్రకారం రాష్ట్రపతి, సభ్యులు కలిస్తేనే పార్లమెంటు. పార్లమెంటు ఏర్పాటు, గడువు ముగిసిన తర్వాత లేదా ప్రభుత్వం కోరితే పడిపోతే మళ్లీ కొత్త సభ ఏర్పాటుకు ఎన్నికల కమిషన్‌కు అనుమతి నివ్వడం రాష్ట్రపతి ద్వారానే జరుగుతుంది. ఎన్నికైన సభ్యుల జాబితాను తనకే అందజేస్తారు. 78వ అధికరణం మేరకు పార్లమెంటు ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి సంతకం చేస్తేనే శాసనాలవు తాయి. కనక రాష్ట్రపతి పార్లమెంటుకూ మధ్య సంబంధం విడదీయరానిది. అలాటి రాష్ట్రపతి లేకుండా, కనీసం ఆహ్వానించకుండా పార్లమెంటు నూతన భవనాన్ని ప్రారంభించాలనుకోవడం ఎలాటి ప్రజాస్వామ్య సంప్రదాయం? ఎలాటి రాజ్యాంగ గౌరవం? పైగా ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును తొలి ఆదివాసి మహిళ ఎన్నికగా గొప్పగా ప్రచారం చేసుకున్న మోడీ ప్రభుత్వం ఎందుకు ఆమెను గౌరవించడం

లేదు? ఈ మాట అనగానే అయితే ప్రతిపక్షాలు ఎందుకు ఆమెపై అభ్యర్థిని పెట్టాయని కొందరు ఎదురు దాడి చేయడం మరీ విడ్డూరం. ఆ స్థానంలో ఎవరుంటే వారు రాజ్యాంగ రీత్యా ఆ గౌరవానికి అర్హులు తప్ప ఎన్నికల్లో పోటీ పెట్టడం ఇక్కడ సమస్య కానేకాదు. ఇంకా కొంతమంది ఉదాహరణకు తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాల గవర్నర్‌గా వున్న తమిళిసై సౌందరరాజన్ వంటివారు సచివాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి కెసిఆర్ తనను ఆహ్వానించలేదని పోటీ వాదన తెచ్చారు. సచివాలయానికి, గవర్నర్‌కు మధ్య అలాటి పాత్ర వున్నట్టు రాజ్యాంగం ఎక్కడైనా చెప్పిందా? తలాతోక లేని వాదన తప్ప! ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, మహారాష్ట్ర మాజీ గవర్నర్‌ల నిర్వాకాలను సుప్రీం కోర్టు తప్పు పట్టిన తర్వాత కూడా బిజెపి నియమిత వ్యక్తుల తీరు మారలేదనడానికి ఇదో ఉదాహరణ మాత్రమే!

**ఐక్య నిరసనలో ఎపి అపశ్రుతి**

20కి పైగా ప్రతిపక్షాలు కొత్త పార్లమెంటు ప్రారంభ వేడుకను బహిష్కరించాలని నిర్ణయించడం ప్రతిపక్ష ఐక్యతకూ, బిజెపి నిరంకుశ మతతత్వ రాజకీయాలపై పెరుగుతున్న వ్యతిరేకతకూ అద్దం పట్టింది. కర్నాటక ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన ఆ పార్టీ జాతీయ స్థాయిలోనూ తీవ్ర వ్యతిరేకతకు గురవుతున్నట్టు స్పష్టమైంది. అయితే మరోవైపున పార్లమెంటు భవనం అనేది రాజకీయాలకు అతీతమైన విషయ మన్నట్టు, దాన్ని బహిష్కరించడం అపచారమన్నట్టు ఒక పల్లవి లంకించుకున్నారు. ప్రభుత్వాధినేత అయిన ప్రధాని ప్రారంభిస్తే తప్పేమిటని కొందరు మీడియా వ్యాఖ్యాతలు కూడా వంత పాడారు. ముందే చెప్పినట్టు రాష్ట్రపతిని దేశాధినేత అనీ ప్రధానిని ప్రభుత్వాధినేత అనీ అంటారు. దేశ గౌరవానికి సంబంధించిన సందర్భాల్లో రాష్ట్రపతిని ముందు నిలపడం ఆనవాయితీ. ఎందుకంటే ఆయనను లేదా ఆమెను పార్లమెంటు ఉభయ సభలూ ఎన్నుకుంటాయి. అన్ని రాష్ట్రాల ఎమ్మెల్యేలూ ఓటింగులో పాల్గొంటారు. ఎన్నికైన సభ్యులందరూ పాల్గొనే ఈ ఎన్నిక దేశ సమైక్యత కోణంలో కీలక పాత్ర వహిస్తుంది. కనుకనే రాష్ట్రపతిని గౌరవించడం రాజ్యాంగాన్ని గౌరవించడమవుతుంది. ఆ మర్యాద పాటించని మోడీ ప్రభుత్వాన్ని వదిలేసి బహిష్కరిస్తున్న ప్రతిపక్షాలపై దాడి ఎక్కుపెట్టడం తలకిందులు తర్కం. ఈ సమయంలో ఏపీ ముఖ్యమంత్రి జగన్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుల వైసిపి టిడిపి పార్టీలు రెండూ మోడీకి వత్తాసు నివ్వడం హాస్యాస్పదం. జాతీయ రాజకీయాలపై ఎప్పుడూ పెదవి మెదపని జగన్ ఈ విషయంలో మాత్రం తలకెత్తుకుని ఇలాటి సందర్భాన్ని రాజకీయ భేదాలకు అతీతంగా అన్ని పార్టీలూ పాలు పంచుకోవాలని ప్రతిపక్షాలకు ఉచిత సలహా ఇవ్వడం గమనార్హం. ఇటీవలే మోడీ విజన్‌ను విధానాలను పొగిడి తరించిన చంద్రబాబు కూడా డిటోగా ప్రశంసలు కురిపించారు. ఈ విధంగా అధికారం కోసం పోటీ పడే రెండు ప్రధాన పార్టీలు బిజెపికి మద్దతు పలకడం వారి స్వామి భక్తినే చెబుతుంది. ఇక ఉత్తర ప్రదేశ్‌లో గతంలో చాలాసార్లు అవకాశవాదంగా వ్యవహరించిన బిఎస్‌పి మాయావతి, కర్ణాటకలో లోగడ జట్టుకట్టిన జెడిఎస్ దేవగౌడ కూడా కోరి కోరి హాజరయ్యారు. ఒరిస్సా సిఎం నవీన్ పట్నాయక్ వంటివారు ఎప్పుడూ అదే మాటతో ఉన్నారు. ఇలాంటి వైఖరి లౌకిక విలువలకోసం జరిగే రాజ్యాంగ గౌరవం కోసం జరిగే పోరాటంలో ఒక అపశ్రుతి.

**ఎక్కడిదీ రాజదండం?**

మిగిలిన అనేక మతతత్వ పోకడలు, నిర్ణయాలు పక్కన పెట్టి ఈ ప్రారంభోత్సవంలోనూ మోడీ ప్రభుత్వం మత రాజకీయాలనే ప్రదర్శించింది. హిందూత్వ సిద్ధాంత కర్త గాడ్సే గురువు సావర్కర్ జయంతి నాడు ఈ ప్రారంభోత్సవం పెట్టడం వ్యూహాత్మక సంకేతమే! రాజదండం (సెంగోల్) ఉదంతం ఇందుకు మరో ఉదాహరణ. గతంలో ఎన్నడూ పెద్దగా చెప్పుకోని ఈ రాజదండం కథను తవ్వి తీయడం ద్వారా బిజెపి హిందూత్వ సిద్ధాంతానికి పెద్దపీట వేస్తోంది. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వారి నుంచి భారతీయులకు అధికార మార్పిడి జరిగేప్పుడు తమిళనాడులోని తిరువాదుత్తురై అధీనం అనే మఠం నుంచి ఈ రాజదండం కానుకగా సమర్పించబడింది. దాన్ని ఆ ఆశ్రమ ప్రతినిధులు ప్రధాని నెహ్రూకు అందిస్తున్న చిత్రాలు కూడా ఆనాడు వచ్చాయి. అయితే అదేదో స్వాతంత్ర సాధనకు అధికార మార్పిడికి సంకేతంగా ఇచ్చినట్టు పేర్కొనే ఆధారాలే లేవు. అలా చూసిన చెప్పిన సందర్భాలూ లేవు. హోంమంత్రి అమిత్ షా అకస్మాత్తుగా దీన్ని ప్రస్తావించినపుడు నాయకులూ పాత్రికేయులూ కూడా ఆశ్చర్యపోయారు.

అధికార మార్పిడికి ఏదైనా లాంఛనప్రాయమైన సంకేతం వుంటుందా అని మౌంట్ బాటన్ అడిగితే నెహ్రూ మొదటి గవర్నర్ జనరల్ రాజాజీని సంప్రదించినట్టు ఆయన తమ స్వరాష్ట్రమైన మద్రాసు నుంచి దాన్ని తెప్పించినట్టు అమిత్‌షా కథ చెబుతున్నారు. ఈ రాజదండాన్ని మొదట మౌంట్‌బాటన్‌కు ఇచ్చి తర్వాత నెహ్రూకు అందజేశారని కథ చెబుతున్నారు. దాన్ని పార్లమెంటు భవనంపై శాశ్వతంగా ప్రతిష్టించుతామని కూడా కేంద్రం ప్రకటించింది. బ్రిటిష్ చక్రవర్తితో సహా దేశదేశాల రాజులు పట్టాభిషేకాల సమయంలో ఈ తరహా దండం ఒకటి రాజగురువు నుంచి తీసుకునే పద్ధతి వుంది. కాని అది ప్రజాస్వామంలో ప్రజల ఆమోదం తప్ప అలాటి

## రైలు పట్టాలు

పట్టాలకెప్పుడూ నిజానికి కునుకే పట్టదు
తమ భుజాలపైన ఆశల మూటల్ని
సజావుగా దరికి చేర్చే దాకా
దిగాలుగానే ఉంటాయి

మానవ తప్పిదమో
పాలకుల నిర్లక్ష్య ఫలితమో
వేల గూళ్ళని ఒక్కవేటున
నేలమట్టం చేసినప్పుడు
కలల దేహాల్ని శకలాలుగా
తమ పైకి విసిరేసినపుడు
పట్టాల గుండె కోత
ఓ పట్టాన అర్థం కాదు
మౌనంగా రోదిస్తాయి
చెల్లాచెదురై ధూళి పట్టిన ఆశల్ని
కన్నీళ్ళతో కడిగేస్తాయి

విరిగిన ఆ లోహపు మనసుకి
మిగిలిన ఊరట ఒకటే
పరిచయమైనా లేని ఆర్తులకు
చేయందించగ.. పరుగున వచ్చిన
మానవ ప్రవాహాన్ని గాంచినపుడే.
మానవతా పరిమళాలు తాకినపుడే.

**- డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ,**

**94408 36931**

ఆచారాలేమీ ఉండవు. పైగా లౌకిక విధానం తీసుకున్న భారతదేశంలో అసలే అవకాశం లేదు. భిన్న మతాలతో కూడిన ఈ దేశంలో ఒక మతానికి సంబంధించిన చిహ్నమే ఎలా ప్రభుత్వ చిహ్నమవుతుంది? అంటే ఇది కూడా బిజెపి మార్కు మత రాజకీయాల్లోనూ, తమిళనాడును సంతోషపెట్టే వ్యూహంలోనూ భాగమనుకోవాలి. దీనికి ఆధారాలేమంటే ఆనాడు వెలువడిన ప్రత్యేక సంచికల్లో వుందంటున్నారు. తీరా చూస్తే వాటిలోనూ ఆ మతం ప్రతినిధులు చెప్పిందే వుంది. కనక ఇది కల్పితమనేది సుస్పష్టం. రాజ్యాంగం పార్లమెంటుకు ఇచ్చిన ప్రాతినిధ్య స్వభావాన్ని, దానిలో భాగంగానూ రాజ్యాధినేతగానూ రాష్ట్రపతి స్థానాన్ని మోడీ సర్కారు అగౌరవం పాలు చేసింది. రాజ్యాంగంలో ఏ ప్రస్తావన లేని ఒక రాజదండాన్ని ఆ స్థానంలో ప్రతిష్టించడం దాని రాజరిక స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. మోడీ ఏకపక్ష నిరంకుశత్వానికి నిదర్శనమవుతుంది. ■



## హాఫ్ హార్టెడ్

అప్పుడే విచ్చుకుంటున్న కలల పూలను
కొమ్మలతో సహా కత్తిరించుకుని వెళ్లిపోయావు...
చివుళ్లు వేయని రాతిరి చెట్టుకు
ఎవరో కట్టిన లాంతరులా
నిర్ఘాంత చూపులతో వ్రేలాడుతూ ఉన్నాను...

డైరీలో పేజీలు ఎంత తిరగేస్తూ ఉన్నా
నువ్వు చింపుకు వెళ్ళి పోయిన పేజీ తాలూకు
ఆనవాళ్ళయినా కనిపించటం లేదు
హృదయాన్ని తర్జుమా చేసి నింపేవేమోనని
వెతుకుతున్న...
ఉత్తరం అంతా అస్పష్ట అక్షరాలతో
అర్థం కానీ వాక్యాలతో నిండిఉంది?...
ఏ?
మనసుతో రాయలేదా...?
తీరానికి చేరకుండానే విరిగిపోయిన పడవలా
ముక్కలైన మనసు నీటి మీద తేలుతూ ఉంది ...
పూర్తిగా కాలని కట్టెలా ఆలోచనల నెగళ్లు
ఇంకా మండుతూనే ఉన్నాయి...
పరామర్శ ప్రేమ జల్లు ఒక్కసారి కురిస్తే బావుణ్ణు...
ఉక్కిరి బిక్కిరి అయి, హోరు గీతాన్ని దీర్ఘకవితలా శృతిచేస్తూ
రాత్రి అంతా అలలు అన్వేషిస్తూనే ఉన్నాయి
నువ్వొచ్చే పడవ కోసం ...
కలవక పోయినా ఏ బాధా ఉండక పోవును...!
రెండు మాటలు మాట్లాడి...
అయోమయ తోటలో కళ్లకు గంతలు కట్టి వెళ్ళిపోయావు...
ప్రశ్నార్థకాలు నా ముందు పంక్తులుగా
బారులు తీరిన వేళ
యుద్ధకేతనం ఇప్పుడెవరి మీద ఎగురవేయాలి?

**- దాకరపు బాబూరావు**

**98489 93599**

# వెలుగు రాగాల పాట



లోకం కళ్ళను చీకట్లు కమ్మే యాళ్ల
దీపాలు కనుపాపలను వెలిగిస్తున్న వేళ
ఎవరికి వారే తలుపులన్నీ బిగించుకుని
ఇళ్ళన్నీ ఇరుకుతనంలోకి
సర్దుకుంటున్న సమయాన
దూరాన్నుండి
వెలుగు రాగాన్ని మోసుకొస్తున్నది
ఆ పాట
గాయపడ్డ వెదురు ముక్కకు
ప్రాణం పోస్తున్న పాట
గాలిని మేల్కొలుపుతున్న గానమది

దప్పులో నిద్రిస్తున్న దరువుల్ని
నిప్పులతో కాపి దండోరా వేస్తున్న పాట
కూడలిలో నిలబడింది కాబోలు
ఎలుగెత్తి తన సందేశాన్ని గానం చేస్తున్నది

“మహాజనులారా!
ఎవరి పనులో వారు పడిపోయి
అందరం ఒక్కటయ్యేపనిని మరిచారా?
ఎవరి ఏడుపు వారికుంది కానీ
అందరి కన్నీటికి
కారణాన్ని అన్వేషించారా!
ఎవరింట్లో వాళ్ళు
దీపాలు వెలిగించుకుంటే చాలా ...?
వీధుల్లో పేరుకుపోతున్న చీకటి మాటేమిటి?

నక్షత్రం కాలేకపోయినా
మిణుగురులై నలుగురు కదిలితే చాలదూ
వెలుతురు నెత్తురులో ఉరకలెత్తడానికి
ఐదు వేళ్ళు కలిస్తే
ఆయుధమవుతుందని మరిచారా?
శక్తులను వ్యక్తులుగా విడదీస్తున్న
కుట్రల్ని గమనించలేరా?
మన నవ్వులెందుకు
చెల్లాచెదురవుతున్నాయి
పువ్వులన్నిటినీ దండలా అల్లిన దారం
ఎక్కడో తెగిపోతున్నది
మనసుల్ని కలిపి
ముడి వేసుకుందాం రండి

ఇంకెన్నాళ్ళు
కన్నీళ్ళ ధారావాహికల్ని
ప్రేక్షకుల్లా చూస్తూ ఉందాం
నెత్తుటి వార్తలకు
నిట్టూర్పుల పాఠకులుగా మిగిలిపోదాం?

చాలు చాలు ఇక లెండి
పాదాలకు కవాతులను
పరిచయం చేయండి
శ్వాసకు జ్వలించడం నేర్పండి!

కదలండి
కదిలి కదిలి
కాంతినదులై ప్రవహించండి!
కాలం కథలో
ఎవరి పాత్రను వారు పోషించండహో!....”

❖❖❖

కళ్ళు తెరుచుకున్న
చూపులు వీధిలోకి నడిచాయి
పాట నడిచిన దారి వెంట
వెలుగుతున్న నక్షత్రాలు!

**- రహీమొద్దీన్**
**90108 51085**



# రెండరటి పళ్లు

- వంజారి రోహిణి
90005 94630

**దిం**డుకి ముఖం ఆనించి బోర్లా పడుకున్నా. ఊపిరి ఆగి పోయినట్లయింది. వెనక్కి తిరిగి వెల్లికిలా పడుకున్నా.. ఊహు.. నిద్ర కాదు కదా.. కంటి రెప్ప కూడా వాలడం లేదు. గడియారంలో చిన్న ముల్లు నత్తతో పోటీపెట్టుకున్నట్లుంది. కదలడం లేదు.

భయంతో చెమటలు పడుతున్నాయి. పక్కకు తిరిగి చూసాను. శ్రీవారు శేషతల్పం మీద పవళించిన విష్ణుమూర్తిలా తలకింద చేయి పెట్టుకుని నిశ్చింతగా. కాసింత అసూయ పుట్టింది నాలో.

ఓ దీర్ఘమైన నిట్టూర్పు విడిచి పక్కకు ఒత్తిగిల్లాను. రేపొద్దున ఏమవుతుందో ఏమో? తలుచుకుంటేనే వణుకు పుడుతోంది. బెంగ పెరిగిపోతోంది. ఇప్పుడేమి చేయాలి?

♦ ♦ ♦

'త్రిశంకు స్వర్గం' అంటారు కదా..! అటు స్వర్గం కాదు ఇటు నరకం కాదుట అది. అచ్చం స్కూల్లో ఉన్న ఐదంతస్తుల్లో మా మూడో అంతస్తు లాగా.

నరకం. అంటే... అదే.. కింద రెండంతస్తులు అనుక్షణం హెడ్ మేడం సుభాషిణి పర్యవేక్షణలో ఉండడం వల్ల, ఆ రెండు ఫ్లోర్లల్లో టీచర్లకు అనుక్షణం నరకంలో ఉన్నట్లే.. ఒక్క నిముషం కూర్చున్నా.. 'కూర్చోవడానికి కాదు మీకు జీతాలు' అంటూ క్లాస్ పీకుతుంది. అక్కడ టీచర్లు అలెర్టుగా ఉంటారు. అక్కడ నుంచి హెడ్ మేడం కదిలితే చాలు; వర్తమానాలు అతివేగంగా కోవర్ట్ పిల్లల ద్వారా పై అంతస్తులకు అందుతాయి. పైన నాలుగు, ఐదు అంతస్తుల్లో ఎనిమిది, తొమ్మిది, పది తరగతులు. అక్కడికి మెట్లు ఎక్కి మేడం చేరుకునేలోగా అందరు ఎక్కడివాళ్ళు అక్కడ సర్దుకుంటారు. అది స్వర్గం. ఇక మూడో అంతస్తు ఉందే.. ఇక్కడే అంతా అయోమయం. మా పాలిటి త్రిశంకు స్వర్గం.

మేడం ఎప్పుడొస్తుందో సరిగా తెలియక అప్పటివరకు నిలబడి నిలబడి కాళ్ళు లాగేస్తున్న టీచర్లు ఒక్క క్షణం అలా కూర్చోగానే, మేడం పిల్లిలా అడుగులు వేసుకుంటూ మెట్లు ఎక్కి నేరుగా కుర్చీలో కూర్చున్న టీచర్ క్లాసులోకి వచ్చేస్తుంది. ఇక ఆ టీచర్ పరిస్థితి.. చూడాలి. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన దొంగలా.. పగవాడికి కూడా వద్దు ఆ పరిస్థితి అనిపిస్తుంది. ఈ రోజు మా పుణ్యం పుచ్చి మా టీచర్ల కోవర్టు మునెమ్మ ఆయా వర్తమానం మోసుకొచ్చింది.

"టీచర్.. టీచర్ ..హెడ్ మేడం రౌండ్కు వస్తుందే".

ఆ మాట వినీ వినబడగానే... అప్పటిదాకా టేబుల్ మీద కాళ్ళు చాపుకుని కూర్చుని ఉన్న రోజారాణి టీచర్ గబుక్కున టేబుల్ మీద నా ముద్దుల పెంపుడు కొడుకు నుంచి దూకి కుదురుగా నిలబడి బోర్డు మీద ఏదో రాసేస్తోంది జెట్ వేగంతో మూడో తరగతిలో. మధ్యాన్నం మొదటి పీరియడ్ నుంచి కునికిపాట్లు పడుతున్న సత్యా టీచర్ వాటర్ బాటిల్ తీసుకుని కళ్ళ మీద నీళ్ళు చల్లుకుంటోంది గబగబా. తను దీపావళికి కొన్న అరిటాకు పచ్చ రంగు జార్జెట్ చీరని నాకు చూపించడానికి వచ్చిన శ్రావణి టీచర్ గబుక్కున తన క్లాసులోకి పరుగెత్తింది.

టైం మూడుంబావు అవుతోంది. నాకు కంగారు ఎక్కువ అయింది. మానస టీచర్ ఇంకా మ్యాథ్స్ హోంవర్క్ పంపలేదు నా దగ్గరకు. అది వస్తే కానీ డైరీ రాత సంపూర్ణం కాదు. అప్పుడే ఐదో తరగతి నుంచి లోహిత వచ్చి మ్యాథ్స్ హోంవర్క్ చీటీని నాకు ఇచ్చింది.

నాలుగో తరగతి లోటస్ సెక్షన్లో అరవై మంది పిల్లలకు క్లాస్ టీచర్ని. నలభై మంది పిల్లలు పట్టే గదిలో అరవై మంది. బస్తాలో కుక్కి వాడిపోయిన వంకాయల్లా ఇరుకిరుగ్గా కూర్చుని ఉన్నారు. పొద్దున నందివర్ధనంలా విచ్చుకున్నవాళ్ళు మధ్యాహ్నం అయ్యేసరికి వాడిపోయిన తోటకూర కాడల్లా ఉన్నారు. కోళ్ల ఫారంలో కోడి పిల్లల అరుపులను మించిపోతున్నాయి వాళ్ళ అరుపులు. క్లాసంతా కలయదిరిగి సామ దాన భేద దండోపాయా లన్నీ ఉపయోగించాక క్లాస్ నిశ్శబ్దం అయింది.

ఈ రోజు ఐదు సబ్జక్ట్స్‌లో డైరీవర్క్ రాయాలి. తెలుగులో రెండు సుమతీ శతకాలు, హిందీలో ఐదు గుణింతాలు వర్క్

బోర్డు మీద రాసి వెనక్కి తిరిగాను. కొందరు వేగంగా, కొందరు నెమ్మదిగా డైరీ రాస్తున్నారు. రెండో బెంచిలో చివర కూర్చున్న నా ముద్దుల పెంపుడు కొడుకు 'ముద్దసీర్ అహ్మద్' మాత్రం డైరీలో ఒక్క అక్షరం కూడా రాయకుండా పెన్ పట్టుకుని దిక్కులు చూస్తున్నాడు. వాడి దగ్గరకు పోయి డైరీ రాయడం మొదలుపెట్టు అని గద్దిస్తుండగా.. అదిగో అప్పుడే హెడ్ మేడం క్లాస్ బైట నిలబడి గుర్రుగా చూస్తోంది నా వంక. ఆ చూపులకు శక్తే ఉంటే.. నేనక్కడే మాడి మసైపోదును.

తడబాటు ఎక్కువైంది నాలో. 'ఎంతసేపు డైరీ రాసేది. స్టూడెంట్స్‌ని కంట్రోల్‌లో పెట్టుకోమని రోజు నూరిపోయాలా నేను మీకు..? త్వరగా పూర్తి చేసి స్టడీ అవరుకి కూర్చోబెట్టండి. అప్పుడే టైం ముదుంబావు దాటింది. త్వరగా డైరీ సంతకాలు కానీయండి."

ఉరుములా గర్జించి మెరుపులా మాయమై పక్క క్లాసుకి వెళ్ళింది. పొద్దున్నుంచి ఆవిడ రౌండ్స్‌కి రావడం ఇది నాలుగోసారి. ఉత్త అనుమానపు మనిషి. సిన్సియర్గా పని చేసేవారిని, పని చేయకుండా ఆమె ముందు నటించేవారిని ఇద్దరినీ కలగలిపి అనుమానంగానే చూస్తుంది. అందుకే ఆమె మీద చాలా కోపం టీచర్లకు. కానీ ఏం చేయగలం? ఆమె ముందు కుక్కిన పేనుల్లా పడిఉండాల్సిందే.

ఓ ఐదు నిముషాలకు ఆమె కిందికి వెళ్ళిపోయింది. బతుకు జీవుడా అనుకుంటూ బోర్డు మీద డైరీ వర్క్ రాస్తున్న.

"టీచర్.. టీచర్.. భావేష్ ఏడుస్తున్నాడు"

"ఎందుకట"

"టీచర్.. భావేష్ స్టాప్లర్ పిన్ మింగేశాడట"

దిగ్గున వెనక్కి తిరిగా. చివరి బెంచిలో మధ్యలో కూర్చున్న భావేష్ నల్లమందు తిన్నట్లు ముఖం పెట్టుకుని ఉన్నాడు.

"ఏరా.. పిన్ మింగావా" వెనుక బెంచి దగ్గరకు పరిగెత్తా.

తల అడ్డంగా, నిలువుగా, గుండ్రంగా తిప్పి లాస్యవిన్యాసం చేసాడు వాడు. స్టాప్లర్ పిన్ మింగిన ధాఖలాలేవీ అంటే గొంతు పట్టుకోవడం, నొప్పి అంటూ ఏడవడం ఏమి కనపడలేదు.

"ఏరా కైలాష్..వాడు పిన్ మింగడం నువ్వు చూసావా?"

"టీచర్.. వాడు పిన్ పైకి ఎగరేసి నోటితో పట్టాడు. అది కింద పడింది టీచర్" అన్నాడు కైలాష్. "ఎగరేసినప్పుడు వాడి నోట్లో పడినట్లుంది టీచర్" స్టాప్లర్ మిషన్ని ఒత్తుతూ అన్నాడు వాడికి కుడి పక్క కూర్చున్న అంకిత్. వాడి చేతినుంచి స్టాప్లర్ మిషన్ని లాగేసుకున్నాను విసురుగా

బెంచి కిందకి వంగి చూసాను. చిన్న చిన్న స్టాప్లర్ పిన్నులు చాలా పడివున్నాయి.

"ఏరా భావేష్..! నిజం చెప్పు.. నువ్వు పిన్ను మింగావా" ఆ కాస్త గద్దింపుకే వాడు బిక్కమొఖం వేసి "మింగలేదు టీచర్" అన్నాడు. ఈ సంకట పరీక్ష ఏంటి నాకు. ఓ పక్క స్టడీ అవర్ టైం అవుతోంది. డైరీ రాయడం పూర్తి చేయకపోతే నా పీక పిసుకుతుంది మా హెడ్ మేడం. ఏం చేయాలిరా దేవుడో..మళ్ళీ ఇంకోసారి వాడిని నఖశిఖ పర్యంతరం గమనించాను. పిన్ను మింగాడో లేదో క్లారిటీ వాడికి లేదు. మనిషి చూస్తే బాగానే ఉన్నాడు. నేను గమనించినప్పుడు మాత్రం ఏడుపు ముఖం పెడుతున్నాడు. ఏం చేయాలో తెలియని కంగారుగా ఉంది. ఒక వేళ వాడు నిజంగా పిన్ను మింగి వాడికేమన్నా అయితే..? ఆలోచనలు నన్ను కందిరీగల్లా ముసురుతున్నాయి.

పెద్ద సమస్య వచ్చిపడింది నాకు. వెనక్కి వెనక్కి తిరుగుతూ వాడినే చూస్తూ ఎలాగో డైరీ రాసాను అనిపించాను. డైరీ పేజీలో ఒక్క అక్షరం కూడా పెట్టని ముద్దసీర్ అహ్మద్ డైరీ లాక్కుని వర్క్ రాసేసాను. మూడే మూడు నిముషాల్లో అందరి డైరీల్లో సంతకాలు బరికేసాను.

♦ ♦ ♦

టీచర్లు ఇచ్చిన ప్రాజెక్ట్ వర్క్ కోసం ఇంటర్నెట్ షాపులకు వెళ్లి ప్రింట్స్ తీసుకునే కాలం కూడా పోయి ప్రతి ఇంట్లో కంప్యూటర్లు, లాప్టాప్లు, ప్రింటర్లు వచ్చి చేరేశాయి. ప్రతి ఇల్లు ఒక ఇంటర్నెట్ సెంటర్ అయింది ఇప్పుడు. ప్రతి ఒక్కరి పౌచ్‌లో క్రేయాన్స్, కలర్ పెన్స్, స్టాప్లర్ పిన్స్ ఉంటాయి. ఇప్పుడీ వెధవ పిన్ మింగాడా లేదా ఎట్లా తెలుసుకోవడం? అందరినీ స్టడీ అవర్ కి కూర్చోబెట్టి చదివిస్తూ, మధ్య మధ్యలో భావేష్‌ని గమనిస్తున్నా. వాడు ఓ పక్క అల్లరి చేస్తూనే, మరోపక్క గొంతుని చేత్తో తడుముకుంటున్నాడు దిగులుగా.

నిజంగా పిన్ను మింగాడేమో! వెళ్ళి హెడ్ మేడంకి చెప్పేస్తే.. భూమికను క్లాస్ చూసుకోమని మేడం దగ్గరకు వెళదామనుకున్నా. ఒక వేళ వాడు పిన్ మింగకుంటే..? అనవసరపు అక్షింతలు కదా నాకు. ఎటూ తేల్చుకోలేని డైలమాలో ఉండిపోయాను. అయినా వాడు పసిబిడ్డ. భయపడుతున్నాడు. నేను టీచర్‌నే అయినా, ఆ సమయంలో వాడి పరిస్థితి చూసి నా తల్లి మనసు ఊరుకోలేదు. మళ్ళీ చివరి బెంచి దగ్గరకు వెళ్ళా.

"చెప్పు రా.. నిజంగా పిన్ మింగావా నువ్వు..?" అడిగాను. అప్పటికది వందోసారి వాడిని అడగడం.

"టీచర్.. నాకు సరిగా తెలియడం లేదు. మింగానేమో అని భయం వేస్తోంది" బిక్కముఖం వేశాడు.

"గొంతులో ఇరుక్కున్నట్లు నొప్పి ఏమన్నా ఉందా రా?

"లేదు టీచర్. కానీ పిన్ మింగాననిపిస్తోంది" ఏడవాలా వద్దా అన్నట్లు ఉంది వాడి వాలకం. స్టాప్లర్ పిన్ మింగితే ఏమౌతుంది. గూగుల్ సెర్చ్ చేసి చూద్దాం అంటే సెల్‌ఫోన్ పొద్దునే ఆఫీస్‌లో ఇచ్చేస్తిని. ఇక ఏం చేయాలి? అప్పటికే ఇక్కడ జరిగిన సంగతి గురించి పక్క క్లాసులకి ఉప్పు అందిపోయింది టాయిలెట్ కి పోయి వచ్చే పిల్లల ద్వారా.

శ్రావణి టీచర్ వచ్చి "వాడికి నీళ్లు తాగించండి. పిన్ ఉంటే కడుపులో కొట్టుకుపోయి రేపు పొద్దునే వచ్చేస్తుంది" అని సలహా పడేసి వెళ్ళింది. అప్పటికే రెండు వాటర్ బాటిల్స్ నీళ్లు తాగించా వాడిచేత. పొట్ట ఉబ్బిపోయి వాడు కూడా రెండు సార్లు టాయిలెట్

కి వెళ్ళివచ్చాడు. అయినా అనుమానం చావలేదు నాకు.

ఒక్క క్షణం ఆలోచించాను. అప్పుడు టక్కున వచ్చిందో ఐడియా. చైతు గాడికి మూడేళ్ళప్పుడు కర్పూరం బిళ్ళ మింగేసి ఇంట్లో అందరికీ కంగారు పుట్టించి 'నాకేమో అయిపోతోంది' అంటూ నానా రభస చేసి, అందరినీ డాక్టర్ దగ్గరకి పరుగులు పెట్టించాడు. డాక్టర్ వాడిని పరిశీలనగా చూసి, పొట్ట మీద ఒత్తి, వాడికి ఏం కాదు అని చెప్పి మందులు ఏమి రాయకుండా "ఇంటికెళ్లి వీడికి మెత్తటి అరటిపండు తినిపించండి" అని సలహా ఇవ్వడం, అరటిపండు తిని వాడు నిద్రపోవడం గుర్తుకు వచ్చింది.

భావేష్ గాడి దగ్గరకి వెళ్ళాను. "భావేష్.. చెప్ప రా. ఇప్పుడు ఎలా ఉంది నీకు. కడుపులో నొప్పి ఏమైనా ఉందా..?' అన్నాను నా ఐడియాని అమలుపరచాలని.

వాడు అడ్డంగా తలూపాడు నొప్పి లేదని.

"అయితే ఇంటికెళ్ళాక రెండు మెత్తటి అరటిపళ్ళు తిను. పిన్ ఉంటే వచ్చేస్తుంది రేపు మోషన్‌లో"

ఎందుకైనా మంచిదని ఓ ఉచిత సలహా పడేసాను.

వాడు "అలాగే టీచర్" అని ఆముదం తాగినట్లు ముఖం పెట్టాడు. అంతటితో ఊరుకుంటే బతికిపోదును. కానీ నేను ఒకటి అనుకుంటే జరిగింది ఇంకొకటి.

ఈ ఒక్క ఆలోచన నన్ను ఎన్ని మలుపులు తిప్పుతుందో, ఎన్ని చెరువుల నీళ్లు తాగిస్తుందో ఆ క్షణం నాకు అర్థం కాలేదు.

"భూమికా.. ఐదో తరగతిలో ఉన్న భావేష్ అక్క శృతిని నేను పిలుస్తున్నానని చెప్పి తీసుకురా"

మాట పూర్తిగా వినకుండానే పరుగుతీసింది భూమిక.

ఎద్దు పుండు కాకికి ముద్దు అన్నట్లు, పక్కవాళ్ళ బాధ తమకి ఎంత వినోదం కలిస్తుందో.. భూమిక వెళ్లి ఏం చెప్పిందో భావేష్ అక్కతో పాటు పక్క క్లాసుల టీచర్లు శ్రావణి, శోభారాణి, సత్య తొంగి తొంగి చూసి, వారికి తోచిన సలహా ఇచ్చివెళుతున్నారు నన్ను ఉడికిస్తూ.

"శ్రుతీ..! మీ తమ్ముడు స్టాప్లర్ పిన్ మింగానంటున్నాడు. కాసేపు మింగలేదంటున్నాడు. వాడు పిన్ మింగడం నేనైతే చూడలేదు. వాడి ఫ్రెండ్స్ కూడా సరిగా చెప్పలేకపోతున్నారు. అందుకని ఇంటికెళ్ళాక వాడికి రెండరటిపళ్ళు తినిపించు. ఒకవేళ పిన్ను మింగినా ఏం కాదు"

బొమ్మలా తలఊపి వెళ్ళిపోయింది శృతి. అమ్మయ్య..! మేడం కి తెలియకుండా ఎలాగో మేనేజ్ చేసేసాను. ఈ రోజుటికి గండం గడిచినట్టే! గాఢంగా ఊపిరి పీల్చుకున్నాను. ఏదో జరుగుతుందని సరదా పడిన టీచర్లు ఏమి జరగలేదని నిరాశగా తమ క్లాసులకు వెళ్లిపోయారు.

భావేష్ మాత్రం మహా హుషారుగా, నేను చూసినప్పుడు మాత్రం గొంతు పట్టుకుని బాధగా ఆస్కార్ నటుడిని మించిపోయాడు. అయినా అనుమానం చావక వాడ్ని నఖ శిఖ పర్యంతరం గమనించి, నాలుగోసారి వాడిని నీళ్లు తాగమని చెప్తుండగా లాంగ్ బెల్ మోగింది.

పిల్లలందరూ వెళ్ళాక మెట్లు దిగి ఆఫీస్ రూంలోకి వెళ్ళి అటెండర్ సాయిలుని అడిగి సెల్ ఫోన్ తీసుకుని, హెడ్ మేడం కి గుడ్ ఈవెనింగ్ చెప్పి బయట పడ్డాను. గుడ్ ఈవెనింగ్ చెప్పకుండా వెళ్లిన మాలతీ టీచర్‌కి రేపొద్దున హెడ్ మేడం పీకే క్లాస్ గురించి తలచుకుని నవ్వుకుంటూ పిల్లలతో పాటు హుషారుగా షేర్ ఆటో ఎక్కాను.

చెప్పులు వదిలి ఇంట్లోకి అడుగు పెట్టాను. విపరీతమైన దాహంగా ఉంది. కాళ్ళు కడిగే ఓపిక కూడా లేక కుండలో గ్లాసు ముంచి నీళ్లు తీసుకుని గ్లాసు నోటిదగ్గర పెట్టుకున్నాను.

అంతలోనే 'నిను వీడని నీడను నేనే' రింగ్ టోన్‌లో పాట. ఛీ..ఛీ .. ఈ పాట రింగ్ టోన్గా వచ్చిందేంటి.. ఎవరు మార్చారు. నీళ్లు తాగకుండానే గ్లాసు పక్కన పెట్టి ఫోన్ తీసాను, కాస్త అనుమానంగా. అంతే!

"అసలు నీకు బుద్ధి పనిచేస్తోందా?" ఆటమ్ బాంబ్‌లా పేలింది హెడ్ మేడం గొంతు. నా అనుమానం నిజమైందన్న మాట. ఇక ఈ రోజుతో నాపని అయిపోయింది. ధైర్యాన్ని కూడకట్టుకుని, 'మేడం' మాట తడబడింది నాలిక మెలికపడినట్లు..

"భావేష్‌కి ఏం చెప్పావు నువ్వు..?" నోట్లో ఉన్న కాస్త తడి ఆరిపోయింది.

"మేడం... భావేష్ స్టాప్లర్ పిన్ మింగానని చెప్పాడు. వాడు మింగడం నేను చూడలేదు. కాసేపు మింగానంటాడు. కాసేపు మింగలేదంటాడు. అందుకని.." ఒక్కొక్క మాట కూడదీసుకుని అన్నాను. మాట పూర్తి కాకముందే..

"అందుకని నువ్వు అరటిపళ్ళు తినమని సలహా ఇస్తావా? నువ్వేమైనా డాక్టరువా? వాడు పిన్ మింగినట్లు అనిపిస్తే వచ్చి నాకు చెప్పాలి కానీ రెండరటిపళ్ళు తినమని బోడి సలహా ఎవరివ్వమన్నారు నిన్ను?" ఆమె ముందు నేనుండుంటే నా పీక పిసికేసేదే..

"స్టూడెంట్‌కి ఏమైనా జరిగితే నాకు చెప్పాలనే ఇంగితజ్ఞానం లేదా? వాడికి ఏమైనా అయితే ఎవరు జవాబుదారీ? ఇదిగో భావేష్ వాళ్ళ అమ్మతో మాట్లాడు" మేడం స్వరంలో విపరీతమైన కోపం. నాలో విపరీతమైన దడ.

రాబందును చూసినా పికిలి పిట్టలా వణికిపోతూ సెల్‌ని చెవ్వుకి మరింత దగ్గరగా ఆనించుకున్నాను. అవతల పక్క నుంచి ఎవరెవరివో పెద్ద పెద్దగా అరుపులు, పెడబొబ్బలు, తిట్లు, విపరీతమైన ఏడుపు కలగలిపి వినిపిస్తున్నాయి.

"మేడం.. చెప్పండి. మా భావేష్ లేక లేక మాకు పెళ్ళైన పదేళ్లకు పుట్టిన బిడ్డ. వాడిని మేము ఎంత గారంగా, జాగ్రత్తగా చూసుకున్నాం అనుకుంటున్నారు. వాడు స్టాప్లర్ పిన్ మింగాడా. నిజం చెప్పండి.. మిమ్మలిని ఏమి అనము. చెప్పండి మేడం ఆమె వెక్కుతోంది.

వెనువెంటనే "ఈ ముండలను అడిగేదేంది అసలు. పద

పోలీస్ స్టేషన్ కి పోయి స్కూల్ మీద, ఆ టీచర్ మీద రిపోర్ట్ ఇద్దాం. అప్పుడు నిజం కక్కుతారు" భావేష్ నాన్న అరుపులు అనుకుంటా అవి. ముద్ద ముద్దగా వినపడుతున్నాయి. అతను ఓ సారి మద్యం తాగేసి మేడం మీదకు గొడవకు వచ్చాడు పిల్లల ఫీజు విషయంలో. అతని గొంతు వినగానే నా పైప్రాణాలు పైనే పోయాయి.

వెన్నులో వణకు మొదులైంది నాకు. ఒక్క చిన్న పొరపాటు. వాడు 'పిన్ మింగాను' అన్నప్పుడు వెళ్లి మేడం కి చెప్పి ఉంటే పరిస్థితి ఇంకోలా ఉండేదేమో. ఆమె నుంచి తప్పించుకోవాలని పెనుము మీద నుంచి పొయ్యిలో పడ్డాను ఇప్పుడు.

"భావేష్ పిన్ను మింగడం అయితే నేను చూడలేదు. పిలగాడు బాగానే ఉన్నాడు అని మేడం కి చెప్పలేదు" మాట పూర్తీ చేసేలోగా ఫోన్ కట్ చేసారు .

భావేష్ నిజంగానే పిన్ మింగాడేమో.. వాడికి ఏం ప్రమాదం రాలేదుగా..నా మనసులో ఓ పక్క బాధ, వాళ్ళన్న మాటలకు.. మనసు నిలవలేదు.

పది సార్లు ఫోన్ చేస్తే మేడం ఫోన్ ఎత్తింది. "భావేష్ కి ఎలా ఉంది మేడం ఇప్పుడు " గొంతులో వణకు తగ్గలేదు నాకు.

"నువ్వు చేసిన ఘనకార్యానికి ఎప్పుడూ ఇటు రాని మన కరెస్పాండంట్ సార్ కూడా వచ్చాడు. భావేష్ ని పి.టీ. సారు డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్లాడు"

"మేడం..నేను స్కూల్ దగ్గరకు వచ్చేదా..?" కరెస్పాండంట్ సారు వచ్చాడంటే ఇక ఈ స్కూల్లో నా ఉద్యోగానికి నూకలు తీరినట్లే.

"ఎందుకు..? ఇంకో గంటలో ఇద్దరికీ పోలీస్ స్టేషన్ నుంచి పిలుపు వస్తుంది. అప్పుడు ఇద్దరం కలిసి పోదాం. జైల్లో కూర్చుని తీరిగ్గా అరటిపళ్ళు తిందాం " విసురుగా ఫోన్ పెట్టేసింది మేడం. అది వ్యంగ్యమో..వెటకారమో..కోపమో.. మేడం స్వరం అంచనా వేయలేకుండా ఉంది.

శ్రీవారు ఇంటికి వస్తూ తెచ్చిన కవర్ చూసి అదిరిపడ్డాను. కవర్ నిండా అరటిపండ్లు. " ఆ కవర్ అక్కడ దూరంగా పడేయండి " భయంగా చూస్తూ అరిచాను.

"ఏంటి రజని..! కవర్లో ఉండేది అరటిపండ్లే కదా. ఏదో బాంబు ఉన్నట్లు భపడతావేమి..!" నా వంకా అమితాశ్చర్యంగా చూస్తూ శ్రీవారు. బాంబు అయినా అంత భయపడేదాన్ని కాదేమో ఆ క్షణం. స్కూల్లో జరిగింది చెప్పక తప్పలేదు. మేడం ఫోన్ గురించి కూడా చెప్పాను.

ఉచిత సలహాలు ఇవ్వకూడదు అనుకున్నాడేమో మౌనంగా రెండు నిముషాలు నా వంక జాలిగా చూసి ఏమి ఎరగనట్లు గదిలోకి వెళ్ళాడు ఆయన. మళ్ళీ కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుని పట్టువదలని విక్రమార్కిలా పి.టీ. సారుకి ఫోన్ చేస్తూనే ఉన్నాను.

ఇక శ్రీవారు, పిల్లలు నా వాలకం చూసి, ఇక నేను వంటింట్లోకి పోయే స్థితిలో లేనని రూఢి చేసుకుని వాళ్ళు చేతులు కాల్చుకునేదానికి పోయారు .

పీ.టీ. సారుకి వంద సార్లు ఫోన్ చేశాను. ఊహు. స్విచ్ ఆఫ్ అని వెక్కిరిస్తోంది ఫోన్. రెండరటిపళ్ళ సలహా నా కొంప ముంచుతుందని నేనూహించలేదు అసలు.

నా పరిస్థితి అర్ధమై " అంత రిస్క్ ఎందుకు పడతావు రజని..స్కూల్ మానేస్తే పోలా..?" ఇక ఉండబట్టలేక ఉచిత సలహా ఒకటి పారేసాడు శ్రీవారు.

అసలు ఈ గండం గడిస్తే కదా..ఏమైనా చేయడానికి. నీ టెన్షన్ తో నాకు ఏంపని,నా డ్యూటీ నాది అంటూ సాయంత్రం నుంచి రాత్రిలోకి మారింది కాలం. చీకట్లు ముసురుకున్నాయి చుట్టుపక్కల. నా మనసులో కూడా.

పీ.టీ. సారు ఫోన్ ఎత్తలేదు. మేడం దగ్గర నుంచి కూడా ఫోన్ రాలేదు. ఏ క్షణంలో ఏం వార్త వినాల్సివస్తుందో. భావేష్ గాడు నిజంగా పిన్ను మింగాడేమో. ఎంత పొరపాటు చేశాను. అప్పుడే మేడం కి చెప్పేసి ఉంటే ఇంత దూరం వచ్చేది కాదు.

గుగూల్ లో వెతికాను. స్టాప్లర్ పిన్ ముడుచుకుని ఉంటే ఏం కాదు. కానీ పిన్ తెరచినట్లు ఉంటే దాని సన్నటి కూసుగా ఉన్న కొసలు కడుపులో పేగులకు గుచ్చుకోవచ్చు. అలా పిన్ కడుపు లోపల ఉంటే స్కానింగ్ చేసి చూసి ఆపరేషన్ చేసి తీయాలి" ఆ సమాచారం చదువుతూ ఉంటే ఇక నాకు శ్రీకృష్ణ జన్మస్థానానికి బదిలీ తప్పదు అనిపించింది. అంతకన్నా ముందు నిజంగా పిన్ మింగి ఉంటే "భావేష్" పరిస్థితి ఏమిటో ఇప్పుడు..! ఎలా ఉన్నాడో బిడ్డ. వాడికి ఏం కాకూడదు. వరద పోటు వచ్చిన నదిలో నీళ్ళలా ఆలోచనలు పరిగెడుతున్నాయి. ఇక ఆకలి, దాహం, నిద్ర దూరం అయినాయి నాకు

అందరు నిద్ర పోతున్నారు హాయిగా. రేపు నా పరిస్థితి ఏమిటి..? ఇప్పుడు నేను ఏమి చేయాలి..?

కళ్ళు మంట పుడుతున్నాయి తప్ప నిద్ర రావడం లేదు. శ్రీవారు చెప్పినట్లు స్కూల్ మానేస్తే పోతుంది. ఎనిమిది గంటలు నిలబడి, గొంతు చించుకుని పాఠాలు చెప్పాలి. బోర్డు మీద రాయాలి. చాక్ పీసు పొడి అంతా ముక్కుల్లో నింపుకుని ఉబ్బసం తెచ్చుకోవాలి. ఇంకా ఇదిగో ఇలాంటి గండాలు ఎప్పుడొస్తాయో తెలియదు. ప్రైవేట్ స్కూల్ టీచర్ ఉద్యోగం అంటేనే దినం గండం..నూరేళ్లయస్సు.

పొద్దున ఆరు గంటలకే ఇంటిముందర ఏదో కలకలం. గుండెలు బితుకు బితుకు మంటున్నాయి నాకు. వాకిట్లోకి పోలీసులు వచ్చి ఉన్నారు. వెనుకే భావేష్ తల్లిదండ్రులు ఆగ్రహంతో ఊగిపోతూ. నన్ను బూతులు తిడుతూ. ఆ వెనుకే భద్రకాళిలా హెడ్ మేడం. వెళ్లి వ్యాన్లో కూర్చోండి మేడం. మిమ్మల్ని విచారించాలి" కటువుగా పోలీస్ స్వరం.

"ఎందుకు..భావేష్ కి ఏమైంది" భయంతో నా కళ్ళు పత్తికాయల్లా విచ్చుకున్నాయి.

"అవన్నీ స్టేషన్ లో మాట్లాడుతారు. పదండి ముందు" లేడి కానిస్టేబుల్ నా జబ్బ పట్టి లాగి వ్యాన్ లో కూర్చోబెట్టింది. వ్యాన్ కదిలింది.

"ఆపండి. నేను ఏ తప్పు చేయలేదు. వాడు పిన్ను మింగడం నేను చూడలేదు. చూడకుండా మింగాడని నేను ఎలా చెప్పను. స్కూల్ లో ఉన్నంతసేపు వాడు బాగానే ఉన్నాడు. పిన్ మింగానని వాడు కూడా కచ్చితంగా చెప్పలేదు. నేను ఏ పొరపాటు చేయలేదు. రెండరటిపళ్ళు తినమన్నాను. అంతే. అయ్యో.. ఏమండీ.. ఏమండీ..! వాళ్ళు నన్ను తీసుకుపోతున్నారు. ఆపండి.. ఆపండి.." వ్యాన్ తలుపు బాదుతున్నాను.

"అబ్బా.. అబ్బా .. నాయనో.. రజనీ.. నా వీపు బాదేస్తున్నావు. నీ బాదుడు ఆపు. రజనీ.. పొద్దునే నిద్రపోనీకుండా ఏమిటి నీ అరుపులు. ఏం ఆపాలి" శ్రీవారి గొంతులో విసుగు.

దిగ్గున లేచి కూర్చున్నా.. అంటే.. ఇప్పటిదాకా నేను కల కన్నానా..! చెమటలతో ఒళ్ళు తడిసిపోయింది. పక్కన ఉన్న నీళ్ల బాటిల్ ఎత్తి గటగటా తాగేసాను. వేకువజామున వచ్చే కలలు నిజమవుతాయంటారు. ఈ కల నిజం కానుందా.. నాకు జైలు యోగం తప్పదా. లేచి యాంత్రికంగా పనులు చేశాను.

స్కూల్ మానేయడానికి లేదు. ఈ రోజు నా సబ్జెక్టు సైన్స్ యూనిట్ టెస్ట్ ఉంది. లేని ఓపికా, ధైర్యం తెచ్చుకుని ఏమి జరిగినా అంగీకరించాల్సిందే అని నిశ్చయించుకుని ఆటో ఎక్కాను.

తొమ్మిది అయింది. దూరం నుంచే నన్ను ఉరిమి చూసింది మేడం. కసాయివాడి దగ్గరకు మేక పిల్ల వెళ్లినట్లు ఆమె ముందుకు వెళ్లి నిలబడ్డాను.

"భావేష్‌కి ఎలా ఉంది మేడం.. సారీ మేడం.. నా వల్ల మీరు మాటలు పడ్డారు" నా మాటలు పూర్తి కాకముందే

"నీకు ఈ ఒక్క రోజే.. నా బతుకు ఎప్పుడూ ఇంతే. నా కళ్ళ ముందు కనిపించకుండా క్లాసులోకి పోండి ముందు" విరుచుకుపడింది మేడం.

నోటికి అడ్డంగా చేయి పెట్టుకుని నవ్వుని ఆపుకుంటోంది శ్రావణి టీచర్ నా వెనుక నిలబడి. నా సందేహం తీరలేదు కానీ ఈ రోజుకి గండం గడిచినట్లే, భావేష్‌కి ఎలా ఉందో ఏమిటో ..! బతుకు జీవుడా అనుకుని మా త్రిశంకు స్వర్గం మెట్లను పరిగిస్తూ ఎక్కాను వెనక్కి చూడకుండా.

ఉదయపు ప్రేయర్ అయిపోయింది. అసెంబ్లీ హాల్ నుంచి పిల్లలు క్లాసులకి వస్తున్నారు. నా కళ్ళు భావేష్ కోసం వెదికాయి. ఎక్కడా వాడి జాడ లేదు. పీటీ సారు కూడా కనపడలేదు.

ఈ రోజు నా గతి ఏమిటో..? ఇక ఈ స్కూల్లో నా అస్తిత్వం ఏమిటో..? క్లాసులోకి పిల్లలందరూ వచ్చారు. ఒక్క భావేష్ తప్ప. మునెమ్మ వచ్చి అటెండెన్స్ రిజిస్టర్, చాక్ పీసులు ఇచ్చివెళ్ళింది. మళ్ళీ ఒకసారి ఆశ చావక బయటకు చూసాను. ఊహు. భావేష్ జాడ లేదు.

నిరాశగా అటెండెన్స్ రిజిస్టర్ తెరిచాను. "భూమికా.." ఎస్ టీచర్", లోపాముద్రా.. "ఎస్ టీచర్" , అంకిత్ .." గుడ్ మార్నింగ్ టీచర్"

వరుసగా పేర్లు పిలుస్తున్నా.

"ఎస్స్యూజ్ మీ టీచర్ "

గొంతు వినగానే రిజిస్టర్ పక్కన పడేసి దిగ్గున లేచి పరిగెత్తా.. ఎదురుగా మహా ఉషారుగా భావేష్. వాడిని చూడగానే నా పోయిన ప్రాణాలు తిరిగి వచ్చాయి.

"భావేష్.. ఎలావుందీ నీకు..! "

"బాగుంది టీచర్"

"మరి నిన్న పీటీ సారు డాక్టర్ దగ్గరకి నిన్ను తీసుకువెళ్లాడు కదా"

"అవును టీచర్"

"స్కానింగ్ చేసారా నీకు? పిన్ కనపడిందా నీ పొట్టలో..?

"స్కానింగ్ చేయలేదు టీచర్ "

మరి డాక్టర్ ఏం చెప్పాడు..? "ఉద్వేగం ఆపుకోలేక పోతున్నా నేను

"రెండరటిపళ్ళు తినమన్నాడు టీచర్" నోరంతా తెరచి నవ్వుతూ భావేష్

"ఆ ......." ■

## పాలపిట్ట కథల పోటీ ఫలితాలు

అరిశా సత్యనారాయణ – ఆదిలక్ష్మి గార్ల జ్ఞాపకాల స్ఫూర్తితో పాలపిట్ట నిర్వహించిన కథల పోటీకి మూడు వందలకు పైగా కథలు వచ్చాయి. ఇది తెలుగునాట కథారచన విస్తృతిని తెలియజేస్తోంది. కథావస్తువులో వైవిధ్యం అపారంగా ఉంది. పలు దఫాలుగా చదివిన తరువాత కథల ఎంపిక జరిగింది. మొదటి బహుమతి: గీతలు చెడిపి... – శాంతినారాయణ; రెండో బహుమతి: తోడు – టి.వి.ఎల్. గాయత్రి; మూడో బహుమతి : ఈతరం కథ – కోటమర్తి రాధా హిమబిందు. ప్రత్యేక బహుమతులు : 1. సీతపిన్ని – కృపాకర్ పోతుల, 2. మౌనం రాగమైన వేళ! – నాదెళ్ల అనురాధ, 3. పగటి చూపు – జడా సుబ్బారావు, 4. తోడేళ్ళు – సాగర్ల సత్తయ్య, 5. మంచితనం – గన్నవరపు నరసింహమూర్తి పొందారు.

**- గుడిపాటి, ఎడిటర్, పాలపిట్ట**

# సాహితీ ప్రజ్ఞ

నిర్వహణ : కుమార స్వామి

1. 'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు' అన్న కవి ఎవరు?
ఎ. త్యాగయ్య బి. అన్నమయ్య సి. క్షేత్రయ్య డి. మొల్ల

2. బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకం... గూళలకిచ్చి యప్పడుఉపు గూడు భుజించనని ధిక్కార స్వరం వినిపించిన కవి
ఎ. ధూర్జటి బి. పోతన సి. నన్నయ డి. తిక్కన

3. కందకు లేని దురద........ ఎందుకు ?
ఎ. కత్తిపీట బి. కత్తి సి. చేతులు డి. నాలుక

4. కేంద్ర సాహిత్య పురస్కారం పొందిన విమర్శిని గ్రంథ రచయిత?
ఎ. కొలుకలూరి ఇనాక్ బి. పాపినేని శివశంకర్ సి. డి చంద్రశేఖర రెడ్డి సి. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

5. 'ముసలమ్మ మరణం' కావ్య రచయిత?
ఎ. శ్రీశ్రీ బి. కట్టమంచి రామలింగారెడ్డి సి. బాలగంగాధర్ తిలక్ డి. వీరేశలింగం

6. అన్నమయ్య జన్మస్థలం
ఎ. తాళ్ళపాక బి. రాజంపేట సి. ఒంటిమిట్ట డి. పైవేవియు కాదు.

7. 'స్వారోచిష మనుసంభవం' అని ఏ కావ్యానికి పేరు?
ఎ. అముక్తమాల్యద బి. మనుచరిత్ర సి. వసు చరిత్ర డి. ఏదీ కాదు

8. 'సుమతి శతకం' రాసిన కవి పేరు, ఊరు?
ఎ. బద్దెన (బద్వేలు) బి. కవి చౌడప్ప (ఖాజీపేట) సి.కోగిర జయసీతారం డి. కూచిమంచి తిమ్మకవి

9. 'చదువని వాడజ్ఞుండగు చదివిన సదసద్వివేక చతురత గలుగున్' అన్న ఈ పద్యం ఎందులోనిది?
ఎ. భాగవతం బి. భారతం సి. భగవద్గీత డి. రామాయణం

10. 'ఊరకరారు మహాత్ములు' అన్న నానుడి ఎందులోనిది?
ఎ. భాగవతం బి. బ్రహ్మాండపురాణం సి. భారతం డి. త్యాగరాజు కీర్తన

11. 'రాయలసీమ కన్నీటి గాథ' రాసిన సుప్రసిద్ధ రచయిత ఎవరు?
ఎ. డా.ఎం.వి. రమణారెడ్డి బి. విద్వాన్ విశ్వం సి. తరిమెల నాగిరెడ్డి డి. పప్పూరి రామాచార్యులు

12. కిందివానిలో అల్లసాని పెద్దన రచించిన గ్రంథం ఏది?
ఎ. స్వారోచిష మనుసంభవం బి. పాండురంగ మాహాత్మ్యం సి. కుమార సంభవం డి. కిరాతార్జునీయం

13. ఆంధ్ర కవితా పితామహునిగా ప్రసిద్దుడైన కవి ఎవరు?
ఎ. తెనాలి రామకృష్ణుడు బి. అల్లసాని పెద్దన సి. నంది తిమ్మన డి. ధూర్జటి

14. తెలుగు ప్రబంధ కావ్య రచయితగా ప్రసిద్దుడైన తొలి తెలుగు కవి ఎవరు?
ఎ. నన్నయ భట్టారక బి. నంది తిమ్మన సి. పోతన డి. శ్రీనాధుడు

15. 'ఊరబావి' కథా రచయిత
ఎ. కేతు విశ్వనాథరెడ్డి బి. బోయ జంగయ్య సి. కొలకలూరి ఇనాక్ డి. పోరంకి దక్షిణామూర్తి

16. 'ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి అయినా, చివరకు వంటింటి గిన్నెలన్నిటి పైనా మానాన్న పేరే' అన్న కవిత
ఎ. స్త్రీ వాద కవిత బి. మైనారిటీ వాద కవిత సి. భావకవిత డి. దళిత వాద కవిత

17. తిమిరంతో సమరం రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన కవి ఎవరు?
ఎ. సి.నారాయణ రెడ్డి బి. కాళోజి సి. దాశరథి డి. వట్టికోట ఆళ్వారుస్వామి

18. తెలంగాణ ఏ పదం నుంచి వచ్చింది?
ఎ. కొడుంగ బి. త్రిలింగ సి. ములుగ డి. పైవన్నీ

19. 'తెలుగునాట భక్తి రసం తెప్పలుగా పారుతోంది డ్రైనేజి స్కీము లేక దేంజరుగా మారుతోంది' అన్న కవి
ఎ. గజ్జెల మల్లారెడ్డి బి. ఆరుద్ర సి. తిలక్ డి. శ్రీ శ్రీ

20. తెలుగు భాషా సాహిత్యాలకై అవిరళ కృషి సల్పిన పాశ్చాత్యుల్లో ప్రథముడు?
ఎ. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ బి. మన్రో సి. నికోలా డికొంటి డి. మెగస్తనీస్

జవాబులు : **1. ఎ 2. బి 3. ఎ 4. ఎ 5. బి 6. ఎ 7. బి 8. ఎ 9. ఎ 10. ఎ**
**11. ఎ 12. ఎ 13. బి 14. బి 15. సి 16. ఎ 17. సి 18. బి 19.ఎ 20.ఎ**

## గంద్ర గొడ్డలి

**అ**ంతవరకూ మాగన్ను మగతగా
నిద్రమంచుని మూటగట్టుకుని
వణికిసలాడే పూబాలల్ని
తన లేలేత కిరణ స్పర్శతో
మేల్కొలిపే తొలిపొద్దు పొడుపల్లే
మునుమును చీకట్లను తరిమికొడుతూ
తన పొలికేకతో మా పేటను నిద్రలేపుతూ
పనిని భుజాన్నేసుకుతిరుగాడే
పేరుమోసిన గొప్ప గొడ్డలి పనివాడతడు
మా పేటకు మరో కొత్త సూరీడతను

మానుల్ని బద్దలు కొడతాడే కానీ
మనుషుల్ని కూడగట్టి
పనిముఖం పట్టించడానికే పుట్టాడన్నట్టు
పనికోసమే కలవరిస్తూ
బద్ధకాన్ని నిద్రపుచ్చే అలసటెరగని
నిత్య శ్రామికుడతను పని ప్రేమికుడతను

పురమాయిస్తే తప్ప
పూచికపుల్ల జోలిక్కూడా వెళ్ళక
చెట్టూ చేమల్ని, గట్టూ పుట్టల్ని
ఆలూబిడ్డల్లా చూసుకునే ప్రకృతి ఆరాధకుడతను
పసిరికకు ప్రాణంపెట్టే తడిఊటల చెలమతను


తను పగలగొట్టిన పుల్ల, పేడుల్ని
పండగ, పబ్బాలకు
పెళ్ళీ పేరంటాలకు వండివార్చే
గాడిపొయ్యిలో పెట్టి మంటపెడతారో
చివరి యాత్ర శ్మశానవాటికలో
చితిగా పేర్చి నిప్పెడతారో
శిశువు కోసం జాషువా చెప్పినట్టు
ఎప్పటికీ ఏ పాపమెరగడితను!

చేజారిన పండ్లు లారీ కిందపడి
ఎక్కడ చితికిపోతాయోనని
తొందరపాటుగా తొందరపడి
ఆ వాహన చక్రాల కింద నీవే తునాతునకలై
మా పాలిట గండ్రగొడ్డలివై నిల్చి
మా గుండెల్ని ఛిద్రంచేశావ్!
మమ్మలని బతికున్న శవాలుగా మిగిల్చావ్!

**(రోడ్డు ప్రమాదంలో కన్ను మూసిన అసంఘటిత కార్మిక మిత్రునికి...)**

**- మోకా రత్నరాజు**

**99890 14767**



## రాజో'కీయం

**రా**జు కొడుకు రాజే కావాలి
దానికోసమే రాజకీయం రాజుకోవాలి
మఱ్ఱినీడలో మరో మొక్కకి మనుగడ లేదు!
ఇదీ, రాచరికపు వ్రణ ప్రజాస్వామ్యం!

మిధ్యా ఊహలతో మొదలెడతాడు
మధ్యలో వెండితెరపై వెలుగుతాడు
ఎప్పటికి నాయకుడిగా తేలతాడు?


కటకంతో కాంచినా కానరాదు అభివృద్ధి
బడ్జెట్‌లో లేదు కేంద్రానికి పెట్టుబుద్ధి
రాజోలిబండ రైతుల వెతలు నిత్య వృద్ధి
పోలవరం ఒక కలవరం
రైతు కలల కల్లోల సాగరం !
పధకాలతో ప్రసిద్ధి
వడ్డీపై వడ్డీ మనకు దొరికే సిద్ధి

విడి ఒడిపోయిన శ్రీరాముల త్యాగభూమి
నిత్య వేదనల కర్మ భూమి
ఇది ఆంధ్రభూమి!

**- వీరేశ్వరరావు మూల**

94947 46228


**సాహిత్యప్రస్థానం**
విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక
**చందాదారులుగా చేరండి ..**
**మీ మిత్రులను చేర్పించండి ..!**
**వివరాలకు 94900 99057 ను సంప్రదించండి.**






# ప్రతి హృదయాన్నీ తాకే అక్షర తరంగాలు

- శాంతికృష్ణ
95022 36670

**సా**హిత్యమూ, సంగీతమూ, చిత్రలేఖనాల్లో తనకంటూ ఒక శైలిని ఏర్పరచుకుని ముందుకు వెళ్తున్న కళల సెలయేరు తను. ఎంతో సున్నితమైన మనసుతో మరెంతో స్నేహపూర్వకంగా ఉండే అరుణ నాకు దాదాపుగా ఐదేళ్ల నుంచి తెలుసు. తన కవిత్వంలో ఒక ఫ్లో ఉంటుంది. మొదటి వాక్యం నుంచి చివరి వాక్యం వరకు మధ్యలో విరామం లేకుండా సాగిపోయే కవిత్వ ధార ఆమెది. అలా రాయడం తనకు బాగా అలవాటు అయినట్లుగా అనిపిస్తుంది.

దైనందిన జీవితంలో తనకు ఎదురైన అనేక సంఘటనలను, మనసులో మెరిసే అనేక ఊహల సవ్వడులను అక్షరాలుగా మలచి ప్రతిరోజూ కవిత్వీకరించడం అరుణకు ఇష్టమైన ఒక హాబీ. ఏ చిన్ని దృశ్యం చూసినా వెంటనే స్పందించే మనస్తత్వం. తన హృదయంలో చెలరేగే భావాలు తరంగాలుగా చేస్తోన్న సవ్వడులను ఒక్కో కవితగా మలచి మనముందుకు పుస్తకంగా తీసుకు వచ్చిన కవయిత్రి సందడి అరుణ కుమారి.

స్నేహశీలి అయిన అరుణ నెల్లూరు నివాసి. ఎంతో కాలం రెడ్‌క్రాస్ వారి స్పాస్టిక్ సెంటర్‌లో (బుద్ధిమాంద్యం గల పిల్లల పాఠశాల) ప్రత్యేక శిక్షణా బోధకురాలిగా పనిచేశారు. తాను వేసిన పెయింటింగ్ చిత్రాలతో నెల్లూరులో రెండుసార్లు ఆర్ట్ ఎగ్జిబిషన్ కూడా నిర్వహించారు. అనేక కవితా ప్రక్రియల్లో ప్రవేశం ఉన్న అరుణ రెండు వచన కవితా సంపుటాలను ముద్రించారు. ఇంకా ఒక కథల సంపుటి, నవల ముద్రణకు సిద్ధమవుతున్నాయి.

75 కవితలను 'నా హృదయ తరంగాలు' పేరుతో కవిత్వ సంపుటిగా ఇటీవల వెలువరించారు. అందులో కొన్ని కవితలను మనం ఆత్మీయంగా పలకరిద్దాం.

"అశృవులై నయనాలు పలకాలన్నా ప్రేమతో హృది నిండాలన్నా/ మధురమైనా బాధయైనా కవితై స్పందించాలన్నా/ ఓ మది గది కదలాలి/ ఓ అనురాగ తరంగమేదో సఅజించాలి.../ ఓ ఆనందగీతం పొంగాలి/ ఓ బాధాతప్త కడలి తాకాలి/ మునిగిపోని నావలా వేకువలో వెదికే తోవలా చుక్కాని లేని నడకలా...' అంటారు 'మనో తరంగం' కవితలో. ప్రేమ పూర్వకంగా రాసుకున్న కవయిత్రి మనో ఘర్షణ మన మనసును కూడా సుతిమెత్తగా తాకుతుంది. మనలో కూడా సంఘర్షణ మొదలవుతుంది.

'అరుణ కిరణాలు' కవితలో సూర్యోదయానికి పలుకుతున్న స్వాగత వచనాలు ప్రణయరాగ సుధలతో నిండితన్మయత్వంతో సాగిపోతుంది. "నువ్వొస్తే చాలు కోయిలమ్మ కూతలే/ రవి కిరణాలతో తట్టిలేపేస్తూ/ నవరస విన్యాసాలే మనుషుల మనసులు చూస్తూ/ నువ్వొస్తే చాలు కలల రెపరెపలే.../ రాత్రి కన్న స్వప్నాలు మాయమై నూతనంగా పగటి ఆశలను స్వాగతిస్తూ ../ నువ్వొస్తే చాలు వింత కాంతులెన్నో విహంగాల ఆటలు మొదలెట్టేస్తూ/ రసానంద జగత్తును చూస్తూ..." అరుణ కిరణాలను ఆహ్వానించటం కొంగొత్తగా ఉంది.

"అమ్మ భాష మధురం తెలుగు వెలుగు దివ్యం/ అక్షరాలు సుస్వరాల రాగం జాలువారు ముత్యాల హారం/ శ్రీ కృష్ణదేవరాయల కలం పలుకుల మయం" ఇదీ, 'మన మాతృభాష' కవితలో అమ్మ పలుకు పడుతున్న హారతి! 'అక్షరాల విశ్వరూపం' కవితలో తన అక్షరాలు ఎలాంటివో చెప్పారు కవయిత్రి.

"అరుణ వర్ణాల జ్వలితాలే రగిలే అక్షరాలు
కర్షక జీవుల ఆకలి రోదనలే అక్షరాలు
నిరంతరం ఘోషించే నిరుపేదల కన్నీటి చారికలే అక్షరాలు
ప్రశ్నలకే ప్రశ్నలా అలలా కుదిపే భావతరంగాలే అక్షరాలు" ... అక్షరాల విశ్వరూపాన్ని సాక్షాత్కారం చేస్తారు.

"లోకంలో జననానికై అమ్మ పేగు వారధి
ఋతువుల ఆగమనానికై కాలం వారధి

అనుబంధాల అల్లికలకై అనురాగం వారథి
ఆలుమగల అన్యోన్యతకు నమ్మకం వారథి" అంటూ 'బతుకులో వారధి' కవితలో ఏ బంధానికైనా వారధి ఉంటుందంటూ చాలా ఉదాహరణలు చూపించారు. నిజమే కదా! ఈ జీవనగమనంలో మనం ఎన్నో వారథులను నిర్మించుకోవాల్సి ఉంటుంది. లేదంటే గమ్యం చేరలేము కదా... బంధాల పునాదులు బలపడాలంటే ఎన్నో వంతెనలను తప్పకుండా దాటాలి.

"కష్టాలలో మునుగుతాం
కన్నీటిలో తడుస్తాం
అంతరంగ ప్రవాహంలో కొట్టుకు పోతాం
తరలి పోతుంది తిరిగి రానంటూ
మరలి పోతుంది మరపు నేనంటూ
ఇదే జీవితం ఓ అనంత సాగరం
మలుచుకుంటే మనో చైతన్యం
వదిలేస్తే చింతల కుహరం..." ఇలా 'జీవిత సంఘర్షణ' కవిత... తాత్విక ధోరణిలో సాగుతుంది. జీవనయానంలో అనేక సంఘర్షణల్లో మనిషి నిత్యం సతమతమవుతూ, ఓడుతూ గెలుస్తూ ఎన్నో పాఠాలు నేర్చుకుంటూ... చైతన్యం వైపు సాగిపోతాడు.

"ఎంతని వేయాలో హృదయానికి కుట్లు
గడియ గడియకొక గతమై
తడవ తడవకొక తపనై
నిండా పగులుతూ నిబ్బరమేదో సడలుతూ...

విసిరిన మాటలకొకసారి
విడిచిన ప్రేమలకొకసారి
ఈసడింపులకొకసారి
ఇష్టం లేదని ఒకసారి
కష్టమని ఒకసారి..." 'హృదయానికి వేయాలి కుట్లు' కవితలో ... తెగిపోయిన బంధాలను నిలపాలని, ఆవిరైన అనురాగాలకు మళ్ళీ ఊపిరి పోయాలని, నిరంతరం ఆశపడే హృదయంలో ఎన్ని వేదనల సుడిగుండాలో... ఎన్ని ఆశల చిగురింతలో..!

"జ్ఞాపకాలను పలకరిస్తుంది
ఆనందాలను ఆస్వాదిస్తుంది
నిజాలకు అర్థం చెబుతుంది
కృతజ్ఞతతో నిండిపోతుంది..."
చినుకులై రాలుతూ
మది తడిపి పోతూ
నిత్య సత్యమై పోతూ
అక్షరమై వాలుతుంది..." 'కన్నీటి విలువ' కవితలో... మనసు ఆనందంతో ఉప్పొంగినా, గుండెలో గుబులు సెగలైనా మొదట కన్పించేది కన్నీళ్ళే! అప్పుడే ఆ మనసుకు ఊరట కలుగుతుంది. అందుకే చాలా సందర్భాల్లో కన్నీళ్ళు ఉపశమన ఉపకరణాలు.

"వ్యవసాయ సంక్షోభంలో విలపిస్తూ
పాడిపంటల భూమి బీడపట్టెనేమో
పాడు చూపులన్నీ సోకెనేమో
కళకళలాడిన నగుమోములన్నీ వాడిపోయెను..." అంటూ 'రైతన్న వ్యథ'ను వివరించారు. రైతన్న కష్టాలను మన కళ్ళముందు ఉంచారు. ఎప్పటికైనా రైతు జీవితాల్లో పున్నమి వెలుగులు వస్తాయనే ఆశ పచ్చని పైరుతల్లి గుండెల్లో పచ్చ బొట్టులా సలుపుతూనే ఉంటుంది.

"ఉన్నపట్టున వచ్చి కూర్చుంటుంది
కథలెన్నో చెబుతుంది
రాగాలెన్నో తీస్తుంది
కలల సౌధాలను నిర్మిస్తుంది
కాలాన్ని ఆపేస్తుంది." ప్రేమ పైన ప్రేమగా పిర్యాదు చేస్తున్నట్లు సాగుతుందీ కవిత. ఒకచోట కల్పవృక్షమని పొగుడుతూ మరోచోట 'స్వప్నాలకు సమాధి' అని నిష్ఠురమాడుతోంది కవయిత్రి. అవును ప్రేమ పెదవులపై నవ్వులను పూయిస్తూనే కళ్ళల్లో గోదావరై ఉరుకుతుంది.


ఇంకా ఈ పుస్తకంలో రైతుల గురించి, కుల వ్యవస్థల గురించి, అమ్మ, నాన్న, మహిళలు... ఇలా అనేక అంశాలపై రాశారు. ఎక్కువగా హృదయం పైన కవితలు కనిపిస్తాయి. అందుకే ఈ సంపుటికి 'నా హృదయ తరంగాలు' అని పేరు సార్థకమైంది. కవయిత్రి, మిత్రురాలు సందడి అరుణకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు. ఈ పుస్తకం కోసం సంప్రదించాల్సిన నెంబరు : 99498 05100. ■

## రైతు కథల పోటీ

ప్రముఖ సాహితీవేత్త ఓలేటి వెంకట సుబ్బారావు గారి సహకారంతో విశాలాక్షి సాహిత్య మాసపత్రిక రైతు అంశంతో కథల పోటీ నిర్వహిస్తోంది. 10 ఉత్తమ కథలకు ఒక్కో కథకు వెయ్యి రూపాయలు చొప్పున మొత్తం బహుమతులు ఉంటాయి. 500-600 పదాలకు మించకుండా రైతు వస్తువుగా కథలను ఆహ్వానిస్తున్నాం. బహుమతులు పొందిన వాటితోపాటు మరికొన్ని సాధారణ ప్రచురణకు స్వీకరిస్తాం. విశాలాక్షి సాహిత్య మాస పత్రికలో ప్రచురిస్తాం. కథలు పోస్టు/ కొరియర్ ద్వారా 30-6-2023 లోపు అందాలి. కథలు చేరవలసిన చివరి తేది 30-06-2023

పంపవలసిన చిరునామా : విశాలాక్షి, D.No. 27-5-487, Padmavathi Nagar, Balaji Nagar Ext, Nellore - 524002. Cell : 9440529785

**- ఈతకోట సుబ్బారావు**
**సంపాదకులు, విశాలాక్షి మాసపత్రిక**




# వర్తమానంపై సంధించిన విశాల అక్షరాస్త్రం

- సుధామురళి
94913 11049

**వి**శాలాక్షి సుబ్బారావు గారిగా చిరపరిచితులైన సంపాదకకవి ఈతకోట సుబ్బారావు పుష్కరకాలంలో రచించిన తన సంపాదక కవిత్వ పరిమళాల సంకలనం 'విశాల నయనం'. 'కవిత్వానికి పాత్రికేయానికీ ఏమంత మైత్రి లేదు. ఒకటి ఊహ, భావనలతో ముడిపడినది.. మరొకటి పచ్చి వాస్తవికతతో వ్యవహరించేది' అని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్ తమ ముందుమాటలో రాసిన అక్షరాలు ఎంత వాస్తవాలో, వారే రాసిన 'కవిత్వానికీ సంపాదకీయానికీ ఐక్యత సాధించే ప్రయత్నాన్ని కవి, రచయిత, స్థానిక చరిత్రకారులు, సహ పాత్రికేయులు ఈతకోట సుబ్బారావు విజయవంతంగా కొనసాగిస్తున్నారు' అన్న మాటలూ అంతే వాస్తవం. రెండు వైరుధ్య భావనలను ఒకే దారానికి గుచ్చి, ఒకే వాక్యంలో పొదిగి వినిపించిన సరికొత్త గొంతుక ఈ నయనం చూసే చూపు.

ఇందులోని అనేకానేక కవితలు విప్లవ పద్యాలుగా అగ్గిని కురిపిస్తాయి, ప్రజాస్వామ్యయుతంగా దోచుకోబడుతున్న జనాల పట్ల జాలీ దయా కలగలిపిన మాటల్ని పలికిస్తూ, చచ్చుబడుతున్న పౌరుషాన్ని ఒక్క మాటతో పరుగు పెట్టేలా చేస్తాయి. ఈ కవిత్వం నిండా రాజ్యం పట్ల సానుభూతి, రాజ్యాధికారుల నిర్ణయాల వల్ల కుదేలౌతున్న ప్రజల పట్ల సహానుభూతి, పాలకుల అనైతిక వ్యవహార పట్ల చెప్పలేనంత ఆక్రోశం వ్యక్తమవుతూనే ... మరో వైపు సాగించాల్సిన పయనం పట్ల, చేరుకోవాల్సిన గమ్యం వైపూ దృష్టిని నిలిపేలా చేసే ప్రేరణామాత్రలు కూడా మిళితమై వున్నాయి.

పత్రికా సంపాదకత్వం అంటే అత్యున్నత వృత్తికి న్యాయం చేస్తూనే అందులో మన మానసిక సంఘర్షణల కంటే సామాజిక న్యాయం, సామూహిక వాస్తవ చిత్రీకరణలకు పెద్ద పీట వేయాలి. ఆ అవసరాన్ని గుర్తెరిగి సంపాదకీయ వ్యాసాలు రాయడం ఏ పత్రికా సంపాదకునికైనా ఓ ఎదురీత. సంభవిస్తున్న సంఘటనలు, పరిమాణం చెందుతున్న ఆర్థిక, రాజకీయ, సాంఘిక ఆచార వ్యవహారాలు, వాటి పరిణామాలు అన్నిటినీ నిశితంగా పరిశీలిస్తూ, జనాల నాడి పట్టుకుంటూ, నొప్పింపక తానొప్పక సూత్రాన్ని తూచా తప్పక పాటిస్తూ సాగించాల్సిన నడక. త్రాసు ఎటు మొగ్గినా అటు సత్యానికి, ఇటు అంతఃకరణ శుద్ధికీ భారీ ఎత్తున చేటు జరిగే ప్రమాదం పొంచి ఉన్న సాహిత్య కరకట్ట.

అటువంటి బాధ్యతాయుత భారాన్ని మోస్తూ దానిని సరికొత్తగా, కవిత్వ రీతిలో అందించడం సుబ్బారావు గారు తీసుకున్న స్వ నిర్ణయం. తనకు తోచిన రీతిలో, తను అనుకున్న విధి విధానాలతో, తాను చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, నిర్మొహమాటంగా చెప్పేందుకు ప్రయత్నించారు. అందులో నూటికి నూటుఒక్క పాళ్లు సఫలీకృతులయ్యారు. ఇందులో ఎంచుకున్న విషయాలు, వస్తువులు కొత్తవేమీ కానప్పటికీ ఆ విషయాల పట్ల, వస్తువుల పట్ల వారి దృక్పథాన్ని అక్షరాల్లో వారు చిత్రించిన తీరు ఎక్కడా తొణకదు, దేనికీ బెణకదు.

'మీడియా మూడోకన్ను అవినీతి మూలాల్లోకి దూసుకెళుతుంది/ నక్సలైట్ల ముసుగులో వేట కుక్కలు చెండాడిన అమాయకుల్ని/ గోడల మీద చిమ్మిన రక్తం మరకల్ని చూసి నిగ్గు తేలుస్తుంది' అంటూ పాత్రికేయ వృత్తిని గూర్చి, సన్మానాలకు, సత్కారాలకు నోచుకోని అక్షర సైనికుల గురించి పడిన వీరి ఆవేదన ఎంతటి నిజమో మనకందరికీ తెలిసిందే అయినా.. దానిని కవిత్వీకరించిన తీరు ఆమోదయోగ్యం.

'నిక్కచ్చిగా నిజాయితీగా చీకటి చరిత్ర ముసుగు తీసిన పాపానికి/ చార్మినారు సాక్షిగా ప్రాణాలు కోల్పోయిన అక్షర సైనికులెందరో?' అంటూ తన సహచరులు కోల్పోయిన ప్రాణాల పట్ల, అసలా హత్యల వునికినే పట్టించుకోని సమాజం పైన అశ్రువులు, ఆగ్రహం కలగలిపి జారవిడిచి మనచేతా ఆ ఆలోచన చేయిస్తారు.

జనహనన అహంకారాల చావు కేకలు

సజీవ సమాధుల్లో బయటపడ్డ అస్థిపంజరాలు
రాచపుళ్ళవుతున్న గుండె గాయాలు

కన్నీటి సెలయేళ్ళు నిప్పుల నదులు/ ఎన్నాళ్ళని చేతులు కట్టుకుంటాం/ .. ఇంకెన్నాళ్ళు గరిక పోచలా పెరుగుదాం/ రండి తాడులా పేనుకుందాం/ మదమెక్కిన గజరాజుపై తిరగబడదాం!' అన్న కవితా వాక్యాలతో ప్రజను క్షోభ పెట్టే పాలకులపై తిరుగుబాటు ప్రకటించి, తమ అస్తిత్వాన్ని సైతం కోల్పోతున్న మనుషులలో అణువణువునా సత్తువను నింపుతారు.

'చెట్టు పునరుత్థానం కోసం ఆకులన్నీ రాల్చుకున్నట్టు
సరికొత్త బౌద్ధిక జన్మకోసం స్నానం చేస్తున్నాను

పాతను త్యజించి ఫీనిక్సులా కొత్తగా జన్మిస్తున్నాను' అంటూ బానిస సంకెళ్లు తెంచుకుని, నీతి బాహ్య యుద్ధ వీధిలో ఒంటరై చరిస్తున్న నేటి భారత స్థితిని, ఆ స్థితికి కారణమైన రాజకీయ కుయుక్తులకు కుంపటి రాజేస్తూ కొత్త జననాన్ని కలగంటారు, మనల్నీ కొత్తగా పుట్టమని వేడుకుంటారు. అందుకే స్వామీ ఒక్కటివ్వు అంటూ ఎప్పుడో, ఎక్కడో పుట్టి ఎన్నాళ్ళ కిందటో గిట్టి పరోపకారార్థం ఇదం శరీరం అన్న నానుడిని జీర్ణించుకున్నందుకు, మహాత్ముల స్థానాన్ని పదిలం చేసుకుని చరిత్ర పుటల్లో నిలిచి పోయిన వాళ్ళ పుట్టు పూర్వోత్తరాలు ఏరుకుంటూ, నేతులు తాగిన మూతులు మా తాతలవే అని ఇప్పుడు జబ్బలు చరుచుకునేందుకు సమాయత్తం అయిన మేతావుల మేధను

"స్వాముల సందేహాలు, పరిశోధకుల అంచనాలు,
అన్నీ తీరాలంటే, మాకు నీ ఆధార్కార్డు కావాలి. ఇవ్వవూ!' అంటూ వ్యంగ్యంగా కడగి వదిలి పెడతారు. నిర్మొహమాట, ముక్కుసూటి ఆలోచనలను పద్యాలు చేసి పాడుతాడు.

'ఆయన గుండె వీణలో/ ఏ తీగ లాగినా కవితల పూల వర్షమే కదా!' అంటూ ఆర్ద్రతాక్షరమై విశ్వంభరునికో అశ్రు తర్పణం వదలుతాడు.

'ఇంకా చీకటి అంచునే నించొన్నాం
శూన్యాన్ని చూసి ఆకాశం అని భ్రమిస్తున్నాం...
రెక్కలు లేని పక్షి ఎగరలేదు
అక్షరం రాని నోరు మంత్రం వుచ్చరించలేదు
సత్ ప్రాణ హనన అగ్ని సంస్కార వెలుగులో
విశ్వ రసాన్వేషణ నిరంతర సాధన
చంద్ర మండలంపై జీవాణు అస్థిత్వ పరిశోధన
ఊభిలో ఇరుక్కున్న మనిషి నేలపైన" అంటూ మూఢత్వం, మూర్ఖత్వం మూర్తీభవించిన మనుష్య జంతువుల చర్యలపై అవహేళన, నిరసన వ్యక్తం చేస్తాడు.


ఇవన్నీ గత పన్నెండేళ్ళలో నెలకొకమారు చొప్పున పన్నెండు పన్నెండుల మాస పత్రికల సంపాదకీయ కవిత్వ సారస్వతాలు. వీటిలోని కొన్నిటిని, అతి ముఖ్యమైన వాటినీ ఏరికోరి ఈ కవిత్వ దండ గుచ్చిన 'విశాల నయనం' పుస్తకాన్ని పట్టుకున్న ఏ పాఠకుడు కూడా హడావుడిగా చదివేసి, పుస్తకాన్ని ఓ పక్కకు గిరాటేసి, స్థిమితంగా కూర్చోలేడు. ఒకటీ, రెండు కవితల తర్వాత ఓ ఆలోచన మొదలౌతుంది, ఆ జరిగిన సంఘటన తాలూకూ సమయానికి మనసు పయనమౌతుంది. కవితో కలిసి పాఠకుడు దుఃఖిస్తాడు, వేదన పడతాడు, ఆలోచిస్తాడు, ఎగసే నిప్పులా మండుతాడు. సంఘటన జరిగిన కాలంలోని తన ఆలోచన, మానసిక స్థితిని పునరాలోచించి, పునః సమీక్షించుకుంటాడు. సరికొత్త పద బంధాలకు, భావ ప్రకటనా మార్గాలకు ఈ విశాల నయనం దారులు తెరుస్తుంది.

'జిల్లేళ్ళు మొలుస్తున్న దేశంలో ....
తగలబడుతున్న దేశం పైన
సముద్రాన్ని పిచ్కారీ చేయండి
పిడికిలెత్తిన యువ సత్తువ భుజాల మీదినుండి
నిరుద్యోగ కావళ్లు కిందకు దించేయండి
శాంతి కరువైన దేశంలో మొలచిన
విప్లవ వృక్షాలపైన బుల్డోజర్లు కాదు
వృత్తి జలాన్ని మంత్రించి చిలకరించండి...' అన్న కవితలోని ప్రతి పంక్తి ఓ ఉద్బోధ.

నిజాయితీగా పనిచేసే వ్యక్తులపై, వ్యవస్థలు ఎలా నిందవేస్తాయో తెలియచేసేందుకు .. 'పాలకుల వైఫల్యాల్ని నెత్తికెత్తుకున్నందుకు/ వాళ్ళ చేతకాని తనానికి చేతులెక్కి మొక్కినందుకు/ వాళ్ళు కట్టించుకున్న గర్భ గుడుల్లో నువ్వు దేవుడైనందుకు/ ఆదాయ నల్లనాగు పన్నెత్తి నిన్ను కాటేసింది/ నీ నిజాయితీ పైన దింగనేరం మోపి/ నిన్ను జనాల్లో చులకన చేయాలని చూస్తుంది!' అంటూ చమత్కార బాణాల్ని లాఘవంగా వదిలి కుహనా వాదుల నర్మగర్భ కుట్రలను బట్ట బయలు చేశారు.

'మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మముగన్న తల్లికి మంగళారతులు
రాష్ట్ర గీతాన్ని ఇంగ్లీషులో పాడగలవా?
మాతృభాషలో చదువు చప్పిడి కూడు కాదు
అది మెదడుకు మేత పెట్టే మృష్టాన్న భోజనం!' ఇదో భావోక్తి, మాతృభాషపై తనకున్న భక్తి.

ఈరోజు, రేపు, ఎల్లుండి కాలంతో సంబంధం లేకుండా, కాల గర్భంలో కలిసి పోకుండా చదువరుల గుండెల్లో నిలచి, కొన్ని రోజుల పాటు వెంటాడే కవితలే ఈ విశాల నయనం మనకు అందించిన బహుమతులు. సుబ్బారావు గారి కలం కలకాలం పదునెక్కి వుండాలని, సామాజిక రుగ్మతల భరతం పడుతూ, పడి లేస్తున్న మానసిక సంఘర్షణలను పునాదుల ప్రక్షాళిస్తూ సాగిపోవాలని, వారొక్కరై సృష్టించిన ఈ నూతన సంపాదకీయ కవితా వాక్యాలను వేవేల సాహిత్యాభిమానులు అందిపుచ్చుకోవాలని ఆశిద్దాం. ■




# గ్రామీణ కథా సొబగులు 'గాండ్లమిట్ట' కథలు

– జంధ్యాల రఘుబాబు
98497 53298

**క**థ కథకు ఒక కథ ఉంటుంది. అన్ని కథలకూ కలిపి కూడా ఒక కథ ఉంటుంది. అది పట్టుకున్నవాడు చెప్పాలంటే చేజిక్కించుకున్నవాడు ఆర్.సి.కృష్ణస్వామిరాజు. జీవిత బీమాలో విశ్రాంత వికాస అధికారి ఆయన. అవిశ్రాంత సమాజ వికాసకుడు కూడా. అందుకే జీవిత బీమా పాలసీలు చేయించినంత సులభంగా కథలు రాసి పడేయగలడు. ఐతే వాటిలో జీవితాన్ని కూరుస్తాడు. పాత్రలు తాను చిన్నప్పటినుంచి చూస్తున్నవే, నేటికీ కనబడుతున్నవే. కథాంశం చుట్టూ వాటిని, వాటి చుట్టూ కథాంశాన్ని మజ్జిగ చిలికినట్టు చిలుకుతాడు. చివరిలో వెన్న తీసి మన చేతిలో పెడతాడు. ఆ వెన్న తాను రేపిన గాయానికే పూయవలసి వస్తుంది చాలాసార్లు. నాలుగు వందల పైచిలుకు కథలు వివిధ పత్రికల్లో రాసిన ఈయన ఇప్పుడు పద్యాలుగో పుస్తకం అచ్చువేసే పనిలో ఉన్నాడు. అంత విస్తృతంగా రాస్తారు. కథల్లో కొద్దిగా చిత్తూరు జిల్లా యాస కనిపించినా అది తక్కువగా ఉండడంవల్ల అందరూ సులభంగా చదువుకోవచ్చు.

గాండ్లమిట్ట ... ఆయన వెలువరించిన కథాసంపుట. ఇందులో 'పల్లెకు పోదాం' అన్న కథలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలపై నమ్మకంలేని సుధీర్ తండ్రి బి.టెక్ చదివిన కొడుకుని గవర్నమెంటు ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాయమంటాడు. అలా రాసి గ్రామీణ బ్యాంకు మేనేజరుగా ఉద్యోగం సంపాదిస్తాడు సుధీర్. ఎక్కడో జర్మనీలోనో, అమెరికాలోనో ఉండవల్సిన తాను ఇలా పల్లెకు రావడమేమిటని మొండికేస్తాడు. తల్లిదండ్రులు నచ్చజెప్పిన మీదట పల్లె దారి పడతాడు. బస్సే లేని, పోని ఊరది. అక్కడికి చేరాలంటే ఆటో మాట్లాడుకోవాలంతే. అలాంటిది ఇక పల్లెను వదలనని, పట్టణంలో జీవితమేముందని అనుకునేంతగా మార్చిన ఆ పల్లె జనం ఒకరిమీద ఒకరు చూపించే ప్రేమలేకాక జంతువుల పట్ల కూడా చూపే కరుణ సుధీర్‌ను కట్టిపడేస్తుంది. 'కురుల సిరులు' కథలో క్యాన్సర్ వచ్చి బాధపడే తండ్రికి కీమో థెరపీ వల్ల వెంట్రుకలు కూడా రాలిపోయి అతడిని నిర్వేదనకు గురిచేస్తాయి. అప్పుడు కొడుకు తాను గుండు చేయించుకొని నీవు ఒంటరివి కాదు, నాన్నా అనడం ఊహకందని ముగింపు. చూడడానికి మామూలుగా కనిపించినా మానసిక కోణంలో చూస్తే ఈ కథ గొప్పదనం కనిపిస్తుంది. 'చింతచిగురు' కథలో భర్తను కోల్పోయిన భారతక్క చిగురు కోసి అమ్మడం, పిల్లలు పనిచేస్తున్నారు కదా ఇంకా నీకు కష్టమెందుకు అన్నా మనిషన్నాక పనిచేయాలనటం గొప్పగా ఉంటుంది. అగ్నిప్రమాదంలో తమ పాక కాలిపోతుంటే లోపలికురికి తన భర్త కొనిచ్చిన పట్టు చీర పట్టుకొని ఆ మంటల్లో గాయాల పాలవుతుంది భారతక్క. ఆమె బతకాలని అందరూ కోరుకుంటారు చివర్లో.

పేదరికం, దాని బాధల గురించి కూడా ఎక్కువసార్లు ఈయన కథల్లో తడుముతారు. 'రాళ్ళ బియ్యం' కథలో రైల్వేలో టికెట్ కలెక్టరుగా పని చేసే రమణమూర్తి తాను టీ తాగడానికి పోయినప్పుడు అక్కడ డబ్బుల్లేనివారికి తనే తాగిస్తాడు. 'అలా ఎందుకు చేస్తావు సార్' అని అడిగిన టీకొట్టు అబ్బాయికి ఫ్లాష్‌బ్యాకులో చిన్నప్పటి తమ పేదరికం గురించి చెబుతాడు. బియ్యం లేనప్పుడు ఎసట్లో అమ్మ బియ్యం బదులుగా రాళ్ళు ఉడికిస్తుంటే ఆకలిలో ఉన్న చెల్లి గెంతుతూ ఆడుకోవడానికి పోవడం తరువాత బియ్యం వేసి అన్నం వండడం చదువుతుంటే కళ్ళలో నీళ్ళు తెప్పిస్తుంది.

ఇక ఈ పుస్తకం శీర్షిక కథ గాండ్ల మిట్ట గురించి. అదో ఊరు. తండ్రి చనిపోతే డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న

కొడుకు ఆదిమూలం వాళ్ళను, వీళ్ళను పట్టుకొని అంతిమ సంస్కారాలు జరిపిస్తాడు. తరువాత ఊరొదిలిపోయి ఎల్ఐసి ఏజెంటుగా, తరువాత డెవలప్మెంటు అధికారిగా మారి కారేసుకొని తల్లితో పాటు గాండ్లమిట్టకొస్తాడు.,, అదీ ఓ ముసలామె క్రిష్ణమ్మ చనిపోయిందని తెలిసి. ఆమే తన దగ్గరున్న డబ్బు సాయం చేసింది తన తండ్రి చనిపోయినప్పుడు. క్రిష్ణమ్మ అంతిమ సంస్కారాలన్నింటికీ తానే డబ్బిస్తాడు. అలాగే ఊరిలో ఎవరు చనిపోయినా తన వంతుగా పదివేల రూపాయలిస్తానని తన తల్లితో పాటు ఊరివారందరినీ అడిగి మరీ ఒప్పిస్తారు. మానవతను అత్యున్నత స్థాయిలో చూపించిన కథ ఇది. 'మీ పెన్షన్ మాకొద్దు' కథలో ముసలితనంలో ఎవరి పెన్షన్ వారి ఆధీనంలోనే ఉంచుకొమ్మని సలహా ఇస్తారు. 'గాలిపటం' కథలో వాటిని అజాగ్రత్తగా ఎగరవేయొద్దని, మాంజా దారాలవల్ల కలిగే అనర్థాలను కూడా చెబుతారు. ఒక్కోసారి అవి ఎలా ప్రాణాంతకం గా మారతాయో కూడా చెబుతారు. మతి స్థిమితం కోల్పోయిన వాళ్ళ వెనుక ఉన్న విషాద గాథల్ని చెప్పి, పిచ్చివారిలా కనిపించినా వాళ్ళు మంచి చెబుతారన్న విషయాన్ని చూపించారు.

'అమ్మ విమానం ఎక్కాలనింది' కథలో నాన్న అకస్మాత్తుగా చనిపోయినా కష్టపడి చదివించిన అమ్మ, రోజూ వెదురు తడకలోనుంచి విమానాన్ని చూసి ఎప్పుడైనా విమానం ఎక్కుతానంటావా? అని కొడుకును అడిగేది. మంచి చదువు చదివి, సాఫ్టువేరు ఉద్యోగం తెచ్చుకున్న కొడుకు విమానం ఎక్కిస్తాడు. ఆనందపడుతుంది తల్లి. తన చిరకాల కోర్కె తీరిందను కుందో ఏమో ఇంటికొచ్చిన క్షణాల్లో కన్ను మూస్తుంది. 'నమ్మకమే నాన్న' కథలో తండ్రీ కూతుళ్ళ అనుబంధాన్ని చూపుతారు. తనని పాము కరచినా కాదు ఏదో పురుగు కరిచిందని చెప్పిన నాన్న మాట నమ్మి ధైర్యంగా ఆసుపత్రికి పోతుంది కూతురు. అక్కడ ఇంజెక్షన్ వేయిస్తాడు. తగ్గిపోతుంది. నాన్న ఆదాయం సరిపోదని, ఇంట్లో చెల్లి కూడా ఉందని ఇంటరులో బైపీసి చదివినా బీకాం చేరి ఆపై ఆడిటరుగా మారి మంచి పేరు తెచ్చుకుంటుంది పెద్ద కూతురు. ఓ సెమినారులో తన గురించి గొప్పగా కూతురు చెబుతుంటే విని ఆనందిస్తున్నప్పుడు అతని తలపై వేప పూలు పడతాయి. ఇంకొన్ని కథల్లోనూ తలపై వేప, కానుగ పూలు పడడం, ఇంద్ర ధనస్సు విరియడం చూస్తాం. 'మగువా ఓ మగువా' కథలో అమ్మాయిలకు శానిటరీ పాడ్స్ ఇస్తుంటాడు కుప్పారెడ్డి. ఎందుకంటే తన పిచ్చి చెల్లెలు పెద్దమనిషైనప్పుడు పడ్డ బాధలు చూసినవాడు కాబట్టి. అలా తన దగ్గర తీసుకున్న ఓ అమ్మాయి పెద్ద డాక్టరుగా మారి కుప్పారెడ్డి షాపు మూసే పరిస్థితిలో ఉంటే బ్యాంకువాళ్ళకు నచ్చజెప్పి ఆదుకుంటుంది. తానే ఆ లోను తీరుస్తుంది. అప్పుడే జూనియర్ కాలేజీ వదలగా వచ్చిన విద్యార్థినులకు స్త్రీకి సహజమైన రుతుక్రమంపై కొన్ని విషయాలు చెప్పి శానిటరీ న్యాప్కిన్స్ వాడాలని చెబుతుంది. ఈ కథ చివరలో కూడా షాపు షెల్ఫులోని శానిటరీ పాడ్స్ మెరవడం చూపిస్తాడు రచయిత.

ఈయన బాలసాహిత్యం కూడా ఎక్కువగా రాయడం వల్ల తన కథల్లో చిన్నపిల్లల పాత్రల్ని పెడతాడు. ఒక్కోసారి పెద్దవారి పాత్రలతో కథానిక మొదలుపెట్టినా ఫ్లాష్ బ్యాక్‌లోకి పోయి అక్కడ బాలల్ని చూపిస్తాడు. ఈ టెక్నిక్ చాలా కథల్లో కనిపిస్తుంది. గ్రామీణ వాతావరణం, మానవతా విలువలు, చిన్ననాటి జీవితం, మనుషులకు వచ్చే కష్టాలు వాటిని అధికమించే తీరు ఈయన కథల్లో చూస్తాం. కొన్నిచోట్ల పాత్రలు స్పీచులిచ్చినట్టు కనిపించినా ఆ చెప్పే విషయం, చెబుతున్న తీరు కథలో కలసిపోయి చదువరుల్ని మెప్పించి ఒప్పిస్తాడు రచయిత. సమకాలీన కథకుల్లో ఓ మంచి మనసున్న కథకుడు ఆర్.సి.కృష్ణస్వామిరాజు. ■



కవి కంచరానకు స్వీయచిత్రపటం అందిస్తున్న దృశ్యం; చిత్రంలో శివారెడ్డి, లక్ష్మీనరసయ్య, అట్టాడ తదితరులు

## 'నీటిగింజల పంట' ఆవిష్కరణ

**కం**చరాన భుజంగరావు తొలి కవితా సంపుటి 'నీటిగింజల పంట' ఆవిష్కరణ సభ మే 27వ తేదీన శ్రీకాకుళంలో అట్టాడ అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ప్రముఖ కవి కె శివారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. భుజంగరావు ఉత్తరాంధ్ర నేల గురించి ఇక్కడి మట్టి దుఃఖాన్ని గురించి ఈ కవిత్వంలో బలంగా చెప్పాడని అన్నారు. ఈ సభలో కలిసినట్టు కవులు తరచూ కలుసుకోవాలని గంటేడ గౌరునాయుడు అన్నారు. ప్రముఖ విమర్శకులు జి లక్ష్మీ నరసయ్య ... జీవితాన్ని సమాజాన్ని బేరబుల్ స్థాయికి తీసుకుపోయేదే కవిత్వం అని అన్నారు. గుర్తుంచుకోదగినదే కవిత్వమయితే, అటువంటి గుర్తుంచుకోదగ్గ కవితా వాక్యాలు కంచరాన చాలా రాశాడన్నారు. శ్రీకాకుళం డిఇఒ డా. తిరుమల చైతన్య గౌరవ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కవితా సంపుటి వర్తమాన రైతు జీవితాన్ని, ప్రతిఘటనను ప్రతిబింబించింది అని ఏపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి అన్నారు. అనిల్ డ్యానీ, పుప్పాల శ్రీరామ్ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో చీకటి దివాకర్, చంద్రిక, చింతా అప్పల నాయుడు, బాల సుధాకర్ మౌళి, సిరికి స్వామినాయుడు, పాయల మురళీకృష్ణ, పిల్లా తిరుపతిరావు, మల్లిపురం జగదీష్, పక్కి రవీంద్రనాథ్, చింతాడ తిరుమలరావు , సిరా తదితరులు పాల్గొన్నారు.

# మార్క్సిస్టు సాహిత్య విమర్శను తేజోవంతం చేసిన కేతు విశ్వనాథ రెడ్డి



సభలో మాట్లాడుతున్న డాక్టర్ఈశ్వరరెడ్డి

**సా**హిత్యాన్ని సమాజాన్ని మార్క్సిస్టు దృక్పథంతో అధ్యయనం చేసి తెలుగు సాహిత్య విమర్శను, కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప కథారచయిత, విమర్శకుడు ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి అని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి వారికి నివాళులు అర్పించారు. ఏ రచయిత సమాజాన్ని ఒకడుగు ముందుకు వేయిస్తాడో, అతడిని సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని అన్నారు. ప్రసిద్ధ కథారచయిత ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి సంస్మరణ సభను అరసం కడప జిల్లా శాఖ, వైవియూ సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంయుక్తంగా **3.6.2023** ఆదివారం ఉదయం బ్రౌన్ సమావేశ మందిరంలో నిర్వహించాయి. అరసం కడప జిల్లా అధ్యక్షులు డా.ఈశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత విశ్వనాథ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆచార్య ఈశ్వర రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ, విశ్వనాథరెడ్డి తన చుట్టూ ఉన్న సమస్యలను, పుట్టి పెరిగిన ప్రాంత జీవితాన్ని కథలుగా మలచిన విశిష్ట రచయితని కీర్తించారు. 1980లో స్త్రీవాదం పుట్టుకొస్తే ఆచార్య కేతు 1978లోనే పురుషులతో సమానంగా మహిళలు నిలబడాలని, ఎవరి దయాదాక్షిణ్యాల మీద బతకొద్దంటూ రచనలు చేయడం విశేషమని అన్నారు. పంటలు లేని పొలాలను చూస్తే శుభ్రం చేసిన పలకలా ఉన్నాయంటూ ఆనాటి స్థితిని పోల్చారని చెప్పారు. ఆయన కుల, మత, వయోభేదం లేకుండా ఆదర్శనీయ జీవితం గడిపారని తెలిపారు.

వైవియూ ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ, ఆచార్య కేతుకు విశ్వవిద్యాలయం ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలుగు శాఖకు మార్గదర్శనం చెయ్యడమే కాక గజ్జెల మల్లారెడ్డి అవార్డు ఎంపికలో కీలకపాత్ర పోషించారని, బ్రౌన్ సలహామండలి సభ్యులుగా సేవలందించారని పేర్కొన్నారు. ఆం.ప్ర.అభ్యుదయ రచయితల సంఘం గౌరవాధ్యక్షురాలు డా.పి.సంజీవమ్మ మాట్లాడుతూ, తనకు ఆచార్య కేతుతో 1973 నుంచి పరిచయం ఉందని, 1974లో అరసం మొదటి కథాసంపుటాన్ని తీసుకువచ్చారని గుర్తుచేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిన సందర్భంలో ఆయన... అది రాయలసీమ కథకు, రాయలసీమ సాహిత్య చైతన్యానికి గుర్తింపుగా పేర్కొన్నారని చెప్పారు. ఆయన తన విమర్శ వ్యాసాలను 'దృష్టి' పేరుతో గ్రంథంగా తెచ్చారని, వేరు, బోధి అనే నవలలు రాశారని, అవి చాలా ప్రభావపూరితమైనవని అన్నారు. ఆయనను రాయలసీమకో, రాష్ట్రానికో పరిమితం చెయ్యకూడదని, భారతీయ అభ్యుదయ కథారచయితగా చూడాలని అన్నారు. కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యాన్ని ఆయన విషయపరంగా విభజించి, ఆరు భాగాలుగా తీసుకువచ్చారని అన్నారు. విద్యారంగానికి విశేష సేవలందించడమే కాక అభ్యుదయ వాదాన్ని పాఠ్యాంశాల్లోకి తీసుకువచ్చి ఉన్నతీకరించారనిఅన్నారు.

సిపిఐ రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యాన్ని, మార్క్సిస్టు తాత్వికతను ఆయన ఒంటపట్టించుకొన్నారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉండేదని అన్నారు. విశాలాంధ్రకు ఆయన అందించిన సేవ శ్లాఘనీయమని, ఆయన రచనలను విశాలాంధ్ర ద్వారా తీసుకువస్తామని అన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, సాహితీ రంగంలో విశ్వనాథ రెడ్డి తనకు మార్గదర్శకులని అన్నారు. బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధిలో ఆయన పాత్ర గొప్పదని గుర్తు చేసుకున్నారు.

సిపిఐ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం, అరసం ప్రతి ఏటా ఆయన పేరుతో సదస్సులు నిర్వహించి అవార్డులు ఇచ్చేలా చూడాలని కోరారు. కెస్కో సంస్థ వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ ద్వారా ప్రతి ఏటా కేతు విశ్వనాథ రెడ్డి జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేస్తామని ప్రకటించారు. ప్రముఖ కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్ మాట్లాడుతూ... కేతు విశ్వనాథ రెడ్డి రాయలసీమ ప్రాతినిధ్య రచయిత అని, తాను రచయిత కావడానికి ఆయనే దారిదీపమని అన్నారు. జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయ భాస్కర్ మాట్లాడుతూ, ఆచార్య కేతు రాతప్రతులను సేకరించి సి.పి.బ్రౌన్ గ్రంథాలయంలో భద్రపరచాలని కోరారు. రాయలసీమ టూరిజం కల్చరల్ సొసైటి చీఫ్ ప్యాట్రన్ లయన్ పోతుల వెంకట్రామి రెడ్డి మాట్లాడుతూ, విశ్వనాథ రెడ్డి తన రచనల ద్వారా చిరంజీవి అని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ, కేతు విశ్వనాథరెడ్డి ప్రగతిశీల భావాలు కొత్త తరానికి ఎంతో ఉత్తేజాన్ని ఇచ్చాయని అన్నారు.

ఇంకా తవ్వా ఓబుల్ రెడ్డి, డా.భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు డా.భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డా.తవ్వా వెంకటయ్య, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ఎం.బాలాజీ రావు, కొండూరు పిచ్చమ్మ వెంకట రాజు స్మారక సంస్థ అధ్యక్షులు కొండూరు జనార్దన రాజు తదితరులు విశ్వనాథ రెడ్డితో తమకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. సాహితీస్రవంతి కడప జిల్లా కన్వీనర్ బండి ప్రసాద్, అరసం కడప జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డా.తుమ్మలూరు సురేష్‌బాబు, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగా సురేష్, డా.ఎస్. రాజగోపాల రెడ్డి, డా.తక్కోలు మాచిరెడ్డి, హజరత్తయ్య, డా.వెల్లాల వేంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు. ■



కేతు విశ్వనాథ రెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న కెంగార మోహన్, వేదికపై పాణి, వెంకటకృష్ణ, హరికృష్ణ, ఇనాయతుల్లా తదితరులు

# సాహిత్యంలో మార్క్సిస్టు ముద్రవేసిన కథకుడు

ఆధునిక కథాసాహిత్యంలో కేతు విశ్వనాథరెడ్డి బలమైన మార్క్సిస్ట్ ముద్రవేశారని, అనేక కథలు సామాజిక వాస్తవికతతో రాశారని వక్తలు కొనియాడారు. 28.5.2023 ఆదివారం కర్నూలులోని లలిత కళాసమితిలో ప్రగతిశీల సాహిత్యసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కేతు విశ్వనాథరెడ్డి సంతాపసభ కవి కెంగార మోహన్ సభాధ్యక్షతన జరిగింది. విరసం నాయకులు పాణి మాట్లాడుతూ, అనావృష్టి, ఫ్యాక్షన్, దళిత సమస్యలు, స్త్రీవేదనలను ఇతివృత్తాలుగా తీసుకొని కేతు కథలుగా రాశారని అన్నారు. ఇందులో మార్పుకు అవకాశమున్న శక్తులను అన్వేషించారని అన్నారు. రాయలసీమలో ప్రగతిశీల సాహిత్య పరిణామ వికాసాన్ని పరిశీలించినపుడు కేతు సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సి వుందన్నారు. జి.వెంకటకృష్ణ మాట్లాడుతూ కక్షలు, కరవు, సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులూచ జీవన వైవిధ్యం లాంటి అంశాల్ని విశ్లేషిస్తూ సీమ నుంచి విస్తృతమైన సాహిత్యం వెలువడగా... అందులో కేతు విశ్వనాథరెడ్డి ప్రధానపాత్ర పోషించారని అన్నారు. సభాధ్యక్షులు, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ, ఆరున్నర దశాబ్దాల క్రితమే మార్క్సిస్టు అవగాహనతో కథలను రాసిన కథకుడు కేతు విశ్వనాథరెడ్డి అన్నారు. అసమానతలు, అంతరాలు లేని సరికొత్త సమాజాన్ని నిర్మిద్దామని సాహిత్యకారులకు పిలుపునిచ్చిన కథకుడు అని కొనియాడారు. ఇనాయతుల్లా మాట్లాడుతూ, అరవై ఏళ్ళ కేతు సాహిత్య జీవితంలో తన శక్తి మేరకు సౌందర్యాన్ని ఆరాధించాడని అన్నారు. డా.హరికిషన్ మాట్లాడుతూ, కేతు తన కథల్లో విరివిగా సామెతలు, నుడికారాలు వాడారని అన్నారు. ఆయన కథల్లో వాస్తవమైన జీవితాలు కనబడ్తాయని అన్నారు. సభకు ముందు కవులు కేతు చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లర్పించారు. సభలో కథకులు జి.ఉమామహేశ్వర్, యస్ డి వి అజీజ్, మారుతి పౌరోహితం, కవులు చౌశా, టి.వెంకటేష్, రాంచంద్, సయ్యద్ జహీర్ అహ్మద్, సూగూరు సుధాకర్, ప్రొ.ఆదవాని హనుమంతప్ప డీటిఎఫ్ నాయకులు రత్నం ఏసేపు అరసం, సాహితీస్రవంతి, విరసం కార్యకర్తలు, సాహిత్యాభిమానులు పాల్గన్నారు.

## కాళ్ళకూరి నాటకత్రయ సమాలోచనము - పుస్తకావిష్కరణ

సాహితీస్రవంతి కాకినాడ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు రచించిన 'శ్రీ కాళ్ళ కూరి నారాయణరావు నాటకత్రయ సమాలోచనము" గ్రంథావిష్కరణ పెద్దాపురం శ్రీయాసలపు సూర్యారావు భవనంలో 21.5.2023న జరిగింది. సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ గ్రంథావిష్కరణ చేయగా, ప్రముఖ గజల్స్ రచయిత డాక్టర్ రెంటాల శ్రీవేంకటేశ్వర రావు పుస్తక పరిచయం చేసారు.

కెంగార మోహన్ మాట్లాడుతూ, ఆనాటి సమాజాన్ని పట్టి పీడించే వేశ్యాలోలత, వరకట్నం, మద్యపానం అనే మూడు దురాచారాలను దుయ్యబడుతూ కాళ్ళకూరి ఈ నాటకాల్ని రాసారని అన్నారు. ఈ మూడు నాటకల్ని రచయిత కృష్ణబాబు చాలా చక్కగా విశ్లేషించారని అన్నారు.

డా.రెంటాల .. పుస్తక పరిచయం చేస్తూ మూడు నాటకాలలోని ముచ్చటైన, మేల్తరమైన పద్యాలను ఉదాహరించటం చాలా బాగుందని అన్నారు. ఈ నాటకాల్నీ ఇప్పటిదాకా చదవని వారికి ఈ విశ్లేషణ ఒక చక్కని అవగాహనను కలిగిస్తుందని, ఇప్పటికే చదివినవారికి ఇదొక



గ్రంథావిష్కరణ దృశ్యం

మంచి నెమరువేత అని అన్నారు. అనంతరం డి.ఎస్.పి.రావు, చేబియ్యం సూర్యసుబ్రహ్మణ్యం గార్లు చింతామణి నాటకంలోని బిల్వమంగళుని పద్యాలను గానం చేసారు. సభలో గనారా, డాక్టర్ గజరావు సీతారామ స్వామి, సాహితీస్రవంతిపట్టణ కార్యదర్శి శివ, శివకృష్ణ, పూడి శ్రీనివాస్, క్రాంతికుమార్, జయశ్రీ, మంజుల, దుర్గాప్రసాద్, గౌరినాయుడు, మణిబాబు, రామకృష్ణ శ్రీవత్స, యుటిఎఫ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుద్ర

31.08.1925–04.06.1998



సుప్రసిద్ధ అభ్యుదయ కవి, రచయిత, పరిశోధకుడు, విమర్శకుడు త్వమేవాహంతో తెలుగు కవిత్వంలో కొత్త ప్రయోగశైలి ప్రారంభించారు. అనేక కావ్యాలు, పరిశోధనా గ్రంథాలు రాశారు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం 13 సంపుటాలు ఒక చేతి మీదుగా రచించి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు.

SAHITYA PRASTHANAM ■ SAMPUTI - 4 ■ SANCHIKA - 9 ■ KRISHNA ■ June 2023
RNI NO.APTEL/2004/18396 ■Postal Regd. No.VJ/187/2023-25 PAGES : 68
Date of Posting : 2nd of Every Month ■ Date of Publication : 27.05.2023

